
THE LARGEST CIRCULATED TELUGU WEEKLY
స్వాతి
ESTABLISHED 1984
సపరివార పత్రిక
₹20
22.6.2018
అన్నింటా ఆనందం




www.dwarakatirumala.org eo_dwarakatirumala@yahoo.co.in

శ్రీ వేంకటేశ్వరస్వామి వారు (ద్విమూర్తులు)

శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానము (చిన్న తిరుపతి) ద్వారకాతిరుమల, పశ్చిమగోదావరి జిల్లా. ఆంధ్రప్రదేశ్

Sri Venkateswara Swamy Vari Devastanam (Chinna Tirupathi) Dwaraka Tirumala, West Godavari Dist., A.P. : Ph: 08829-271469, 271427, 271436


Others say they will
make you beautiful.
We know you already are.
Beyouty. An innerwear designed for the real me - true comfort, soft fabric, perfect fit. So thoughtful, it's as if it's designed by a friend.
Celebrate the real you.
Beyouty™
You deserve it
NEW YORK • LONDON • PARIS
BRANDIS INDIA
MARKETING TO INDIA
For enquiries call +91 9972399488 / 080 41170656 www.brandisindia.com

THE LARGEST CIRCULATED TELUGU WEEKLY
స్వాతి
సపరివార పత్రిక
FOUNDER PROPRIETOR EDITOR : VEMURI BALARAM

నైవేద్యతత్వం

ఫలాలన్నింటిలో కూడా ఉత్తమమైనటువంటిది టెంకాయ.ఎందుకనంటే ప్రతి పండులోనూ రసం వుంటుంది. రసమే ప్రధానం.ఆ పండును పిండితే గానీ రసం బయటకు రాదు.

ఈ కొబ్బరికాయలో పిండవలసిన అవసరం లేకుండానే, ముందుగానే భగవంతుడే రసాన్ని విడిగా తయారుచేసిపెట్టాడు.

అంతేకాకుండా మానవుడిశరీరంలో తలకాయను ఎట్లా తయారుచేశాడో,అట్లాగే ఫలాల్లో 'నారికేళాన్ని' భగవంతుడు తయారుచేశాడు.

ఎలాగంటారా?! ఈ తలకాయలో అక్కరలేని ఆలోచనలు చాలా వుంటాయి.

అదే కొబ్బరికాయ చుట్టూ వున్న పీచు. తరువాత ఈ తలకాయలో అహంకారం అనేటువంటి గట్టి పార ఒకటి వుంటుంది. ఎంతకీ పగలదది. అదే టెంకాయలో వున్నటువంటి పైన డిప్ప.

దాని లోపల మానవుడికి ఎంతో కొంత ప్రేమ వుంటుంది.ప్రతిమానవుడూ పుట్టగానే వాడికి మొట్ట మొదట కలిగే అనుభూతే ప్రేమ.

ఈ ప్రేమ అనేదే కొబ్బరికాయలో వున్న మెత్తటి కొబ్బరి. ఇక భగవంతుడు స్వయంగా ప్రసాదించే టటువంటి, అంతర్గతమైనటువంటి, దివ్యజ్ఞానం ప్రతి తలకాయలోనూ వుండనే వుంటుంది.

అది ఈ కొబ్బరికాయలో పరిశుద్ధ మైనటువంటి జలరూపంలో వుంటుంది.

దాని చుట్టూతా వున్నటువంటి ప్రేమబంధమనే పొరను, దాని చుట్టూ వున్నటువంటి అహంకారమనే పొరనూ పగలకొడితే, లోపలవున్న జ్ఞానమనే జలం బయటకువస్తుంది. అందువల్లే భగవంతుడికి నైవే ద్యంగా సమర్పించే వస్తువులలో కొబ్బరికాయకు విశిష్ట స్థానం లభించింది.

-జయగురుదత్త



పాఠక దేవుళ్ళకు నమస్కారం
ఎడిటర్
వేమూరి బలరామ్

ESTABLISHED 1984 | సంపుటి 34 | 22.6.2018 | సంచిక 51
అనిల్ బిల్డింగ్స్ సూర్యారావుపేట పోస్ట్ బాక్స్ 339 విజయవాడ 520 002

Every good humanbeing has the moral responsibility to become rich

సీరియల్స్

ముఖచిత్రం అమృతా అయ్యర్

కథలు

స్పెషల్ ఫీచర్స్

శీర్షికలు

చందాను www.swatipublications.com వెబ్‌సైట్ ద్వారా చెల్లించవచ్చు
E-mail: advtswati@gmail.com swativja@eth.net

విడిప్రతి ₹20 12 నెలలకు ₹1076
విదేశాలకు సంవత్సరచందా (ఎయిర్ మెయిల్) ₹6666 (100 డాలర్లు)

Editor: VEMURI BALARAM Swati Publications Anil Buildings Suryaraopet Vijayawada 520 002 Printed and Published by the owner VEMURI BALARAM
Printed at Anil Swati Press Autonagar Vijayawada Cover at Kala Jyothi Process Pvt.Ltd., Hyderabad
Tel.: (0866) 2431862 2434017 Advt. 2431233 Mktg. 2433938 Fax: 0866-2430433



8.6.2018

'**మ**నిషిలో మనిషి', 'హృదయం ఎక్కడున్నదీ...', 'సామ్రాట్ సముద్ర గుప్త', 'వేట' సీరియల్స్ అన్నీ ఇంట్రెస్టింగ్‌గా సాగుతున్నాయి.

'లేచిపోవాలని ఉంది!' కథ చివరి వరకూ ఆసక్తిగా సాగింది. 'పతిసేవా వ్రతం' కథ బాగుంది.

షేక్ యాకుబ్ పాషా ఖమ్మం

ప్రతి మనిషికీ ఈశ్వరుడొక్కడే దిక్కు. ఆ విశ్వాసాన్ని కోల్పోకూడదని సంపాదకీయంలో చక్కగా తెలియజేశారు. విలియమ్ వర్డ్స్ వర్త్ గురించి 'చివరి రోజుల్లో...' చాలా ఆసక్తికర విషయాలు తెలియజేశారు.

లక్ష్మీగిరిజాకుమార్ రాజమహేంద్రవరం

ఈశ్వర విశ్వాసం లేకపోవడం వలన జీవనయాత్ర ఒడుదుడుకులకు లోనవుతున్నదనే 'యుగశక్తి గాయత్రి' మాటలు అక్షర సత్యాలు.

నవలాలోకపు రారాణి, కోట్లాదిమంది కలలరాణి యద్దనపూడి సులోచనా రాణి. 'జాతస్య హి ధ్రువో మృత్యుః' అంటూ... ఈ లోకాన్ని విడిచిపోవడం తీరని లోటు.

కుక్కల రూపంలో శివుడుంటాడని 'సత్యాన్వేషణ'లో చదివి అవాక్కయ్యాం. బాబా భగవంతుడు, ఆయన మానవాతీతమైన గుణములు గలవాడు.

పి.నరసయ్య హైదరాబాద్

యద్దనపూడి 'నవలా లోకపు రారాణి' సులోచనారాణిగారి జ్ఞాపకాల లోకి వెళ్ళిపోయాం.

'పతిసేవా వ్రతం' కథ బాగుంది. అలాగే రక్తపోటుకు సంబంధించి తీసుకోవాల్సిన పరిరక్షక చర్యల గురించి 'ఫర్ U' శీర్షికలో చదివాం.

ఎన్.సుభాష్ చంద్రబోస్ విశాఖపట్నం

మన జీవితం కూడా ఈశ్వరేచ్ఛా రూపమేకాబట్టి జీవితంలో ఈశ్వర విశ్వాసంతోపాటు సమస్త కార్యాలలో ఆయన ఇష్టానికే ప్రాధాన్యత ఇవ్వాలని 'విజయయాత్ర' సంపాదకీయంలోని వివరణ బాగుంది.

బహుమతి పొందిన కథ 'లేచిపోవాలని ఉంది'లో 'సందేహపడక వెలుగు చూసి సాగు ముందుకు... నిరాశలోన జీవితాన్ని కృంగదీయకు' అంటూ రచయిత మంచి మాటలు చెప్పారు.

జి.వి.మురళీమోహన్
కోటరామచంద్రపురం

వచ్చేవారం స్పెషల్

స్టోరీ బుక్స్ పవర్

'**వి**జయ యాత్ర' అంశం ద్వారా పరమాత్మశక్తి, కృపలమీద ఏ విధంగా అచంచలమయిన విశ్వాసం కలుగుతుందో అదే విధంగా దైవం విరాట్ స్వరూపం సర్వత్రా ప్రకాశిస్తూ ఉంటుందనీ అవగతమయింది.

'సత్యాన్వేషణ'లో చెప్పినట్టు ధర్మం ఎక్కడ ఉంటే విజయం అక్కడ తప్పక ఉంటుందన్న విషయం ఆదర్శనీయమైనది. మనసులో మార్పు మొదలైతే తర్వాత జరగాల్సినవి జరుగుతాయని 'మనసు గాయపడితే'లో తెలిపారు.

పి.రమణమూర్తి హైదరాబాద్

ఇది మంచి సమయం



14.6.2018 నుండి 20.6.2018 వరకు శ్రీ విలంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, నిజ జ్యేష్ఠమాసం, శుక్లపక్షం.

14.6.2018 గురువారం
తిథి: శుద్ధపాడ్యమి రా. 9.42 వరకు
నక్షత్రం: మృగశిర మ. 2.04 వరకు
వర్జ్యం: రా. 9.31-10.56 వరకు
దుర్ముహూర్తం : ప. 9.51-10.43 వరకు. మ. 3.04-3.56 వరకు
రాహుకాలం: మ. 1.39-3.16 వరకు
మంచి సమయం: లేదు
సూర్యోదయం: 5.31కి
సూర్యాస్తమయం: 6.35కి

15.6.2018 శుక్రవారం
తిథి: విదియ సా. 6.10 వరకు
నక్షత్రం: ఆర్ద్ర ప. 11.21 వరకు
వర్జ్యం: రా. 10.02-11.28 వరకు
దుర్ముహూర్తం : ప. 8.06-8.58 వరకు. మ. 12.26-1.18 వరకు
రాహుకాలం: ప.10.24-12.01 వరకు
మంచి సమయం: మ. 3.00 నుండి 4.00 వరకు
సూర్యోదయం: 5.31కి
సూర్యాస్తమయం: 6.36కి

16.6.2018 శనివారం
తిథి: తదియ మ. 2.46 వరకు
నక్షత్రం: పునర్వసు ప. 8.43 వరకు
వర్జ్యం: మ. 3.55-5.23 వరకు
దుర్ముహూర్తం: ఉ.5.30-7.14 వరకు
రాహుకాలం: ప. 8.47-10.24 వరకు
మంచి సమయం: ప. 10.00 నుండి 11.30 వరకు
సూర్యోదయం: 5.31కి
సూర్యాస్తమయం: 6.36కి

17.6.2018 ఆదివారం
తిథి: చవితి ప. 11.39 వరకు
నక్షత్రం: పుష్యమి ఉ. 6.20 వరకు. తదుపరి ఆశ్లేష తె. 4.19 వరకు
వర్జ్యం: సా. 6.03-7.31 వరకు
దుర్ముహూర్తం: సా.4.47-5.39 వరకు
రాహుకాలం: సా. 4.53-6.31 వరకు
మంచి సమయం: ప. 11.55 నుండి 1.00 వరకు
సూర్యోదయం: 5.31కి
సూర్యాస్తమయం: 6.36కి

18.6.2018 సోమవారం
తిథి: పంచమి ప. 8.55 వరకు
నక్షత్రం: మఘ రా. 2.46 వరకు
వర్జ్యం : మ. 3.33-5.03 వరకు
దుర్ముహూర్తం: ప. 12.27 నుండి 1.19 వరకు. మ. 3.03-3.55 వరకు
రాహుకాలం: ఉ. 7.09-8.47 వరకు
మంచి సమయం: ప. 9.45 నుండి 11.50 వరకు
సూర్యోదయం: 5.31కి
సూర్యాస్తమయం: 6.36కి

19.6.2018 మంగళవారం
తిథి: షష్ఠి ఉ. 6.41 వరకు. తదుపరి సప్తమి తె. 4.59 వరకు
నక్షత్రం: పూర్వఫల్గుని రా. 1.45 వరకు
వర్జ్యం : ప. 10.26-11.58 వరకు
దుర్ముహూర్తం: ప. 8.06 నుండి 8.58 వరకు. రా. 10.55-11.47 వరకు
రాహుకాలం: మ. 3.16-4.53 వరకు
మంచి సమయం: లేదు
సూర్యోదయం: 5.31కి
సూర్యాస్తమయం: 6.36కి

20.6.2018 బుధవారం
తిథి: అష్టమి రా. 3.51 వరకు
నక్షత్రం: ఉత్తరఫల్గుని రా. 1.19
వర్జ్యం: ప. 8.50-10.24 వరకు
దుర్ముహూర్తం: ప. 11.35 నుండి 12.27 వరకు
రాహుకాలం: మ.12.02-1.39 వరకు
మంచి సమయం: సా. 4.00 నుండి 6.00 వరకు
సూర్యోదయం: 5.32కి
సూర్యాస్తమయం: 6.37కి

* అయోమయం మొత్తం పోయింది.

Glenmark

డేండ్రఫ్ గురించి మరియు
మీరు ప్రస్తుతం వాడుతున్న యాంటి-డేండ్రఫ్ షాంపు గురించి
మీ నమ్మకాలను, మీరు తెలుసుకోబోయే నిజాలు మార్చేస్తాయి.

విశ్వాసం #1 డేండ్రఫ్ అంటే కంటికి కనిపించే ఫ్లేక్స్ మరియు వాటిని శుభ్రపరచుకుంటే డేండ్రఫ్ సమస్యనుండి విముక్తి పొందవచ్చును

నిజం: డేండ్రఫ్ లక్షణాలలో ఒకటి మాత్రమే ఫ్లేక్స్. వాస్తవంగా చూస్తే డేండ్రఫ్ పలు రకాల, విభిన్నమైన సమస్యల కాంప్లెక్స్ ఇంటర్‌లింక్, స్కల్ప్‌పై మైక్రోఆర్గానిజమ్స్ పేరుకుపోవడం వల్ల కలుగుతుంది (మాడ). ఈ మైక్రోఆర్గానిజమ్స్ పలు లక్షణాలుగా వాటంతట అవే కనపడతాయి. ఇవి ఫ్లేకింగ్ నుండి ఇచింగ్ వరకూ, చివరికి స్కల్ప్‌పై ఫంగల్ ఇన్ఫెక్షన్ కూడా కలుగవచ్చును. అందువల్ల, ఫ్లేక్స్‌ను కడిగేసుకుంటే డేండ్రఫ్ సమస్యను పరిష్కరించుకున్నట్లు కాదు.

SCALPE+ యాంటి-డేండ్రఫ్ షాంపు ఈ పలు రకాలుగా కలిగే వాటిని పరిష్కరించడానికి ప్రత్యేకంగా ఫార్ములేట్ చేయబడినది. ప్రపంచవ్యాప్తంగా గుర్తించబడిన దీని కెటోకోనజోల్ ఫార్ములేషన్ డేండ్రఫ్‌ను కలిగించే మైక్రోఆర్గానిజమ్స్ ఎదుగుదలను అడ్డుకుంటుంది, ఆ విధంగా డేండ్రఫ్ సమస్యకి సమగ్రమైన పరిష్కారాన్ని అందజేస్తుంది.

విశ్వాసం #2 డేండ్రఫ్‌ని నయం చేసుకోవడానికి మీ జట్టుకు ప్రతి రోజు షాంపు పెట్టుకోవాలి

నిజం: లేదు! మీ జుట్టుకు మరియు స్కల్ప్‌కు రోజూ షాంపు పెట్టుకోవడం వల్ల వాటి నేచురల్ నూనెలను వదిలేలా చేయవచ్చును మరియు దానికి పోషణ లేకుండా చేస్తుంది, దాంతో ఇంకాస్త డేండ్రఫ్ సంబంధిత ఇబ్బందులకు దారితీస్తుంది.

డెర్మటాలజిస్టులు సిఫారసు చేసినట్లుగా **SCALPE+** యాంటి-డేండ్రఫ్ షాంపును డేండ్రఫ్ సంబంధిత సమస్యలు అన్నిటి నుండి విముక్తి కొరకు 4 వారాలలో 3 రోజులకు ఒకసారి వాడాలి. దాని కెటోకోనజోల్ ఫార్ములేషన్, 72 గంటల* పాటు డేండ్రఫ్‌ను కలిగించే మైక్రోఆర్గానిజమ్స్ పనిపడుతుంది, మొదటి సారి ఉపయోగించిన వెంటనే, అందువల్ల రోజూ మీ జుట్టుకి షాంపూ పెట్టుకోవలసిన అవసరం లేదు.

విశ్వాసం #3 డేండ్రఫ్ ఒక సారి వచ్చిందంటే, మరలామరలా వస్తూనే ఉంటుంది

నిజం: ఇచింగ్/ఫ్లేకింగ్/స్కేలింగ్, హెయిర్ ఫాల్ మరియు డ్రైనెస్ లాంటి పలు రకాల సమస్యల యొక్క ఇంటర్‌లింక్ డేండ్రఫ్. ఇంకాపైగా, ఈ పలు రకాల సమస్యల పరిష్కారానికి రెగ్యులర్ యాంటి-డేండ్రఫ్ షాంపూలను వాడడం తగినంతగా ఉండదు, ఇది మామూలుగా డేండ్రఫ్ సమస్య మరలామరలా రావడానికి దారితీస్తుంది.

SCALPE+ యాంటి-డేండ్రఫ్ షాంపు ఈ ఇంటర్-లింక్డ్ సమస్యలు ప్రతి ఒక్కదానిని పరిష్కరించడానికి డిజైను చేయబడినది, దీనిని సిఫారసు చేయబడిన విధంగా 4 వారాలలో 3 రోజులకు** ఒకసారి వాడడం వల్ల తరచుగా డేండ్రఫ్ తిరగబెట్టడాన్ని# నివారిస్తుంది.

విశ్వాసం #4 యాంటి-డేండ్రఫ్ షాంపూలను వాడడం జుట్టు రాలిపోయేలా చేస్తుంది

నిజం: స్కల్ప్ ఇచింగ్, డ్రైనెస్, అధిగా స్కేలింగ్ మరియు ఫ్లేకింగ్ లాంటి సమస్యలను డేండ్రఫ్ తనతో పాటుగా కొని తెచ్చుకుంటుంది. దీని కారణంగా దురదపుట్టే స్కల్ప్‌ను ఎప్పుడూ గోక్కోవలసిన అవసరం పడుతుంది. వదలకుండా గోక్కోవడం జుట్టు మొదళ్ళను దెబ్బతీయవచ్చును, దాంతో అవి చిట్లిపోవచ్చును. ఇంకాపైగా, సర్ఫెక్టెంట్స్ కలిగి ఉన్న రెగ్యులర్ యాంటి-డేండ్రఫ్ షాంపూలు స్కల్ప్‌ను పొడిగా మరియు దురదపుట్టేలా చేస్తాయి.

SCALPE+ యాంటి-డేండ్రఫ్ షాంపు, డేండ్రఫ్‌ను కలిగించే మైక్రోఆర్గానిజమ్స్ ఎదుగుదలను ఆపివేస్తుంది, దాంతో ఇచీ స్కల్ప్ పరిస్థితిని తగ్గిస్తుంది, పర్‌సిస్టెంట్ స్క్రేచింగ్‌ను కనీసంగా చేస్తుంది. ఈ విధంగా జుట్టు రాలిపోయే సమస్యని పరిష్కరిస్తుంది.

BBDO INDIA

ప్రతిపక్షాలు బలపడ్డాయి

సాధారణ గడియారంలో ఒక్క నిమిషం అంటే చాలా తక్కువ సమయం. కాని రాజకీయ గడియారంలో ఒక్క నిమిషం ఎన్నో చిత్రవిచిత్రాలు, అనూహ్య సంఘటనలు జరపగలిగినంత సమయమవుతుంది. ఆ విషయం బి.జె.పి.కి ఈ సమయానికి బాగా అర్థమైవుండాలి.

కర్ణాటక ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సమయంలో ప్రాథమిక సమాచారం ప్రకారం బిజెపి 122 నియోజకవర్గాలలో ముందంజలో వుంది.

ప్రభుత్వం ఏర్పడటానికి కావాల్సింది 111 స్థానాలే. కాబట్టి కర్ణాటకలో మెజారిటీ తమదేనని- ఇక ప్రభుత్వం ఏర్పాటుచేయటమే తరువాయి అన్న ధీమాలో ఆ పార్టీ వుండిపోయింది.

ఆ ధీమా సమయమే బిజెపిని ఎదురుదెబ్బతీసింది. తుది ఫలితాలు స్పష్టమయ్యేలోగానే జె.డి.(ఎస్)ని తమవైపుకు తిప్పుకోగలిగింది కాంగ్రెస్. చివరిగా బిజెపికి దక్కింది 104 స్థానాలు. అత్యధిక స్థానాలు గెలిచిన పార్టీగా గుర్తింపు. ఆ ఒక్క అంశాన్ని ఆధారం చేసుకుని, గవర్నర్ సహకారంతో కర్ణాటకలో ప్రభుత్వం ఏర్పాటుచేయగలిగారు. ఐతే గత అనుభవాల దృష్ట్యా ఈసారి కాంగ్రెస్ అతివేగంగా స్పందించింది.

తమ శాసనసభ్యులను హైదరాబాద్‌కి తరలించటం, బలపరీక్షకు ఇచ్చిన పధ్నాలుగు రోజుల గడువును సుప్రీమ్‌కోర్టులో ప్రశ్నించటం, అర్ధరాత్రి ప్రధాన న్యాయమూర్తి ఇంటి తలుపులు తట్టి మరీ పిటీషన్ వినాలని డిమాండ్ చెయ్యటంవంటివన్నీ 'ఒక్క నిమిషం'లో సాధించినవే.

ఒకసారి సుప్రీమ్‌కోర్టు జోక్యం చేసుకున్నతర్వాత బి.జె.పి. ఆటలు ఆగిపోయాయి. తాము సంపాదించదలచుకున్న పదిమంది ఎమ్.ఎల్.ఎ.లను ఆకట్టుకోలేకపోయారు.

ఫలితం యడ్యూరప్ప ముఖ్యమంత్రి పదవిమూడు నాళ్ళ ముచ్చటగా ముగిసింది.జె.డి.(ఎస్)కి ఎటువంటి గాలం విసిరితే దేవెగౌడ పడిపోతాడో కాంగ్రెస్‌కి బాగా తెలుసు. తమకు సంఖ్యాబలం ఎక్కువైనా ముఖ్యమంత్రి పదవిని దేవెగౌడ కొడుకు కుమారస్వామికి ఇస్తామని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ హామీ ఇచ్చింది.

ఫలితంగా ఇప్పుడు కర్ణాటకలో జె.డి.(ఎస్),కాంగ్రెస్ సంకీర్ణం కొలువు తీరింది. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రులుగా కుమారస్వామి, పరమేశ్వర (కాంగ్రెస్)లు పదవీస్వీకారంచేసి వారం దాటినా పూర్తి మంత్రివర్గం ఏర్పాటుచేయలేకపోయారు. ఆ సంకీర్ణం పరిస్థితి సజావుగా లేదని, ఆ రెండు పార్టీల మధ్య వైరుధ్యం వల్ల కుమారస్వామి ప్రభుత్వం కూడా పతనమైనా ఆశ్చర్యపోనక్కరలేదన్నది రాజ కీయ పరిశీలకుల మాట.

ఆ సంకీర్ణ ప్రభుత్వ భవిష్యత్తు ఎలా వున్నా ముందుగా బిజెపికి చెక్‌పెట్టడంలో ప్రతిపక్షాలు సఫలమయ్యాయి. దక్షిణాదిలోకి అడుగుపెట్టనివ్వకుండా భారతీయ జనతాపార్టీని నిలువరించాలని ప్రాంతీయ పార్టీలన్నీ పెట్టుకున్న లక్ష్యం నెరవేరింది.

కర్ణాటకలో విజయంతో మరో రాష్ట్రం మా ఖాతాలో చేరుతుంది అన్న బిజెపి నేతల మాటలు, కర్ణాటక ఫలితాల తర్వాత కాంగ్రెస్ పార్టీ పంజాబ్, పాండిచ్చేరి, పరివార్‌లనే మూడు 'పి'లకు పరిమితమవుతుందన్న ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఎద్దేవాను తిప్పికొట్టగలిగారు. కాంగ్రెస్ తన అహాన్ని తగ్గించుకుని, ఒక ప్రాంతీయపార్టీకి సహాయకపార్టీగా పనిచేయటానికి సిద్ధమైంది. అది ఆ పార్టీకి అవసరం.

కాంగ్రెస్ పార్టీ తన స్థానాన్ని వెనక్కి నెట్టుకోవటం ద్వారా మిగిలిన ప్రతిపక్షాలన్నింటినీ ఏకతాటిమీదికి తీసుకురాగలిగింది.

దేశంలోని ప్రాంతీయపార్టీ నేతలంతా ఒక్క వేదిక మీద కనిపించటం ద్వారా ఒక గొప్ప రాజకీయఐక్యతా సందేశం ప్రజలలోకి తీసుకువెళ్ళారు.

కాంగ్రెస్‌కి బద్ధవిరోధినని చెప్పుకునే చంద్రబాబు నాయుడు ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీతో చేయి కలిపి, తన అసలు సిసలు రెండు వేళ్ళ విక్టరీ గుర్తు చేయిఊపుడు మరచిపోయి కాంగ్రెస్‌పార్టీ గుర్తు ఐన హస్తాన్ని తాను చూపించటం ద్వారా బిజెపిని వ్యతిరేకించటానికి ఎలాంటి చర్యకైనా తాముసిద్ధమన్న సంకేతం అందించగలిగాడు. బెంగళూరులో జరిగినది ప్రతిపక్షాలబలప్రదర్శన.

కాంగ్రెస్ నాయకత్వాన్ని వ్యతిరేకించి ఆ పార్టీలో నుండి బయటకు వచ్చి సొంతపార్టీలు పెట్టుకున్న శరద్ పవార్ (ఎన్.సి.పి), మమతాబెనర్జీ(టి.ఎమ్.సి)లు కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తామన్న వాగ్దానం ఆ వేదిక మీద నుండి చేశారు.

ప్రాంతీయపార్టీలలో బిజు జనతాదళ్ నేత, ఒడిషా ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్, టి.ఆర్.ఎస్. నేత కె.సి.ఆర్, డి.ఎమ్.కె. నేత ఎమ్.కె. స్టాలిన్‌లు తప్పించి దాదాపుగా మిగిలిన అందరూ చేతులు కలిపారు. ఆ పార్టీలు ఆ తర్వాతికాలంలో సమయం, సందర్భం చూసుకుని బిజెపి వ్యతిరేక కూటమిలో చేరే అవకాశం లేకపోలేదు.

బిజెపితో మహారాష్ట్రలో అధికారం పంచుకుంటూ, ఎన్.డి.ఎ.లో కొనసాగుతూ కూడా బిజెపిమీద కత్తులు దూస్తున్న పార్టీ శివసేన.ఆ పార్టీ కూడా ప్రతిపక్ష శిబిరంలో చేరవచ్చును. వచ్చే ఎన్నికల్లో నరేంద్ర మోడీని నిలువరించటమే తమ లక్ష్యం అని స్పష్టం చేశాయి ప్రతిపక్షాలు. కర్ణాటకలో జరిగిన ప్రతిపక్ష కలయికకు మరింత ప్రోత్సాహంగా ఆ తర్వాత దేశవ్యాప్తంగా జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు వున్నాయి.

ఉత్తరప్రదేశ్‌లోని కైరానాసీటును ఎస్.పి.,బి.ఎస్.పి., కాంగ్రెస్ పార్టీల మద్దతుతో రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్.ఎల్.డి) గెలుచుకుంది. గత సంవత్సరకాలంలో ఉత్తరప్రదేశ్‌లో జరిగిన మూడు లోక్‌సభ ఉప ఎన్నికలలో బిజెపి ఓడిపోయింది.

2014 తర్వాత జరిగిన లోక్‌సభ ఉపఎన్నికల్లో బిజెపి కొత్తగా గెలుచుకున్న సీట్లు లేవు.

నిన్నమొన్నటివరకు లోక్‌సభలో సొంతమెజారిటీ కలిగిన బిజెపి ఇప్పుడు మిత్రపక్షాల మద్దతుతో మాత్రమే అధికారం నిలబెట్టుకునే పరిస్థితి. ఇది ఒక రకంగా ఎన్.డి.ఎ.లోని మిత్రపక్షాలకు బలం చేకూర్చటమేకాదు బిజెపీయేతర ప్రతిపక్షాలన్నింటికీ బలం పుంజుకోగలమన్న నమ్మకం కలిగించే విషయం.

ప్రతిపక్షాల నమ్మకానికి ఆధారం 2014 నాటి ఎన్నికలు.ఆ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన బిజెపికి దక్కిన ఓట్ల శాతం 31 మాత్రమే.అంటే మిగిలిన 67 శాతం ఓట్లు ఇతర పార్టీల చేతిలో వున్నాయి. తాము కలిసికట్టుగా పోటీ



నాలుగేళ్ళ స్వపరిపాలనలో అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ దేశానికి నమూనాగా నిలిచింది.

-కె.సి.ఆర్., సి.ఎమ్., తెలంగాణ

70 ఏళ్ళ వయసులో కూడ...!



శ్రీమతి లలితాదేవి

నా పేరు లలితా దేవి. నేను అనూస్ సిస్టర్స్‌కు అమ్మని. అబ్బాయిలతో పోటీ పడుతూ అణకువతో సమాజంలో ఇమిడిపోతున్న నా కూతుళ్ళను చూస్తే నాకెప్పుడూ గర్వమే. ఇదంతా మా గురువు గారు పెట్టిన బిక్ష. నాది మొదటి నుంచి స్ట్రెయిట్ హెయిర్. యుక్త వయస్సులో చక్కటి జడతో బారుగా బాగుండేది. ఏజ్ వచ్చాక జుట్టు పలుచబడి తలకి అతుక్కుపోయినట్లుగా అయింది. తరువాత కొన్ని రోజులు అనూస్ హెన్నాతో మేనేజ్ చేశాను. కాని అనూస్ బ్లాక్ ఎక్స్‌పర్ట్ అప్లై చేయడం మొదలు పెట్టాక నా జుట్టు ఒత్తుగా మరియు సహజమైన నలుపు రంగుతో కనిపిస్తూ ఇక నేను నా జుట్టు గురించి బెంగ పడకుండా అనూస్ బ్లాక్ ఎక్స్‌పర్ట్ నాకు సహకరిస్తోంది.

మా అమ్మ గురించి

మా అమ్మకి శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయరు స్వామి అంటే ప్రాణం. వారి బోధనలు వింటూ, ఆచరిస్తూ మమ్మల్ని జీవితంలో వచ్చే ఒడిదుడుకులను అణకువగా మలచుకొని ఆత్మ విశ్వాసంతో ముందుకు పోవడం నేర్పింది. ఇప్పటికీ రోజూ తనే ఫ్యాక్టరీకి వెడుతూ అనూస్ బ్లాక్ ఎక్స్‌పర్ట్ ప్రతి ప్యాక్ కస్టమర్స్ వద్దకు జాగ్రత్తగా వెళ్ళాలనే తపనతో ప్రతి లోడ్‌లోని మొదటి ప్యాకెట్ తాను పెట్టుకొనిసంతృప్తి చెందిన తరువాతనే మాకు గాని, మాక్లయింట్స్‌కు గాని చేరనిస్తారు. అనూస్ బ్లాక్ ఎక్స్‌పర్ట్‌తో పాటు ప్రతి అనూస్ ప్రొడక్ట్ అమ్మ చేతి వాత్సల్యం, అమ్మ ఇచ్చే ఆత్మ విశ్వాసం, సమాజానికి మంచి చేసే గురువుగారి బోధనలు ఇమిడి ఉన్న ప్రొడక్ట్. **– అనూస్ సిస్టర్స్**



కెమికల్ హెయిర్ డైకి నో చెప్పండి

కెమికల్స్ ఏమాత్రం లేని

బ్లాక్ ఎక్స్‌పర్ట్ **100%** నేచురల్ బ్లాక్ హెయిర్ కలర్ ట్రై చేయండి

- ఇది జుట్టుకు సహజమైన నలుపు రంగును ఇవ్వడంతో పాటు తెలుపు జుట్టును తగ్గిస్తుంది.
- ప్రకృతి సిద్ధమైన పదార్థముల వల్ల దీనిని ముఖ చర్మం మీద (గడ్డం, మీసాలకు) కూడ ఎటువంటి సందేహం లేకుండా వాడవచ్చు.
- ఇది జుట్టుకు కండిషనింగ్‌ను ఇచ్చి, చక్కని ఎక్స్‌ఫోలియేటర్‌గా పనిచేస్తుంది.
- జుట్టు రాలకుండా, డాండ్రఫ్ రాకుండా కాపాడుతుంది
- ఈ ప్రోడక్ట్ పి.పి.డి అండ్ గ్లూటెన్ ఫ్రీ.100% వేగాన్, సల్ఫేట్ ఫ్రీ.

ఫ్రీ అప్లికేషన్ కొరకు కాల్ చేయండి
70972 98070

- అనూస్ ప్రొడక్ట్స్ ఆన్‌లైన్‌లో కూడ లభ్యమవుతాయి **www.anoos.com**
- అనూస్ వీడియోస్‌కై మీ వాట్సప్ నంబరును ఈ **91000 34054** కు షేర్ చేయండి.
- అనూస్ హెర్బల్ ప్రొడక్ట్స్ మీ దగ్గరలోని సూపర్ మార్కెట్స్‌లోగాని, షాపులోగాని పొందాలంటే, పదే పదే అడిగి ఒత్తిడి పెంచండి.
- అనూస్ బ్లాక్ ఎక్స్‌పర్ట్ అప్లికేషన్‌కై ఈ క్రింది లింక్‌ను క్లిక్ చేయండి : https://www.youtube.com/watch?v=JIuUHIbfGxk&t=29s

మా సేవలకై మీ ప్రశ్నలను ఈ నంబరుపై 99596 16106 సంప్రదించండి – అనూస్ సిస్టర్స్

ANOO'S SALON & CLINIC Since 1983

TELANGANA | ANDHRAPRADESH
KARNATAKA | TAMILNADU | USA

Watch Anoo's Programme
Every Friday in TV'9 at 12.30 PM
Every Saturday in STAR MAA at 7.30 AM
Every Saturday in HMTV at 1.30 PM.

Services &
Beauty Courses: 99596 16106
Product Enquiries: 9100034054

చేయగలిగితే ప్రతి నియోజకవర్గంలో బిజెపిని ఓడించ గలమన్నది వారి నమ్మకం. కాబట్టి ఎన్నికల్లో ప్రతి పక్షాల తరఫున సరిగా 542 మందిని నిలబెట్టగలిగితే ఎన్డీఏకి,బిజెపికి ఒక్క సీటు కూడా రాకుండా చేయగల మన్నది ప్రతిపక్షాల కల.

దానినే ఇప్పుడు ఉత్తరప్రదేశ్, బీహార్‌వంటి కీల కరాష్ట్రాల ఉప ఎన్నికల్లో సాధించాము కదా అని ప్రతిపక్షాలు గర్వంగా చెప్పుకుంటున్నాయి.

గత లోక్‌సభ ఎన్నికల సమయంలో ఇతరపార్టీ లన్నీ ఎవరికి వారుగా పోటీచేసి దెబ్బతిన్నారు. సాంప్రదాయకంగా బద్ధవిరోధులైన ఎస్.పి., బి.ఎస్.పి.లు కల్సినపుడు, ఆర్.జె.డి. కాంగ్రెస్‌లు ఏకమైన పుడు ఫలితాలు ఆశాజనకంగా కనిపించాయి.

ఇవే ఫలితాలు 2019 ఎన్నికల్లోనూ వస్తాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పొంగిపోవటానికి ఆధారం ఉప ఎన్ని కల ఓట్ల లెక్కలే. 'మహా ఘట బంధన్' నిర్మాణా నికి పునాది పడింది.

మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌పార్టీ, బి.ఎస్.పి.లు ఎన్నికల అవగాహనకు వచ్చాయి. సీట్ల సర్దుబాట్ల అంశం పక్కనపెడితే కీలకమైన రాజస్థాన్,బీహారు, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్‌లలో బి.ఎస్.పి. కాంగ్రెస్‌కి సహాయం చేస్తానంటున్నది. ఆ నాలుగు రాష్ట్రాల లోనూ బిజెపికి ప్రధాన పోటీ కాంగ్రెస్.

రెండే పార్టీలు రంగంలో వున్నప్పుడు ఫలి తాలు స్వల్ప మెజారిటీతో వుంటాయి.

కాబట్టి బి.ఎస్.పి.లాంటి పార్టీ తన ఓట్లను కాంగ్రెస్‌కి బదిలీ చెయ్యగలిగితే ఆ పార్టీవిజయం సులభమేనని లెక్కలు చెబుతున్నాయి.

ఉత్తరాదిరాష్ట్రాలలో ప్రతిపక్షాలు ఇప్పట్నుండి ఉత్సాహంగా పనిచెయ్యటానికి కారణం 'మహా ఘట బంధన్ అనే గెలుపు సూత్రమే. దక్షిణాది ప్రాంతీయ పార్టీల ప్రభావం అంతంత మాత్రమే.

దక్షిణాదిన ప్రతి రాష్ట్రంలో ఒకటికన్నా ఎక్కువ ప్రాంతీయపార్టీలు వున్నాయి. ఆ రెండు ప్రాంతీయ పార్టీల మధ్య పోరాటం తీవ్రంగా ఉంటుంది. కాబట్టి ఏకపక్షంగా ఏ ఒక్క ప్రాంతీయ పార్టీ రాష్ట్రంలోని అన్ని సీట్లను గెలుచు కోలేవు. ఆ రెండు ప్రాంతీయపార్టీలు ఒకే ఒరలో ఇమడలేని కత్తుల వంటివి.

కాబట్టి ఆ రెండు పార్టీలలో ఒకటి యు.పి.ఎ. పక్షంలో వుంటే రెండవది అప్రకటితంగా ఎన్.డి.ఎ. పక్షాన నిలుస్తాయి. కాబట్టి రాబోయే ఎన్నికల్లో ప్రధా నంగా పోటీ ఉత్తరభారతదేశంలోనే వుంటుంది.


బి.జె.పి. నుండి సవాలును ఎదుర్కొంటున్న పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ, ఒడిషా ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్‌లు కాంగ్రెస్‌తో చేతులు కలపటానికి వెనుకాడకపోవచ్చు. కాంగ్రెస్‌కి వున్న బలహీనత నాయకత్వపరమైనది.

కిందిస్థాయి కార్యకర్తలు పార్టీకి బలం.దేశవ్యాప్తంగా గ్రామస్థాయిలో పార్టీవ్యవస్థ వుంది. ఐతే వారినందరినీ నడిపించగలిగిన, కదిలించగలిగిన, గెలుపుపైనమ్మకం అందించగలిగిన నాయకత్వం కరువైంది.

కాబట్టి కాంగ్రెస్ ప్రాంతీయపార్టీలమీద ఆధార పడాల్సివస్తున్నది. కాంగ్రెస్‌తో చేతులు కలపటంద్వారా ఆ యా రాష్ట్రాలలో ఆ పార్టీ తిరిగి కోలుకోలేకుండా చేయగలమన్నది ప్రాంతీయపార్టీల నమ్మకం.

అందుకే కాంగ్రెస్‌తో స్నేహానికి ప్రాంతీయపార్టీలు ఉత్సాహం చూపుతున్నాయి. 2019లో గెలవకపోతే ఆ తర్వాత నరేంద్రమోడీని తట్టుకోవటం కష్టంకాబట్టి ఎటువంటి పొత్తుకైనా సంసిద్ధమవ్వాల్సిన పరిస్థితి కాంగ్రెస్‌ది. ప్రతిపక్షాలు బలపడినమాట వాస్తవం.

ఉప ఎన్నికల వేళ ఒక్క సీటు గెలుపు ఓటములతో ఏ పార్టీకీ పోయేది లేదు. అధికారంలో వున్న పార్టీకి



షాక్ ఇవ్వటానికి సులభంగా పొత్తుకి సిద్ధమవుతాయి ప్రతిపక్షాలు. ఇప్పుడు ఆ విజయం నావల్ల సాధ్యమైం దంటే నావల్ల సాధ్యమయిందన్న ప్రాంతీయపార్టీల మాటలు తిప్పలు తెస్తాయి.

యు.పి. ఉపఎన్నికల్లో ఘనవిజయంపట్ల కాంగ్రెస్, ఎస్.పి.ఆర్‌జెడి వంటి పార్టీలన్నీ గర్వంగా తమ వంతు ప్రకటనలు చేస్తున్నప్పటికీ బి.ఎస్.పి.అధినేత మాయా వతి ఒక్కమాట మాట్లాడకపోవటమే ప్రాంతీయపార్టీల మధ్య వున్న పట్టుదలలకు నిదర్శనం.

యు.పి.లో అత్యధిక సీట్లు తమకు కావాలన్నది మాయావతి ఆలోచన. అటువంటి ఆలోచనే ఎస్.పి.ది కూడా. యు.పి.లో ఎవరు ఎక్కువ సీట్లు సాధిస్తే వారు కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటులో కీలకమవుతారు. కాబట్టి ఎస్.పి.,బి.ఎస్.పి.ల పట్టుదల ప్రదర్శనతప్పదు. బీహార్‌లో ఆర్.జె.డి.ది అదే తరహా వాదన.

ప్రతిపక్షంలోవున్న ప్రాంతీయపార్టీలమధ్య ఏర్పడే సీట్ల పంపిణీ విభేదాలను పరిష్కరించగల్గిన స్థితిలో కాంగ్రెస్ పార్టీ వుండాలి!

కాని కాంగ్రెస్ పార్టీలో ఆ తరహా చొరవ చూప గలిగిన సత్తా రాహుల్‌గాంధీలో కనిపించటం లేదు. ప్రాంతీయపార్టీల నేతలందరూ రాజకీయాలలో రాహుల్‌గాంధీకన్నా సీనియర్లు, రాజకీయ ఎత్తు గడలలో ఆరితేరినవారు. పైగా వారంతా కుటుంబ వారసత్వంగాకాక తమ స్వయంప్రతిభ, కృషితో ఒక స్థాయికి చేరినవారు.

అటువంటివారిలో శరద్ పవార్, చంద్రబాబు నాయుడు, మమతాబెనర్జీ వంటివారు రాహుల్ గాంధీని నాయకుడిగా అంగీకరించి అతని సూచ నలప్రకారంపనిచెయ్యటానికి ఇష్టపడటం కష్టమే. సోనియాగాంధీ రాజకీయంగా సీనియర్ అనికాక పోయినా 2004 ఎన్నికల్లో కాంగ్రెస్‌కి అత్యధిక సీట్లు తెచ్చిన పార్టీఅధ్యక్షురాలిగా మిగిలినపార్టీలు ఆమె నాయకత్వాన్ని అంగీకరించాయి.

ఎలాగైనా రాహుల్‌ని ప్రధానిని చేయాలన్న కాంగ్రెస్‌వారి కల ప్రతిపక్షపార్టీల ఉత్సాహం మీద నీళ్ళు చల్లుతున్నాయి.

ప్రతిపక్షాల ముందున్నది పదినెలల కాలం. ఈ పది నెలలలో ప్రధాని నరేంద్రమోడీని ఢీకొన గలిగిన ఒక శక్తివంతమైన నేతను సంయుక్తంగా ప్రకటించాల్సివుంటుంది.

2014 నాటి ఓట్లశాతం లెక్కలు వదిలికొత్తగా కలిసివచ్చే అంశాలను వెతికిపట్టుకోవాలి.

ప్రతిపక్షాలన్నీ కలిసి రూపొందించుకోగలిగిన ఉమ్మడి ప్రణాళిక ఎటువంటిదో ఒక స్పష్టతనివ్వటం అవసరం. అటువంటి ప్రత్యామ్నాయ సిద్ధాంతపరమైన విధానం లేక 'మోడీ హటావో' నినాదంతో ముందుకు వెళితే 1970ల్లో ప్రతిపక్షాలన్నీకలిసి నిర్మించిన 'ఇందిరా హటావో' ఉద్యమం లాగానే వుంటుంది.

వ్యక్తిగతకక్షతో నాడు ఇందిరాగాంధీని ఓడించా లన్న ప్రతిపక్ష లక్ష్యం నెరవేరలేదు. 2019లో కూడా అటువంటి లక్ష్యమే ప్రతిపక్షాలదైతే మోడీని ఓడించ లేరు. ప్రస్తుతానికి బిజెపియేతర ప్రతిపక్షాలకున్నది ఉత్సాహం, స్వల్పంగా పెరిగిన బలం.

ఆ రెండు మాత్రమే తమను గెలిపిస్తాయని ప్రతి పక్షాలు అనుకుంటే అంతకన్నా అమాయకత్వం మరొ కటి వుండదు.మోడీని ఢీకొనేముందు తమలో తాము పరిష్కరించుకోవలసిన అంశాలు, నిర్మించాల్సిన సిద్ధాంతపరమైన ఐక్యతా వేదిక వున్నాయి.

అవి ఎంత త్వరగా ఏర్పడితే అంత సులభంగా తమ లక్ష్యం అందుకోగలుగుతారు.

డా॥ దుగ్గరాజు శ్రీనివాసరావు

ఒక చిన్నమాట

ఏదైనా పోటీపరీక్షలో ఆంధ్రప్రదేశ్ అవతరణ దినమేది అనడిగితే అభ్యర్థులు ఏమి జవాబు రాస్తారో! కొంచెం చిక్కు ప్రశ్నే కావచ్చు. లెక్కల్లో ఒక సమాధానం రాసి అది కాదని కొట్టివేసి, మరొకటిరాసి అదీ సరికాదని కొట్టివేసి చివరికి సరైన సమాధానం కనుక్కొన్నట్టు జూన్ 2వతేదీ అని రాస్తారా?

ఉత్సవాలు, సంబరాలు, సంతోషతరంగాలు లేని దినమే మా అవతరణ దినోత్సవం అని ముఖం ముడుచుకుంటారా?

నవంబరు ఒకటవతేదీ 1953 ఆంధ్రరాష్ట్రం అవతరణ దినంగా పట్టపగ్గాలు లేని ఆనందంతో జేజేలు కొట్టుకొంటూ వీధుల్లో ఊరేగింపులు జరిపినరోజులూ కొందరి జ్ఞాపకాలలో నిక్షిప్తంగా ఉన్నాయి.

ఆ రోజుల్లో స్కూలు విద్యార్థులుగా, కాలేజీ విద్యార్థులుగా నవయువతగా ఉద్యమంలో పాల్గొని సమ్మెలు చేసినవారు ఇప్పటికీ మనమధ్య ఉన్నారు.

వారి భావాలు ఎలా ఉన్నాయో ఆరాతీసినవారెవరూ లేరు. ఈ రోజు, రేపటిగురించి ఆలోచించే తరానికి నిన్నటి గురించి తెలుసుకోవలసిన అవసరం లేదేమో! కాని ఎన్ని ఆకాశహర్మ్యాలు నిర్మించినా వాటి పునాది చరిత్రే.

మద్రాసురాష్ట్రం నుండి విడిపోయినా ఏమికోల్పోయాము అని దుఃఖపడకుండా రాజధానికోసం వెంపర్లాడకుండా ఏదో ఒక నగరంలో గుడారాలు వేసుకొని పరిపాలన కొనసాగించారు. భాషారాష్ట్రంగా మొత్తం దేశంలో ఏర్పడిన మొట్టమొదటిరాష్ట్రం ఆంధ్రరాష్ట్రం.

హైదరాబాద్ స్టేట్‌లోని తెలుగువారిని కలుపుతూ ఆంధ్రప్రదేశ్ నవంబరు ఒకటవతేదీ ఆవిర్భవించిందన్నా సంతోషతరంగాలు ఉవ్వెత్తున లేచాయి.

మళ్ళీ ఆంధ్రప్రదేశ్ పుట్టిందని తెలుగు రాష్ట్రాన్ని రెండుగా చీల్చినప్పుడు మాత్రం దుఃఖం ఎందుకు ముంచుకొచ్చింది. తాత్త్వికంగా ఆలోచిస్తే 'పూర్ణమదః పూర్ణమిదః, పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే' మద్రాసునుండి విడిపోయినా పూర్ణ రాష్ట్రమే. హైదరాబాద్ తెలుగు ప్రాంతాలతో కలిసినా పూర్ణరాష్ట్రమే.



డాక్టర్ జె.భాగ్యలక్ష్మి
E-mail: jbhagyalakshmi43@yahoo.in

హైదరాబాద్ తెలుగు ప్రాంతాలు విడిపోయినా పూర్తి రాష్ట్రమే. మధ్యలో వచ్చి మధ్యలో పోగయినదాని గురించి ఎన్నాళ్ళు దుఃఖిస్తారు?

ఎన్నో పండుగలు మనదేశవాసులు జరుపుకొంటారు. ముఖ్యమైన పండుగల సంగతి వదిలేస్తే అమావాస్యలు, పున్నమిలు, పంచమి, షష్టి, చతుర్దశిలాంటివెన్నో ప్రాముఖ్యం సంతరించుకొంటాయి. ఇక పుష్కరాలు బ్రహ్మోత్సవాలు, ఉరుసులు, మేళాలు చెప్పనలవి కాదు.

కాని అన్ని వర్గాలను, తెగలను, భాషలను, మతాలను, రాష్ట్రాలను కలిపి చేసుకునే పండుగలు స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం.

ఒక రాష్ట్ర ప్రజలు అనిర్వచనీయమయిన ఆనందంతో కలిసికట్టుగా చేసుకొనే పండుగ రాష్ట్ర అవతరణ దినోత్సవం. దేశంలో 28 రాష్ట్రాలు అవతరణ వారోత్సవాలు చేసుకొంటుంటే ఆంధ్రప్రదేశ్‌లో ఆ ఉత్సవం ఎందుకు లేదు? ఎన్.టి.రామారావు పాలనలో నిజంగానే తెలుగు ప్రజలు ఉబ్బితబ్బిబ్బయ్యే పండుగ వాతావరణం రాష్ట్రోత్సవాలలో చోటుచేసుకొనేది.



Courtesy : INFINITHOUGHTS

రాష్ట్రానికి ఎంతో దూరంలో ఉన్న ఢిల్లీలో రాష్ట్రోత్సవాల గురించి ప్రస్తుతం ప్రస్తావిస్తున్నాను. అప్పటివరకు ఆంధ్రాభవన్ ఏదో కార్యాలయం అన్న దృష్టితో ప్రజలుండేవారు. ఎన్.టి.ఆర్. పాలనలో ప్రజలకోసం గేట్లు బార్లా తెరుచుకొన్నాయి.

సిబ్బంది కోసమే ఉన్న క్యాంటీన్‌లో ఆంధ్ర వంటకాలు ఢిల్లీ ప్రజలకోసం సిద్ధమయ్యాయి. ఇక ఉత్సవాలు, సాంస్కృతిక సాహిత్య కార్యక్రమాలు, చలనచిత్రోత్సవాలు పండుగలప్పుడు సరే సరి.

రాష్ట్రావతరణ దినమంటే ఆ విశాల ప్రాంగణమంతా తెలుగువారు కళకళలాడిపోయేవారు.

అది నిజమైనపండుగ. ప్రత్యేకమైన తెలుగువంటకాలు ఒకవైపు. పుస్తకాలు, వస్త్రాలు, చేనేతలు, చేతిపనులు, కళాఖండాల ప్రదర్శన, మరోవైపు తెలిసినవారి పలకరింపులు, తెలియనివారితో పరిచయాలు.

కమీషనర్‌గా వైద్యనాథన్‌గారు, డిప్యూటీగా కిషన్‌రావుగారు తెలుగువారికి ఢిల్లీలో సాంస్కృతిక స్వర్ణయుగం సృష్టించారు. ఒక రాష్ట్రంతో మరోరాష్ట్రం పోలికలు అనవసరమే అనుకొన్నా ఒకేరోజు పుట్టిన తెలంగాణా, మళ్ళీ జన్మనెత్తిన ఆంధ్రప్రదేశ్‌ను గురించి జంటగా ఆలోచించటం ఒక్కోసారి అనివార్యమనిపిస్తుంది.

తెలంగాణ తన అవతరణ దినోత్సవం గొప్పగా చేసుకొంది. తన ప్రగతిగురించి వేయినోళ్ళ ఢిల్లీవరకు వినిపించింది. విశిష్ట సేవలను అందించినవారిని సన్మానించింది. కేంద్రంవారు ఆశించినంత సాయం చేయలేదనే కొరత ఉన్నా 'కేంద్రంతో సత్సంబంధాలు మా విధానం' అని చాటిచెప్పింది.

వారి ప్రచారపద్ధతి వెల్ ఆర్కెస్ట్రేటెడ్ (Well Orchestrated). ఒక వాద్య బృందంలా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో అవతరణ దినాన్ని చీకటిరోజుగా వర్ణించారు. నిర్మాణదీక్షలు సరే. అధికారికంగా కాకుండా తమంతటతామే ఈ దీక్ష రాష్ట్రం కోసం ఫలానా రోజు ఫలానా సమయానికి స్వీకరించమన్నా ప్రజలు ఉత్సాహంతో ముందుకువచ్చేవారు.

'నమ్మకద్రోహం' 'బిజెపి మోసాలను వివరించేందుకే నవనిర్మాణదీక్షలు' 'అస్థిరపరచే కుట్ర' అనే పతాకశీర్షికలతో రాష్ట్రోత్సవాలు జరుగుతాయా?


వ్యక్తిత్వ వికాసంలో పాజిటివ్ థింకింగ్ గురించి చెపుతారు. వ్యతిరేకభావాలు వద్దంటారు. కష్టాలలో మునిగిపోకుండా ఆత్మస్థైర్యంతో ముందుకుపొమ్మంటారు. ఇవి రాష్ట్రాలకు వర్తించవా?


'నీళ్ళలో నివసిస్తూ మొసలితో వైరమెందుకు?' అనే సామెత ఉంది. శృతిమించి రాగానపడే ఏ వ్యతిరేకతా ఎవరికీ మేలుచెయ్యదు.

'మా రాష్ట్రం' అని గర్వంగా ప్రజలు అవతరణ దినోత్సవం ఎందుకు జరుపుకోకూడదు? ఎన్నాళ్ళు దుఃఖసముద్రంలో మునుగుతారు?

రసగుల్లాలా వున్న
ఆ బెంగాలీ సుందరిని
చూడగానే అతను
ఫ్లాటైపోయాడు
ఆమె పరిస్థితీ అంతే!!
ఆ ఇద్దర్నీ చూస్తున్న
మరో యువకుడి కళ్ళు
ఎర్రగా తయారైనాయ్!!
వాడెవడోగాని వాడికి మూడినట్లే.
ఇక వాడిని రక్షించాలంటే
హరిహర బ్రహ్మాదులు
అడ్డుకోవాల్సిందే అనుకున్నారు
అతని మిత్రబృందం
ఆ తర్వాత ఏం జరిగిందో?!

గొర్లి శ్రీనివాసరావు లవ్లీ సీరియల్






Courtesy : VANITHA

పరదేశీ ప్రేమకథ

చెబుతుంది త్వరలో

అనుకోని అతిథి



మంత్రవాది మహేశ్వర్

"మిమ్మల్ని ఎప్పుడు కలుసుకోవచ్చు" ఫోనులో యువతి గొంతు అలా అడగడంలో ఏదో ఉద్దేశ్యం తొంగిచూసింది. సున్నితంగా మాత్రం అన్పించలేదు.

"ఎవరు మాట్లాడుతున్నది" అడిగేశాడు రాఘవేంద్ర. "మేఘన" ఆ చెప్పేవిధానం నచ్చలేదు.

పైగా ఆ పేరుగలవాళ్ళెవరూ రాఘవేంద్రకు పరిచయం లేదు. ఆ మాటకొస్తే ఆడవాళ్ళతోనే పరిచయం లేదని చెప్పాలి.

"నాకు ఎవరినీ కలవాలనిలేదు" ముక్తసరిగా అన్నాడు. అదే గొప్ప అన్నట్లుందిఅతనిధోరణి. రిసీవర్ పెట్టేయకుండా ఉండడానికి సంస్కారం అడ్డొచ్చింది. మనసు అల్లకల్లోలంగా ఉన్నవారి ప్రవర్తన అలాకాక మరెలా ఉంటుంది.

"మీకు మా మమ్మీ తెలుసుండాలి... సిమ్రాన్"

"సి... మ్రా...న్"

ఆ పేరు వినగానే రక్తం గడ్డకట్టుకుపోయినట్లయింది. బయటవీస్తున్న గాలి ఫ్రెంచ్ విండోలగుండా జొరబడి కర్టెన్లను విలవిల్లాడేలా చేసింది.

గోడకున్న క్యాలెండర్ టపటపా కొట్టుకోవడం ప్రారంభించింది.రోడ్డుమీద ఎగురుతున్న దుమ్ము ఆవెర్రిగాలికి వంకర్లు తిరిగిపోతూ ప్రళయనృత్యాన్ని తలపింప చేసింది.

ఉదయంపూట వాతావరణం వింతగాను, వికృతంగానూ అనిపించింది రాఘవేంద్రకు.

"నేను ఎవరినీ చూడాలనుకోవడంలేదు" కచ్చితంగా చెప్పేసి రిసీవర్ పెట్టేశాడు. రాఘవేంద్రకు సస్పెన్స్ లేదు ఈ విషయంలో.

సిమ్రాన్-పలుకుబడి,అందం, తెలివితేటలు అన్నీ ఒకచోట కుప్పగాపోస్తే ఎలా ఉంటుందో అలాంటి రూపం సిమ్రాన్‌ది. ఆకర్షించేరూపం, కట్టిపడేసే మనస్తత్వం... ఆ రకంగానే రాఘవేంద్రకు పరిచయం.

నలభయ్యేళ్ళు పైబడుతున్న ఈ వయసులో అంత తేలిగ్గా ఆమెను ఎలా మరచిపోగలుగుతాడు. కాలేజీ జీవితంలో ఎక్కువమందితో కలిసి తిరగడం, పార్టీల్లో పాల్గొనడంలాంటివి చేయలేదు రాఘవేంద్ర. సమస్యంటూ ఏమీలేదు. తనకు అలా ఒంటరిగా ఉండడమంటేనే ఇష్టం.

అందుకేనేమో ఎవరూ ప్రత్యేకంగా తనతో పరిచయం కోసం తహతహలాడలేదు. అందగాడనేలాంటి ముద్రగానీ, చదువుల్లో మేధావితనంగానీ లేదు. అటువంటి రాఘవేంద్రతో పరిచయం పెంచుకోవాలని చూసింది అందమైన సిమ్రాన్ మాత్రమే.

ఎందుకో ఏమిటో కొన్ని పరిచయాలు దైవసంకల్పితంగా ఏర్పడతాయి. ఏ ఇద్దరు ఏ కారణంగా దగ్గరౌతారో చెప్పడం ఎంతో కష్టం. ఆకర్షణకు కారణాలేముంటాయో ఎవరూ చెప్పలేరు.

పి.జి.లో చేరిన మొదటి రెండునెలల్లోనే సిమ్రాన్ మంచి స్నేహితురాలైంది. రాఘవేంద్రకున్న ప్రత్యేకతల్లా రకరకాల ఆలోచనలను డైరీలో కవితాత్మకంగా రాయడం... కథలు, నవలలపట్ల ఆసక్తి.

బహుశా అలా ఏకాంతంగా కూర్చుని తనతోతాను గడపడం సిమ్రాన్‌కు నచ్చివుండాలి. అదే స్నేహానికి కారణమైఉండాలి.

ఆ స్నేహమే రాఘవేంద్రను మార్చింది. తరువాత తరువాత నలుగురితో కొంతవరకు కలవగలగడానికి జీవితంపట్ల ఒక ఉత్సాహం కలగడానికి, ఏదో కోల్పోయినట్లున్న ధోరణి నుంచి బయటపడడానికి సిమ్రాన్ కారణం అని చెప్పక తప్పదు.

సిమ్రాన్ అంటే ఎక్కడలేని ఆనందం, ఉత్సాహం...



ఆమెను కౌగిలిలో బంధించి శరీరాలు రెండూ పెనవేసుకుంటున్న సమయంలో చిన్న భయం అతడిని ఆపేసింది. అది పసిగట్టిన ఆమె "ఏం ఆగిపోయావు" అంది. "......" జవాబివ్వలేదతను. "నేను గర్భవతినైతే ఏంటి అనే కదా" "......" దానికి చిన్న నవ్వు నవ్వింది. ఆ విషయాన్నీ తేలిగ్గా తీసుకుంది ఆమె. ఇంతకీ ఆమె ఉద్దేశం...

అంత అందం తనని ఎంతో ఇష్టపడుతోందని గర్వం.. తన కంపెనీని కోరుకుంటోందనే ఆనందం రాఘవేంద్రలో. స్నేహం కేవలం స్నేహంగా ఎక్కువ కాలం ఉండలేదు.

అందులోనూ ఆడ,మగ మధ్య ఒకరినొకరు చూడకుండా ఉండలేని పరిస్థితి ఏర్పడింది.

ఏమిటా పరిస్థితి... స్థితి... కలిసి ఆలోచిస్తే అర్థమైంది ప్రేమని. ప్రేమే అయినప్పుడు, ఒకరంటే మరొకరికి ఇష్టమైనప్పుడు ఆ బంధం నిలబడాలంటే ఒక్కటే మార్గం, పెళ్ళి... ఏడడుగులను మించి ఎంతో నడిచినవాళ్ళు మూడుముళ్ళు వేయడం ఒక్కటే మిగిలి ఉందని వారికనిపించింది.

ఒక్క విషయం మరచిపోకూడదక్కడ. రాఘవేంద్ర సిమ్రాన్‌కు మొదటి బాయ్‌ఫ్రెండ్ కాదు. కానీ తనే అన్న భావన ముద్రపడేలా చేయగలిగింది. తరువాత రాఘవేంద్రకు ఎవరి ద్వారానో తెలిసింది ఒక అబ్బాయితో కలిసి సిమ్రాన్ తిరిగేదని, అతని అహంకారం కారణంగా విడిపోవడం జరిగిందని తెలిసింది. అది తెలిసినా రాఘవేంద్రలో ఏ మార్పూ లేదు. సిమ్రాన్ వ్యక్తిత్వాన్ని చూసే ఆమెను ఇష్టపడ్డాడు.

అందుకే ఆమెతో జీవితాన్ని పంచుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఒక అందమైన కుటుంబాన్ని ఊహించాడు. రాఘవేంద్ర సిమ్రాన్‌ల ప్రేమ గుర్తులెన్నో ఇందిరాపార్కు, కెబిఆర్‌పార్కు, శిల్పారామం, నెక్లెస్ రోడ్డు, దుర్గం చెరువు... జీవితంలో మధురాతి మధురమైన రోజులు.

ఏమైనా రాఘవేంద్రలో ఒక చిన్న బెరుకు, భయం సిమ్రాన్ చేయిపట్టుకుని నడవాలంటే వాళ్ళ కుటుంబ సభ్యులకు తెలిస్తే ఏమనుకుంటారు.

సంప్రదాయ కుటుంబం తాలూకు ఛాయలు విడిచిపెట్టలేదు అతడ్ని. ఎందుకంటే ఇది పాతికేళ్ళ క్రితం విషయం.

"వశ్రీ దేనికి డియర్... ఏమీకాదు" అని అంటూండేది రాఘవేంద్రతో.తననుతాను సమర్థించుకోలేకపోయేవాడు రాఘవేంద్ర.

"చూడు డియర్... ఒకవేళ మన విషయం మా వాళ్ళకు తెలిసిందే అనుకో... నేను మరొకరి పేరు చెబుతానులే. నీ పేరు బయటకు రానివ్వను. నీకెటువంటి ఇబ్బందీ రాదు" అని చొరవ చూపించేది.

ఆ మాటలకు రాఘవేంద్రకు నవ్వు వచ్చేది. సిమ్రాన్‌తో మాట్లాడడం ఏమైనా కష్టమే. వాదనకు దిగితే ఓడిపోకా తప్పదు. రాఘవేంద్రకు ఆ రోజు బాగా జ్ఞాపకం. మరి తొలి అనుభవం కదా.

కాలేజీ కారిడార్ ఖాళీగా ఉంది. అంతా వెళ్ళిపోయారు. లోపల భయం. అయినా ఒకలాంటి ఉద్రేకం. ఆ డ్రెస్సులో చాలా అందంగా ఉంది సిమ్రాన్.

లేత గులాబీ రేకుల్లాంటి పెదాలు, మెరుపులు ఒలకబోసే పొడుగాటి కళ్ళు.పసిమిఛాయలో మెరిసిపోతూ కనిపించింది.

ఆ నిశ్శబ్ద వాతావరణం ప్రోత్స హించింది. ఎటో చూస్తూనడుస్తున్న సిమ్రాన్‌ను ఒక్కసారిగా దగ్గరికి తీసుకుని పెదవులపై గట్టిగా ముద్దుపెట్టుకున్నాడు.

ఉలిక్కిపడిన సిమ్రాన్ "అయ్యో ఏమిటిది... సడన్‌గా" అంది. అన్నదేగానీ అతను చేసింది తనకూ ఇష్టమైనదే. కళ్ళలోకి చూస్తూ ఉండిపోయిన రాఘవేంద్రతో అంది "నేనెంత భయపడ్డానో తెలుసా... ఏమిటీ అల్లరి" అని.

"ఆగలేకపోయాను... సారీ"

"అంత ఆగలేకపోవడానికి కారణమేమిటో తెలుసుకోవచ్చా" అంది సిమ్రాన్. "నీ అందం"

"రోజూ చూస్తున్నదేగా"

"ఈరోజు మరీ పిచ్చెక్కించింది... ఆ డ్రస్సు"

"నచ్చిందా" తన ఎదసంపదను అతనికి పరిచయం చేయడానికన్నట్లు దగ్గరగా తీసుకొచ్చింది.

"పిచ్చిపిచ్చిగా" అన్న పెదవుల్లో కసి కనిపించింది.

"ఒక నవల రాసేస్తారేమిటి"

"ఒకటేమిటి... ఎదురుగా ఉంటే ఎన్నయినా రాసేయొచ్చు" అన్నాడు రాఘవేంద్ర.

"అంత ఆగలేకపోయినవారు చూస్తూ, రాసుకుంటూ కూర్చోగలరా అని నా అనుమానం"

"సందేహమా"

"నా అందం మీద అంత నమ్మకం"

ఇద్దరి నవ్వులూ శ్రుతి కలిశాయి.

ఆ తరువాత సిమ్రాన్ చిన్నచిన్న టూర్లు ప్లాన్ చేసింది. తనలోనూ కోరికలు బుసకొట్టడం వల్లే అలా చేసిందని అర్థమైంది.

నాగార్జునసాగర్ హోటల్ రూమ్ లోని... అనంతగిరి గెస్ట్‌హౌస్‌లో... ఇద్దరి మనసుల్లోని కోరికలు ఒకటై పొమ్మని సలహా ఇచ్చాయి.

సిమ్రాన్ కవ్వింపు చర్యలకు రాఘవేంద్ర ఆగలేకపోయాడు. కౌగిలిలో బంధించాడు. ఉక్కిరిబిక్కిరిచేస్తూనే ఆమెఒళ్ళంతా ముద్దులముద్రలు వేశాడు.

శరీరాలు రెండూ పెనవేసుకుంటున్న సమయంలో చిన్నభయం రాఘవేంద్రను ఆపేసింది. అది పసిగట్టిన సిమ్రాన్ "ఏం ఆగిపోయావు" అంది.

"......" జవాబివ్వలేదతను.

"నేను గర్భవతినైతే అని కదా" "......" దానికి చిన్ననవ్వు నవ్వింది. విషయం తేలిగ్గా తీసుకుంది.

"డియర్... నాకు బేబీ కలిగినా నీకు ఎప్పుడూ ఇబ్బంది రానివ్వను. దాని గురించి వర్రీకాకు అనవసరంగా... ఓకే" అంటూ రాఘవేంద్రను తనపైకి బలంగా లాక్కుంది.

అప్పటికే ఉన్నా లేనట్లేలా అనిపించిన దుస్తులు సిగ్గుతో మంచంమీద నుండి జారి కిందపడ్డాయి.

రాఘవేంద్ర లైటు స్విచాఫ్ చేయబోతుంటే సిమ్రాన్ ఆపేసింది "నాకిలాగే ఇష్టం. నీ మగతనాన్ని చూస్తూనేను, నా ఆడతనాన్ని రెచ్చగొడుతూ నువ్వు, మన ఊపిరులను శ్రుతి చేసుకుంటూ ఆ మధుర ధ్వనిలో ఇద్దరం..." అంటూ ఆమె చేతులు ఉత్సాహానికి ఊపిరిపోసేందుకు ఉపక్రమించాయి. సున్నితమైన భాగాలను స్పృశించాయి పదేపదే.

"ఈ దేహం నీకు అర్పించేశాను. సందేహాలు లేకుండా సాగిపో. నీ సాహసం చూపించు. గెలుపుసాధించు. నన్ను పూర్తిగా ఓడించు" అంది మత్తుగా. తన పెదాలతో అతని పెదాలను లాక్ చేసింది మరోమాట లేకుండా. చిలిపినవ్వు, మెరిసే కళ్ళు, చేతివేళ్ళ స్పర్శ... అన్నీ ఏకమై ఆమె సామ్రాజ్యంలోకి మనస్ఫూర్తిగా ఆహ్వానించాయి.

> **గూగుల్ ప్రపంచంలో ఇప్పుడు మొదలైంది. కాని నారదముని రూపంలో భారతదేశ గూగుల్ మహాభారతకాలంలోనే వుంది.**
> -దినేశ్ శర్మ, యు.పి. డిప్యూటీ సి.ఎమ్.



రాఘవేంద్రకు స్వర్గలోకపు ద్వారాలు తెరుచుకుని లోనికి దూసుకెళ్ళినట్లు అనిపించింది. ఒకరోజు సిమ్రాన్ కాసేపు మాట్లాడాక "నా ఎక్స్- హైదరాబాద్ వస్తున్నారు. ఎలాగైనా కలవాలన్నాడు"

"అలాగే వెళ్ళు" బ్రాడ్ మైండెడ్ ఫెలోలా నటించాడు రాఘవేంద్ర.

అమెరికాలో అతనో ఫైనాన్షియల్ ఎక్స్‌పర్ట్ అని, పేరు మిధున్ అని ఒకసారిచెప్పింది. ఇంకోమగవాడి గురించి కావడంతో బాగా గుర్తుంది.

తరువాతరోజు ఉదయం సిమ్రాన్ కాలేజీకిరాలేదు. బహుశా ఆమె మిధున్‌తోనే తిరుగుతూ ఉండచ్చునని పించింది. ఆ తరువాత మరో రెండు రోజులు రాకపోవడంతో దిగులు మొదలైంది.

ఎవరిని కనుక్కోవాలో కూడా అర్థంకాలేదు. ఆమె స్నేహితుల్ని అడిగితే తెలియదన్నారు.

వారం గడిచింది భారంగా... ముందువారం ఎంత ఆనందోత్సాహాలతో గడిచిందో తలుచుకుంటే బాధ కలిగింది. కాలేజీ ఆవరణలో ఓ చెట్టుకింద కూర్చుని డైరీలో ఏదో రాసుకుంటున్నాడు. ఎదురుగా కాస్త దూరంగా ఎవరో నిలబడినట్లు అనిపించి తలెత్తి చూశాడు రాఘవేంద్ర.

సిమ్రాన్... తన అందాలరాశి. కానీ, ఎందుకోఎప్పటిలా అనిపించలేదు. వేరుగా ఉంది.

"ఎక్కడికెళ్ళిపోయావు సిమ్రాన్. నేను ఎంత వర్రీ అవుతున్నానో తెలుసా?" లోపల పేరుకుపోయిన నిరాశ బయటికొచ్చింది. గట్టిగానే అన్నాడు.

సాధారణంగా రాఘవేంద్ర ఆ స్వరంలో మాట్లాడితే సిమ్రాన్ దీటుగా జవాబిచ్చే మనిషి. అటువంటిది మౌనంగా ఉండిపోయింది. రాఘవేంద్ర కళ్ళలోకి సూటిగా చూడలేకపోయింది.

లేచి దగ్గరగావెళ్ళి ఆమెపైన చేయివేశాడుప్రేమగా. "స్వీటీ... ఏం జరిగింది..." చేయితీసి కాస్త పక్కకు నడిచింది. ఆమెతోపాటు అతనూ నాలుగడుగులు వేశాడు. అప్పుడు చెప్పడం ప్రారంభించింది-

"అయామ్ సారీ రాఘవ... కొన్ని విషయాల్లో మార్పు తప్పనిసరి అవుతుంటుంది"

"ఏ విషయం" "......" "చెప్పు"

"నా ఎక్స్ అదే మిధున్‌తో నా పెళ్ళి నిశ్చయమైంది. రెండు కుటుంబాలూ ఆనందంగా అంగీకరించడం... వచ్చే వారమే పెళ్ళి. సింపుల్ రిజిస్టర్ మ్యారేజ్. వెంటనే అమెరికా ప్రయాణం.

అతనికి అక్కడ ఇల్లుంది" గుక్కతిప్పుకోకుండా ఒక్కసారిగా చెప్పేసిందంతా. జీవితానికే ముగింపు పలికినట్లు అనిపించింది రాఘవేంద్రకూ.

"కుదరదు. నేను ఒప్పుకోను సిమ్రాన్.

నువ్వు నా స్వంతం" అన్నాడు రాఘవేంద్ర.

"అయామ్ సారీ రాఘవా... మా పేరెంట్స్ ఎలాగైనా ఒప్పుకోరు. అది జరిగే అవకాశం ఎంతమాత్రం లేనప్పుడు ఇలా జరగడమే సురక్షితమైన మార్గం అనిపించింది. నాకంటే చక్కని అమ్మాయిలుదొరుకుతారు రాఘవా నీకు"

"ఎలా అనగలుగుతున్నావు ఆ మాట. కనబడని వారంలో ఏం జరిగింది" అడిగేశాడు.

"మిథున్‌తో గోవా వెళ్ళాను. అక్కడ రూమ్ బుక్ చేసి ఉంచాడు" అంది సిమ్రాన్.

రాఘవేంద్రకు విషయం అర్థమైంది. ఆమెఅతనితో సుఖం పంచుకుని ఉంటుంది.తనకంటే అతనే భర్తగా బెటర్ అనుకునిఉంటుంది. హోదా, ఆస్తిపాస్తులు... అన్నింటినీ మించి ఒకేకులం. పెద్దలు కోరుకునేవేమిటో సిమ్రాన్‌కు తెలుసు. అందుకే దేనికీ అడ్డుచెప్పలేదు. తన దగ్గర సింపుల్‌గా సారీతో సరిపోతుంది. రాఘవేంద్ర ఒంటరివాడయ్యాడు.

సిమ్రాన్ కాలేజీ మానేసి వెళ్ళిపోయిందని తెలిసింది. అమెరికా వెళ్ళిపోయిన విషయమూ ఎవరో చెప్పారు. ఆడవాళ్ళంటేనే అసహ్యం కలిగింది రాఘవేంద్రకు. వాళ్ళను నమ్మితే గోతిలో పడ్డట్లే అన్నది అతని భావన.

డోర్ బెల్ మోగింది.

ఆలోచనల అలజడి తగ్గి ప్రశాంతత ఏర్పడుతున్న సమయంలో... తట్టిలేపినట్లయింది ఒక్కసారి.

పనిమనిషి వచ్చి ఉండాలి. డోర్ తీశాడు.

పనిమనిషి కాదు. ఒక అమ్మాయి. రూపురేఖలు లీలగా మెదిలాయి గతాన్ని మోసుకొస్తూ. ఎలా మరచిపోగలడు ఆ నీలికళ్ళను. అందంగా ఉంది అమ్మాయి, అచ్చం సిమ్రాన్‌లాగే.

కళ్ళల్లో అదే మెరుపు... పెదాలపై అటువంటి నవ్వే... ఎందుకో నా కూతురై ఉండాలి అనిపించింది. 'సిక్స్త్ సెన్స్ అంటే అదేనేమో' రాఘవేంద్ర అనుకున్నాడు. అందుకే ఆ స్వతంత్రం కావచ్చు. ఎంతో చనువుగా లోపలికొచ్చేసింది.

రాఘవేంద్ర మాత్రం ఏం అడగలేదు. ఒకానొకప్పుడు ఆమె తల్లిదగ్గర ఓడిపోయాడు. ఇప్పుడు కూతురు... ఇల్లంతా కలియబెట్టింది. రాఘవేంద్ర పుస్తకాల బీరువాకేసి చూసింది.

స్టడీరూమ్‌లోకివెళ్ళింది. రాఘవేంద్ర రెండవ నవల రాయడంలో ఉన్నాడని టేబుల్ మీద కాగితాలు సాక్ష్యమిస్తున్నాయి.

మొదటి నవల పెద్ద ఫ్లాప్.

రాఘవేంద్ర ఆమెతోపాటు వెనగ్గా వెళ్ళలేదు. ముందుగదిలోనే వాలుకుర్చీలో కూర్చుండిపోయాడు ఏం పట్టనట్లు. చాలాసేపటికిగాని ఆమె స్టడీ రూమ్ నుండి బయటకురాలేదు.

"నేను మీ నవల చదివేశాను... ముగింపు ఇంకా రాయాల్సి ఉందికదా"

"......"

'బావుంది. చాలా పాపులర్ అవుతుంది" అంది.



కొత్త ఉత్సాహం

తానీమధ్య నటించే సినిమాలన్నిటికీ ప్రేక్షకుల స్పందన ఎంతో బావుంటున్నదని, ఈ స్పందనే తనలోని నటికి ఊపిరిపోస్తున్నదని అదేపనిగా సంబరపడుతున్నది సమంత.

"వృత్తిరీత్యా నేను ఆశించే సంతృప్తి ఇటీవల ప్రతి సినిమాలోనూ నాకు దక్కుతున్నది.

ఓ నటిగా ఆత్మ సంతృప్తిని ఇచ్చే పాత్రలు రావడం మొదలయినప్పటి నుంచీ నాలో కొత్త ఉత్సాహం సంతరించుకుంటున్నది. హీరోయిన్ ప్రాధాన్యంగల పాత్రలే కావాలని నేను కోరుకోవడంలేదు.

కమర్షియల్‌చిత్రాల్లోనూకథానాయికకు ప్రాధాన్యం ఉంటున్నది. మంచి కథల్లో భాగం అయితే చాలనుకుంటాను" అంటూ మెరిసే కళ్ళతో చెప్పుకొచ్చింది.

"ఎందుకొచ్చావు ఇప్పుడు. నా గతాన్ని తోడి ఏం ఆనందం పొందుదామని"

దానికి జవాబివ్వడానికి టైము తీసుకుంది. అనుభవం లేని చిన్నపిల్ల కదా... ముందు కళ్ళలోకిచూసింది. రాఘవేంద్ర చూడలేకపోయాడు. సిమ్రాన్ వెళ్ళిపోయినప్పట్నుంచీ లైఫ్‌లో డిసిప్లిన్ పోయింది.

ఎవరికోసం... ఎందుకోసం అన్నట్లు తయారైంది జీవితం. సిగరెట్లు, ఆల్కహాల్ బాగా అలవాటైపోయాయి. రూపురేఖల్నే మార్చేశాయి. ముఖం మీద ముడతలు. నలభైఏళ్ళకే అరవైఏళ్ళు మీదపడ్డట్టు...

"మమ్మీ మిమ్మల్ని ఎంతో ప్రేమిస్తోంది ఇప్పటికీ"

"ఇప్పటికీ" అన్న విషయం కొత్తగా అనిపించిందతనికి.

"ఓహో అలాగా... నీకేం తెలుసు" వ్యంగ్యం.

క్షణం తరువాత "మమ్మీ అంతా చెప్పింది. మీరు, మీతో ఉన్న సంబంధం. మమ్మీని మీరెంతగా ప్రేమించిందీ మమ్మీ అంటూంటుంది. జీవితంలో తనెంతో ఇష్టపడే పర్‌ఫెక్ట్ వ్యక్తి మీరేనని"

రాఘవేంద్రకు నవ్వు వచ్చింది. ఇన్నాళ్ళ నుంచీ పేరుకుపోయిన నిరాశా నిస్పృహలు, ఒంటరితనం... ఆ క్షణంలో కట్టలు తెంచుకున్నాయి.

ఇప్పుడు ఇన్నేళ్ళకు సిమ్రాన్ తన కూతుర్ని తన దగ్గరికి ఎందుకు పంపినట్టు. ఆ కూతుర్ని చూసుకునే మంచితనం భర్తలో లేదనిపించిందా.

"ఏం కావాలిప్పుడు నీకు"

ఆమె అలాగే నిలబడి వుంది.

రాఘవేంద్ర ముఖంలో లోతుకుపోయిన కళ్ళలోకి చూస్తూ....

ఆమె కళ్ళల్లో ఒక వణుకు కనిపించింది. రాఘవేంద్ర నియంత్రించుకున్నాడు.

"నాన్నా" అంటూ గట్టిగా హత్తుకుంది.

గడ్డకట్టుకుపోయినట్లయింది. ఇలా జరగడం ఇది రెండవసారి... ఇన్నేళ్ళ తరువాత.

జీవితంలో సిమ్రాన్ రెండవసారి ఓడించింది. మొదటిసారి ప్రేమలో.. రెండవసారి మళ్ళీ ఇప్పుడు ప్రేమతోనే... బిడ్డ ద్వారా.

రాఘవేంద్రకు హాని కలగకూడదనుకుంది. ప్రేమ వ్యవహారం బయటపడితే ఏం జరుగుతుందో సిమ్రాన్ ఊహించగలిగింది.

తనవాళ్ళంతా కలిసి రాఘవేంద్రను లేకుండా కూడా చేయగలరు. ఎటువంటి సాహసం పనికిరాదనుకుంది. వాళ్ళు చెప్పిన వ్యక్తి ముందే తలవంచి తాళి కట్టించుకుంది.

ఒక్కొక్క విషయమూ మేఘన ద్వారా బయటికొచ్చాయి. అంతేకాదు, మిథున్ పెళ్ళయ్యాక కొన్నాళ్ళకే అమెరికాలో రోడ్డు యాక్సిడెంట్‌లో చనిపోయాడని, మేఘన ఒక్కర్తేకూతురని, అదికూడా సిమ్రాన్‌కు రాఘవేంద్రవల్ల కలిగిన సంతానమనే నిజం ఇన్నేళ్ళూ రహస్యంగా గుండెల్లోనే దాచుకుందని.

ఈమధ్యే మేఘనకు చెప్పిందని, ఆ తరువాత ఇండియా వచ్చేసిందని, ముంబయిలో ఉంటోందని సిమ్రాన్‌కు కూడా రాఘవేంద్రను చూడాలని ఉందని, కానీ జరిగిన పరిస్థితుల దృష్ట్యా ముఖంచెల్లక రాలేకపోయిందని... ఒక్కొక్క విషయం మేఘన చెప్పుకొచ్చింది. కన్నతండ్రి గుండె కరిగిపోయింది.

ఒకరి కన్నీరు మరొకరు తుడుచుకున్నారు ఇద్దరూ. ఆ మర్నాడే ముంబయి బయలుదేరారు తేలికపడ్డ మనసులతో.

అంతా రాజకీయమే

సూపర్ సి.ఎమ్. సిద్ధు

రెండు నియోజక వర్గాలలో పోటీ చేసి ఒక దానిలో భారీగా ఓడిపోయి మరోదానిలో గెలిచిన కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఇప్పుడు కాంగ్రెస్ బ్రాండ్ రాజకీయాల్లో బాధ్యత వహించాల్సిన అవసరంలేని సూపర్ సిఎమ్ అయ్యాడు.

జె.డి.(ఎస్.)కి ముఖ్యమంత్రి పదవి దక్కిందన్న ఆనందం తప్పించి మిగిలినదంతా విషాదంగా చేశారు కాంగ్రెస్‌వారు. ప్రభుత్వానికి ఆవల ఒక కో ఆర్డినేషన్ కమిటీ వేసి, ఆ కమిటీ అనుమతి లేకుండా ఎటువంటి నిర్ణయాలు తీసుకునేందుకు వీల్లేదని సి.ఎమ్ కుమారస్వామికి తేల్చిచెప్పారు.

కుమారస్వామి కో ఆర్డినేషన్ కమిటీకి ఓ.కే. అన్నాడు.ఇప్పుడు ఆ కమిటీకి ఛైర్మన్ సిద్దరామయ్య అని ప్రకటించి, ఆయన సూపర్ సి.ఎమ్.గా వ్యవహరించే అవకాశం కల్పించారు.

సిద్దరామయ్య పొడే గిట్టని జె.డి(ఎస్.), అతగాడి అనుమతితో ముఖ్యమంత్రి కుమారస్వామి నిర్ణయాలు తీసుకోవటమనే ఏర్పాటును ఎలా స్వాగతిస్తారు అన్నది ప్రశ్న. అందుకే కర్ణాటకలో లుకలుకలు అప్పుడే మొదలయ్యాయి. ◆

నోయిడా దెబ్బేనా...

రెండేళ్ళక్రితం అద్భుత విజయం సాధించిన బి.జె.పి. ఉత్తరప్రదేశ్ ఉప ఎన్నికల్లో వరసగా ఎందుకు ఓడిపోతోంది! దీనికి ఎన్నోరకాల కారణాలు ఉన్నా పార్టీలోని కొందరు వద్దని చెప్పినా ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ చేసిన నోయిడా పర్యటన ఫలితమేనంటున్నారు.

ఉత్తరప్రదేశ్ రాజకీయాలలో ఉన్న ఒక గట్టి నమ్మకం నోయిడాకి వెళ్ళిన ముఖ్యమంత్రి పదవి నిలవదు అని. అందుకే అటు మాయావతిగాని ఆ తర్వాత వచ్చిన అఖిలేష్ యాదవ్‌లిద్దరూ తమ పదవీకాలంలో ఎన్నడూ నోయిడావైపు తొంగి చూడలేదు. నోయిడా అతివేగంగా అభివృద్ధిచెందుతున్న పట్టణం. ఢిల్లీకి మరీ దగ్గర.

అయినా అక్కడ ఏదైనా అధికారిక ప్రారంభోత్సవాలు చేయాల్సివస్తే లక్నోలోనే కూర్చుని రిమోట్ కంట్రోల్‌తో చేసేవారు. అదంతా అర్థంలేని నమ్మకం అని సి.ఎమ్. యోగి ఆదిత్యనాథ్ దాస్ నోయిడా వెళ్ళి పలు కార్యక్రమాలలో పాల్గొన్నాడు.

అప్పటినుండే బి.జె.పి.కి ఓటములు మొదలయ్యాయని, సి.ఎమ్. యోగి ఏదైనాచేసి ఆ దోష పరిహారం పొందాలని పార్టీ పెద్దలంటున్నారు. ◆

చెప్పనివే చేస్తారు

'వాగ్దానం చేసినవే కాదు, చెప్పనివి చేస్తున్నాం' అనేది ఇటీవలి కాలంలో రాజకీయ నేతల నోటి వెంట వినిపించే మాట. అలా చెప్పటంలో మిగిలిన నాయకులకన్నా ముందుండే నేత కె.సి.ఆర్.

ఎన్నికల సమయంలో అధికారంలోకి రావటానికి చాలా చెపుతారు. అందులో 'దళితుడే ముఖ్యమంత్రి' అనే అతి పెద్ద వాగ్దానం నుండి 'ఇంటింటికీ నల్లా' 'ప్రతి ఎకరానికీ నీరు'వంటివి చాలా ఉంటాయి. అయితే ఎన్నికలలో గెలిచిన తరువాత దళితుడిని పక్కనపెట్టి తానే ముఖ్యమంత్రి పదవిని తీసుకోవటం అనేది చెప్పనివి చెయ్యటంలో మొదటి స్థానంలో నిలుస్తుంది.

చెప్పిన మాటలు, చేసిన వాగ్దానాలు ఏమేరకు నిలబెట్టుకున్నదీ రాష్ట్ర ప్రజలకు అర్థమవుతున్న వేళ వారి మనసుల్లో కొత్త ఆశలు నింపితేగాని వచ్చే ఎన్నికల్లో గెలుపు సాధ్యంకాదు. అందుకే ఇప్పుడు ప్రభుత్వ పథకాలద్వారా నేరుగా రైతులకు డబ్బులు చేతిలో పెట్టి ఓట్లు వేయించుకునే పథకం చెప్పనిదే చేస్తున్నారు. ◆

చెప్పుల శకునం

మధ్యప్రదేశ్‌లో ఎన్నికలకు సంవత్సరం ముందు నుండే ప్రచారం చేపట్టాలని కాంగ్రెస్ భావించింది. అందుకు తగినట్టుగానే కమలనాథ్‌ని రాష్ట్ర నేతగా, జ్యోతిరాదిత్య సింధియాని ప్రచార నేతగా ప్రకటించింది. ఎన్నికల ప్రచారాన్ని తమ ఇష్టదైవమైన ఉజ్జయిని కాళీమాతా దేవాలయంలో పూజ చేసి ప్రారంభించాలనుకున్నాడు సింధియా.

వేలాదిమంది వెంటరాగా ఉజ్జయిని దేవాలయంలో పూజలుముగించి బయటకు వచ్చి చూసుకుంటే సింధియా చెప్పులు మాయమయ్యాయి.

జ్యోతిరాదిత్య సింధియా రాజరికపునాటి చెప్పులను ఎవరయినా గౌరవంతో తీసుకువెళ్ళారో లేక కోపంతో తీసుకువెళ్ళారో తెలియదుకాని చెప్పుల మాయం ఎటువంటి శకునం అనే చర్చ కాంగ్రెస్‌లో మొదలయింది.

ప్రచారానికి బైలుదేరుతుంటే చెప్పుల మాయం అశుభం అని కాంగ్రెస్‌లోని ఒక వర్గం అంటుంటే, చెప్పులు మాయమవటం అంటే అంతా మంచి జరుగుతుందనే శకునమని సింధియా ఆప్తవర్గం అంటున్నది. ఇంతకీ అసలు శకునం ఏమిటో, అసలు దానిని ఎందుకు నమ్మాలో జ్యోతిరాదిత్య సింధియా చెప్పటంలేదు. ◆

పొత్తు... మీతో వద్దు

బి.జె.పి.ని ఓడించేందుకు ఏ పార్టీతో అయినా చేతులు కలిపేందుకు సిద్ధమని కాంగ్రెస్ ప్రకటించింది. ప్రతిపక్షాలలో ఒకే ఒక్క పార్టీతోమాత్రం పొత్తులు పెట్టుకోము అంటున్నది కాంగ్రెస్. ఆ ఒక్క పార్టీ 'ఆమ్ ఆద్మీ పార్టీ'.

ఆ పార్టీ నేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ గత ఎన్నికల్లో ఘనవిజయం సాధించాడు. అయితే గడచిన మూడు సంవత్సరాలలో కేజ్రీవాల్ గ్రాఫ్ పడిపోయింది. ప్రజలలో గతంలో ఉన్న 'క్రేజ్' కేజ్రీవాల్‌కి లేదు.

పైగా 2014 ఎన్నికలకు ముందు యు.పి.ఎ. ప్రభుత్వాన్ని అవినీతిమయ ప్రభుత్వంగా ముద్ర వేసి తీవ్ర ప్రచారం చేసినవాడు కేజ్రీవాల్.

నాడు కేజ్రీవాల్ కొట్టిన ఆరోపణల దెబ్బల వలనే కాంగ్రెస్ బలహీనపడి బి.జె.పి. చేతిలో ఓడిపోయిందనేది కాంగ్రెస్ నేతల నమ్మకం.

అందుకే తిరిగి కేజ్రీవాల్‌తో చేతులు కలిపి, అతను కోరినన్ని సీట్లు ఇచ్చి గెలిపించి తాము ద్వితీయ స్థానంలో ఉండటంకన్నా కాంగ్రెస్ పార్టీ అదృష్టాన్ని ఒంటరి పోరాటంగానే నిరూపించుకోవాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ◆

షాక్ భయం

జార్ఖండ్ రాష్ట్రంలో జరిగిన ఉప ఎన్నికల్లో జార్ఖండ్ ముక్తి మోర్చా (జె.ఎమ్.ఎమ్.) గెలవటం అంటే వచ్చే ఎన్నికల్లో ఉత్తర భారత రాష్ట్రాలలో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సివస్తుందని ఆ పార్టీ అగ్రనేతలకు అర్థమయింది.

గత ఎన్నికల్లో అధిక సీట్లు గెలుచుకుని, ప్రాంతీయ పార్టీ అయిన జె.ఎమ్.ఎమ్.ని పక్కకి నెట్టింది బి.జె.పి. ఇక ప్రాంతీయ పార్టీ భావజాలం నుండి జార్ఖండ్‌ని జాతీయ భావజాలంవైపునకు మరలించగలిగామన్న తృప్తి భారతీయ జనతా పార్టీకి మిగల్చలేదు జార్ఖండ్ ఓటర్లు.

జె.ఎమ్.ఎమ్. నేతలు ఎన్ని రకాలుగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నా, కొందరు నేతలు జైలులో శిక్ష అనుభవిస్తున్నా ఓటర్ల మనసుల్లో జార్ఖండ్ ముక్తి మోర్చా రగిల్చిన ప్రాంతీయ భావజాలం చాలా స్థిరంగా నిలిచివుంది.

అందుకే కీలకమైన ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదురైనప్పుడు ఓటర్లు ప్రాంతీయ పార్టీలవైపు మళ్ళుతున్నారు. ఇది భారతీయ జనతా పార్టీకి మరింత షాక్ ఇస్తున్న విషయం.



శ్రీ లలితాదేవి స్తుతి

ప్రాతఃస్మరే పరశివాం లలితాం భవానీం
త్రయ్యంతవేద్య విభవాం కరుణానవద్యాం।
విశ్వస్య సృష్టి విలయస్థితి హేతుభూతాం
విశ్వేశ్వరీం నిగమవాఙ్మనసాతి దూరామ్ ॥

పరశివా, లలితా, భవానీదేవిని ప్రాతఃకాలంలో స్మరిస్తున్నాను. వేదవేద్యమైన వైభవం ఆ తల్లిది. అపారకరుణామయి, విశ్వసృష్టి స్థితిలయకారిణి, విశ్వేశ్వరి, వాక్కులకూ మనసులకూ అందనిది అయిన ఆ లలితాదేవికి నమస్సులు. ❐

రంభావ్రతం

(తేది : 16.6.2018)

'రంభ' అనే మాటకి అప్సర స్త్రీ అనేది అర్థం కాదు. 'రంభ' అనే పదానికి 'అరటి' అని అర్థం. రంభా పత్రమంటే అరటాకు.

రంభా ఫలమంటే అరటిపండు అని అర్థం. రంభా వ్రతమంటే మొత్తం అరటికి సంబంధించినవాటితోనే చేస్తూ గడిపే ఒకరోజు అని అర్థం.

అరటిదొప్పలని చిన్నచిన్నవిగాతరిగి వాటికున్న ఆ కాలువలాటి భాగంలో ఆవునేతి దీపాలని పెట్టాలి. అరటి పువ్వుకి ఉండే ఆ జేగురు ఆకుల్ని తీసి కాల్చి నల్లనిమసిగా అయ్యాక ఆవు నేతిని చేర్చి దాన్ని బొట్టుగా వాడాలి.

అమ్మవారి లలితాసహస్ర నామాలని చదువుతూ పూజచేసి అరటిపండ్లని మాత్రమే నివేదన చేయాలి. అరటాకులోనే భోజనాన్ని చేయాలి.

ఎండినఅరటాకునే ఆసనంగా వేసుకోవాలి. అరటి దూట(ఊచ)తో చేయబడిన వంటకాలనీ,అరటిపండు,కాయలతో చేసిన పదార్థాలనే తినాలి. అరటి అనేది శరీరానికి ఈ వేసవిలో ఎంత మేలు చేస్తుందో గమనింపజేయడానికి ఈ వ్రతం అనుకోవచ్చు. ❐

{ సజ్జనుల సేవ చేయడం ద్వారా భగవంతుడిని చేరుకోవచ్చు. }

ఉమాపూజ

(తేది : 17.6.2018)

మేనాదేవికీ హిమవంతునికీ కలిగిన కూతురు పార్వతి. హిమవంతుడు ఓ పర్వతం కాబట్టి ఆయన కూతురైన ఈమెని పార్వతి అనేవారు.

శంకరుణ్ణే మాత్రమే వివాహం చేసుకుంటానని ఆమె అంది తల్లిదండ్రులతో. శంకరునికి లావణ్యం మాత్రమే ఉంది గాని తమ హోదాతో ఆలోచిస్తే శంకరునికి ఏ విధమైన అర్హతా తమ కూతురిని వివాహమాడేందుకు లేదు. దాంతో తల్లిదండ్రులు ఆమె అభిప్రాయాన్ని కాదన్నారు.

ఆమె వీరి మాటలని తిరస్కరిస్తూ ఇదిగో ఈ జ్యేష్ఠ శుద్ధ చతుర్థి (నేడు) నాడు తపస్సు ప్రారంభిస్తానంది.

దాంతో తల్లిదండ్రులు 'ఉ-తపస్సు, మా-వద్దు' అన్నారు ఆమెతో. దాంతో ఆమె పేరు ఉమ అయింది.

కోరుకున్న భర్తతో వివాహం కావాలంటే ఈ రోజున లలితాసహస్రనామాలని పఠిస్తూ నియమబద్ధంగా ఉండడం మంచిది. సిద్ధి కలుగుతుంది. ❐

పుష్యార్క యోగం

(తేది : 17.6.2018)

ఇరవై ఏడు నక్షత్రాల్లోనూ ఎనిమిదవది పుష్యమి. ఈ నక్షత్రానికి అధిపతి 'శని'. శని అనే గ్రహం ఆయుష్యాన్ని ఇచ్చేవాడూ, వృద్ధి చెందించేవాడూ కాబట్టి పుష్యమి అనేది గొప్ప నక్షత్రం. తారాబలం చూసుకుని సహజంగా పనిని ప్రారంభిస్తారు మంచితారఅయినట్లయితేనే. 'పుష్య స్సర్వార్థ సాధకః' అని ఉండడంబట్టి పుష్యమీ నక్షత్రంలో బయల్దేరబోతే తారాబలం లేకున్నా నష్టం రాదని చెప్పింది శాస్త్రం.

ఆ పుష్యమీ నక్షత్రం గనుక ఆదివారంనాడు వస్తే పుష్యమి+అర్కుడు (సూర్యుడు) కలిపిన కారణంగా దాన్ని పుష్య అర్క యోగమన్నారు.

ఆయుష్యాన్నిచ్చే సూర్యపుత్రుడు శనీ, బుద్ధి బలాన్నిచ్చే సూర్యుడూ ఒక చోట చేరడం కారణంగా ఈ రోజుని గొప్పది అన్నారు. ఆదిత్య హృదయ స్తోత్రాన్నీ, శనిశ్లోకాలనీ చదివితే ఈ రోజున- ప్రమాదాలు జరగవు. మంచి ఆలోచనలు కూడా వస్తాయి. ❐

అరణ్యక గౌరీపూజ

(తేది : 19.6.2018)

కాలం మారాక అనేక నియమాలూ, సంప్రదాయాలూ, పూజలూ, వ్రతాలూ కాలగర్భంలో కలిసిపోయి, భగవంతుని కంటె మన పైనున్న అధికారి మాత్రమే (అతణ్ణి సేవించినపక్షంలో)మేలుచేయగల్గుతాడనే అభిప్రాయం జనుల్లో వచ్చింది. అది సరికాదు.

ఈ కాలంలో ఈ రోజున (జ్యేష్ఠ శుద్ధ షష్ఠి) ఎక్కడో నిర్జనమైన వనానికి వెళ్ళి అక్కడ గౌరీదేవి పూజని ఉదయం నుండి సాయంకాలం వరకూ తోటి ముత్తయిదువులతో కలిసి చేయడం 'అరణ్యక గౌరీపూజ'.

అమ్మవారికి వనాలంటే బాగాఇష్టం. 'కదంబ కాననావాసా, వన సంచార కుశలా, అశోకవనికాప్రియా' వంటి నామాలు ఆమెకు ఉన్న వనాల ఇష్టాన్ని చెప్తాయి. అలాటిచోట ఒక రోజుపాటు భక్తిశ్రద్ధలతో పూజని చేస్తే అనుకున్న కోరికలు నెరవేరుతాయి.


అరణ్యమనేది ఊరికి దూరంగా ఉంటుంది కాబట్టే ప్రశాంతతకి భంగం అనేది ఉండదు. అక్కడ ఉండే చెట్లు చేమలు, జింకలు లేళ్ళూ మొదలైనవన్నీ హింసకి దూరంగావుండేవే ఐన కారణంగా శాంతగుణమే మనలో తిరుగాడుతూ ఉంటుంది.

అభిషేకం కోసం సెలయేటి నీళ్ళూ, పూజకోసం ఎన్నో చెట్ల పుష్పాలూ, నైవేద్యం కోసం అనేక వృక్షాల ఫలాలూ, స్నానాలకోసం చక్కని జలాశయాలూ, మధ్యాహ్నం విశ్రాంతి తీసుకునేందుకు చక్కని పెద్ద నీడలనిచ్చే చెట్లూ,

మనసుని ఆహ్లాదపరుస్తూ విన్పించే పక్షుల కూతలూ... ఇవన్నీ మనసుకి ఆహ్లాదాన్ని కల్గజేస్తాయి. సంవత్సరానికి కనీసం ఒక్కరోజైనా ఇలాటిప్రదేశాల్లో ఉండడాన్ని అలవాటు చేసుకుంటే,

ఒక వయసొచ్చాక వానప్రస్థ జీవితంలో వనాల్లో,పర్ణశాలల్లో ఉండాలనే ఆలోచనలు వస్తాయి.

నాలుగు అడుగులు



ఇతరులను క్షమించటం అనేది మన మనశ్శాంతికి చాలా అవసరం. వారికి అర్హత వుందా లేదా అన్నది మనకు అనవసరం.

ఓ వ్యక్తిపై ప్రతీకారంతో రగిలిపోవటమన్నది, మనం విషం తాగి, వారు చావాలనుకోవటంలాంటిది. అభివృద్ధి చెందాలనుకునే వ్యక్తులకు, ఇతరుల పట్ల తమకున్న కోపం, ప్రతీకారం, అడ్డంకిగా మారతాయి.

వాటిలో చిక్కుకుని మనిషి విలవిలలాడుతూ ఉంటాడు.

అందుచేత ఇతరులపై వున్న చెడు ఆలోచనలు వదులుకోవాలి. అప్పుడే మనశ్శాంతితో అభివృద్ధి పథంలో ముందుకు దూసుకువెళతాం.

ఇతరుల చెడ్డ ప్రవర్తన మనలను బాధిస్తున్నంత వరకు,ఆ ఆలోచనలలో బందీ అయినప్పుడు, మనిషి ఆనందకరమైన భవిష్యత్తును సొంతం చేసుకోవటం సాధ్యం కాదు.

మనసును కలచివేసే పాతజ్ఞాపకాలను వదిలించుకోవాలంటే క్షమించటం నేర్చుకోవాలి. కాని ఎన్నో అడ్డంకులను ఎదుర్కోవలసివస్తుంది.

మానసికంగా మనం ఎదుటివారిని క్షమించటానికి సిద్ధంగా వుండము లేదా ఏదో ఒకరోజు అనుకోకుండా క్షమించే బుద్ధి మనలో ప్రవేశిస్తుందనిభావిస్తాం. ఒక్కోసారి క్షమించాలని ప్రయత్నిస్తాము కాని అందుకు ఎన్నుకున్న దారి సరిగ్గా ఉండదు.

అనుబంధాలకు వారధి

చాలాసార్లు 'క్షమించటం' అన్నది ఉత్తమ గుణాలలో ఒకటి కాబట్టి మనం మంచివాళ్ళమనిపించుకోవటం కోసం, మనసుకు నచ్చచెప్పుకుని క్షమించటానికి తయారవుతాం. అలా మర్యాదకోసం చేసే పని సరైన ఫలితాన్ని ఇవ్వదు.

క్షమించటంవల్ల మన ఆత్మగౌరవం పెరుగుతుంది. మనమీద మనకు ఆరాధన అధికమవుతుంది. మనలో అలవరుచుకున్న మంచితనం క్షమించమంటుంది, అనుబంధాలను సరైనరీతిలో నిలుపుకోవాలనుకుంటుంది. మరోవైపు అనాది ఆటవికభావం 'క్షమించటం' కుదరదంటుంది.

అడ్డుపడటం తప్పుకాదు. అది మనల్ని రక్షించాలని ప్రయత్నిస్తోంది. దాన్ని మంచి మాటలద్వారా బుజ్జగిస్తే అర్థంచేసుకుంటుంది. క్షమించటానికి తయారవుతుంది.

మనం క్షమించినప్పుడు ఎదుటివారిని శిక్షించాలన్న భావన మనసులోనుండి తొలగిపోతుంది. ఎదుటివారిని దెబ్బతీయాలన్న ఆలోచన, ఎంత సమర్థించుకున్నప్పటికీ బాధకు కారణమవుతుంది. గుండెలమీద బండరాయిలా నిలిచిపోతుంది.

ఎప్పుడైతే ప్రతీకారేచ్ఛ తొలగిపోతుందో ఆ క్షణం మనం స్వాతంత్ర్యాన్ని పొందుతాం. మనసు తేలిక పడుతుంది, మనశ్శాంతి సొంతమవుతుంది.

ఎదుటి వ్యక్తిని క్షమించిన తరువాత మాత్రమే వారితో అనుబంధాన్ని ఎలా కొనసాగించాలన్నదానిపై

సరైన మార్గం

మన స్మార్ట్‌ఫోనులో పనికొచ్చే యాప్‌లు వుంటే ఎన్నోపనులు అవలీలగా చేయవచ్చు. అలాగే సరైన మార్గాన్ని ఎన్నుకుంటే 'క్షమించటం' ఎంతో తేలిక. 'క్షమించటం' ఎలాగో తెలియజేసే వినూత్న మార్గం నేడు మనకు అందుబాటులో వుంది. దాని పేరు 'క్షమించటంవైపు నాలుగు అడుగులు'.

ఈ మార్గంలో ఒక్కో అడుగువేస్తూ ముందుకు వెళితే క్షమించటం తేలికవుతుంది, మనసు శాంత పడుతుంది, మనశ్శాంతి లభిస్తుంది.

మనలోపల రెండురకాల ఆలోచనలు సాగుతూ వుంటాయి. ఒక భాగం క్షమించమంటుంది, వేరే భాగం అడ్డుపడుతుంది. అలా అని అడ్డుపడుతున్న భాగం తప్పుడుమార్గంలో వెళుతోందని భావించకూడదు. ఆ భాగం మనల్ని రక్షించటానికి ప్రయత్నిస్తోంది. అలా ఏ భాగమైతే క్షమించటానికి అడ్డుపడుతోందో,ఆ భాగంయొక్క అభ్యంతరాలను, ఆరోగ్యకరమైన రీతిలో తొలగించగలిగితే చాలు క్షమించటానికి అడ్డేమీ వుండదు. అడ్డుపడే భాగానికి నిదానంగా నచ్చచెప్పాలి. అంతేకాని దానిని బలవంతంగా ఒప్పించేపని చేయకూడదు. మనలోని అడ్డుపడే భాగం, కోరుకునే ఆరోగ్యకరమైన అవసరాలను గమనించాలి. వాటిని అందించాలి.

క్షమించటం మంచి లక్షణం. ప్రతీకారం తీర్చుకున్నాక క్షమిస్తాననటం సరిఅయిన విధానం కాదు. అందుచేత, క్షమించటంవల్లకలిగే లాభాలు ఏమిటో తెలియజెప్పి, అడ్డుపడే భాగాన్ని పక్కకు తప్పించాలి. ఒనగూడే ఫలితాలపై మనం దృష్టిపెడితే అడ్డు నిదానంగా కరిగిపోతుంది.



మనకు స్పష్టత వస్తుంది. క్షమించటంవల్ల అనుబంధాన్ని నిలుపుకోవచ్చు లేదా వదిలేసి వెళ్ళిపోవచ్చు.

ఇప్పుడు 'క్షమించటం వైపు నాలుగు అడుగులు' వేద్దాం. మొదట ఈ పద్ధతిని నేర్చుకునేటప్పుడు రాత పూర్వకంగా అభ్యాసం చేయటం మంచిది.

ఇలా వేసేటువంటి నాలుగు అడుగులు, వ్యక్తుల మధ్య ఏర్పడిన దూరాన్ని దూరం చేస్తాయి. అనుబంధాలకు వారధి కడతాయి.

ఎవరిని? ఎందుకు?

మొదటగా మీరు ఎవరిని క్షమించాలనుకుంటున్నారో ఆలోచించండి.

ఎందుకు వారిని క్షమించాలో కూడా అనుకోండి. ఆ విషయాన్ని ఒక కాగితంపై ఈ తరహాలో రాసిపెట్టుకోండి. "నేను ....ను క్షమించాలనుకుంటున్నాను. ఎందుకంటే..."

ఉదాహరణకు :

"నేను అరుణను క్షమించాలనుకుంటున్నాను. తను నా బాయ్‌ఫ్రెండ్‌ను నాకుకాకుండా చేసింది"

"నేను రంజితను క్షమించాలి. చిన్నప్పుడు నన్ను బాగా గట్టిగా కొట్టింది"

"మా నాన్న నన్ను ప్రేమగా చూడలేదు. నేను ఆయనను మన్నిస్తాను"

ప్రస్తుత మానసిక స్థితి

పరిస్థితి గురించి మీ మనసులోవున్న అన్ని రకాల బాధాకరమైన విషయాలను కాగితంపై పట్టికరూపంలో రాయండి. ఇలా రాసేటప్పుడు నిజమైన ఇబ్బందిని వున్నది వున్నట్లుగా రాయాలి.

అంతేగాని మంచి వాక్యాలుగానో లేదా తక్కువ చేసో రాసుకోకూడదు.

ఉదాహరణకు :

"నాకు వాడిపై పిచ్చకోపంగా ఉంది"అన్నది నిజం. అయితే "వాడివల్ల నాకు కొంచెం బాధ వేసింది" అని రాయటం తప్పు. మీ మనసుపడిన బాధను యథార్థరూపంలో కాగితం మీద పెట్టాలి.

లాభాలు

క్షమించటంవల్ల కలిగే ప్రయోజనాలను కాగితంపై రాసుకోవాలి. మీరు ఎదుటివారిని పూర్తిగా క్షమించేశారు. అసలు ఇటువంటి సంఘటన జరగనేలేదన్నట్లు భావిస్తున్నారు.

అప్పుడు మీ మానసిక స్థితి ఏమిటి? మీ ప్రవర్తన ఎలా వుంది? క్షమించిన తరువాత అంతకుముందు కన్నా సంతోషంగా వున్నారా? వచ్చే లాభాలు క్షమించటానికి ముందు వున్న మన స్థితికి వ్యతిరేక దిశలో వుంటాయి. క్షమించకముందు కోపం వుండేది. క్షమించిన తరువాత 'శాంతం' వుంది.

కాగితంగా మీకు కలిగిన అనుభూతులను రాయండి. వదిలిపోయిన ఆలోచనలగురించి వద్దు. అంటే "నాకెంతో సంతోషంగా వుంది" అని రాసుకోవాలి. అంతేగాని "నా బాధ దూరమైంది" అని రాసుకోకూడదు.

కొన్నిసార్లు క్షమించటంవల్ల వృత్తి, ఉద్యోగాలలో మంచి మార్పులు చోటుచేసుకుంటాయి.

జీవితభాగస్వామితో అనుబంధం మరింత బలపడుతుంది. 'క్షమించటం' ద్వారా ఏం పొందాలనుకుంటున్నారో కాగితంపై రాసుకోండి.

సుఖమైన జీవితం

ముందు క్షమించాలనుకున్నాం. మన మానసిక పరిస్థితిని అర్థంచేసుకున్నాం, వచ్చే లాభాలు తెలుసుకున్నాం. ఆపై నిర్ణయాన్ని అమలుచేయాలి. అందుకోసం కాగితంపై "నేను ....ను క్షమిస్తున్నాను. నేను దానిద్వారా వచ్చే.... లాభాలను అంగీకరిస్తున్నాను" అని రాసిపెట్టుకోవాలి.

ఉదాహరణకు :

"నేను అనంత్‌ను క్షమిస్తున్నాను. దానివల్ల నాకు కలిగే మనశ్శాంతిని మనసారా స్వీకరిస్తున్నాను"

ఇలా కాగితంపై రాసేముందు మనసులో మూడుసార్లు నిదానంగా ఒక్కొక్కమాట అనుకోవాలి.

అలా నిదానంగా అనుకుంటూ మీలో మార్పు ఏమన్నా వస్తోందేమో గమనించండి.

పైన చెప్పినవిధంగా ఒక వ్యక్తి లేదా విషయం గురించి కొన్నిసార్లు మనసులో ఒక్కో అడుగు ముందుకు వేయండి.



మీ మానసిక స్థితి వచ్చే మార్పులను చూస్తూవుండండి.

మొదటి అడుగులో క్షమించాలన్న ఆలోచన దృఢమవుతుంది. రెండు, మూడు అడుగులలో మానసికస్థితి మరింత మెరుగుపడుతుంది.

అలా సాగుతుండగా ఒక సమయంలో మీరు 'మంచి మార్పు'ను పూర్తిగా అనుభూతి చెందుతారు. క్షమించటం నేర్చుకుంటే అభ్యాసం చేస్తూవుంటే, కొంతకాలానికి అప్రయత్నంగా మీలో భాగంగా మారిపోతుంది.

'క్షమించటం' ఎంత తేలికో తెలిసి ఆశ్చర్యపోతారు.

జీవితం సుఖంగా సంతోషంగా సాగటానికి 'క్షమించటం' సరైన ఆయుధంలేకుంటే యుద్ధం చేయకుండానే ఓడిపోతాం. క్షమించటానికి సిద్ధమా మీరు?

పాలపర్తి శ్రీకాంత్

ఉదయం సాయంత్రం బిలమార్గం కోసం అన్వేషణ మధ్యాహ్నం ఆహా ర్వానేషణ. ఇదే దినచర్య ఐపోయింది.

అయిదురోజులు గడిచిపోయాయి. విసిగి పోయాడు. ఎన్ని రోజులీ వెదుకులాట...? ఇలా ఉండగా ఆరో రోజు ఉదయం వాతా వరణం కాస్త చలిగానే ఉంది.

నేలమట్టంనుంచి వంద అడుగుల ఎత్తులో కొండ పాదాన్ని చుట్టి ఎగురుతూ తన అన్వేషణ కొనసాగి స్తోంది కొంగ. సరిగ్గా పశ్చిమ దిక్కుగా వస్తూండగా... అప్పుడు... సరిగ్గా అప్పుడు వెచ్చటి గాలి తెర ఒకటి గప్పున తాకటం గమనించింది. ఉలిక్కిపడింది.

వెనుతిరిగి అక్కడే ఒక రౌండ్ కొట్టి దిగువకు చూసింది. గాలి వెచ్చని స్పర్శ మళ్ళీతాకింది. దిగువన చెట్లకొమ్మలు ఆకులు కొంతమేర నల్లగా మాడిపోయి నల్లని చారలా కన్పిస్తున్నాయి.

ఈ వేడిగాలి ఓల్కనో శిఖరం నుంచి వస్తున్నది కాదు.ఖచ్చితంగా రహస్య బిలమార్గం ఇక్కడే ఉందని పించింది. బిలం గుండా అప్పుడప్పుడూ బయటికి వీచే గాలి సెగసోకి వృక్షశాఖలు ఆకులు అలా నల్లగా మాడిపోయాయి. గతంలో అప్పుడప్పుడూ ఈ ప్రాంతం తగలబడేదనటానికి గుర్తుగా కింద నేల అంతా బూడిదమయంగా ఉంది.

సందేహనివృత్తికోసం చెట్లమధ్య వాలింది కొంగ. చుట్టూపచ్చటి వృక్షాలు ఇక్కడమాత్రం నేలంతాకాలిన బూడిద. చిన్నచిన్న ప్రాణులు కూడా ఇటు వస్తున్న జాడలేదు. మెడను స్ప్రింగులా వెనక్కి, ముందుకు ఊపుతూ తన పొడవు కాళ్ళతో ముందుకు నడి చింది కొంగ. ఎగుడుదిగుడుగా రాళ్ళురప్పలతో కూడిన ఏటవాలు ప్రాంతం.

చుట్టూ దట్టంగా అడవిలా పెరిగిన పచ్చదనం. ఇటుమాత్రం నల్లగా మాడిపోయిన చార. మరికాస్త పైకి వెళ్ళి చూడగా అక్కడ కన్పించింది. కేవలం మూడు అడుగుల వ్యాసంలో ఒక బిలమార్గం.

దాన్ని చూస్తుంటే ఇది నరకద్వారం ఏమిటని పించింది. పొగ చూరిపోయి నల్లగా మాడిపోయిన పొగగొట్టం చిమ్నీలా ఉంది.

లోపలినుంచి కొద్దిపాటివెచ్చదనంతో గాలి వీస్తోంది. చుట్టూ దట్టమైన వృక్షాలవెనక కనుమరుగున ఉన్నం దున దీన్ని రహస్య బిలమార్గం అనుండాలి. అసలు



తను వెదికే బిలం ఇదో కాదో తెలియాలంటే లోనకు వెళ్ళి చూడాలి. ఆలస్యం చేయ లేదు. సాహసించి చివ్వున లేచి నెమ్మదిగా ఎగురుతూ బిలంలోకి ప్రవేశించింది.

E-mail: Suryadevaranovelist@gmail.com



సూర్యదేవర రామ్మోహనరావు



మనిషిలో మనిషి

బయటినుంచి చూడ్డానికి ప్రవేశద్వారం మూడు అడుగుల వ్యాసమే ఉంది. కాని లోన... దిగువకు చిన్నచిన్న బండరాళ్ళతో మెట్లమాదిరి దారి ఉంది. కిందకు దిగాక అర్థమైంది. అది ఎంత పెద్ద గుహ మార్గమో. సుమారు పదిహేను నుంచి ఇరవై అడుగుల వ్యాసంలో ఎగువకుపోతూనే ఉంది.

ఆ చివర ఎక్కడో మలుపు తిరిగినట్టుంది. అటునుంచి వస్తున్న ఎర్రటి వెలుగుతో గుహ మార్గంలో చీకటి లేదు. వెళ్ళేకొద్దీ వెలుతురు పెరుగుతోంది.

అంతేకాదు, అటునుంచి వస్తున్న పొగలు సెగలకు నల్లగా గుహ మార్గం పొగ చూరిపోయి ఒక విధమైన కారు వాసనతో బీభత్సంగా ఉంది.

నేలమీదకు చూస్తుంటే అక్కడక్కడా మానవ అస్థిపంజరాలు కన్పిస్తున్నాయి.

బహుశా ఇక్కడి రహస్యాన్ని ఛేదించాలని లోన కొచ్చిన సాహసికుల అస్థిపంజరాలు కావచ్చు అవి.

ఇలాంటిచోట సాధారణంగా గోడలవెంట గబ్బిలాలు ఆవాసం చేస్తాయి. నేలమీద పాములు మొదలైన విషకీటకాలు నివసిస్తాయి. కాని ఎక్కడా ఒక ప్రాణి తిరుగుతున్న జాడ కూడా లేదు.

ఈ వేడి సెగల కారణంగానే గుహ మార్గం పొడవునా నిర్జీవంగా ఉంది. వెళ్ళేకొద్ది వెచ్చదనం అధికరిస్తోంది. అదంతా చూసుకొంటూ ఎగువన మలుపును సమీపిస్తోంది కొంగ.

ఇంతలో ఎగువనుంచి చెవులు చిల్లులు పడేలా పెద్దప్రేలుడు శబ్దం విన్పించింది.

దానివెనకే గుహమార్గంలో పెద్ద మెరుపు. చూస్తూ వుండగానే సుడులు తిరుగుతూ ధూళితో కూడిన పొగ మంటలు. మలుపు తిరిగి తనకు ఎదురురావటం గమనించింది. అంతే- అదిరిపడి గిరుక్కున తిరిగింది కొంగ. దూసుకువస్తున్న ధూమం తనను తాకితే ఇక్కడే కాలి బూడిదకావాల్సిందే.

వచ్చిన దారినే శరవేగంతో బిలం బయటకు చేరుకోడానికి పారిపోనారంభించింది.

జరిగిన కథ 31

గుహలో కనీసం అయిదువందలమందికి పైగా పనిచేస్తూవుంటారు. వాళ్ళందర్నీ మెషీన్ గన్‌తో కవర్ చేస్తూ అక్కడ ఉన్న జీప్‌ని డ్రైవ్ చేస్తూ చాలామందిని కాల్చేస్తాడు కార్తికేయ.

చింపాంజీ శరీరాన్ని వదిలి కొంగ శరీరంలోకి పరకాయప్రవేశం చేస్తాడు కార్తికేయ.

స్వామి సత్యానంద పంపిన నరహంతకులైన కపాలి, ఛెళియన్‌లిద్దరూ పర్లాకిమిడి చేరుకుంటారు. రాజావిష్ణుచంద్ర గజపతి మహదేవ్‌గార్ని హత్యచేయబోయిన ఆ దుండగుల బారినుండి చివరి క్షణంలో తప్పించుకుంటాడాయన.

ఛెళియన్, కపాలీలు మిలటరీకి లొంగిపోతారు. కొంగలోకి పరకాయప్రవేశం చేసిన కార్తికేయ వర్షంలో చిక్కుకుపోతాడు.

త్వరగా మసాయా అగ్నిపర్వతం చేరుకోవాలన్న సంకల్పం అతనిది. సాధూబాయ్ వేషంలో వచ్చినవాడు ఎప్పుడొస్తాడా అని ఎదురుచూస్తుంటుంది సుదీప. జ్వాలాముఖిచుట్టూ ఎగురుతూ రహస్య బిలమార్గం ఎక్కడుందా అని వెదకడం మొదలుపెడ్తాడు కార్తికేయ. ఇక చదవండి.

రాకాసి మబ్బులా ధూమం కొంగ వెంటబడి తరుముకొస్తున్నట్టుంది. రెక్కల్లోకి శక్తినంతా కేంద్రీకరించుకుని పారిపోయివస్తోంది.ఎంత వేగంగా అంటే ప్రమాదం చుట్టుముట్టకముందే బతుకుజీవుడా అని ఒడ్డుకు చేరిన మనిషిలా రివ్వు రివ్వున ఎగురుతూ వచ్చి బిలంనుండి బయటపడింది కొంగ.

వేడిసెగలు తాకకముందే పైపైకి గాల్లోకి ఎగిరింది. దాని వెనకే బయటికొచ్చిన పొగధూళి వేడిమికి వృక్షశాఖలు మాడి మసయ్యాయి. అంతా తృటిలో జరిగిపోయింది. ఘోరప్రమాదం తప్పింది.

పైపైకి చెట్లమీదకు ఎగిరి రెక్కలల్లార్చితే గాని కొంగకు శరీర ఉష్ణతాపం చల్లారలేదు. కొంత దూరం వెళ్ళి ఒక వృక్షశాఖ మీద వాలి "బాప్‌రే" అనుకుంది మనసులో. తిరిగిచూస్తే బిలంలోంచి వస్తున్న నల్లటి మబ్బులు ఆకాశానికి లేస్తూ కన్పించాయి.

తను లోన ప్రవేశించేప్పుడు శాంతంగానే ఉన్న జ్వాలాముఖి ఉన్నట్టుండి ప్రేలుడుతో ఉగ్రరూపం దాల్చటం ఏమిటి? తన రాకకు దీనికి ఏమన్నా సంబంధం ఉందా లేక ఇది కాకతాళీయమా, చాలా సేపు ఇదే విషయం ఆలోచిస్తూ కూర్చున్నాడు కొంగ శరీరంలోని కార్తికేయ.

జ్వాలాముఖి నుంచి లావా అయితే పొంగలేదు గాని ఆ రోజు తర్వాత వరుసగా మూడు రోజులు అప్పుడప్పుడూ ప్రేలుళ్ళు సంభవిస్తూనే ఉన్నాయి.

బిలమార్గం నుంచి వేడిసెగలు పొగలు బయటికి చిమ్ముతూనే ఉన్నాయి. మరోసారి లోన ప్రవేశించే ఛాన్సే దొరకలేదు కార్తికేయకు. బిలం నుండి కొంత ఎత్తులో ఒక చెట్టును ఆశ్రయించి సమయం కోసం ఓపికగా ఎదురు చూస్తున్నాడు. అయితే సందేహంమాత్రం నివృత్తి అయింది. తను వెళ్ళాల్సిన బిల మార్గం అదే. అదితప్ప మరో బిలం వున్న జాడ లేదు.



జ్వాలాముఖి శాంతంగా ఉన్న సమయంలో మాత్రమే తిరిగి లోన ప్రవేశింపగలడు. అప్పుడు కూడా గాజుపంజరం సమీపంలోకి పోగలడో లేదో తెలీదు.

వారం తిరిగేసరికి అగ్నిపర్వతం శాంతించింది. ప్రేలుళ్ళు లేవు. గుహామార్గంలో వేడిసెగలతో పొగలూ లేవు. ఎనిమిదో రోజు ఉదయాన మరో ప్రయత్నం చేశాడు కొంగ శరీరంలోని కార్తికేయ.

ఈసారి వేగంగా, చాలా వేగంగా గుహలో ఎగురుతూ ఎగువన మలుపులోకి పోయాడు. వేడి సెగలు అధికరించటం ఆరంభమైంది. అక్కడికింకా రెండు ఫర్లాంగుల ఎగువన గుహామార్గం ముగిసింది.

అక్కడ భూమి లోతుల్లోంచి ఎగసివస్తున్న అగ్ని జ్వాలలు పైకి ఓల్కనో మౌత్‌వైపు పోతూ ఒక అగ్ని స్థంభంలా గోచరిస్తున్నాయి.

మరికాస్త ముందుకు వెళ్ళేసరికి వేడిసెగలకు ఈకలు అంటుకుని తగలబడిపోతాయనిపించింది. కళ్ళు మండుతున్నాయి.

శరీరం ఉడికిపోతున్నంత వేడి. కాని ఆ జ్వాలా స్తంభానికి ఇవతల కుడిపక్క ఒక పగులు. చూడ్డానికి అల్మారాలా ఉంది. అందులో ఏదో వస్తువు మెరుస్తూ గోచరించింది. అంతవరకే చూడగలిగాడు కార్తికేయ.

ఇక తట్టుకోలేక రివ్వున వెనుతిరిగి రెట్టించిన వేగంతో బిలంలోనించి బయటికి వచ్చేశాడు. తిరిగి చెట్టుకొమ్మమీద కూర్చుని చాలాసేపు రెక్కలల్లార్చుకుంటేగాని కొంగ శరీరం సాధారణ స్థితికి రాలేదు. తను చూసిందంతా ఓసారి గుర్తుకుతెచ్చుకున్నాడు. సందేహం లేదు. మానవమాత్రుడు ఎవడూ కూడా లోనకు ప్రవేశింపలేని బిలమార్గం.

అగ్నికీలల సమీపంలో బిలం గోడలో తళతళా మెరుస్తున్నది ఖచ్చితంగా మంత్రనిర్మితమయిన గాజు పంజరం. అందులోనే సంజనా పట్టు పురుగు రూపంలో బందీగా ఉంది.

ఆ పంజరాన్ని కిందకు తోసేస్తే చాలు. తర్వాత తను ఏమైనా ఫరవాలేదు. కాని అక్కడికి చేరుకోవటం సాధ్యమా! అన్నదే ప్రశ్న. దారిలోనే మాడి మసైపోయే ప్రమాదం ఉంది. కొంగ శరీరంలో ఇప్పుడు తనకున్న వేగం చాలదు. ఇంకా వేగం కావాలి.

ఇప్పుడు తనను రక్షించేది వేగం మాత్రమే. అందుకు ఏంచేయాలి? ఏంచేయాలన్న ప్రశ్నకు మరుసటిరోజు సాయంకాలం సమాధానం లభించింది. ఆహార సముపార్జనకు వెళ్ళి తిరిగివస్తూండగా తను వసించిన వృక్ష సమీపంలోనే ఒక చెట్టుకింద కనిపించింది ఒక పక్షి శరీరం.

అది సాధారణ పక్షికాదు. అత్యంత వేగంగా ఎగిరే లియోజాతి పక్షి. ఏం జరిగిందో ఎలా చనిపోయిందో గాని చచ్చి రెండుమూడు గంటలు మించదు.

ముక్కుతో పక్షిని అటూ ఇటూ కదిల్చి చూసింది కొంగ. ఎక్కడా గాయాల జాడలేదు. సలక్షణంగా ఉంది. ఇది దొరకటం ఒక అదృష్టంగానే భావించాడు బకరూపుడు కార్తికేయ.

రాకెట్ బర్డ్ శరీరం లభించటంతో అప్పటికప్పుడు ఒక పథకం రూపుదిద్దుకుంది మనసులో. అటు జ్వాలాముఖి కూడా శాంతంగానే ఉంది. ఆలస్యం అమృతం విషం అన్నారు. అవకాశం దొరికినప్పుడే ఆలస్యం లేకుండా పనులు ముగించటం తెలివైన పని.

ఇక ఎక్కువ ఆలోచించలేదు... తనకు కొంగ శరీరం అవసరమే. ఎందుకంటే గాజు పంజరాన్ని చేరేలోపలే లియోపక్షి కాలిపోతుంది. అదే జరిగితే మరో శరీరం అందుబాటులో ఉండకపోతే తను గాలిలో కలిసిపోతాడు. అలాంటి ప్రమాదం రాకుండా కొంగ శరీరాన్ని భద్రంగా ఉంచాలి.

వెంటనే చెట్టుపైకి ఎగిరాడు. గుబురు కొమ్మల్లో జారి క్రిందపడనిచోట కూర్చుని కళ్ళు మూసుకుని గురుదేవుడు మణిసిద్ధుడ్ని తలుచుకున్నాడు.

పరకాయప్రవేశ విద్యతో కొంగ శరీరాన్ని వదిలి రాకెట్‌బర్డ్ శరీరంలో ప్రవేశించాడు.ఎప్పుడైతే కార్తికేయ తప్పుకున్నాడో మరుక్షణం విగతజీవిగా మెడ వాలేసి కొమ్మలమీద ఒరిగిపోయింది కొంగ.



అత్యుత్తమ పాత్ర

'స్వర్ణ ఖడ్గం' సీరియల్‌లో మహారాణి పాత్ర పోషిస్తున్న సంజనా తన సర్వశక్తులనూ కేంద్రీకరించి నటిస్తున్నాను అని చెపుతోంది.

"ఇది నా డ్రీమ్ రోల్. ట్రైలర్ విడుదలయ్యాక మహిళా ప్రాధాన్యం గల పాత్రలకోసం అనేక ఫోన్లు వస్తున్నాయి. ఈ సీరియల్ ఇతర భాషలలోకి డబ్ కానున్నది" అంటున్న సంజన మరే ఇతర ప్రాజెక్టులకూ సంతకాలు చెయ్యలేదు. ఇది తన కెరీర్‌లోనే ఉత్తమ పాత్ర కాగలదుకాబట్టి పూర్తి ఏకాగ్రత చూపాలన్నది ఆమె అభిప్రాయం.

కార్తికేయ ప్రవేశించగానే అంతవరకు చచ్చిపడున్న లియోపక్షి చట్టున ప్రాణం వచ్చినట్టు లేచి నిలబడి ఒళ్ళు దులుపుకుంది. రెక్కలు రెపరెపలాడించి చుట్టూ చూసింది. అలా చూస్తుండగానే తెలిసింది. దానికి ఎడమకన్ను గుడ్డిదని.

బహుశా వాటిలో అవి కాట్లాడుకోవడంలో ఆ కన్ను పోయుంటుంది. కుడికన్ను మాత్రం స్పష్టంగా బాగానే ఉంది. గాల్లో ఉండగానే జరిగిన పోరాటంలో అది కిందపడి ప్రాణం పోగొట్టుకునివుండాలి. శరీరం గాయాలతో కాస్త బాధనిపిస్తోంది. అయినా వాటిని లెక్కచేయకుండా గాల్లోకి ఎగిరాడు.

కొంగ శరీర నిర్మాణానికి లియోపక్షి శరీర నిర్మాణానికి వ్యత్యాసం ఉంది. అది అలవాటు అయ్యేందుకు ఒక రౌండు గాల్లో చక్కెర్లుకొట్టాడు కార్తికేయ. సులువుగా వేగాన్ని అందుకోగలుగుతున్నాడు.

అంతా సరిచూసుకున్నాక ఇక ఆగకుండా బిల మార్గంలో జొరబడ్డాడు. అప్పుడు సరిగ్గా సాయంత్రం సమయం ఐదుగంటలు.

ఇండియాలో చూస్తే ఉదయం ఐదుగంటలవుతూంది సుమారుగా. కార్తికేయ పరకాయప్రవేశం చేసిన రాకెట్‌బర్డ్ నిజంగా రాకెట్‌లాగే గుహ మార్గంలో రివ్వురివ్వున దూసుకుపోసాగింది.

కు డికంటితో మాత్రమే చూడగల్గుతూ వేగాన్ని పూర్తిస్థాయికి పెంచింది. చూస్తూవుండగానే అది గుహ మార్గం మలుపు తిరిగి అగ్నికీలలవైపు వెళ్ళిపోతోంది. అప్పటికే వేడిసెగలకు శరీరం వేడెక్కటం ఆరంభమైపోయింది.

అంత వేడిలోనూ మలుపు నుంచి ఫర్లాంగుదూరం ముందుకెళ్ళిపోయింది. ఇంకో ఫర్లాంగు దూరం వెళ్ళగల్గితే చాలు. క్షణాలు చకచకా కరిగిపోతున్నాయి.

లక్ష్యాన్ని ఛేదించగలడా లేదా అన్న ప్రశ్న వదిలేశాడు కార్తికేయ. మొండిగా దూసుకుపోతున్నాడు. ఇంకో రెండువందల అడుగుల దూరంలో నల్లగా పొగ చూరిపోయిన అల్మారాలాంటి భాగం కుడిపక్కరాతి గోడలో నేలకు అయిదడుగుల ఎత్తున ఉంది.

అందులో మెరుస్తున్న అద్దాలతో గాజు పంజరం గోచరమైంది. దాంతో మరింత వేగం పెంచింది రాకెట్‌బర్డ్. వేడి సెగలకు కనుగుడ్లు ప్రేలిపోతాయా అన్పిస్తోంది. శరీరం ఉడికిపోతున్నంత వేడి.

భరింపరాని బాధ. రెక్కలకు నిప్పు అంటుకుంది. అయినా కూడా ప్రయాణం ఆపలేదు... చూస్తూవుండగానే టార్గెటు దగ్గర పడింది. ఈకలన్నీ అంటుకుని తగలబడిపోతున్నాయి. చివరిక్షణం దగ్గరపడింది.



గంటకు రెండు వందల కిలోమీటర్ల మహావేగంతో ఉల్కాపాతంలా దూసుకెళ్ళి నేరుగా అల్మారాలోని గాజు పంజరాన్ని ఛటాలున ఢీకొట్టి కిందపడిపోయింది. అంతే అల్మారాలోని మంత్రనిర్మిత గాజు పంజరం కదిలి దొర్లి కిందపడి భళ్ళున పగిలింది.

అంతవరకు అందులో బందీగా వున్న పట్టుపురుగు తన పక్కనే అటూ ఇటూ కదిలి అదృశ్యంగావటం చివరిసారిగా చూసింది లియోపక్షి.

అంతవరకే చూసిన పక్షిలోని కార్తికేయ తప్పుకున్నాడు. పక్షి కనుగుడ్లు పేలిపోయి భగ్గున లేచిన మంటల్లో కాలిపోనారంభించింది లియోపక్షి.

అందులోంచి తప్పుకున్న కార్తికేయ ఆత్మ అర నిమిషంలో బిలం నుంచి బయటికొచ్చి తిరిగి కొంగ శరీరంలోకి పరకాయప్రవేశం చేసింది. అంతే అంత వరకు తన పొడవుమెడ వేలాడవేసి చచ్చిపడున్న కొంగలో చలనం వచ్చింది. మెడను వెనక్కు తీసుకుని కొమ్మమీద నిటారుగా లేచి నిలబడింది. 'క్వాక్' అంటూ ఆనందంతో పెద్దగా అరిచింది.

ఇండియా - తెల్లవారుజాము అయిదుగంటల ప్రాంతం. అది తమిళ నాడు, కేరళ సరి హద్దుల్లోని వేలంచేరి గ్రామం. పూలతోటలకు ప్రసిద్ధి చెందిన గ్రామం. పూల పరిమళాలతో ఉదయపు గాలులు పరిమళిస్తున్నాయి. తెల్లవారుజామునే కూలీలు పూలతోటల్లో పూలుకోసే పనిలో ఉంటారు. ఎందుకంటే ఉదయానికే బుట్టలు కట్టి పూలను మార్కెట్‌కు పంపించేయాలి. ఇప్పుడిప్పుడే తొలివెలుగులు విచ్చుకొంటున్నాయి. ఆ సమయంలో -

నిశీథిని చీల్చుకుంటూ ఒక పొలికేక. దారుణమైన ఆర్తనాదం. ఒళ్ళు జలదరింపచేసే చావుకేక.

ఒక్కసారిగా ఆ అరుపులువిని చుట్టుపక్కలున్న తోటల్లో పనిచేస్తున్న కూలీలు ఉలిక్కిపడ్డారు. త్రుళ్ళిపడి చూశారు.ఆ కేకలు పోకచెట్లతోపులోని మండువా లోగిట్లోంచి వినవస్తున్నాయి.

ఇ ల్లు మంత్రవాది భైరవేశ్వర్‌ది. ఆ గొంతుకూడా అతడిదే... ఏం జరిగిందో అర్థంగాక కొంత మంది భయంతో బిగిసిపోగా కొందరుమాత్రం ఏం జరిగిందో తెలుసుకోవడానికి చేస్తున్న పనులు ఆపి మండువా లోగిలివైపు పరుగులు తీశారు.

లోన మండువా లోగిట్లో - వేకువ పూజకోసం మంత్రవాది భైరవేశ్వర్ చీకటితోనే లేచి స్నానాదికాలు ముగించాడు.

శుచిగా ఎర్రటి సిల్కుపంచె కట్టి నుదుట పెద్ద ఎర్రబొట్టు పెట్టుకుని తను ఉపాసించే క్షుద్ర దేవతా పూజా గదిలో ప్రవేశించేసరికి శిష్యులు నలుగురూ పూజకు కావలసిన ఏర్పాట్లన్నీ సిద్ధంచేసుంచారు.

ట్యూబ్‌లైటు కాంతిలో పట్టపగల్లా ఉంది. ధూప దీపాలు, ఎర్రటి పూలు, అక్షింతలు, కుంకుమలతో క్షుద్ర దేవతను పూజిస్తూ ఒక నల్లకోడిని కూడా బలి ఇచ్చాడు. ఇంతలో ఎందుకో అనీజీగా ఫీలవుతూ శిష్యులవంక చూసి మంచినీళ్ళు అడిగాడు.

నీరు తెచ్చేలోపే గొంతు పట్టుకుని ఎవరో నొక్కుతున్నట్టనిపించి అదిరిపడ్డాడు. విడిపించుకునే ప్రయత్నం చేసేకొద్దీ మరింతగా ఏదో అదృశ్య శక్తి గొంతు నొక్కేస్తుంటే ఊపిరాడక ఒక వెర్రికేక వేస్తూ చట్టున పూజలోంచి లేచిపోయాడు.


లేచీలేవగానే ఎవరో తోసేసినట్టు విరుచుకుపడి

బంధాలకు విలువ

కుటుంబ అనుబంధాలు, ఆప్యాయతలు అంటే కాజల్ అగర్వాల్‌కు అమిత ఇష్టం అట. వీటికోసం ఏం చేయడానికయినా, చివరకు కెరీర్ వదులుకోవడానికయినా సిద్ధమేనంటూ ఉద్వేగంగా చెపుతోంది కూడా.

ఇవన్నీ చిన్నప్పటినుంచి తనకు అనుభవం అంటున్న కాజల్ ఈ తరం అనుబంధాల గురించి తన అభిప్రాయాన్ని ఏకరువుపెట్టింది.

"ఈ తరంవారికి స్నేహం, అనుబంధాల విలువ తెలుసుకాని, చిన్న చిన్న విషయాలకే అనుబంధాలను దూరం చేసుకుంటున్నారు. ప్రతి ఒక్కరూ కూడా డబ్బులకంటే భావోద్వేగాలకు విలువ ఇస్తుంటే, ప్రతీ బంధం గొప్పగా వుంటుంది" అంటూ హితవు పలికింది కాజల్ అగర్వాల్.



సైనిక దళాలలో
పని చేసేవారు పురుషులలో
ఉత్తమ పురుషులు.
-రామనాథ్ కోవింద్, రాష్ట్రపతి

పోతూ మరోసారి దారుణంగా అరిచాడు. అతడి కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. ఏం జరిగిందో అర్థమయిపోతోంది. శిష్యులు నల్గురూ భయాందోళనలతో చేష్టలుదక్కి చూస్తున్నారు.

కుమారశక్తి పీఠాధిపతి ఇస్తానన్న ఐదుకోట్ల రూపాయలకు ఆశపడి కోటిరూపాయలు అడ్వాన్స్ తీసుకుని రాకుమారి మేఘనా సౌందర్యానంద సహానాదేవిమీద ప్రాచీన ప్రాణనిక్షిప్త క్షుద్రవిద్య ప్రయోగం చేశాడు.

ఆమె ప్రాణశక్తి పట్టుపురుగు రూపంలోకి మార్చి మంత్రనిర్మితమైన గాజు పంజరంలో బంధించాడు. దాన్ని నికరాగ్వాలోని మసాయా జ్వాలాముఖి రహస్య నరకద్వారమైన బిలమార్గంలోకి పంపించేశాడు. మానవుడెవడూ అడుగు పెట్టలేని చోటు. ఎవరూ ఆమెను కాపాడలేరనుకున్నాడు. ఈ రహస్యం ఎవరికీ తెలీదనుకున్నాడు.

తన అంచనా తప్పింది. ఎలా తెల్సుకున్నాడో ఎలా లోన ప్రవేశించాడోగాని ఎవడో సాహసి గాజు పంజరం పగలగొట్టి యువరాణికి విముక్తిని కల్పించాడు. దాని ఫలితమే ఇది.

మంత్ర నిర్మిత పంజరం పగలటంతో ప్రయోగం తిప్పికొట్టబడింది. క్షుద్ర శక్తులు తనమీదే దాడి చేస్తున్నాయి. వీటిని ఎవరూ ఆపలేరు. తన పాపం పండింది. వెల్లకిలా పడి కొట్టుకుంటున్నాడు. టన్నులకొద్దీ బరువు తనమీదపడి అదిమేస్తున్నట్టుంది.

రోడ్‌రోలర్‌కిందపడి నలిగిపోతున్నట్టుంది. నోటినుండి భళ్ళున నెత్తురు కక్కుతున్నాడు. నవరంధ్రాల గుండా రక్తం పొంగింది. గిలగిలా కొట్టుకుంటూ అయిదునిమిషాల లోపలే ప్రాణాలు వదిలేశాడు భైరవేశ్వర్.

ఏం జరిగిందో తెలియక భయంతో బిగిసిపోయి చూస్తున్నారు శిష్యులు. అంతలో అక్కడికి చేరుకున్న పూలు కోసే కూలీలు ఎదురుగా నెత్తుటి మడుగులోని భైరవేశ్వర్ మృతదేహాన్ని చూడలేక భయపడి వెనుతిరిగారు.

క్షణాల్లో ఈ వార్త వేలంచేరి గ్రామంలో పాకిపోయింది. జనం తండోపతండాలుగా పోకచెట్ల తోపులోని మండువా లోగిలివైపు తరలిరాసాగారు.

నికరాగ్వాలో గాజుపంజరాన్ని పగలగొట్టి పట్టుపురుగు రూపంలోని సంజనాకు విముక్తి కల్గించిన కార్తికేయ పరకాయ ప్రవేశవిద్యతో తిరిగి కొంగ శరీరంలోకి ప్రవేశించిన కొద్దిసేపటికే ఇక్కడ వేకువలో భైరవేశ్వర్ మరణించటం విశేషం. ఇదే సమయంలో-

పర్లాకిమిడి. రాజా విష్ణుచంద్ర గజపతి మహదేవ్‌గారి ప్యాలెస్.

తెల్లవారడానికి ఎంతో సమయం లేదు. ఇన్ని రోజులూ అంతఃపురంలో హంసతూలికవంటి బెడ్‌మీద ఎలా ఉంచితే అలా కదలిక లేకుండా కోమాలోనే పడివుంది, రాకుమారి మేఘనా సౌందర్యానంద సహానాదేవి ఉరఫ్ సంజనా. చిక్కి సగమై ఉంది.

పరిచారికలు నర్సులు అప్పటికే నిద్ర లేచారు. ఆ సమయంలో ఒక్కసారిగా ప్రాణం లేచివచ్చినట్టు, పెద్ద శ్వాస పీల్చుకుని మూలిగింది యువరాణి. యువతులంతా ఉలిక్కిపడ్డారు.... షాక్‌తో ఆమెవంక చూశారు.

నికరాగ్వా మసాయా ఓల్కనో గర్భ కుహరంలో గాజుపంజరం పగిలి విముక్తి కలిగి బైటపడిన పట్టుపురుగు అదృశ్యమైన కొన్ని నిమిషాల వ్యవధిలోనే ఇక్కడ యువరాణిలో చలనం ఆరంభమయింది. ఆమె ప్రాణశక్తి ఆమెను తిరిగి చేరుకుంది కాని ఇవేమీ తెలీని పరిచారికలు, నర్సులు మాత్రం భీతి చెందారు. ఏం జరుగుతోంది?

యువరాణి ప్రాణం పోతోందా? అని గాభరా చెందిన పడుచులంతా యువరాణి పాన్పును చుట్టేశారు.

ఇంకా ఉంది

> రాజకీయ నాయకులు పక్క పక్కన కూర్చుంటే పార్టీలు ఫిరాయిస్తున్నట్టు కాదు.
> -వెంకయ్యనాయుడు, ఉపరాష్ట్రపతి





అవంతికా ఖాత్రి

నటి, దర్శకురాలు,నిర్మాత, గాయనిగా అవంతికా ఖాత్రి బాలీవుడ్ తెరపైకి వచ్చింది. 'హార్ ఛోడ్ నాయార్' చిత్రంతో కెరీర్‌కు శ్రీకారంచుట్టింది.

ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీలో పుట్టి, పెరిగింది. 'బ్యూటిఫుల్‌వరల్డ్' అనే సినిమాను నిర్మించిన అనుభవం ఉంది. తాజాగా 'బోటమ్స్ అప్ ఆల్బమ్' చేస్తోంది. 'కుచ్‌కుచ్ లోచా హై'లో సన్నీ లియోన్‌తో కలిసి నటించింది. ఆమె వ్యక్తిగత విశేషాలు, అభిప్రాయాలు :

► **సృజనాత్మకపరంగా సంతృప్తి ఇచ్చేది :** నటన. అయితే పాడడం, డ్యాన్స్‌చేయడంకూడా నటనలోప్యాకేజీగానే భావిస్తాను

► **నా జీవితానికి థీమ్ సాంగ్ :** 'యే జవానీ హై దీవాని'లోని ల్లాహి

► **ఇతరులలో ఆకర్షించేది :** ఏ విషయంపట్ల అయినా పూర్తి హృదయాన్ని కేంద్రీకరించే వ్యక్తి.దేన్నీ వదిలిపెట్టకుండా పూర్తి ఏకాగ్రత చూపే తీరు

► **రాబోయే ప్రాజెక్టులు :** ప్రస్తుతం నాది ఎగ్జయిటింగ్ సమయం. కొత్త ప్రయాణంచేస్తున్నాను. నటనకాకుండా నా స్వంత కంపెనీ మాడ్ హ్యాటర్స్‌ను ప్రారంభించడం కూడా థ్రిల్లింగ్‌గా వుంది. 'బ్యూటిఫుల్ వరల్డ్' షార్ట్ ఫిలిమ్ చేశాను. అనురాగ్ కాశ్యప్‌తో సహనిర్మాతను. రెండో షార్ట్ ఫిల్మ్‌కూడా రెడీగా ఉంది. ఇది లెస్బియన్ లవ్‌స్టోరీ. నిర్మాతగా, దర్శకురాలిగా, నటిగా బహుళ పాత్రలు పోషిస్తున్నాను


► **కలిసి పనిచేయాలనుకునేవారు :** అనేకమంది ఉన్నారు. టబు, కరీనా కపూర్, ఇర్ఫాన్‌ఖాన్, స్కార్‌లెట్ జాన్సన్- ఇలా ఎందరో

► **అద్భుతమైన అనుభవం:** కుచ్‌కుచ్ లోచా హై'లో సన్నీలియోన్, రామ్‌కపూర్‌లతో కలిసి నటించడం

► **బైక్స్ అంటే:** నాకు చాలా క్రేజ్

► **ప్రస్తుతం నాదృష్టి :** నటన పైనే

Courtesy : THE MAN



WhatsApp

భారతదేశంలో-10 ప్రత్యేక గ్రామాలు

1. శని శింగణాపూర్, మహారాష్ట్ర : ఈ గ్రామంలో ఇళ్ళకు తలుపులుండవు.
2. కొదిన్హి, కేరళ : ఈ గ్రామంలో 400 మంది 'కవలలు' వున్నారు.
3. మట్టూర్, కర్ణాటక : గ్రామప్రజలందరూ 100 శాతం సంస్కృతం మాట్లాడతారు.
4. రొంగ్‌దోయి, అస్సాం : వర్షాలకోసం ఇక్కడ కప్పలకు పెళ్ళిళ్ళు చేస్తారు.
5. బారవాన్‌కాలా, బీహార్ : బ్రహ్మచారుల గ్రామం. యాభై ఏళ్ళనుండి ఒక్క పెళ్ళీ జరగలేదు.
6. కుల్‌ధరా, రాజస్థాన్ : చెడు జరుగుతుందన్న భయంతో, గ్రామం, గ్రామం ఖాళీచేసి వెళ్ళిపోయారు.
7. పుంసారి, గుజరాత్ : ప్రతి ఇంటికీ వైఫై కనెక్షన్, సీసీ కెమెరాలున్నాయి. రోడ్ల మీద దీపాలన్నీ సోలార్‌పవర్‌తో వెలుగుతాయి.
8. హివార్ బజార్, మహారాష్ట్ర : ఈ గ్రామంలో పేదవారు లేరు. అరవై మంది మిలియనీర్లు వున్నారు.
9. మావ్‌లైనాంగ్, మేఘాలయా : ఆసియా ఖండంలోనే అతిశుభ్రమైన గ్రామం.
10. జంబూర్, గుజరాత్ : దీన్ని 'ఆఫ్రికా గ్రామం' అంటారు. ఇక్కడివారు భారతీయులే అయినా, ఆఫ్రికా మనుషుల్లా అనిపిస్తారు.

ఒక భారతీయుడు, ఒక బ్రిటీషర్, ఒక సౌదీ అరేబియా మనిషి ముగ్గురూ హోటల్‌లో డిన్నర్ చేస్తున్నారు.

బ్రిటీషర్ : "భారతదేశం అద్భుతమైనది" అని అంటారెందుకు?

భారతీయుడు : ఒక ఉదాహరణతో చెబుతాను. కొత్తగా కడుతున్న ఫ్లైఓవర్ కూలి దాని కింద 20మంది మనుషులు ఇరుక్కుపోతే, మీ దేశాలలో ఏం చేస్తారు?

బ్రిటీషర్ : కట్టే ఇంజనీర్‌ని, దాన్ని పర్యవేక్షించే అధికారిని జీవితకాలం జైలులో వేస్తాం.

సౌదీ అరేబియన్ : ఇంజనీర్‌ని, అధికారిని మూడు సార్లు తలమీద కాల్చి, జనం మధ్యలో ఉరి వేస్తాం.

భారతీయుడు : మా పద్ధతి వేరు. ఫ్లైఓవర్‌లో ఇరుక్కున్న మనుషుల్లో ఒక్కడు చనిపోయినా, డాక్టర్‌ను చితక్కొడతాం.

బ్రిటీషర్, సౌదీఅరేబియన్ : ఓహ్, అద్భుతం.

☺ మనిషి కుడిచెవితో మాటలు బాగా వినగలుగుతాడు. ఎడమచెవితో సంగీతం బాగా వినగలుగుతాడు.

☺ పెళ్ళిలో కొత్త భార్యాభర్తలు అగ్ని చుట్టూ ఏడు సార్లు ఎందుకు తిరుగుతారో తెలుసా?
ఓ లెక్కల టీచర్ చెప్పిన సమాధానం "కొత్త దంపతులు అగ్నిచుట్టూ గుండ్రంగా, దాదాపుగా 360^0 వుండే వృత్తంమీద 7సార్లు ప్రదక్షిణ చేస్తారు. 360ని 1 నుండి 9 వరకు అంకెలతో, ఒక్క 7తో తప్ప శేషం లేకుండా భాగించవచ్చు. అందుచేత ఏడు సార్లు అగ్నిచుట్టూ 'మమ్మల్ని ఎవరూ విడదీయలేరు' అని ప్రతీకాత్మకంగా ప్రదక్షిణలు చేస్తారు"


☺ పెట్రోలు ధరలు మరోసారి పెరిగాయి. 77 ఛానల్ విలేఖరి. ఓ బంకులోనుండి పెట్రోలు పోయించుకుని బయటకొస్తున్న కవితను ఇలా అడిగాడు. "ధరలు పెరగటంవల్ల మీరెంత ఇబ్బందిపడుతున్నారో చెప్పండి మేడమ్"
కవిత : నాకే ఇబ్బందీ లేదు. ఇంతకుముందు వందరూపాయల పెట్రోలు పోయించేదాన్ని, ఇప్పుడు కూడా వందరూపాయల పెట్రోలే పోయించుకుంటున్నా"

☺ వంతెన కట్టడానికైనా, గోడ కట్టడానికైనా సిమెంట్, ఇసుకే కావాలి. వంతెన మనుషులను కలుపుతుంది. గోడ విడగొడుతుంది. ఏది కట్టాలో నిర్ణయించుకోవలసింది మనమే.

☺ జడ్జి : నీకు విడాకులెందుకు కావాలి?
భర్త : నేను ఆఫీసుకెళ్ళేముందు, వచ్చాక కూడా. మా ఆవిడ టీ.వీ చూస్తూ ఇంటి పనంతా నాతో చేయిస్తోంది. వెల్లుల్లి వలవమంటుంది. ఉల్లిపాయలు తరగమంటుంది. అంట్లుతోమిస్తుంది.
జడ్జి : ఆ పనులు కష్టమేమిటోయ్. వెల్లుల్లిని వేడి నీటిలో వేస్తే సులువుగా వొలవవచ్చు. ఉల్లిపాయలు ఫ్రిజ్‌లో కాస్సేపు పెట్టి, అప్పుడు కట్ చేస్తే కళ్ళు మండవు. గిన్నెలు, ఓ గంట నీళ్ళలో నానపెడితే, తేలిగ్గా కడగవచ్చు. బట్టలు ఓ గంటన్నర ముందు నానపెడితే ఉతకటం ఈజీ.
భర్త : అర్థం అయింది సార్. నా కేసు వెనక్కి తీసుకుంటాను సార్.
జడ్జి : ఏం అర్థమయ్యింది?
భర్త : మీ పరిస్థితి నాకంటే దారుణంగావుందని.

☺ ఆటోని, అమ్మాయిని ఫాలో అవ్వకూడదు. ఆ రెండూ ఎప్పుడు, ఎలా జర్క్ ఇచ్చి టర్న్ తీసుకుంటాయో ఎవరికీ తెలియదు.

☺ ఓ వయసులోవున్న అమ్మాయి మ్యారేజ్‌బ్యూరోకి వెళ్ళి తన వివరాలు రిజిష్టర్ చేసుకుని, తనకు తగిన సంబంధం కోసం ప్రయత్నం మొదలు పెట్టింది ఆ అమ్మాయి.
మ్యారేజ్ బ్యూరో మనిషి : "మీకు ఎటువంటి లక్షణాలు వున్నవాళ్ళు కావాలి?"
అమ్మాయి : "చూడటానికి బాగుండాలి, చక్కగా మాట్లాడాలి, నవ్వించాలి, ఆటలాడాలి,
మంచి నాలెడ్జ్ వుండాలి, పాటలు పాడటం, డ్యాన్స్ చేయుటం బాగా రావాలి.
నేను బయటకు వెళ్ళకుండా ఇంట్లోనే వున్నప్పుడు నాతోపాటు ఉండాలి.
నాకు మాట్లాడాలనిపించినప్పుడు, చక్కని కథలు చెప్పాలి. నేను విశ్రాంతి తీసుకునేటప్పుడు, నిద్ర పోయేటప్పుడు మాట్లాడకుండా వుండాలి"
మ్యారేజ్ బ్యూరో వ్యక్తి ఓపిగ్గా అంతా విన్నాడు. తర్వాత ఇలా అన్నాడు-
"నాకు అర్థమైందమ్మా, మీకు కావలసింది ఒక టీ.వీ." అన్నాడు మ్యారేజ్ బ్యూరో మనిషి.



'మధుర' ఫలం

వేసవి ఎండలు ఎంతగా మండిస్తున్నా ఈ సీజన్‌కే ప్రత్యేకం అయిన మామిడిపండ్ల తాలూకు మధురిమలు ఎండల బాధను తీరుస్తుంటాయి. మామిడిపండ్లను తినాలన్న కోరికతోపాటు ఎలా, ఎంతగా తినాలన్న ప్రశ్నలు, సంశయాలు ప్రశాంతతలకు భంగంగా వుంటుంటాయి.

డయాబెటిస్ ఉన్నవాళ్ళు తినవచ్చా! ఇంత తియ్యని పండ్లు తింటే బరువు పెరగమా? ఇవి ఆరోగ్యకరమైనవేనా? వంటి ప్రశ్నలు పదేపదే చికాకుపెడుతుంటాయి. వీటి గురించిన భయం అవసరంలేదు.

నిజానికి సహజంగా, ప్రకృతి అందించేవి ఏవితినాలన్నా అతిగాభయసందేహాలు వ్యక్తంచేయాల్సిన అవసరంలేదు. ప్యాకేజ్డ్ పదార్థాలు తిన్నప్పుడు మాత్రమే భయపడాల్సివుంటుంది. ప్రాసెస్డ్ పదార్థాలగురించే సందేహపడాలి. అన్నింటికీమించి జీవనశైలి అస్సలు బాగా లేకపోవడం గురించి ఆందోళనపడాలి.

అంతేకాని, ప్రకృతిలో సహజంగా, ఏడాదిలో కొద్దిరోజులు మాత్రమే దొరికే ఈ రారాజు పండు గురించి అస్సలు భయపడనవసరంలేదు.

విటమిన్లు, పోషకాలు

సి, ఎ, ఇ, కె విటమిన్లు మామిడిపండ్లలో పుష్కలంగా లభిస్తాయి.విటమిన్ బి12 మినహా ఇతర 'బి' విటమిన్లూ వుంటాయి. ఒమెగా 3, ఒమెగా 6, ఇతర ఖనిజాలు, పీచుకూడా వీటిలో వుంటాయి.

ఒక మామిడిపండులో సుమారుగా 29-32 గ్రాముల ఫ్రూట్ షుగర్ వుంటుంది.

గ్లైకమిక్ లోడ్ కేవలం పది మాత్రమే. కాబట్టి మామిడిపండ్లు తింటే ఏమవుతుందో అని భయపడాల్సిన అవసరం లేదు. అతిగా తింటుంటే మాత్రం కొంత భయపడాలి. ఏదైనా అతి అనర్థదాయకమే అన్న సూత్రం ఇక్కడ కూడా వర్తిస్తుంది.

డయాబెటిస్ ఉంటే

డయాబెటిస్‌గలవారు అస్సలు మామిడిపండ్లు తినకూడదనడంలో అర్థం లేదు. అతి అనర్థదాయకం అన్న సూత్రాన్ని ఇక్కడా అప్లయ్ చేసుకోవాలి.

డయాబెటిస్‌గలవారు నిరభ్యంతరంగా మామిడిపండ్లు తినవచ్చు- తగుమాత్రంగా.

రక్తంలో చక్కెరస్థాయిలు ఎంతమేరకు ఉన్నాయన్నదాని ఆధారంగా రోజుకో మామిడిపండు లేదా సగం పండు నిరభ్యంతరంగా తినవచ్చు. మామిడిపండ్లలో పీచు ఎక్కువగా వుంటుంది కాబట్టి రక్తంలో చక్కెర స్థాయిల్ని మరీ ఎక్కువగా పెరగనివ్వదు.

తమ బ్లడ్‌షుగర్‌ను తగ్గించుకునే ప్రయత్నం చేసేవాళ్ళు మామిడిపండుతోపాటు కాని, తర్వాత కాని కొన్ని గింజలు,నట్స్‌ను తింటుంటే ఈ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి.విటమిన్లు, పీచుకాకుండా మామిడిపండ్లలో మ్యాంగిఫెరిన్ అనే పదార్థం వుంటుంది. ఇది శరీరంపై యాంటీవైరల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ప్రభావాలు చూపుతుంది.

బ్లడ్‌షుగర్ లెవల్స్‌ను అనుకూల పంథాలో నియంత్రించేందుకు శరీరంలోని కొన్ని ఎంజైములపై ప్రభావం చూపుతుంది. మామిడిపండ్లకు సంబంధించి కొన్నిప్రదేశాల్లో కొన్నినమ్మకాలూ వున్నాయి.

శరీరంపై చల్లని ప్రభావాన్ని చూపగలవు కాబట్టే వీటిని వేసవిలో పండిస్తారని గోవాలోని అనేకమంది స్థానికులు భావిస్తారు. వీటిలో విటమిన్ 'సి' అత్యధికంగా వుండి, రోగనిరోధకశక్తిని మెరుగుపరుస్తుంది. మామిడిపండ్లలోని విటమిన్ 'సి' శరీరంలో రోగనిరోధకశక్తిని పెంచి, వర్షాకాలానికి సిద్ధంచేస్తుందనేది గోవన్ల సిద్ధాంతం. సాధారణంగా వర్షాకాలంలో ఇన్‌ఫెక్షన్ల అవకాశాలు ఎక్కువగా వుంటాయి.

తగు మోతాదు

మామిడిపండ్లు రోజుకు ఎన్ని తినవచ్చు అన్న ప్రశ్నకు క్లుప్తమైన సమాధానం లేదు. వయస్సు, ఆరోగ్యస్థాయిలను అనుసరించి ఉంటుంది. రోజుకు ఐదారు మామిడిపండ్లు తినేవారున్నారు. పూర్తి సీజన్‌లో మామిడిపండ్లు తినవచ్చు.

కాబట్టి రోజుకు ఒకటి, రెండు పండ్లు హాయిగా, సులువుగా తినేయవచ్చు. డయాబెటిస్ స్థాయి ఎక్కువగా ఉన్నవారైతే ఉదయం సగం, సాయంత్రం మిగతా సగం తినవచ్చు. షుగర్ లెవల్స్ మరీ ఎక్కువ వుంటే నట్స్, గింజలు జత చేయాలి.

బరువు భయం వుంటే మామిడిపండ్లు అదనపు భారాన్ని అస్సలు వేయవు. వాటిలో పట్టించుకోవాల్సినంత కొవ్వు వుండదు. విటమిన్ 'సి'తో సహా అనేక పోషకాలుంటాయి కాబట్టి శరీరాన్ని డిటాక్స్ చెయ్యడంలో ఇవి సహకరిస్తాయి.

నిస్సంశయంగా మామిడిపండ్ల సీజన్‌ను ఎంజాయ్ చేయవచ్చు. అనవసర భయసందేహాలతో ఈ మధురఫలాన్ని మిస్ కాకూడదు.



Courtesy : HEALTH & NUTRITION



ఒక గ్రామంలో రామశర్మా, బంగారయ్యా అనే ఇద్దరు స్నేహితులు ఉండేవారు.

ఇద్దరూ పేదవారే. ఒకరోజు ఇద్దరూ కలిసి ఆలోచించుకుని, ధనం సంపాదించడానికి, తమ గ్రామం నుంచి బయలుదేరారు.

చాలాదూరం ప్రయాణం చేసి అలసిపోయి వారు ఒక ముని ఆశ్రమంముందు చతికిలబడ్డారు. ముని



వారి సంగతి అంతా అడిగి తెలుసుకుని ఇలా అన్నాడు. "నాయనలారా... నేను ఎంతో కష్టపడి ఎన్నో విద్యలు సాధించాను. మీలో ఒకడు బ్రాహ్మణుడు. బ్రాహ్మణుడికి ధనం మీద వ్యామోహం తగదు.

జ్ఞానం సంపాదించి, దాన్ని పదిమందికీ పంచి ఇచ్చి, పేరు ప్రఖ్యాతులు తెచ్చుకుంటే బ్రాహ్మణజన్మ సార్థకమవుతుంది.

రెండవవాడు వైశ్యుడు. కాబట్టి, అతను వ్యాపార రహస్యాలన్నీ నావద్ద నేర్చుకుని ధనసంపాదన చేయవచ్చు. వ్యాపారం ధనం సంపాదించటానికి మాత్రమే గాక ప్రజాసేవకు కూడా ఉపయోగపడుతుందని గ్రహించినవాడే అసలైన వైశ్యుడు"

ముని సలహాప్రకారం స్నేహితులిద్దరూ మూడు సంవత్సరాల పాటు విద్యాభ్యాసం చేశారు.

రామశర్మ అనేక శాస్త్రాలలో పాండిత్యం సంపాదించాడు. బంగారయ్య వ్యాపార రహస్యాలన్నీ తెలుసుకున్నాడు. ఈ జ్ఞానంతో రామశర్మ రాజుగారి వద్ద ఆస్థాన పండితుడు అయ్యాడు.

బంగారయ్య వ్యాపారంలో అభివృద్ధి సాధించాడు.

నాలుగైదు సంవత్సరాలు గడిచీ గడవక ముందే ఇద్దరూ సంపన్నులయ్యారు.

కాలం గడిచింది.

రామశర్మకు కృష్ణశర్మ అనే కొడుకు కలిగాడు. కాని ఆ కొడుకు గురించి రామశర్మకు బెంగపట్టుకున్నది. వాడు చాలా పెంకివాడు. వాడికి చదువుమీద ఏమాత్రమూ ఉత్సాహంలేదు.

అస్తమానమూ ఆటలతోనూ, అల్లరితోనూ కాలక్షేపం చేసేవాడు.

తన కొడుకు తనంతవాడు కావటానికి రామశర్మ చేసిన ప్రయత్నం కొంచెం కూడా ఫలించలేదు.

ఇంతలో ఓ వింత జరిగింది.

రామశర్మ ఒకనాడు విద్యార్థులకు కొన్ని శ్లోకాలు బోధిస్తున్నాడు.

అవి చాలా కఠినమైనశ్లోకాలు కావటం చేత విద్యార్థులు వాటిని ఏమాత్రం గ్రహించలేకుండా ఉన్నారు.

చెప్పినదే చెప్పి నోరు నొప్పిపుట్టి, రామశర్మకాసేపు విశ్రాంతి తీసుకుందామని లోపలికి వెళ్ళాడు.

తండ్రి శిష్యులకు పాఠం చెప్పటానికి పడుతున్న శ్రమ కృష్ణశర్మ గమనిస్తూనే ఉన్నాడు. తండ్రి లోపలికి వెళ్ళగానే అతను వచ్చి, తండ్రి కూర్చునే ఆసనం మీద కూర్చుని, తానే పాఠం చెప్పటం మొదలుపెట్టాడు.

చిత్రమేమిటంటే, రామశర్మనోటవింటే అర్థం కాని శ్లోకాలు కృష్ణశర్మనోట వింటూంటే విద్యార్థులకు మరింత తేలికగా అర్థమయ్యాయి.

లోపలినుంచి తిరిగి వస్తూ రామశర్మ ఆ దృశ్యం చూసి ఆశ్చర్యపోయాడు.

తన కొడుకు తెలివి తక్కువవాడు కాడు. వాడి జ్ఞాపకశక్తి కూడా గొప్పది. చదువుకుంటే వాడికి అవలీలగా ఎంత చదువైనా వస్తుంది. రామశర్మ ఈమాటే అంటే, కృష్ణశర్మ "ఎందుకు చదువుకోవాలి?" అని అడిగాడు.

"పదిమందిచేతా గౌరవం పొందాలన్నా, పూజించబడాలన్నా, ధనం సంపాదించాలన్నా విద్య చాలా అవసరం. ఇది నువ్వు ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది" అన్నాడు రామశర్మ.

"మహా పండితుడి కొడుకునని అందరూ నన్ను గౌరవిస్తారు. బ్రాహ్మణ్ణి గనక పూజిస్తారు. ధనవంతుడి కొడుకును, ఇంక సంపాదించేదేమిటి?" అని కృష్ణశర్మ అడిగాడు.

కొడుకు బుద్ధి రామశర్మకు అర్థమయింది. దాన్ని మార్చటానికి ఏం చెయ్యాలా అని ఆయన ఆలోచిస్తూ ఉండగా, ఆయన ఇంటికి బంగారయ్య వచ్చాడు.

ఇద్దరూ కలుసుకుని మాట్లాడుకోవటంలో, బంగారయ్య కూడా తన కొడుకు గురించి ఇలాగే బాధపడుతున్నట్టు బయటపడింది.

బంగారయ్య కొడుకు వరాలయ్య కూడా జులాయి



సేకరణ : చందమామ రోజు



వాడుగా తయారై, తండ్రి తనను దారిలో పెట్టటానికి ప్రయత్నించినప్పుడల్లా, "ధనవంతుడి కొడుకును! నాకు జాగ్రత్తగా ఉండవలసిన అవసరం ఏమిటి?" అంటున్నాడు.

మిత్రులిద్దరూ కూర్చొని ఒక పథకం వేశారు. ఆ పథకం ప్రకారం బంగారయ్య, తన కొడుకును రామశర్మ ఇంట వదిలి తాను భార్యతో సహా వ్యాపారం మీద నగరం విడిచి వెళ్ళిపోయాడు.

వెళ్ళేటప్పుడు ఆయన తన కొడుక్కు సేవలు చెయ్యటానికి ఇద్దరు సేవకులను పెట్టి వెళ్ళాడు.

కృష్ణశర్మకూ, వరాలయ్యకూ మంచి స్నేహం అయింది. ఇద్దరూ ఒకేరకం మనుషులు. వరాలయ్య సేవకులు కృష్ణశర్మకు కూడా సేవలు చేస్తూ ఉండేవాళ్ళు. రెండు నెలలు గడిచాయి.

రామశర్మ ఒకరోజు వరాలయ్యను పిలిచి, "మీ నాన్న డబ్బు కావాలని కబురు చేశాడు. మీ ఇల్లు అమ్మి డబ్బు పంపించు" అన్నాడు.

వరాలయ్య పట్టించుకోలేదు.

మరో నెల గడిచింది.

ఒకరోజున రామశర్మ వద్దకు ఒకమనిషి వచ్చి, "బంగారయ్యగారి ఓడ మునిగింది. దానితో పాటు బంగారయ్యా, భార్యా వారి సంపాదన యావత్తూ మునిగిపోయాయి.

నేను ఆయనను కొసప్రాణంతో ఒడ్డుకు తెచ్చి, మా ఇంటికి చేర్చాను. కాని ఆయన బతకలేదు" అని చెప్పాడు.

ఈ మాట విని ఏడుస్తున్న వరాలయ్యను రామశర్మ ఓదార్చాడు.

కాని ఆయన ఒక్క విషయం వరాలయ్యతో స్పష్టంగా చెప్పాడు.

"నేను నీ తండ్రిలాగా వ్యాపారస్థుణ్ణి కాను. నిన్ను పోషించటం నాకు సాధ్యం కాదు. అందుచేత నీ దారి నువ్వు చూసుకోవలసిందే"

వరాలయ్యకు పౌరుషం వచ్చి, రామశర్మ ఇంటి నుంచి వెళ్ళిపోయాడు. కాని అతనికి తలదాచుకునే చోటు ఎక్కడా దొరకలేదు.

తిండికూడా ఎవరూ పెట్టకపోవటం చేత, వరాలయ్య అభిమానం చంపుకుని తిరిగి రామశర్మ ఇంటికే వచ్చి, భోజనం పెట్టమన్నాడు. రామశర్మ అతనికి భోజనం పెట్టాడు. కాని ఇలా ఎంతో కాలం జరగదని చెప్పాడు. ఈ మాట విని కృష్ణశర్మకు కోపం వచ్చి-

"స్నేహితుడి కొడుకును కష్టసమయంలో ఆ మాత్రం ఆదరించలేరా?" అని తండ్రిని అడిగాడు.

"బంగారయ్య నా స్నేహితుడు. అతను కష్టంలో ఉంటే తప్పక ఆదరించి ఉండేవాణ్ణి. వరాలయ్యకూ, నాకూ సంబంధం లేదు" అన్నాడు రామశర్మ.

"వరాలయ్య మీకేమీ కాకపోవచ్చు. అతను నా మిత్రుడు. నా మిత్రుడికి ఈ ఇంట్లో గౌరవం లభించదా?" అని కృష్ణశర్మ అడిగాడు.

"ఏమిటి నీ గొప్పదనం?" అన్నాడు రామశర్మ నిరసనగా.

"దేవుడికి అర్చనచేసినందువల్ల పూజారిని దేవుడంతవాడుగా గౌరవిస్తాం గద. మహాపండితుడు రామశర్మ కుమారుణ్ణి, అది నాకు గొప్పతనంకాదా?" అని కృష్ణశర్మ అడిగాడు.

రామశర్మ ఒక్క నిమిషం ఆలోచించి-

"నీ ప్రశ్నకు సమాధానం ఇస్తాను. కాని ముందుగా నువ్వొక పని చెయ్యాలి.

నీకూ, వరాలయ్యకూ సేవలు చేసిన ఇద్దరు సేవకులనూ పిలిచి, వాళ్ళచేత వరాలయ్యకు రెండు రోజులపాటు సేవలు చేయించు" అన్నాడు.

కృష్ణశర్మ ఎంతో ఉత్సాహంగా వెళ్ళాడు. వాళ్ళు ఇదివరలో ఒక్క పైసా అడగకుండా సమస్త సేవలూ చేసినవాళ్ళు. కాని ఇప్పుడు వరాలయ్యను గురించి నిర్లక్ష్యంగా మాట్లాడి, అటువంటి దరిద్రుడికి సేవలు చెయ్యము అని చెప్పేశారు.

వాళ్ళ సమాధానానికి ఆశ్చర్యపోయి, కృష్ణశర్మ తిరిగి వచ్చి తన తండ్రికి జరిగినది చెప్పాడు.

రామశర్మ నవ్వి -

"వాళ్ళు సరిగానేచెప్పారు. వరాలయ్యకు వ్యక్తిత్వం లేదు. అతను తండ్రినీడలో ఉన్నంతకాలమూ, తండ్రి డబ్బు అతనికి రక్ష అయింది.

ఆ డబ్బు పోగానే అతను సామాన్యుడయ్యాడు. రేపు నీ గతీ అంతే అవుతుంది.

నా పాండిత్యం ద్వారా నువ్వు గౌరవం పొందుతున్నావు. నా ఆస్తి ఆ పాండిత్యమే.

అది నీకు సంక్రమించకపోతే నీ పనీ అంతేగదా! స్వయంకృషివల్ల ఆర్జించినదే శాశ్వతం. వ్యాపార రహస్యాలు తెలియనివాడు వైశ్యుడుకాడు. విద్యలేనివాడు బ్రాహ్మణుడు కాడు" అన్నాడు.

"స్వయంకృషి అవసరమే. అందుకే మీరు మీ స్నేహితుడికి చేయగల సహాయం నేను నా స్నేహితుడికి చేయలేకుండాఉన్నాను. ఇప్పుడు ఏం చెయ్యాలి?" అని కృష్ణశర్మ అడిగాడు.


"నువ్వూ, నీ స్నేహితుడూ నేను చెప్పిన చోటికి వెళ్ళి, కొన్ని ఏళ్ళపాటు విద్యాభ్యాసం చెయ్యండి" అని రామశర్మ తాము విద్యాభ్యాసం చేసిన ముని ఆశ్రమం గురించి చెప్పాడు.

కృష్ణశర్మా, వరాలయ్యా ఇద్దరూ రెండు సంవత్సరాల పాటు ముని ఆశ్రమంలో విద్యాభ్యాసం చేసి తిరిగి వచ్చారు.

వరాలయ్య తండ్రి జీవించిఉండడమేగాక, తన ఆస్తిని వ్యాపారంలో రెట్టింపు చేశాడు.

తమను మార్చటానికి పండితుడు రామశర్మా, వ్యాపారస్తుడు బంగారయ్యా కలిసి పన్నిన పన్నాగమే ఇది అని వాళ్ళు తెలుసుకున్నారు.

వసుంధర



జెంటిల్‌మ్యానూ-జైలు శిక్షా

కామెడీ కథ



"రేయ్... నేను సింహాన్ని... మామూలు సింహాన్ని కాదు, నరసింహాన్ని!" బుర్ర మీసాలు మెలితిప్పుతూ అన్నాడు నరసింహం.

"అవును నాన్నా... నువ్వు మామూలు సింహానివి ఎందుకు అవుతావు? నరుల బుర్రలు తినే సింహానివే! ఇకనయినా జనం బుర్రలు తినడం ఆపేయ్! నీ అతితో జనాన్ని ఎందుకు చావగొడతావు?" అన్నాడు కొడుకు ఏకాంబరం.

"మీ నాన్న అనేది ఏమిట్రా?" వంటింట్లోనుంచి వచ్చిన మహంకాళి అడిగింది కొడుకుని.

"తను సింహం అంట అమ్మా!"

"ఏం సింహం? గ్రామసింహమా? పనీపాటా లేక పోతే సరి! రొయ్యకి పెరిగినట్లు మీసాలు అయితే పెంచాడు మూరెడు పొడవున!"

"నువ్వు ఆరవకే!" అని భార్యని బతిమాలుతూ అన్నాడు నరసింహం.

"బుర్ర మీసాలు అయితే వున్నాయి కానీ బుర్ర కొద్దిగకూడా లేదురా! నేను ఎన్నోసార్లు చెపుతా, ఎవరి విషయంలోనూ తలదూర్చకు అనీ! వింటేనా?"

"వినేదేమిటే? ఊళ్ళో పెద్దమనిషిని! జెంటిల్ మ్యాన్‌ని! నలుగురు వస్తారు సలహా చెప్పమనో, తీర్పు చెప్పమనో!"

"సరే నాన్నా...నీ దగ్గరకి ఎవరైనావస్తే అలాగే చెపుదువుగానీ, నువ్వు మాత్రం ఎవరి విషయంలో జోక్యం చేసుకోకు! ఇదే చెపుతున్నా, మేం ఎక్కడో దూరదేశం అమెరికాలో ఉన్నాం. మీరు ఇక్కడ గౌరవంగాఉండాలి. హుందాగా ఉండాలి..!" అన్నాడు ఏకాంబరం.

"సరేలేరా!" అన్నాడు నరసింహం.

ఇది జరిగి ఏడాదవుతోంది. ఇప్పుడు ఏకాంబరం అమ్మానాన్న ఇద్దరూ అమెరికా వస్తున్నారు.

ప్రయాణం చేసే రోజు రానేవచ్చింది. నరసింహం విమానం ఎక్కి అమెరికాలో కాలుపెట్టాడు. నాలుగు రోజులు ఎక్కడికీ కదల్లేదు. కదిలే అవకాశం రాలేదు.

"నాన్నా... ఫార్మర్స్ మార్కెట్‌కి వెళుతున్నాను. వస్తావా వెళ్దాం" ఐదో రోజు రెండు ఖాళీ సంచులు తీసుకుని, బూట్లు తొడుక్కుంటూ అడిగాడు ఏకాంబరం.

"వస్తున్నా ఉండు. అసలు ఆ మార్కెట్ ఏమిటో, దాని కథాకమామీషు ఏమిటో తెల్సుకుంటా!"

"ఆయన ఎందుకు ఏకాంబరం వెంట? పెళ్ళికి వెళుతూ పిల్లిని చంకన పెట్టుకుపోయినట్లే! అక్కడ ఏం పెద్దరికం చేస్తాడో! నిప్పుతో తల గోక్కోవడం ఎందుకు, నువ్వు వెళ్ళిరాక!"

"ఊరుకోమ్మా... మరీనూ..."

"నేను వెంట వుంటా కదమ్మా!"

కార్లో ఇద్దరూ ఫార్మర్స్ మార్కెట్‌కి వెళ్ళారు. ప్రతి ఆదివారం ఆ మార్కెట్ ఉంటుంది. జనం కిక్కిరిసి ఉన్నారు. వరుసగా ఎత్తైన టెంట్లు వేసుకుని రైతులు తమ ఉత్పత్తులు అమ్ముతున్నారు. ఒక స్టాల్ దగ్గరకి వెళ్ళి, ఐదు గోంగూర కట్టలు కొన్నాడు ఏకాంబరం. మూర పొడవున వున్న రెండు కాడలకి రబ్బర్‌బ్యాండ్ వేసి, ఒక్కో కట్టగా అమ్ముతున్నారు.

"ఈ రెండు కాడలూ ఎంతరా?" అని అడిగాడు నరసింహం.

"కట్ట రెండు డాలర్లు నాన్నా! ఈ ఐదు కట్టలూ పది డాలర్లు!" అని చెప్పాడు ఏకాంబరం.

"మన డబ్బుల్లో కట్ట 120 రూపాయలా? ఈ ఐదు కట్టలూ 650 రూపాయలా? ఎంత మోసం, ఎంత దగా!" కొడుకుని పక్కకి నెట్టి, ఆ రైతు మీదకి తగాదాకు లేచాడు నరసింహం.

"ఏమయ్యా... సూటూ బూటూ హేటుతో ఉన్నావు! నువ్వసలు రైతువేనా? ఈ పది కాడలూ ఆరు వందల రూపాయలా? మా ఊళ్ళో అయితే రెండు రూపాయలు పడేస్తే ఇంతకు నాలుగు రెట్లు గోంగూర వస్తుంది. ఏమిటి ఇది? మీ దేశం వచ్చామని ఇలా దోచుకుంటారూ?" అన్నాడు నరసింహం.

దుకాణదారు అయిన ఆ రైతు వేరేవాళ్ళకి బేరం ఇస్తూ నరసింహాన్ని పట్టించుకోలేదు.

"ఊరుకో నాన్నా!" కసిరాడు ఏకాంబరం.

"ఉండ్రా నువ్వూ...! నీకు తెలియదు. విషయం ఏమిటో తేల్చిపారేస్తాను. ఇంత అన్యాయమా?"

"నాన్నా..." అని చేయిపట్టుకుని, ఆయన్ని బల వంతముగా పక్క స్టాల్ దగ్గరకి లాక్కుపోయాడు

మొలకలపల్లి కోటేశ్వరరావు

ఏకాంబరం. "ఊరికే గొడవ చేయకు నాన్నా! మన దేశంలా ఇది వ్యవసాయ దేశం కాదు. ఇక్కడి ధరలు ఇవి. మన డబ్బుతో ఎందుకు పోల్చుకుంటావు?"

"అయితేమాత్రం ఇంతంత రేట్లా?"

"సర్లే, ఇంక అరవకు!"

అక్కడ కూరగాయల స్టాల్స్‌కంటే పండ్ల స్టాల్స్ ఎక్కువ వున్నాయి. స్ట్రాబెర్రీస్, బ్లాక్ బెర్రీస్, బ్లూ బెర్రీస్, చెర్రీస్, గ్రేప్స్, ప్లమ్స్, పియర్స్, నెక్‌ట్రెయిన్స్, పీచెస్, కివీ, యాపిల్స్‌లాంటి ఎన్నో పండ్లు.

పండ్ల స్టాల్స్ ముందు ఎత్తయిన బల్లలమీద పెద్ద పెద్ద డిష్‌లలోనూ, ట్రేలలోనూ బెర్రీస్, చెర్రీస్, గ్రేప్స్‌లాంటి చిన్న పండ్లూ, పీచెస్, యాపిల్స్, పియర్స్ లాంటివైతే కోసిన పండ్లముక్కలూ ఉన్నాయి.

వచ్చేవాళ్ళూ, పోయేవాళ్ళూ పండో, ముక్కో తీసుకుని తింటూ, ఎవరో ఒకరు ఆగి కొంటున్నారు. ఏకాంబరం ఒక ముక్క తీసుకుని తింటూ, మరో ముక్క నాన్నకి ఇస్తూ అన్నాడు-

"రుచి చూడు నాన్నా... ఎలా ఉందో?"

తిన్నాడు నరసింహం. "అబ్బో.. అమృతంమాదిరిగా ఉందే...! ఏం కాయరా ఇది!"

"ప్లమ్"

"భలేగా ఉందే!" అంటూ నరసింహం గుప్పిటతో గుప్పెడు ముక్కలు తీసుకున్నాడు.

"అన్ని ముక్కలు తీసుకోకూడదు నాన్నా! శాంపిల్ ఇవి. రుచి చూడటంకోసం పెట్టారు! ఒక్క ముక్కే తీసుకోవాలి!" అన్నాడు ఏకాంబరం.

"ఉండ్రా! మన దేశంలో అసలు ఇలాంటి కాయలు ఉంటయ్యా...? భలే రుచిగా ఉన్నాయి!

చిక్కిందే దక్కుడల, దక్కిందే బొక్కుడల..!"

నరసింహం మరో స్టాల్ దగ్గరకు వెళ్ళి మరో గుప్పెడు ముక్కలను తీసుకున్నాడు.

"నాన్నా తప్పు. అలా తీసుకోకూడదు. బాగుండదు. నువ్వు తిన్నన్ని ఫ్రూట్స్, కావలసినన్ని కొంటా...! అలా తీసుకోకు!" అని చెప్పాడు.

"ఊరుకోరా! నీకు తెలియదు. ఉచితంగా వచ్చేది ఊరగాయకంటే రుచిగా ఉంటుంది...! కొన్నది తింటే ఏం రుచుంటుంది? తీసుకోనియ్!"

తెలుగువాళ్ళు చాలామంది మార్కెట్‌కి వచ్చారు. ఎవరైనా చూస్తే పరువు పోతుందని ఏకాంబరం హడలిపోతున్నాడు. ఎదురెదురుగా రెండు వరుసలుగా స్టాల్స్ ఉన్నాయి. తింటూ చివరి స్టాల్‌దగ్గరకి వచ్చాడు నరసింహం. "బొక్కడం అయిందా? పదవెళ్దాం!"

"వెళ్దాంలేరా! పండ్లు ఎంత బాగున్నాయో! తినమనే కదా పెట్టారు. తిన్నాను"

"తినమని కాదు... రుచి చూడమని పెట్టారు... శాంపిల్స్. అంతే... ఇక వెళ్దాం!"

"ఉండ్రా! పొట్లో కొంచెం ఖాళీ ఉంది. ఆ ఖాళీ కూడా నింపుకుని వస్తాను"

"నీ పొట్ట పగిలేలా ఇంటిదగ్గర తిందువు. రెండు సంచులనిండా కొన్నా! నువ్వు రాకపోతే నేను వెళ్ళిపోతాను!" అన్నాడు ఏకాంబరం.

"ఉండ్రా! తెలియదూ, పెద్దవాడ్ని చెబితే వినుకోవూ!" అంటూ కొడుకుని అనుసరించాడు నరసింహం. ఇంటికి చేరారు ఇద్దరూ.

"ఏం పద్ధతి నాన్నా అదీ, తిండికి కరువుపడ్డట్టు! తెలిసినవాళ్ళు చూస్తే పరువుపోయేది! తల ఎత్తుకోగలమా? ఇప్పుడు నీ ఇష్టంవచ్చినట్లు తిను!"


"చెప్పాకదా ఏకాంబరం. మీ నాన్నకి గుమ్మడికాయ అంత గుండుందికానీ అందులో గుజ్జులేదనీ! డొల్ల! ఏనుగంత మనిషేకానీ, ఎలుక మెదడంత మెదడే!"



నిశ్చితార్థం నిజమే

సినిమాల్లో స్లో అయిపోయి, వివాదాల్లో ఇరుక్కుని నిలదొక్కుకునే ప్రయత్నాలు సాగించిన 'కొత్త బంగారులోకం' సినిమా పిల్ల శ్వేతాబసు పెళ్ళికి సిద్ధంగా వుంది. గత ఏడాదిలోనే నిశ్చితార్థం జరిగిందన్న వార్తల్ని శ్వేత ధ్రువీకరించింది.

"బాలీవుడ్ దర్శకుడు రోహిత్ మిట్టల్, నేను ప్రేమించుకున్నాం. మా ఇద్దరికీ ఎంగేజ్‌మెంట్ జరిగిన మాట నిజం. అయితే మా వ్యక్తిగతాన్ని ప్రైవేట్‌గా ఉంచాలనుకున్నాం" అని పేర్కొన్నది. వీరి పెళ్ళి వచ్చే ఏడాదిలో ఉండవచ్చునేది వినికిడి.



ముందుకు లంఘించి దూకటానికి శక్తికోసం ఎవరైనా రెండడుగులు వెనక్కి వేయాల్సిందే.

-రాజ్‌నాథ్‌సింగ్, కేంద్రమంత్రి

"అరవకే! నీకు తెలియదూ, పెట్టదూ! బొత్తిగా లోకజ్ఞానం లేదు!" అన్నాడు ఏకాంబరం.

ఆ రోజు మొదలు నరసింహం ఇక ఎక్కడికీ కదలక ఇంట్లోనే బందీ అయిపోయాడు. పదిరోజుల తర్వాత కారు తీస్తున్న కొడుకుని అడిగాడు నరసింహం, "ఎక్కడికి వెళుతున్నావురా?" అని.

"బయటకి వెళ్తున్నా. షాపింగ్ పని ఉంది"

"నేనూ వస్తా ఉండ్రా! ఇంట్లో విసుగ్గా ఉంది"

"తిక్కవేషాలు ఏం వేయవుకదా?"

"పెద్దమనిషిని! జెంటిల్‌మ్యాన్‌ని! ఎప్పుడైనా, ఎక్కడైనా డిగ్నిఫైడ్‌గా ఉంటా! తిక్కవేషాలు ఏమిటి?"

కొడుకువెంట బయల్దేరాడు నరసింహం.

దారిలో నాన్నకి జ్యూస్ ఇప్పిద్దామని, జంబో జ్యూస్ సెంటర్‌దగ్గర కారాపాడు. దిగారు. జ్యూస్‌సెంటర్ బయట చక్కటి కుర్చీలూ, టేబుళ్ళూ ఉన్నాయి. ఎంతో శుభ్రంగా ఉంది. "ఇక్కడ కూర్చో నాన్నా! జ్యూస్ తెస్తాను. తాగివెళ్దాం!"

ఆయన్ని లోపలికి తీసుకుపోయి ఎందుకు రిస్క్ పెట్టుకోవాలని, బయట వున్న కుర్చీల్లో ఒకదానిలో కూర్చోపెట్టి లోపలికి వెళ్ళాడు ఏకాంబరం.

సాయంత్రం తొమ్మిదిగంటలవుతోంది. ఇంకా చీకటిపడలేదు. నరసింహానికి కొంచెం ఎడంగా 16, 17 ఏళ్ళ వయసు కల్గిన తెల్లటి అమ్మాయిలు నలుగురు సిగరెట్లు తాగుతూ మాట్లాడుకుంటున్నారు.

ఆ సిగరెట్లు పొడవుగా ఉన్నాయి. గుప్పుగుప్పున పొగవదులుతూ సరదాగా నవ్వుతూ మాట్లాడుకుంటున్నారు. ఆ సన్నివేశం చూసిన నరసింహం ఉగ్ర నరసింహుడు అయ్యాడు. కంపరం ఎత్తింది. కుర్చీలో కూర్చున్న నరసింహం ఒక్క ఉదుటున లేచాడు.

వేగంగా వాళ్ళదగ్గరకి వెళ్ళాడు. వాళ్ళమీద పడినట్లే పడి, వాళ్ళ చేతుల్లోవీ, నోట్లోవీ సిగరెట్లు లాక్కుని పక్కనే ఉన్న ట్రాష్ టిన్‌లో వేశాడు.

ఈ హఠాత్సంఘటనకి ఆ అమ్మాయిలు భయపడ్డారు. గోలగోలగా అరవడం మొదలుపెట్టారు. అద్దాల్లోనించి తండ్రిని గమనిస్తున్న ఏకాంబరం పరుగున వీళ్ళదగ్గరకి వచ్చాడు. ఏంచేయాలో అర్థంకాలేదు. షాక్‌నించి బైటపడ్డాక వాళ్ళు అరుస్తూనే ఉన్నారు.

"ఆడపిల్లలు... సిగరెట్లు తాగుతారా? తప్పు కదూ?" కోపంగా అంటున్నాడు నరసింహం.

"నోర్మూసుకో నాన్నా..! మాట్లాడకు" అని కసురుకున్నాడు ఏకాంబరం. తండ్రి అమాయకుడనీ, తెలియదనీ, క్షమించమనీ వాళ్ళని వేడుకున్నాడు ఏకాంబరం. కొద్దిసేపటికి వాళ్ళు శాంతించారు.

ఇక నరసింహాన్ని కారులో ఎక్కించుకుని ఇంటి దారి పట్టాడు- "వాళ్ళు చిన్నపిల్లలు! పెద్దమనిషీ,



ఇబ్బందికర అనుభవం

ముంబయిలో పుట్టి, టెలివిజన్ సీరియల్స్ సెట్స్‌లో పెరిగిన సిద్ధి ఇద్నానీకి మొదటినుంచీ నటి కావాలన్న కోరిక ఉండేదట.

థియేటర్ ఆర్టిస్టుగా, మోడల్‌గా పనిచేసిన సిద్ధి 'జంబలకిడి పంబ' చిత్రంతో తెరపైకి రానున్నది. "తెలుగులో వినోదాత్మక చిత్రంతో అరంగేట్రం చేయడం ఆనందంగా వుంది.

ఈ ప్రాజెక్టులో నేను చాలా ఎంజాయ్ చేశాను. సినిమాలో స్మోక్ చేయడం నేను ఎదుర్కొన్న ఇబ్బందికర సన్నివేశం. కాని, ఆ సన్నివేశం సినిమాకు చాలా అవసరమని ఓ నటిగా నేను అర్థం చేసుకున్నాను" అని చెప్పింది.

మంచీ-చెడ్డా తెలిసినవాడ్ని! సిగిరెట్లు తాగడం హానికరమని చెప్పడం పొరపాటా? వాళ్ళ అమ్మానాన్నల ముందు అలా తాగుతారూ?"

"మాట్లాడకు. చేసింది తప్పువని! పెద్దగండం గడిచిపోయింది. వాళ్ళు ఫోన్‌కాల్ చేస్తే పోలీసులు వచ్చేవాళ్ళు. నిన్ను తీసుకుపోయేవాళ్ళు. కోర్ట్‌లో పెద్ద మొత్తం ఫైన్ పడేది!" అన్నాడు ఏకాంబరం.

"చిన్న పిల్లలు. అందులో ఆడపిల్లలు సిగరెట్లు తాగడం తప్పుకదూ?"

"తప్పో ఒప్పో! అది ఇక్కడి కల్చర్.తప్పుగా ఎవరూ ఫీల్ కారు. సిగరెట్లు తాగడానికి ఆడ ఏమిటీ, మగ ఏమిటీ, ఎవరైనా తాగుతారు. అది వాళ్ళ ఇష్టం! మన దేశంలో వెనకటి రోజుల్లో చుట్టలు తాగే ఆడవాళ్ళు లేరూ? మేం చిన్నప్పుడు మన పనికివచ్చే నరసమ్మ చుట్టలు తాగదూ? ఇక్కడా అంతే!"

"ఇంత చిన్నపిల్లలు తాగడమా?"

"చిన్నో, పెద్దో! చూడు. ఎంతపని అయ్యేదీ? ఫైర్ యాక్సిడెంట్ జరిగేది. రెండో క్రైమ్‌కి కొద్దిలో మిస్ అయ్యాం. ఇక్కడి ఇళ్ళు అన్నీ చెక్కవీ, అట్టవీ! ఎంత ప్రమాదం జరిగేదో.వెళ్ళి జైల్లో కూర్చోవాల్సివచ్చేది!"

"ఇక్కడి చట్టాలు... అసలు నన్ను అడిగితే..."

"ట్రంప్ వచ్చి అడుగుతాడు నిన్ను! పెద్దమనిషివనీ!" అన్నాడు నరసింహం.

"ట్రంప్ నాకంటే పెద్దా...? అసలు ట్రంప్‌కి ఎన్నేళ్ళూ, నాకు ఎన్నేళ్ళూ? రాజకీయాల్లో ట్రంప్ అనుభవం ఎంతా, నా అనుభవం ఎంతా? ట్రంప్ మహా అయితే నాలుగైదు సంవత్సరాలనాడు రాజకీయాల్లోకి వచ్చాడేమో! నేను నలభైఆరు సంవత్సరాలక్రితమే ఎలక్షన్స్‌లో పోటీపడ్డా!"

"పడ్డావులే బోర్లా! వార్డ్ మెంబర్‌గా పోటీ పడితే, నీమీద నిలబడి గెలిచిన రామయ్యకి 330 ఓట్లు వస్తే, నీకు 30 ఓట్లు వచ్చాయ్! ఈ మాట ఇప్పటికి లక్షసార్లు చెప్పావు!"

"ఎలక్షన్ అంటే అంతే! నిలబడిన అందరూ గెలుస్తారా? ఒకరు ఓడితేనే కదా ఇంకొకరు గెలిచేదీ!"

"సర్లే, సుత్తి ఆపు!" ఏకాంబరం తండ్రిని విసుక్కుని, ఇంట్లో దింపి, షాపింగ్‌కి వెళ్ళిపోయాడు.

తరువాత పదిరోజులకి ఒక మధ్యాహ్నం పూట పార్క్‌కి బయలుదేరాడు నరసింహం.

వాళ్ళు ఉండే అపార్ట్‌మెంట్ పక్కనే ఒక పార్కూ, స్కూలూ ఉన్నాయి.

"ఉండండి, నేనూ వస్తా! మీరు వెళ్ళి అక్కడ ఏం తగలాటకం తెస్తారో! గురిగా ఉండే మనిషి కాదు మీరు! ఎందుకు వచ్చిన గోల?" అంటూ మహంకాళి భర్తని అనుసరించింది. ఇద్దరూ వచ్చి, పార్క్‌లోని వాకింగ్ ట్రాక్‌లో ఒక రౌండ్ తిరిగి ఒక బల్లమీద కూర్చున్నారు. మధ్యాహ్న వేళయినా పార్క్ సందడిగానే ఉంది.

జనం ఎక్కువగానే ఉన్నారు.



బి.జె.పి.కి స్నేహితుల అవసరం లేదు... కాబట్టి శివసేన ఒంటరిగానే 2019లో పోటీ చేస్తుంది.

-ఉద్ధవ్ ఠాక్రే, శివసేన అధ్యక్షుడు

వీళ్ళు కూర్చున్న బెంచ్‌కి అయిదారు బారల దూరంలో చెట్టుకింద ఒక ప్లాస్టిక్ షీట్ పరిచి, ఒక అబ్బాయీ, అమ్మాయీ పడుకుని కౌగిలించుకుంటూ ముద్దులు పెట్టుకుంటున్నారు. ఆ అబ్బాయికీ, అమ్మాయికీ 13, 14 ఏళ్ళు ఉంటాయేమో!.ఆ దృశ్యం చూసిన నరసింహానికి పూనకంలాగా వచ్చింది.

ఒక్క ఊపున లేచాడు. మహంకాళి చేయి పట్టుకుని లాగింది. ఆ చేతిని విదిలించి కొట్టి పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ వాళ్ళదగ్గరకి వెళ్ళాడు. ఆ పిల్లవాడ్ని ఒక్క ఉదుటున రెక్కపట్టుకుని లేపి, చెంపకి పెట్టి చెళ్ళుమని కొట్టి అన్నాడు-

"ఏం పని ఇదీ?"

ఆ పిల్లవాడు భయపడ్డాడు. ఎదురుగా రాక్షసుడిలా నరసింహం.వాడు వెంటనే జేబులోనుంచి ఫోన్ తీసి 911 నెంబర్ నొక్కి, ఇంగ్లీష్‌లో ఏదో చెప్పాడు. పిల్లవాడు ఫోన్ చేసినతరువాత మూడంటే మూడు నిమిషాల్లోనే మూడువైపులనించి మూడు పోలీస్ కార్లు అతివేగంగా వచ్చి ఆగాయి. ఆ కారులోనుంచి ముగ్గురు పోలీసులు దిగి వీళ్ళదగ్గరకి వచ్చారు. ఆ పిల్లవాడు ఏడుస్తూ పోలీసులకి ఏదో చెప్పాడు.

పోలీసులు నరసింహాన్ని ఏదో అడిగారు.

నరసింహానికి జెంటిల్‌మేన్, డిగ్నిఫైడ్ మినహా మూడోముక్క ఇంగ్లీష్ రాదు. అప్పటికే అక్కడ పెద్ద గుంపు చేరారు. ఆ గుంపులో ఇంగ్లీష్ తెల్సిన ఒక తెలుగు పెద్దాయన నరసింహాన్ని అడిగాడు-

"నువ్వు ఈ పిల్లవాడ్ని నిజంగా కొట్టావా అని పోలీసులు అడుగుతున్నారు!"

"కొట్టాను. తప్పేముంది...? వీడు ఎంతా, వీడి వయసెంతా, వీడు చేస్తున్న చేష్టలు ఏమిటి? ఏం పని ఇది?" అన్నాడు నరసింహం కోపంగా.

అదే మాట ఆయన పోలీసులకి ఇంగ్లీష్‌లో చెప్పాడు. మహంకాళి దగ్గర ఫోన్ ఉంది. అది తీసుకుని ఏకాంబరాన్ని పిలిపించారు.

ఏకాంబరం హడలిపోతూ వచ్చాడు. పోలీసులు ఏకాంబరానికి విషయం చెప్పి, నరసింహాన్ని అరెస్ట్‌చేసి తీసుకుపోయారు. అదే రోజు సాయంత్రం పోలీసులు ఆయన్ని కోర్ట్‌లో హాజరుపరిచారు జడ్జిముందు.

గంటలోనే విచారణ ముగిసిపోయింది.

నరసింహానికి వారంరోజుల జైలుశిక్షా, 2 వేల డాలర్లు జరిమానా విధిస్తూ తీర్పుచెప్పాడు జడ్జి.

"పెద్దమనిషినీ, జెంటిల్‌మ్యాన్‌నీ! పిల్లవాడు తెలిసీ తెలియక తప్పుచేస్తే దండించడం నేరమా? అందుకు జరిమానా, జైలుశిక్షా వేస్తారూ? ఇదేనా ఇక్కడి న్యాయం? పాడు దేశం, పాడు గవర్నమెంటు, పాడు వ్యవహారాలూ...!" అని ఆగ్రహంతో ఆక్రోశించాడు నరసింహం.

ఏకాంబరం తండ్రికి వేసిన పెనాల్టీని చెల్లించి, చాలా బాధగా ఇంటి ముఖం పట్టాడు. జెంటిల్‌మ్యాన్ నరసింహం కూడా బాధగానే జైలు ముఖం పట్టాడు.



అనిల్

Wisemen care not for what they cannot have

హంస జాతులు

హంస అన్నమాట వింటే తెల్లగా నిగనిగలాడుతూ అందంగా కదలడమే స్ఫురిస్తుంది.తెల్లహంసలు ఉత్తర ధ్రువ ప్రాంతంలో ఎక్కువగా ఉంటాయి.

అయితే నల్లని హంసలు కూడా వుంటాయి. ఇవి ఆస్ట్రేలియాలో ఎక్కువగా కనపడతాయి.

కొన్ని రకాలు పూర్తిగా నల్లగావుంటే, ఇంకొన్ని తెలుపు, నలుపు కలగలసి వుంటాయి. హంసల్లో ఏడు, ఎనిమిది జాతులు ఉంటాయి. వీటిలో ఐదు రకాలు తెల్లనివే. దక్షిణ అమెరికాలో నారింజరంగు హంసలుంటాయి.

సాధారణంగా తెల్లహంసలు ఇరవై సెంటీమీటర్లదాకా పొడవు వుంటాయి. ట్రాంప్టర్ జాతి హంసలు బాగా పొడవైనవి. ఇవి నూటపది సెంటీమీటర్లకు పైగా పొడవు ఉంటాయి.కొన్ని జాతులు అంతరించిపోయాయి.

వీటి జీవితకాలం ఇరవై ఏళ్ళని, అత్యంత జాగ్రత్తగా పెంచితే యాభై ఏళ్ళదాకా బతుకుతాయని వింటుంటే ఆశ్చర్యంగా వుంది కదూ!

ధూళీ కావాలి

దుమ్మూ, ధూళి అంటే అనారోగ్యానికి, పర్యావరణానికి హాని కలిగిస్తాయన్నది సాధారణ అభిప్రాయం.

గాలిలో ధూళి ఎక్కువగా వుంటే అనారోగ్యం కలిగే మాట నిజమే ఐనా, దీనివల్ల ఇతరత్రా అనేక ఉపయోగాలు ఉన్నాయని ఇటీవల వెల్లడైన పరిశోధన ఫలితాల వల్ల తెలుస్తున్నది.

దుమ్ము, గాలికి ఎగిరి ఓ చోటనుంచి మరో చోటకు వాతావరణంలోకి వ్యాపిస్తుంటుంది.

మేఘాలలో వుండే నీటి ఆవిరి గాలిలోని ఈ దుమ్ము కణాలతో కలవడం వల్ల కొంత ఘనీభవించి నీటిబిందువులుగా తయారవుతాయి. ఇవే వర్షపు జల్లులు అవుతాయి.

పొగమంచు కూడా ధూళివల్లనే ఏర్పడుతుంది. గాలితో పాటు వాతావరణంలో ధూళి కణాలూ ఉన్నందు వల్లే సూర్యకిరణాలు నలుదిక్కులా ప్రసరిస్తుంటాయి.

పిల్లల పేచీలు

మిగతా విషయాలన్నింటిలోనూ బావున్నా ఆహారం విషయంలో మాత్రం పిల్లల పేచీలకు అంతుండదు.

ఏదో ఒక ఆహారాన్ని మాత్రమే తింటూ, తరచు అదే కావాలని కోరుతుంటారు. ఇతర పదార్థాలవైపునకు అస్సలు చూడరు.

ఇలా ఒకే రకం ఆహారం తింటుంటే పిల్లలకు పోషకాలు తగ్గిపోతాయని పెద్దవాళ్ళు ఆందోళన పడడం సహజం. నిజంకూడా. పిల్లల్ని బుజ్జగిస్తూ, వివిధ రకాల ఆహార పదార్థాలు తినే విధంగా వారిని ప్రోత్సహిస్తుండాలి.

అందుకోసం వారికి నచ్చే విధంగా వెరైటీ పదార్థాలు ఇస్తుండాలి. బలవంతంచేస్తే వాళ్ళు తినరు. సరదాగా, ఆటపాటల నడుమ ఆహారాన్ని తినిపిస్తుంటే పేచీలు తగ్గిపోతాయి.

ఉదయం ఉపాహారం

పిల్లలు కొందరిలో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, చురుకుదనం లోపిస్తాయి. ఈ విషయంలో తోటిపిల్లలతో పోల్చుతూ పెద్దవాళ్ళు అదే పనిగా విసుక్కుంటుంటారు.

నిజానికి ఇందుకు కారణం ఆహార లోపం కాగలదు. చాలామంది పిల్లలు ఉదయాన్నే బ్రేక్‌ఫాస్ట్ మానేస్తుంటారు. పిల్లల మెదడు చురుగ్గా పనిచేయాలంటే ఉదయంవేళ ఉపాహారం తప్పనిసరిగా వారికి తినిపించాలి.

రాత్రి భోజనం తర్వాత ఎక్కువ గంటలు విరామం వస్తుంది కాబట్టి బ్రేక్‌ఫాస్ట్ చెయ్యకుండా స్కూలుకు వెళ్ళిపోతే మెదడుశక్తి సన్నగిల్లుతుంది.

కుదురుగా, ఏకాగ్రతతో స్కూల్లో కూర్చోలేకపోతారు. పాఠాలు శ్రద్ధగా వినలేకపోతారు.కాబట్టి ఉదయం వేళ ఉపాహారం మానేసే అవకాశాన్ని పిల్లలకు అస్సలు ఇవ్వకూడదు.

కలసిమెలసి తిరగాలి

ఈ రోజుల్లో అమ్మానాన్నలిద్దరూ ఎవరి పనుల్లో వారు బిజీగా వుంటుండడంతో పిల్లలు వీడియో, కంప్యూటర్ గేమ్‌లకు పరిమితం అయిపోతున్నారు. పిల్లలు నలుగురితో కలవకపోవడం వల్ల చాలా మిస్సవుతుంటారు.

వాళ్ళు తమ వయస్సుకు తగినట్లు, హాయిగా అల్లరిచేస్తూ, నలుగురితో కలివిడిగా వుంటుంటే ఎదిగేకొద్దీ ఎంతగానో ప్రయోజనం ఉంటుంది.


కొత్తవారితో చక్కగా మాట్లాడగలగడం, ఎటువంటి సమస్య ఎదురైనా పరిష్కరించుకోగలగడం. కమ్యూనికేషన్స్ నైపుణ్యాలు అలవడడం వంటి ప్రయోజనాలుంటాయి. గొప్పగొప్పవారితో పరిచయాలు పెరుగుతాయి.

నలుగురితో కలిసిమెలిసి వున్న పిల్లలకు 'లౌకికజ్ఞానం' కూడా పెరుగుతుంది. ఆ జ్ఞానం వారి ఎదుగుదలకు, మానసిక వికాసానికి తోడ్పడుతుంది. ఇలాంటి కమ్యూనికేషన్స్ వల్లే అనేక మంది సెలబ్రిటీలుగా ఎదిగారన్న సంగతి మరువకూడదు.

ఈ స్కిల్స్ వల్ల పిల్లలు మంచి నడవడిక అలవడుతుంది. మంచి పౌరులుగా గుర్తింపు పొందుతారు.

బొమ్మల పజిల్

ఈ రెండు బొమ్మల్లో గల ఐదు వ్యత్యాసాలను గుర్తించండి.





డా॥జి. సమరం

సెక్స్ AND సైకాలజీ

Sex in older age protect women from Cardio Vascular problems

ఎ.ఎల్. హైదరాబాద్

నా వయస్సు 24 సంవత్సరాలు. నేను అందగాడినే. కాని ఏం లాభం? నాకు ఆడవాళ్ళ మీద మనస్సు కలగదు. ఏ స్త్రీ అయినా నా అందం చూసి నా దగ్గరకు వస్తే నేను ఒకటి-రెండు మాటలు మాట్లాడేసరికి ఛీకొట్టి వెళ్ళిపోతుంది.

నేను వాళ్ళకి ఆడంగిలాగా కనబడుతున్నాను. నేను అందరి మగవాళ్ళలాగా ఉండలేనా?

మీలో కాస్త కొజ్జాతనం ఉంది. అందువల్లే ఆడవాళ్ళమీద కాకుండా మగవాళ్ళమీద మోజు కలుగుతోంది. మీలోని ఆడంగితనం పోవాలనే గట్టి సంకల్పం ఉంటే బిహేవియర్ మోడిఫికేషన్ థెరపీ అనే సైకోథెరపీ పద్ధతిద్వారా తేలికగా మార్చవచ్చు. ఒకసారి డాక్టర్‌ని సంప్రదించండి.

ఎ.ఎన్. విజయవాడ

నాకు మరో పదిరోజుల్లో పెళ్ళి ఉంది.ఇంతవరకు నాకు సెక్స్ అనుభవం లేదు. మొదటిరాత్రి సక్సెస్‌ఫుల్‌గా ప్రొసీడ్ అవ్వాలంటే ఎలా?

సాధారణంగా చాలామంది ఫస్ట్‌నైట్ చక్కగానే ఎంజాయ్ చేస్తారు. ఎటువంటి ఇబ్బందీ లేకుండా సక్సెస్ అవుతారు. మొదటి రాత్రి మధురమైన రాత్రిగా వాళ్ళ మదిలో నిలిచిపోతుంది.

కొంతమందిలోనే అనవసర భయాలు, అనుమానాలు ఉంటాయి. నెగెటివ్ ఫీలింగ్స్ మనస్సులో ఉన్నప్పుడు తెలియని భయం చోటుచేసుకుంటుంది. కంగారు వస్తుంది. దాంతో సెక్స్‌లో పాల్గొనగలిగి ఉండి కూడా ఫెయిల్ అవుతారు.

సెక్స్‌లో పాల్గొనడం ఏమీ కష్టమైన పని కాదు. దంపతులిద్దరూ ఒకరిమీద మరొకరికి మంచి క్రేజ్ ఉండి ముచ్చటగా ఒకటైతే అంతా సజావుగానే జరిగిపోతుంది. ఫస్ట్‌నైట్ ఎటువంటి ఇబ్బందీలేకుండా జరగాలంటే దంపతులు ఇద్దరికీ లైంగిక విజ్ఞానం ఉండాలి. ఫోర్‌ప్లే గురించి తెలియాలి.

ఒకరికొకరు చక్కగా సహకరించుకోవాలి. అర్థంలేని అనుమానాలు, భయాలు ఉండకూడదు.

అందుకని మీరు సెక్స్ సైన్స్‌కి సంబంధించిన విషయజ్ఞానాన్ని కొంత తెలుసుకోండి. ఫస్ట్ నైట్ సక్సెస్‌ఫుల్‌గా అయిపోతుంది.

బి.ఆర్. భీమవరం

నా వయస్సు 18 సంవత్సరాలు.నాలో సెక్స్ స్పందనలు చక్కగా ఉన్నాయి. ఒంటరిగా పడుకున్నప్పుడు మేన్లీగా ఉన్న అబ్బాయిలు మనస్సులో మెదిలితే నాలో ఏదో తెలియని అలజడి మొదలవుతుంది.

అనుకోకుండా నా చేతులు నా మర్మావయాల దగ్గరకి చేరుతాయి. యోని దగ్గర గట్టిగా అదుముకుంటాను. ఎంతో హాయి అనిపిస్తుంది.అంతేతప్ప ఇంకేమీ చేయను. మర్మావయాల దగ్గర స్త్రీలల్లో క్లైటోరిస్ అనేదేదో ఉంటుందట. దాన్ని టచ్‌చేస్తే చెప్పలేని థ్రిల్ కలుగుతుందట. ఈ విషయం నా స్నేహితురాలు చెప్పింది. మరి స్త్రీలల్లో ఈ క్లైటోరిస్ మర్మావయాలలో ఏ ప్రాంతంలో ఉంటుంది?

క్లైటోరిస్‌నే యోని శీర్షం అంటారు. యోని రంధ్రానికి కాస్త పైన చర్మం ముడతల్లో బఠానీ గింజంత పరిమాణంలో యోని శీర్షం ఉంటుంది.

{సెక్స్‌తో జ్ఞాపకశక్తి పెరుగుతుంది}

సెక్స్ అంశంమీద పలురకాల సందేహాలున్నాయి. ఆ సందేహాలు ఎప్పటికైనా సంపూర్ణంగా పరిష్కరించబడతాయా! అనేది సందేహమే. సెక్స్‌కి సంబంధించిన అంశాలమీద పలు దశాబ్దాలుగా పరిశోధనలు జరుగుతున్నాయి. పలు కొత్త లాభాలు వెలుగులోకి వస్తున్నాయి. పలు పాత నమ్మకాలు పటాపంచలవుతున్నాయి.

సెక్స్ అనేది ఒక వయసులో మాత్రమే అనుభవించదగినది అనే నమ్మకం బలీయంగా వుంది. కేవలం సంతానం పొందటంకోసం బాధ్యతగా పాల్గొనేదే అనుకునేవారు లేకపోలేదు.

ఒక వయసు తర్వాత స్వచ్ఛందంగా సెక్స్‌కి దూరంగా వుండటం అవసరమని, ఆ వయసులో కూడా సెక్స్‌లో పాల్గొనటమంటే కోరి కష్టాలు తెచ్చుకోవటమేననేది కొందరి అభిప్రాయం.

వయసు పెరిగిన తర్వాత క్రమంగా మానసిక బంధాలన్నీ తెంచుకోవాలనుకుంటారు. అలా తెంచుకుని దూరంగా జరిగి ఎవరి పడకగదిలో వారు పడుకోవటం సరైన పద్ధతి అనుకునే దంపతులు వున్నారు. ఆ వయసులో కూడా సెక్స్ గురించే ఆలోచించేవారు క్రమక్రమంగా జ్ఞాపకశక్తి సమస్యలు కొనితెచ్చుకుంటారన్న అభిప్రాయం ఉంది.

మెదడులో సెక్సీ ఆలోచనలు నిండి ఇతర జ్ఞాపకాలకు చోటు లేకుండా చేస్తాయనుకుంటారు.సెక్స్‌కి సంబంధించిన అంశంమీద జరిగిన అధ్యయనంలో వయసు పెరిగినా సెక్స్‌ను ఆనందంగా అనుభవించే వారికి ఎటువంటి జ్ఞాపకశక్తి సమస్యలు రాకపోవటమే కాదు,జ్ఞాపకశక్తి మరింత పెరుగుతుందని తేల్చారు.

వూలన్ గాంగ్ విశ్వవిద్యాలయ పరిశోధకులు యాభై ఏళ్ళ వయసు దాటిన ఆరువేలమంది దంపతులమీద ఈ అధ్యయనం చేశారు. వారు జ్ఞాపకశక్తి, జ్ఞాపకం పెట్టుకుని నిర్వహించాల్సిన పనులు, సెక్స్ శక్తి, సెక్స్ అనుభవంవంటి అంశాలనన్నింటినీ ఆ దంపతులనుండి సేకరించారు.

జ్ఞాపకశక్తి మందగింపుకు, సెక్స్‌కి సంబంధమే లేదు. ఆ యా దంపతుల విద్యార్హతలు, వారి జీవన విధానం, వారు చేసేటువంటి వ్యాయామం, వారికున్న పొగతాగే, మత్తుపానీయం సేవించే అలవాట్లు జ్ఞాపకశక్తిని ప్రభావితం చేస్తాయేగాని వారి సెక్స్‌లో చురుకుగా వుండటం కాదని అర్థమైంది.

ఏ దంపతులైతే వయసు పెరిగినా ఒకరికొకరుగా జీవితం గడుపుతారో వారిలో ఎటువంటి జ్ఞాపకశక్తి సమస్యలు ఏర్పడవు. పూర్తిస్థాయి లైంగిక అనుభవాలు లేకపోయినా ఒకరినొకరిని దగ్గర చేసే స్పర్శలు,కౌగిలింతలు, ముద్దులు ఆపవద్దన్నది పరిశోధకుల సూచన. భావోద్వేగ అనుబంధం దంపతులు కొనసాగించాల్సిన అవసరం వుంది.

అనవసరపు పట్టింపులు, గత చేదు అనుభవాల ప్రస్తావనలు లేకుండా దంపతులు తమ రొమాంటిక్ జీవితాన్ని కొనసాగించాలి. ఆ విధంగా వుంటే వారు జీవితంలో చురుకుదనం తగ్గదు.భాగస్వామితో దగ్గరగా వుంటూ, లైంగిక ఆనందం పొందే ప్రయత్నంచేసే వారికి జ్ఞాపకశక్తి లోపం ఏర్పడదు.

కిందివయసులో ఎంత చురుకుగా ఆలోచించగలిగేవారో, స్పందించేవారో అదే పద్ధతిలో వయసు మళ్ళిన తర్వాతకూడా వుండగలుగుతారు.

సెక్స్‌కున్న ఆ పవర్‌ని గుర్తించి వయసు పెరిగి, ఇతర బాధ్యతలలో నుండి రిటైర్ అయినా సెక్సీ అంశాలలో నుండి రిటైర్ అవకుండా కొనసాగించి జ్ఞాపకశక్తిని పెంపొందించుకోగలరు. ◆



Courtesy :THE MAN

అది సాధారణంగా పైకి కనపడదు.కాని వేలు పెట్టి అక్కడ ఒరిపిడి కలిగిస్తే చక్కని థ్రిల్ అనిపిస్తుంది. స్త్రీల మర్మావయాల్లో అత్యంత థ్రిల్‌ని కలిగించేది యోనిశీర్షం మాత్రమే.

యోనిశీర్షంలో కామనాడులు అత్యధికంగా ఉంటాయి. యోనిశీర్షం పురుషాంగాన్ని పోలివుంటుంది. పురుషుల్లో ప్రేరణ కలిగించగా పురుషాంగం పరిమాణం పెరిగినట్లుగానే క్లైటోరిస్ కూడా పరిమాణం పెరుగుతుంది.

చర్మం ముడతల్లోనుంచి కొద్దిగా బయటకు వస్తుంది. బఠానీగింజలాగా గుండ్రంగా కనబడుతుంది.

ప్రేరణతో మరింత మధురానుభూతిని కలిగిస్తుంది. శృంగారంలో పాల్గొన్నప్పుడు ఫోర్‌ప్లేలో దంపతులు తప్పకుండా క్లైటోరిస్‌కి ప్రేరణ కలిగించాలి. అప్పుడే మనస్సు పరిపూర్ణంగా శృంగారానికి సమాయత్తం అవుతుంది.

హెచ్.ఆర్.కె. యలమంచిలి

నాకు కాన్పు అయ్యి మూడు వారాలు అయింది. నాకు కాని, మావారికి కాని సెక్స్ కోరికలు చాలా ఎక్కువ. ఉన్న మాట చెప్పాలంటే నేను కాన్పు అవడానికి మూడురోజుల ముందువరకు సెక్స్‌లో పాల్గొంటూనే ఉన్నాను. మేమిద్దరం సెక్స్ లేకుండా ఉండలేము. అందువల్లే కాన్పు అయిన మూడువారాలకే ఉండలేక మేమిద్దరం సెక్స్‌లో పాల్గొన్నాము.

అప్పుడు ఆవేశంలో అలా ఒకటి అయ్యాముగాని నాకు ఏదో తెలియని భయం ఒణికిస్తోంది. కాన్పు అయిన మూడు వారాలకే సెక్స్‌లో పాల్గొనడంవల్ల నాకు గర్భాశయం ఏమైనా పుండుగా మారిపోతుందా, బిడ్డకు పాలు లేకుండా అయిపోతాయా?

నాకు ఏమైనా బాలెంతరాలి జబ్బు వస్తుందా? ఏవేవో తెలియని భయాలు నన్ను ఒణికిస్తున్నాయి. ప్లీజ్ నన్ను మీరు రక్షించండి.

సాధారణంగా కాన్పు అయిన ఆరువారాలనుంచి నిరభ్యంతరంగా సెక్స్‌లో పాల్గొనవచ్చు. అంతకు ముందు అయినట్లయితే కొద్దిగా తెలుపు అవడం, యోని మార్గం లోపల ఇన్‌ఫ్లమేషన్ ఉండటం, నొప్పి అనిపించడం ఉండవచ్చు.


శృంగారంలో పాల్గొంటే బాధ అనిపించవచ్చు. అంతేతప్ప కాన్పు అయిన పదిరోజులకే సెక్స్‌లో పాల్గొన్నప్పటికీ ప్రత్యేకంగా ఎటువంటి ప్రమాదం జరగదు. ఎటువంటి బాలెంతరాలి జబ్బు రాదు. బిడ్డకి పాలు లేకుండా అవ్వవు. మామూలుగా కాన్పు అయిన మూడువారాల వరకు యోని నుండి కొద్దిగా ఎరుపు, తెలుపు ద్రవాలు ఊరుతుంటాయి.

అలా ఉన్నప్పుడు సెక్స్‌లో పాల్గొనడానికి అంతగా మనస్కరించదు. ఒకవేళ మనస్సుపడి కలిసినప్పటికీ ఏమీ అవదు. అందుకని జరిగినదానికి మీరు ఎలాంటి భయం పెట్టుకోనవసరంలేదు.

డా॥ జి. సమరం వాసవ్య నర్సింగ్‌హోమ్ బెంజిసర్కిల్ విజయవాడ 520 010 ఫోన్ 0866-2472370 E-mail drsamaram@hotmail.com www.gsamaram.com

సీరియల్

సామ్రాట్ సముద్రగుప్త



సి. శివరామమూర్తి

"సముద్రగుప్తా! నీవు మహావీరుడవు, శూరుడవు. ఈ ధరణీ మండలాన్ని మహాప్రాభవ వైభవంతో పాలిస్తావు... అశ్వమేధ యాగాన్ని చేస్తావు... నీ కుమారుడు విక్రమార్క చంద్రగుప్తుడు..."

సముద్రగుప్తుడికి అంతా అయోమయంగా, అతని మనసు సాలెగూడులో చిక్కుకుపోయిన కీటకంలా ఉన్నది.

జరిగిన కథ 22

లావినియా సముద్రగుప్తుడు ప్రేమలో పడేసరికి సౌగంధిని అసూయతో రగిలిపోయి ఆ విషయము కచగుప్తుడికి చేరవేస్తుంది.

నీవు లావినియాను కలవకూడదని ఆంక్షపెట్టి ఆమెకు కాపలా పెడతాడు కచుడు. అతడ్ని పట్టాభిషిక్తుడ్ని చేస్తాడు చంద్రగుప్తుడు.

ఇంద్రప్రస్థాధీశుడు నాగాయకుడిని బంధించి తెచ్చినవారిని లావినియా వివాహమాడుతుందని తెలిసి అందుకు బయల్దేరతాడు సముద్రగుప్తుడు... సోదరుడిని సంహరించే కుటిలనీతికి ఉద్యుక్తుడవుతాడు కచుడు.

సముద్రగుప్తుడి దండయాత్రలతో ఈ భరతభూమి దద్దరిల్లిపోతుందని చివరకు అశ్వమేధ యాగం చేస్తాడని భద్రకాళి చెప్పిందని చెబుతాడు కాపాలికుడు.

సముద్రగుప్తుడు సామ్రాట్ అవుతాడని, కచగుప్తుడు కనబడడని సేనా నాయకులకు చెబుతాడు కశ్యపుడు. రేపు ఉదయం దక్షిణ వనానికి వెళ్ళండి. పరశువుతో ఓ వ్యక్తి తారసపడతాడు. ఆ వ్యక్తి నుండి ఆ పరశువును దానంగా తీసుకోండని సేనా నాయకులకు చెబుతాడు కాపాలికుడు.

నిన్ను ఇక్కడకు చేర్చిందెవరో చెప్పమని లావినియాను నిలదీస్తాడు కచుడు. సముద్రగుప్తుడు జైత్రయాత్రకు బయల్దేరతాడు.


ఇక జరిగేది చదవండి.

అదే రోజు ఉదయాన్నే కశ్యపుడు నియమించిన చంద్రగుప్తుడి అత్యంత విశ్వాసపాత్ర సేనానాయకులు పాటలీపుత్రానికి దగ్గరలో ఉన్న దక్షిణ వనానికి బయలుదేరారు... వారిలో తీరని కుతూహలం.

ఆ ఐదుగురు కలిసి వనమధ్యంలో ప్రవేశించి గుర్రాలను అక్కడ ఉన్న చెట్లకు కట్టివేసి అక్కడ ఉన్న మైదానంలోనికి వచ్చి నలువైపులా చూడటం మొదలుపెట్టారు. వారికి ఆ మూల నుండి ఓ శబ్దం విన్పించింది.

అటువైపుగా ప్రయాణం చేశాడు. తీరా చూస్తే ఒక బక్కచిక్కిన వృద్ధుడొకడు అక్కడ ఉన్న చెట్లను గండ్రగొడ్డలితో నరుకుతున్నాడు.

అతడ్ని చూడగానే ఆ ఐదుగురికీ ఆపుకోలేని నవ్వు. 'ఇతడేనా ఆ కాపాలికుడు చెప్పిన వాడు! ఒంటిలో కండకూడా సరిగ్గాలేని ఈ అర్భకవృద్ధుడేనా అతడు...! పరశువును ధరించి కన్పడతాడని చెప్పాడు' ఆ ఐదుగురు విరగబడి నవ్వుతున్నారు.



ఆ వృద్ధుడికి పక్కగా పచ్చిక బయళ్ళలో, బహుశా అతడి ఆవు కాబోలు పచ్చిగరికెను మేస్తోంది.

ఇంతలో ఎక్కడనుంచో ఏ మూల నుంచో ఒక పులి గాండ్రింపు విన్పడింది. ఆ ఐదుగురు మొహమొహాలు చూసుకున్నారు.

ఈసారి పులి గాండ్రింపు మరింత స్పష్టంగా చేరువలో విన్పడింది. వారిలో ఒకడు... "మనం వెళ్ళి ముందుగా ఆ రాతిగుట్టను ఎక్కుదాం. అపుడు పులి ఏ మారుమూలనుంచీ దాడిచేయలేదు. పైగా మనం ఐదుగురమూ కలిసివుంటే పులి మన జోలికి రాలేదు"

వెంటనే ఆ అయిదుగురు పరిగెత్తుకుంటూ వెళ్ళి ఆ రాళ్ళగుట్టను అధిరోహించారు. అక్కడ చెట్లకు కట్టివేసిన అశ్వాలు పులి గాండ్రింపుకు పెద్దపెట్టున సకిలించడం ప్రారంభించాయ్!

పులి మైదానంలోకి ప్రవేశించింది.

ఆ వృద్ధుడు చెట్లను నరకటం ఆపి పులివైపు ఆ మూలగా భయంతో వణికిపోతున్న తన ఆవును చూశాడు.

పులి వారిద్దర్నీ గమనించింది. ఆ ఇద్దరిలో ఏ ఒక్కరిమీదో పులి దాడి చేయడం తథ్యం. ఒక్కసారిగా పులి కన్పడగానే 'అంబా' అని అరుస్తూ ఆవు పరుగెత్తబోయింది.

పులి ఒక్కసారిగా ఆవువైపు పరిగెత్తటం మొదలుపెట్టింది. ఆవు "అంబా... అంబా..." అని ఆ జగదాంబను వేడుకుంటున్నట్లుగా పరిగెత్తుతోంది.

ఏమైందో ఏమో, ఆ వృద్ధుడు ఒక్కసారిగా శివమెత్తిపోయాడు. ఆ గండ్రగొడ్డలిని గిరగిరమని తిప్పుతూ ఒక్కసారిగా ఆ పులిని ఎదుర్కొన్నాడు.

బహుశా ఆ పులికూడా ఊహించి ఉండదు, ఈ సంఘటనకు. వెంటనే ఆవును వదిలి వృద్ధుడివైపు దూకిందా పులి. వృద్ధుడు కాలరుద్రుడిలా విజృంభించాడు. ఆ గండ్రగొడ్డలిని ఒడిసిపట్టుకుని గిరగిరమని తిప్పుతూ పూనకం వచ్చినవాడిలా పులిమీదకు ఒక్కవేటును వేశాడు. ఆ దెబ్బ పులికి నిజంగానే మారణఘాతమయింది.

ఆ పదునైన గండ్రగొడ్డలి పులినట్టనడుమును తాకింది. రక్తం చివ్వుమని ఎగిసింది. ఒక్కసారిగా అంతటి పులి నేల కరుచుకుంది. ఆ రక్తాన్ని చూసిన వృద్ధుడిలో ద్విగుణీకృతమయిన కసి మరోసారి శివమెత్తిపోయాడు.

కిందబడ్డ పులిని తూట్లు తూట్లుగా పొడిచాడు. చూస్తుండగా పులి కొద్దిసేపటిలో నేలకొరిగి విలవిలలాడుతూ ప్రాణాలు విడిచింది. చూపరులకు, ఆ అయిదుగురికి ఇంద్రజాల మాయాజాలంగా తోచింది.

అందరూ అవాక్కయిపోయారు. ఒక్కసారిగా కాపాలికుడు మనసులో మెరిశాడు. ఆ తర్వాత సముద్రగుప్తుడు మనసులో మెదిలాడు. వారి మనసుల్లో చిక్కుముడి వీడినట్లుగా అయింది.

ఉత్తరక్షణమే అయిదుగురు సేనా నాయకులు ఆ వృద్ధుడ్ని చేరారు.

"ఎవరు మీరు...?" ఇంకా రొప్పుతున్నాడు వృద్ధుడు.

"పాటలీపుత్ర సేనానాయకులం"

"ఇంతవరకు చోద్యాన్ని చూస్తున్నారా నాయకులారా...! గోమాతకు ఆపద వాటిల్లుతుంటే చోద్యం చూస్తూ కూర్చున్నారా!" అనడిగాడు.

ఆ ఐదుగురు సిగ్గుతో తలవంచుకున్నారు. "ఇంతకు మీరెవరు?" సేనా నాయకులు అడిగారు.

"నేను కట్టెలు కొట్టుకొని జీవించే ఒక సామాన్యుడిని!"

"కానీ ఇంతకుముందు మీరు చేసిన అద్భుతాన్ని మేము నమ్మలేకపోతున్నాము. ఈ గొడ్డలితో ఎదుర్కొనే విద్యను మీకు ఎవరు నేర్పారు?" అని అడిగారు.

"గండ్రగొడ్డలిని ప్రయోగించటాన్ని ఎవరు నేర్పాలి? ఆత్మరక్షణే మనలోని అద్భుత ప్రేరణ. ఆ



అదనపు బాధ్యత

'మహానటి'గా మహా బాగా మెప్పించిన కీర్తి సురేష్ కొత్త సినిమాలవైపునకు తన దృష్టిని సారించింది. ప్రస్తుతం ఆమెపై అంచనాల భారమూ పెరిగింది.

"మంచి పాత్రలో చూసిన ప్రేక్షకుల అంచనాలు అదే స్థాయిలో వుంటాయని తెలుసు. ఈ అంచనాలను నేను ఒత్తిడిగా భావించను. అదనపు బాధ్యతగా అనుకుంటాను. అందుకు అనుగుణంగానే పనిచేస్తాను. ముందున్న సవాళ్ళను ఎదుర్కోవడానికి నేనెప్పుడూ సిద్ధంగానే వుంటాను. 'మహానటి' నాకెంతో అనుభూతిని, అనుభవాలను మిగిల్చింది" అని చెప్పింది.

మేకను కూడా పులిలా మార్చగల శక్తి ఈ ప్రేరణకుంది"

ఆ ఐదుగురు మొహమొహాలు మార్చి చూసుకున్నారు. "నలువైపులా రాక్షసంగా గండ్రగొడ్డలిని తిప్పుతుంటే మనల్ని ఎదుర్కొనేందుకు ఎవరు సాహసిస్తారు...?" మళ్ళీ వృద్ధుడన్నాడు.

"అవును. మీరేకాదు నామీద నాకే నమ్మకం కలగటం లేదు. నాలో ఏదో శక్తి ఆవహించింది. ఒక ప్రచండమైన శక్తి నన్ను కమ్ముకుంది. కాలరుద్రుడే నన్నావహించాడు"

"చూస్తున్న మా అందరమూ ఇదే అనుభూతికి లోనయ్యాం"

"ఇంతవరకూ నా జీవితంలో ఈ గండ్రగొడ్డలిని చెట్లను నరికేందుకే వినియోగించాను. కానీ ఈ రోజున ఈ పరశువుతో ఒక రాక్షసుడిని సంహరించాను" అన్నాడు.

సేనానాయకుడు అడిగాడు- "ఆ పరశువును మాకు దానం ఇవ్వండి"

"ఎందుకు?"

"దీన్ని మా యువరాజులకు బహూకరిద్దామని మా సంకల్పం. యువరాజులు త్వరలో దండయాత్రను ఆరంభించనున్నారు"

వృద్ధుడు కొంతసేపు ఆలోచించి "అలాగే నాయనా...! ఈ పరశువు ధర్మ పరిరక్షకుల చేతికి చేరటంలోనే ఔచిత్యమున్నది" అన్నాడు.

వృద్ధుడు ఆ గొడ్డలిని వారికి అందజేశాడు.

సేనానాయకులు కృతజ్ఞతగా "మేం దండయాత్ర ఏర్పాట్లలో తలమునకలై వున్నాం... దండయాత్ర నుంచి విజయులై తిరిగి రాగానే మీకు ప్రభువులచేత ఉపకారం చేయిస్తాం. మీ దారిద్ర్యాన్ని శాశ్వతంగా తొలగిస్తాం" అన్నారు.

ఆ వృద్ధుడి మొహంలో వెల్లివిరిసిన ఆనందం.

"ధర్మప్రభువులకు ఈ గొడ్డలి ధర్మవిజయాలను సంపాదించిపెట్టాలని ఆ జగన్మాతను ప్రార్థిస్తున్నాను నాయకులారా!"

"మీరు ఆ భద్రకాళీ భక్తులా..."

"అవును నాయకా... నేను ఆ భద్రకాళీ భక్తుడిని. నిత్య ఉపాసకుడను కూడాను" అన్నాడు.

ఆ సేనానాయకులు ఆ వృద్ధుడికి రెండు చేతులతో భక్తిగా నమస్కరించి, అతడి చేతినుండి ఆ పరశువును సంగ్రహించారు. పులి రక్తంతో తడిసిన ఆ గండ్రగొడ్డలిని కశ్యపుడికి ఇచ్చి జరిగినదంతా విన్నవించారు.

కశ్యపుడు సామ్రాట్‌కు, కాపాలికుడికి జరిగిన వైనాన్ని వివరించి ఆ గండ్రగొడ్డలిని కాపాలికుడి చేతికిచ్చాడు.

"భళారే...! భళా...!" కాపాలికుడు మొహంలో ఆనందం.

కశ్యపుడికి, సామ్రాట్‌కు ఏదో సుస్పష్టంగా మెదులుతోంది.

'ఏదో... ఏదో జరగబోతోంది' ఆ ఇరువురిలో మెదులుతోంది. 'కానీ అది ఇంకా స్పష్టమవటంలేదు'

కాపాలికుడు సామ్రాట్‌వైపు చూసి "జై మహాభైరవా... కాలభైరవా!" అని అరిచాడు. ఈసారి సామ్రాట్‌కు ఒక్కసారిగా తేటతెల్లమైంది.

ఆ మాటలకు చంద్రగుప్తుడి మనసులో తెరలు తెరలుగా ఆనందం వెల్లువై ప్రవహిస్తోంది.

"నిజంగా ఇది జరగబోతోందా!"

కాపాలికుడు సామ్రాట్‌ను చూసి నవ్వి- "ఇంత కాలానికి సామ్రాట్‌కు ఈ చిక్కుముడి పోయింది అవునా!" అని అన్నాడు.

"కానీ... కానీ.. నా మనసులో మెదిలిన ఊహ..."

"అదేమిటో నేను ఇక్కడ నుంచి చూస్తున్నాను చంద్రగుప్తా! నువ్వు చెప్పనక్కరలేదు. నీ ఊహ కాబోయే నిజం. ఆ భద్రకాళి సంకల్పం. అర్థమైందా!"

సామ్రాట్ ఒక్కసారిగా కాపాలికుడి పాదాల్ని తాకాడు-

"కాపాలికా! అలా జరిగితే నీ మేలు ఎన్నటికీ మరువలేను. ఈ రాజ్యమూ, నేను, నా వంశము నీకు సదా ఋణపడి ఉంటాము"

"చంద్రగుప్తా! నాకు కాదు ఆ జగజ్జననికి. ఆ జగన్మాతకు, మనమందరం ఋణపడాలి. నేను కేవలం ఆ తల్లి చేతిలోని కీలుబొమ్మను. ఆమె ఆడించినట్టు ఆడటమే నా పని. నాకంటూ నాది అంటూ ఎటువంటి అస్తిత్వం శూన్యం చంద్రగుప్తా!"

"ఎంతటి మహాభక్తుడీ కాపాలికుడు" చంద్రగుప్తుడి కనులలో భక్తితెర. భక్తితో మనసులో మరోసారి వినమ్రంగా ప్రణామం చేశాడు.

కశ్యపబ్రహ్మకు వీరి ఇద్దరిమధ్య జరుగుతున్న వైనం పూర్తిగా అంతుబట్టడంలేదు.

అర్థంచేసుకున్న చంద్రగుప్తుడు కశ్యపుడితో "ఇక నాలో సందేహాలన్నీ పటాపంచలయ్యాయ్! ఇక సముద్రుడిని సేనాగ్రానికి ముందు నిలబెట్టి యుద్ధాన్ని నడపమని సేనానాయకులకు నా ఉత్తర్వు!" అన్నాడు.

కశ్యపుడిలో అయోమయం.

"కశ్యపా! నీకు తర్వాత వివరిస్తాను. ఇంద్రప్రస్థ నాగాయకుడ్ని వశం చేసుకొని, ఆ ఇంద్రప్రస్థాన్ని జయించటంతో సముద్రుడి జైత్రయాత్రకు శ్రీకారం చుట్టినట్టవుతుంది"

"... ... ..."

"సందేహం లేదు కశ్యపా..! సముద్రుడు పెనుతుపానులా శత్రువుల మీదకు విరుచుకుపడి శత్రు సైన్యాన్ని చీల్చిచెండాడితీరుతాడు.

కాళీమాత అనుగ్రహపాత్రుడయిన సముద్రుడ్ని ఈ భూమ్మీద ఎవరూ జయించలేరు. అజేయుడుగా, అద్వితీయుడిగా అవతరించనున్నాడు"

కాపాలికుడు "చంద్రగుప్తా! మన పూజకు వేళ ఆసన్నమైంది. కాళి ఆలయానికి బయలుదేరవలసివుంది"

చంద్రగుప్తుడు అప్పటికప్పుడు కాపాలికుడితో బయలుదేరాడు.

కశ్యపుడు ఆ ఇరువురువైపు చేష్టలుడిగి నిల్చుండిపోయాడు.

ఇక్కడ సైన్యం ఇంద్రప్రస్థంపైదండయాత్రకు సమాయత్తం కావటం ప్రారంభించింది. నిజానికి గుప్తులకు ఇంద్రప్రస్థాధీశుడిని జయించటం అంత క్లిష్టమైన విషయమేమీ కాదు.



ఆర్.ఎస్.ఎస్. క్యాంప్‌కి వెళ్తున్న ప్రణబ్‌ముఖర్జీ ఆ సంస్థ సిద్ధాంతంలోని లోపాలను ఎత్తిచూపాలి.

-పి.చిదంబరం, కాంగ్రెస్ నేత

మరికొద్ది ఘడియల్లో సైన్యం భద్ర కాళి ఆలయంమీదుగా ఇంద్రప్రస్థానా నికి దారితీయవలసివున్నది.

ఈలోగా సముద్రగుప్తుడు ఎంత ప్రయత్నించినా లావినియాను ఒక్క సారి కూడా కలవలేకపోయాడు.

లావినియా కూడా ఒక్కసారైనా సముద్రుడ్ని చూడాలని తహతహ లాడుతోంది. అంతవరకూ బయటకు ఎగిరిపోయిన జాక్ డాస్ పక్షులు తిరిగి లావినియా ఒళ్ళో చేరాయ్!

సుకన్య ఇచ్చిన ఆ లేఖను అందు కొని లావినియా చదివింది ఆత్రుతగా. లావినియా ఆశ్చర్యంగా తలెత్తి "సౌగం ధినా!" అని అన్నది.

"కాదు యువరాణీ...!" ఈమధ్య సుకన్య లావినియాను యువరాణీ అని సంబోధించడం ప్రారంభించింది.

"ఆ వివరాలు చెప్పేది సౌగంధిని కాదు... నేనే..."

"కాని ఈ లేఖలో సౌగంధిని అని రాసివుంది"

సుకన్య లావినియా చెవిలో గుస గుసలాడింది.

లావినియా చేతులు ఒక్కసారిగా గుండెలపైకి వెళ్ళాయ్!

"అమ్మో! అలా అయితే సౌగంధిని గతి ఏమవుతుంది"

"యువరాణీ! ఆ దుర్మార్గురాలికి తగిన శిక్ష ఇదేనని కశ్యపుల అభి ప్రాయం. సౌగంధిని ఏనాటికయినా మీ ప్రక్కలో బల్లెమే అవుతుంది"

"కానీ... కానీ..."

"యువరాణీ! ఇక నిశ్శబ్దం వహిం చండి" అని చెప్పింది.

లావినియా ఆలోచిస్తూనే వుండి పోయింది. ఆ తర్వాత సుకన్య రాజ ధానిలో జరుగుతున్న దండయాత్ర వివరాలను చెప్పింది.

"సముద్రగుప్తులు యుద్ధానికిసమా యత్తమవుతున్నారుట" అన్నది.

లావినియాలో ఆరాటం-

"ఒక్కసారి... ఒక్కసారి... సముద్రు డిని తను కలిసేందుకు"

సుకన్య "చంద్రగుప్త ప్రభువుల అనుమతి లేదు. సముద్రులు విజయ లక్ష్మిని వరించి ఈ విజయశ్రీని కూడా చేబూనుతారు"

'సంభవమా!' లావినియాలో ప్రశ్నలు! ఒక్క లావినియాలోనే కాదు అందరి లోనూ ఇవే ప్రశ్నలు!!

సముద్రగుప్తుడు అశేష సేనా వాహి నితో ఇంద్రప్రస్థాన్ని ముట్టడించటానికి బయలుదేరాడు. మార్గమధ్యములో మహంకాళి ఆలయానికి చేరారు.

అక్కడ తండ్రి చంద్రగుప్తుడిని, కాపాలికుడ్ని కలిశాడు.

కాపాలికుడు అగ్నికుండములో కూర్చొని అగ్నిశిఖలమధ్యగా భద్రకాళికి అగ్నిహోమం చేస్తున్నాడు.

వెళ్ళి సముద్రుడు శిరస్సువంచి నమస్కరించాడు.

కాపాలికుడు అగ్నికుండంలోంచి లేవకుండా ఆ గొడ్డలిని సముద్రగుప్తు డికి అనుగ్రహించాడు. "విజయోస్తు! యువరాజా! విజయోస్తు!"

సముద్రగుప్తుడు ఒక్కక్షణం పరీ క్షగా ఆ గొడ్డలిని అణువణువును పరి శీలించి తన చేతిలోనికి తీసుకొని అన్నాడు- "మహాప్రసాదం"

"కల్యాణమస్తు! రాకుమారా!" కాపాలి కుడు మరోసారి ఆశీర్వదించాడు.

ఆ తరువాత సముద్రగుప్తుడు తండ్రి పాదాలకు నమస్కరించి వెనుదిరిగి రథారూఢుడయ్యాడు.

ఆ పరశువు గురించి సముద్రుడు ఆలోచనలో పడ్డాడు. 'తనకు ఖడ్గాన్ని పట్టడం రాదు. మరి ఈ పరశును ప్రయోగించగలడా! ఈ గొడ్డలి రాక్ష సుల ఆయుధం. పైశాచిక యుద్ధాలు, భీకర యుద్ధా లకు ఒకప్పుడిలాంటి పర శువుల్ని వాడేవారనిప్రతీక! దీన్ని గిరగిరమని తిప్పితే శత్రువులు దరిచేరటానికి భయపడతారని ఒకప్పుడు గురువు సారంగుడు అనేక ఆయుధాలను వివరిస్తూ ఇచ్చిన వివరణ గుర్తుకు వచ్చింది. దీనిని ప్రయో గించటానికి ఎటువంటి విద్య అక్కరలేదు సముద్రా! కావాల్సింది ఒక రాక్షస ఆవేశము మాత్రమే! కాపాలికుడు దీనిని అను గ్రహించాడు.

"ఇది తన ఆయుధం. దివ్యఆయుధ మవ్వాలి... దీనితోనే తను యుద్ధ భూమిలో అడుగుపెడతాడు"

సముద్రగుప్తుడిలో నిశ్చయం!

'యుద్ధభూమిలో తను శత్రువుల్ని ఎదుర్కొనగలడా! యుద్ధవ్యూహాల్ని తను నిర్దేశించగలడా!'

కశ్యపుడి మాటలు గుర్తుకొచ్చాయి. "యుద్ధ వ్యూహ నిర్మాణాలలో ఆరితేరి నవారు మన సేనానాయకులు. ఈ యుద్ధానికి వ్యూహాలను వారే నిర్ణ యిస్తారు. వారి అనుభవాన్ని, మేథ స్సును యువరాజులు ఎటువంటి శంక లేకుండా విశ్వసించవచ్చు"

ఇంద్రప్రస్థాధీశుడు నాగాయకుడికి ఈ దండయాత్ర వార్త చేరింది. పగల బడి నవ్వుకున్నాడు.

"ఓహో... లావినియాను రక్షించే దుకు సముద్రగుప్తుడు మార్జాల కిశోరం దండయాత్ర సలుపుతున్నా డుట... సముద్రగుప్తుడు గురించి ఆమూలాగ్రంగా విని ఉన్న నాగాయకు డికి జరగబోయేది యుద్ధం బొమ్మ లాటగా అనిపించింది.

నాగాయకుని మంత్రి హెచ్చరిం చాడు. "సముద్రుడు అనుభవశాలి కాకపోవచ్చు. కానీ అతడివెనుక సేనా నాయకులు అనుభవశాలురు, మహా శూరులు ఉన్నారు"

నాగాయకుడు మరోసారి పగల బడి నవ్వాడు.

"సముద్రుడు కూలిపోయిన తరు వాత ఆ నాయకులకు ఆయువుపట్టు ఏముంటుంది?"

"అంటే!"

"ముందు సముద్రగుప్తుడిపైనే మన బలాలు కేంద్రీకరించబడతాయ్! ఖడ్గమే పట్టుకోవడం సరిగ్గా రాని ఆ పిల్లకాకి నా చేతిలో ఓడిపోవటము

దుస్తులమ్మి దానాలు

ఎంతో కొంత దానగుణం దాగివుండడం సహజం. దానం చేయడంలోనూ 'సాహో' తార శ్రద్ధాకపూర్ ప్రత్యేకతను చాటు కుంటున్నది. తన సంపాదన నుంచి దానం చేయడానికి బదులు ఇతరులతో చేయించే పనిలో పడింది.

తనదగ్గరున్న దుస్తుల్ని వేలం వేసి,ఆ వచ్చే డబ్బులను జంతు సంరక్షణకు కృషిచేసేవారికి విరాళంగా ఇస్తుందట.

ఇంట్లో కుక్కను పెంచుకునే తనకు జంతువులంటే అమిత ప్రేమ అంటూ స్వంత డబ్బా కొట్టుకుంటున్నది. ఎంత ప్రేమ ఉంటే మాత్రం ఇలా దుస్తులమ్మి దానాలు చేసేబదులు బోల్డెంత సంపాదిస్తున్నది కదా- దాన్నుంచి ఇవ్వకూడదా...?






కేంద్రం కళ్ళు తెరిపించేందుకే కేరళ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధర లీటర్‌కి రూపాయి తగ్గిస్తున్నది.
-పినరాయి విజయన్, కేరళ సి.ఎమ్.

చిలిపి

మూలిగే నక్కమీద తాడిపండు పడ్డట్టు అంటే?
నిరుద్యోగులను అప్లికేషన్‌తోపాటు ఫీజు చెల్లించమనడం.

ముక్కోటి దేవతలు కట్టకట్టుకొని మీ ఇంటికి వస్తే?
ఎంతమంది వచ్చినా వంట చేయనని మావారు గోలచేయరు.



సహధర్మచారిణి అంటే?
భర్త తిడితే తిట్టేది, కొడితే కొట్టేది.

చదువు ఎందుకు?
'నో వేకెన్సీ' బోర్డ్ చదువుకునేందుకు.

కరెంటుకోతను ఎదుర్కోవాలంటే?
ఇంటింటికీ ఓ జనరేటర్ పథకం ప్రవేశపెట్టాలి.

ఒక గంపలోని నూరు జామపండ్లు, నలుగురు పిల్లలకి పంచినచో ఒక్కొక్కనికి ఏమి వచ్చును?
కడుపునొప్పి.

బస్‌లో కిటికీలు ఎందుకు?
తినుబండారాలు కొనుక్కు తినేందుకు.

తప్పదు. సముద్రుడు కూలిపోయాక ఆ సేనావాహిని భవితవ్యం ఏమిటి? అయితే లొంగుబాటు, లేకపోతే కాళ్ళకు బుద్ధి చెపుతారు. అంతేగా!"

మరో పదిరోజులు గడిచినతర్వాత పాటలీపుత్ర సేనావాహిని, ఇంద్రప్రస్థ నగర శివార్లకు చేరుకుంది ఆ సంధ్యా సమయంలో... నాగాయకుడు తన ప్రత్యేక దూతను పంపాడు.

యుద్ధానికి తాను సిద్ధంగా ఉన్నానని, రేపు సూర్యోదయం తరువాత యుద్ధాన్ని ప్రారంభించగలమని, ఈలోగా సముద్రగుప్తుడు ఆలోచించుకొని క్షమాభిక్షను కోరితే ప్రాణాలతో వదుల్తానని వర్తమానాన్ని పంపాడు.

సముద్రగుప్తుడు ఆ లేఖను దూత ముందు చింపివేసి ఇదే తన ప్రత్యుత్తరంగా నాగాయకుడికి చెప్పమని దూతను సగౌరవంగా వెనక్కి పంపాడు. ఆ రోజు రాత్రి యుద్ధ శిబిరాల్లో దరిదాపుగా అందరూ నిద్రపోలేదు. అందరి ఆలోచనలు సముద్రగుప్తుడిపైనే.

'యుద్ధం ప్రారంభించిన ఉత్తర క్షణంలోనే సమాప్తి కాదుగదా! సముద్రుడు బందీగా చిక్కడు కదా!' కానీ అందరిలో మళ్ళీ ఏదో విశ్వాసం. 'మహా అనుభవజ్ఞులైన చండప్రచండ సేనానాయకులు అండగా ఉన్నారు. వీరి ముందు నాగాయకుడు ఎంత?'

ఆ రాత్రి జరజరమని కుబుసం విడిచిన పాములా కదులుతోంది.

సముద్రగుప్తుడు తన శిబిరంలో పడుకొని ఆలోచిస్తున్నాడు. అతని కళ్ళముందు లావినియా మెదిలింది. 'ఇపుడు లావినియా ఏం చేస్తోంది?'

సంధ్యాసమయం నాలుగు ఘడియలు గడిచాక గాంధార దేశంనుండి వేగులు వచ్చారు. వస్తూనే సంచలన వార్తను మోసుకొనివచ్చారు.

కిదారుడు, తన కూతురు హేమమాల స్వయంవరాన్ని రాబోయే శుద్ధ సప్తమినాడు నిర్వహిస్తున్నాడుట.

దేశదేశాల రాజులకు వర్తమానాన్ని పంపాడుగానీ, కచగుప్తుడికి మాత్రం పంపలేదుట.

'కచుడు హేమమాలకు పట్టమహిషిగా అవకాశాలు లేకుండా చేసి లావినియాను వరించటం కిదారుడికెంతైనా ఆగ్రహాన్ని తెప్పించిందిట'

కచుడు తోకతొక్కిన త్రాచయ్యాడు. "కిదారుడికి ఎంత కండకావరం... వాడి పీచమణచాలి" అన్నాడు.

కశ్యపుడు సలహా ఇచ్చాడు "సామ్రాట్! కిదారుడికి సరి అయిన పాఠం చెప్పటానికి సరి అయిన సమయం వచ్చింది. "హేమమాల స్వయంవరంలో ఏ రాజునైనా వరిస్తే, వరించబోయే ఆ రాజు బలగాలే కాకుండా అతడి మిత్రరాజ్యాల అండదండలు కూడా కిదారుడికి లభిస్తాయ్! ఆ అవకాశాన్ని ఎవరికీ ఇవ్వకుండా ఆ కిదారుడిని ముందుగానే జయించి హేమమాలను వివాహం చేసుకోవాలి"

కచుడికి కశ్యపుడి ఆలోచన ఎంతగానో నచ్చింది. "అంతేకాదు సామ్రాట్! హూణుల నాయకుడు రక్తబాహుడు ఈ యుద్ధంలో మీతో చేతులుకలుపుతాడుట" అని చెప్పాడు.

కచుడు ఆశ్చర్యంగా చూశాడు-

"రక్తబాహుడా... అతడు మనకు శత్రువే!" అన్నాడు.

కశ్యపుడు "ముల్లును ముల్లుతోనే ఏరిపారేయాలి సామ్రాట్! యుద్ధం గెలిచాక రక్తబాహుడ్ని మట్టుపెడదాం"

కచుడికీ ఆలోచన కూడా నచ్చింది. దొంగల నాయకుడిగా జీవితాన్ని ఆరంభించిన హూణనాయకుడు రక్తబాహుడు ఈమధ్యకాలంలో సైన్యాన్ని తయారు చేసుకొని చుట్టుపక్కల రాజ్యాలమీద దండయాత్ర సలుపుతున్నాడు.

ఆ విధంగా రక్తబాహుడు అటు గుప్తులకు, ఇటు కిదారుడికి ప్రధాన శత్రువయ్యాడు. కచుడు "మరి దండయాత్రకు ముహూర్తం!"

"రేపే... రేపే. ఆలస్యంచేస్తే అక్కడ స్వయంవర ముహూర్తానికి అందుకోలేము. ఎలాగో రాజధానిలో సర్వసైన్యాలు అప్రమత్తంగా ఉన్నాయ్! అక్కడకి మీరు వెళ్ళినా, మీరు తిరిగి వచ్చేవరకూ చంద్రగుప్తులు పాటలీపుత్రాన్ని రక్షిస్తుంటారు"


కచుడు కశ్యపుడిని అభినందించాడు. కుటిల కశ్యపుడికి కూడా మనసులో ఆనందం. 'తన పథకాలు నిర్విఘ్నంగా జరుగుతున్నాయ్...

రేపు ఉదయం అక్కడ సముద్రగుప్తుడి విజయం ఇక్కడనుండి కచగుప్తుడి శాశ్వత నిష్క్రమణ' నిజానికి కిదారుడ్ని రెచ్చగొడుతూ రహస్య వర్తమానాన్ని పంపినవాడు కశ్యపుడే.

"కిదారా! ఇక నీకు నూకలు చెల్లు. కచగుప్తసామ్రాట్ చేతిలో నీకు ఓటమి. నీ కూతురి హేమమాలకు శాశ్వతంగా లావినియా పాదాలవద్ద దాస్యం తప్పదు" ఇది వర్తమాన సారాంశం.

కిదారుడికి ఒక్కసారిగా గుండె భగ్గుమన్నది. ప్రతీకార స్వయంవరం ఏర్పాటుచేశాడు.

ఇంకా ఉంది



నేను ఎంతకాలం ముఖ్యమంత్రిగా వుంటాననే ప్రశ్నమాత్రం వెయ్యకండి.
- హెచ్.డి.కుమారస్వామి, కర్ణాటక సి.ఎమ్.

నేనెవరో తెలుసా!

ఈ క్రింది ప్రశ్నలకు సమాధానాలు ఇన్‌లాండ్ కవర్‌పై రాసి స్వాతి చిరునామాకు 23 జూన్ 2018 తేదీలోగా పంపించండి. కరెక్టు సమాధానాలు రాసినవారిలో లాటరీ పద్ధతిద్వారా ఒకరిని విజేతగా ఎంపిక చేసి ₹ 500/- నగదు బహుమతిని అందజేస్తాం.

8.6.2018 సంచికలో ప్రచురించబడిన 'నేనెవరో తెలుసా!' శీర్షిక సమాధానాలు :
1. త్రిలింగస్వామి, 2. శివరామ
₹ 500/- బహుమతి పొందిన విజేత :
జె.రాజశేఖర్, 11-12-378/1
శ్రీరామక్రిష్ణపురం, రోడ్ # 06
హైదరాబాద్ - 500 102

జీవితంలో తోడు అనేది ఆడ మగలిద్దరికీ అవసరమే. ఆ అవసరం నుండి వచ్చినదే వివాహ వ్యవస్థ. అయితే వివాహం గురించి ఆడవారు ఆలోచించే తీరు, మగవారు ఆలోచించే తీరు వేరు వేరుగా ఉంటుంది. లోకం వివాహబంధం గురించి చూసే పద్ధతి భిన్నం. వివాహంతో ఆడవారి జీవితం అంతమవుతుందనుకుంటారు.

ముఖ్యంగా పదిమంది దృష్టిలో ఉండి పనిచేసే ఆడపిల్లలు వివాహంతో తమ కెరీర్‌ని వదులుకోవాల్సి వస్తుంది. అటువంటి పరిస్థితి ఎందరో సినీతారల విషయంలో గమనించేవుంటారు.

సినీతారలే కాదు, క్రీడాకారిణుల విషయంలో కూడా అదే పరిస్థితి. ఒక వయసు రాగానే పెళ్ళి ఎప్పుడు అంటూ వెంటపడుతుంటారు. వారి ఆట నైపుణ్యంమీదకన్నా పెళ్ళిమీద ఎక్కువ ప్రశ్నలు ఎదుర్కోవాల్సివస్తుంటుంది.

ఇక వివాహం కూడా ముగించి ఒక బిడ్డకు తల్లి కూడా అయితే ఇక అటువంటి క్రీడాకారిణిని మరచిపోతారు. ఆమెకూడా నాటివరకు ఆడిన ఆటను, అందులో గెలుచుకున్న బహుమతులను తలచుకుంటూ గడపాల్సిందే. అది దాదాపుగా నేటివరకు చాలామంది క్రీడాకారిణుల చరిత్ర. కాని ఆ చరిత్రను తిరగరాసింది ఒక క్రీడాకారిణి.

ఫ్రెంచ్ ఓపెన్ టెన్నిస్‌లోకి మళ్ళీ వస్తున్నా అని ఆమె ప్రకటించినపుడు అంతా ఆశ్చర్యపోయారు.

'ప్రసవించి బిడ్డ ఆలనాపాలనా చూసుకోక మళ్ళీ ఇప్పుడు ఆటలు ఏమిటి!' అని ప్రశ్నించినవారు లేకపోలేదు. 'వస్తే రానియ్, మొదటి రౌండ్ దాటితే అప్పుడు చూద్దాం' అన్నారు. వారి సవాలును స్వీకరించి తొలి రౌండ్ దాటి ముందుకు వెళ్ళింది.

అంతేకాదు, ప్రపంచంలోని తల్లుల్లారా నా మాట వినండి... ప్రసవంతర్వాత తిరిగి కోలుకోవటం కష్టమనుకుంటున్నారా! ఏమీలేదు. "నన్ను నమ్మండి. నేను చేసి చూపించింది చూడండి... మీరు సాధించగలరు" అంటూ నల్లరంగు టైట్ డ్రస్ వేసుకుని టెన్నిస్ రాకెట్ పట్టిన తన ఫోటోను సోషల్ మీడియాలో పెట్టింది. గత కాలంలో కత్తిపట్టి యుద్ధాలు చేసిన రాణులకన్నా ఏ మాత్రం తీసిపోని సాహసం ఆమె టెన్నిస్ రాకెట్‌తో చేసి చూపించింది.

అమెరికాకి చెందిన ఆ క్రీడాకారిణి టెన్నిస్ ప్రపంచంలో గత 18 సంవత్సరాలుగా సంచలనాలు సృష్టిస్తూనేవుంది. టెన్నిస్ పోటీల్లోకి ప్రవేశించిన మూడేళ్ళ కాలంలోనే ప్రపంచంలో నంబర్ ఒన్ క్రీడాకారిణిగా నిలిచింది. వరుసగా 186 వారాలపాటు ఆ నంబర్ ఒన్ స్థానాన్ని నిలబెట్టుకుని ప్రపంచ చరిత్రలో మరో క్రీడాకారిణితో వున్న స్థానాన్ని పంచుకుంది.

మధ్య మధ్యలో ఆ స్థానం కోల్పోయినా తిరిగి సాధిస్తూ దాదాపు 319 వారాలు ప్రపంచ నంబర్ ఒన్‌గా నిలబడింది. ప్రస్తుతం టెన్నిస్ ఆడుతున్న ఆటగాళ్ళలో ఆమెకు సాటిగా నిలబడగలిగిన గ్రాండ్ స్లామ్ విన్నర్స్ లేరు. మొత్తం 39 గ్రాండ్ స్లామ్ టైటిల్స్ గెలుచుకుని రికార్డు సృష్టించింది.

ఒకే సంవత్సరంలో నాలుగు గ్రాండ్ స్లామ్ టైటిల్స్‌ని గెలుచుకోవటమేకాక తన సోదరితో కలిసి డబుల్స్‌లోనూ నాలుగు గ్రాండ్‌స్లామ్స్‌ని గెల్చుకుంది. ఇక ఆమె టెన్నిస్‌ద్వారా, ఇతర మోడలింగ్‌లద్వారా 2016లో సంపాదించిన 29 మిలియన్ డాలర్లు ఒక రికార్డే. ఫోర్బ్స్‌వారు ప్రతి ఏటా ప్రచురించే కోటీశ్వర క్రీడాకారుల జాబితా 100 మందిలో ఆమె పేరు క్రమంతప్పకుండా కనిపిస్తున్నది నాలుగైదేళ్ళుగా.

ఆమె పుట్టింది నల్లజాతిలో. అమెరికాలో జాత్యహంకారం అధికం.ప్రతి రంగంలో నల్లవారిని తక్కువ చేసి చూసేవారు. నల్లజాతివారికి ఆటలెందుకు అని ఎద్దేవా చేసేవారు. ఆడుతున్నప్పుడు వారి ఆత్మస్థైర్యం దెబ్బతినే వ్యాఖ్యానాలు చేసేవారు.

తెల్లజాతి ప్రత్యర్థితో ఆడేటప్పుడు ప్రేక్షకుల నుండి ఏమాత్రం ఉత్సాహం రాకపోగా, నిరసనలు, విమర్శలు వినవచ్చేవి. అటువంటి వ్యతిరేక సామాజిక వాతావరణంలో పెరుగుతూ అవన్నీ తట్టుకుని పదేళ్ళలోపు అమెరికన్ ఆటగాళ్ళ జట్టులో స్థానం సంపాదించగలిగింది.

18 ఏళ్ళ వయసులో ఒక నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. ఆమెకు టెన్నిస్ అంటే ఇష్టం.ఫ్యాషన్ అన్నా ఇష్టమే. మోడలింగ్ చెయ్యాలి అన్నది పెద్ద కోరిక. ఏ రంగంలోకి వెళితే విజయం సాధించగలదో తెలియదు. ఐతే ఒక విషయం ఆమె మదిలో పడింది.

క్రీడలలోనే తన నల్లరంగు చర్మంమీద అంత వ్యతిరేకత ఉంటే ఇక ఫ్యాషన్, మోడలింగ్ రంగంలో తన రంగు ఎంత అవరోధకం అవుతుందో కదా! అనుకుంది. అందుకే చివరిగా టెన్నిస్‌ని ఎంచుకుంది. టెన్నిస్ బంతిని కసిగా, తన ప్రత్యర్థులైన తెల్లవారిగా భావించి, గట్టిగా టెన్నిస్ రాకెట్‌తో కొట్టవచ్చుకదా అనుకుని టెన్నిస్‌లోకి వచ్చింది.

టెన్నిస్‌లోకి వచ్చినా ఫ్యాషన్ గురించి మరచిపోలేదు. టెన్నిస్‌లో వచ్చిన పేరుతో ఫ్యాషన్, మోడలింగ్ రంగంలోకి వెళ్ళి అక్కడా పేరు సంపాదించుకుంది. అక్కచెల్లెళ్ళు ఇద్దరూ ఒకే క్రీడలో, ఒకే స్థాయి ఆటగాళ్ళుగా ఉన్నప్పుడు ఎదుర్కొనే ఇబ్బందులు ఆమె ఎదుర్కొంది.

అక్కతో తలపడినపుడు భావోద్రేకాలతో కూడిన పోటీగా సాగించేది. పలుమార్లు గెలిచింది. ఓడిపోయిన సందర్భాలూ లేకపోలేదు. అయితే వారిద్దరి మ్యాచ్‌ల ఫలితాలు ముందుగానే ఫిక్స్ అవుతాయని, వాళ్ళ నాన్న రిజల్ట్‌ని ముందే నిర్ణయించి, ఆ రోజు ఎవరు గెలవాలో చెప్పి పంపుతారని, దానికి అనుగుణంగా కొంతసేపు తీవ్రంగా పోటీపడి ఆడినట్టు నటిస్తారనే పుకారు లేవతీశారు. ఒకసారి ఈమె ఓడిపోయింది. ఆ ఫలితాలను ప్రేక్షకులు అంగీకరించలేదు.

అది మ్యాచ్ ఫిక్సింగ్ జరిగినదని, కాబట్టి తమ టికెట్ డబ్బులు తమకు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేసి నిరసన ప్రదర్శించారు.


అయితే ఆమెకు ఓటమి అంటే ఇష్టం లేదు. తాను ఓడిపోయేలా ఎంపైర్‌లు తీసుకున్న నిర్ణయాలమీద తీవ్ర పోరాటం చేసేది. తప్పుడు నిర్ణయాలు ఎంపైర్‌లు తీసుకుని మ్యాచ్ ఫలితాలను తారుమారు చేస్తున్నారని ఆమె చేసిన వాదనతర్వాతే మహిళా టెన్నిస్‌లో 'రీప్లే' చేసి, స్లో మోషన్‌లో చూసి ఎంపైర్ నిర్ణయాలను చక్కదిద్దే పద్ధతి వచ్చింది.

ఆమె వలచి పెళ్ళాడింది తెల్లజాతివాడినే. ఆ పెళ్ళి సమయానికి ఆమె వయసు 35 ఏళ్ళు. 2017 ఏప్రిల్‌లో ఆస్ట్రేలియా ఓపెన్ టెన్నిస్‌లో ఆడి గెలిచినపుడు ఆమెకు ఐదోనెల. అయినా అంత హుషారుగా ఆడగలగటం ప్రపంచమంతా ఆశ్చర్యంగా చెప్పుకుంది.

ఇప్పుడు ప్రసవించిన సంవత్సరంలో తిరిగి టెన్నిస్ కోర్టులో అంతే చలాకీగా ప్యారిస్‌లో కనిపించింది ఆమె. ఇంతకీ...

1. ఆ టెన్నిస్ తార పేరేమిటి?

2. టెన్నిస్‌లో ఆమెతో పోటీపడే ఆమె సోదరి పేరు ఏమిటి?



మునగపాటి కృష్ణంరాజు గారు!



వంశీ

మేం రెడ్ హిల్స్ నుంచి గోపన్ పల్లికి షిఫ్టయ్యి వారం దాటింది. ఆ వేళ జూలై 27 మంగళవారం. పొద్దుట ఆరు గంటలింకా కాలేదు ఉన్నాయి పదకొండొందల అపార్ట్మెంట్లున్న ఆ టౌన్‌షిప్ మొత్తం ఒక రౌండ్ తిరిగితే కిలోమీటరు. అక్కడివాళ్ళంతా మార్నింగ్ వాక్ అక్కడే చేస్తున్నారు గాని నాకెందుకో బయటికెళ్ళి చేద్దామనిపించి, బయల్దేరేను.

మూడు మలుపులు తిరిగి కిలోమీటర్ దూరం నడిస్తే మెయిన్‌రోడ్డొస్తుంది.

అక్కడ్నించి ఎడమపక్కకి తిరిగితే జవహర్ నవోదయ స్కూలు, అది దాటాకా అపర్ణ టౌన్‌షిప్స్. అలా ముందుకెళ్తుంటే ఫుడ్‌బజార్, రత్నదీప్ సూపర్ మార్కెట్లూ, మెడికల్ షాపులూ బాగా బిజీ అయిపోతున్న నల్లగండ్ల ప్రాంతం.

అయిదు కిలోమీటర్లు నడిచి వెనక్కొస్తుంటే ఇద్దరు ఆడా మగా గొంతు పెంచి మాటాడుకోవడం వినిపించింది. వెనక్కి తిరిగి చూసేను. రోడ్డు పక్కనే పెద్ద ఖాళీ స్థలంలో పునాదులు తీసి పిల్లర్స్ లేపున్నాయి. దాని పక్కనే వేసిన పాక. దాని మీద నీలం రంగు ప్లాస్టిక్ కవర్ కప్పివుంది.

మాటలు ఆ పాకలోంచి వినిపిస్తున్నాయి. అటెళ్ళేను. పెళ్ళాంతో మాటాడుకుంటూ చిరిగిపోయిన చొక్కా, వెలిసిపోయిన నిక్కరూ వేసుకుని వస్తున్న ఆ మనిషి వయస్సు యాభయ్యేళ్ళుంటాయి.

అతని వెనకాలే వచ్చిన అతని భార్య వయసు నలభై పైనే. ఏ చప్పుడూ లేని ఆ ఉదయం పూట గోదావరి యాసలో వాళ్ళలాగ మాటాడుకుంటుంటే వినడానికి చాలా హాయిగా వుంది నాకు.

దగ్గరకెళ్ళి "ఏ ఊరు?" అన్నాను.

"ఆంధ్రాసైడు కాకినాడ దగ్గర్లెండి" అన్నాడు మర్యాదగా.

"మాదీ ఆ పక్కే... పసలపూడి" అన్నాను.

గిరుక్కున నా పక్కకి తిరిగిపోయి "అయ్య



బాబోయ్ నిజమాండి... మాది మీ పక్కూరే చోడ వరం" అంటా అరిచేడతను.

"నీ పేరేంటి?" అన్నాను.

"ఇక్కడోళ్ళందరికీ రాజా అని చెప్పుకుంటన్నానండి" అన్నాడు. "పూర్తి పేరేంటో?"

"మా ఇంటి పేరు మునగపాటోరండి. పెద్దోళ్ళు కృష్ణంరాజా అని పేరెట్టేరండి.కూలిపనికొచ్చేం గదండి ఆ పొడుగాటి పేరు కత్తిరించేసేనండి... ఆయ్ మీరిక్కడే ఉంటారాండి? ఎక్కడండి?" అన్నాడు.

"దగ్గరలోనే తిన్నగా వెళ్ళి రైట్‌కి తిరిగితే మంజీరా డైమండ్ టవర్స్ అని వుంది. అందులో అద్దెకి దిగేం"

అంటా ఇంకో రెండుముక్కలు మాటాడి రేపొస్తానంటా ముందుకి నడుస్తున్న నాకు ఆ రాజా మాటతీరులో చాలా మర్యాద, నిజాయితీ కనిపించినియ్యి.

కడిగేసిన కడియం మల్లెపువ్వులాగా నవ్వుతున్నాడతను. ఇంటికెళ్ళేకా అతనేసుకున్న చిరిగిపోయిన చొక్కా గుర్తురావడంతో రేపిద్దామని ఓ మూడు పాత చొక్కాలు తీసి ప్లాస్టిక్ కవర్‌లో పెట్టేను. మర్నాడు మంగళవారం బాగా తెల్లారిపోయినా మబ్బులు బాగా పట్టుండడంతో ఇంకా చీకటిగానే వుంది.

గాలి బాగా వీస్తుండడంతో హాయిగా ఊగుతున్నాయి చెట్లకొమ్మలు. ఈ వాతావరణంలో వాకింగ్‌కి బయల్దేరిన నేను రాజావాళ్ళ పాకదగ్గర ఆగేను. స్లాబ్‌వేస్తున్నారు. హడావుడంతా రాజాదే. పనోళ్ళందరిని చాలా ప్రేమగా వరసలు పెట్టి పిలుస్తా-

"వర్షమొచ్చేలాగుంది తొందరగా కానియ్యండి తమ్ముళ్ళు" అంటా తొందరచేస్తున్నాడు.

అతని మాటతీరు ఆ ప్రేమకి లొంగిపోతున్నకూలి జనంహుషారుగా స్లాబ్‌వేసేపనిచేసుకుంటాపోతుంటే ఏ పక్క చూసినా సందడే సందడి.

ఆ పనోళ్ళందరి మధ్య ఎంత వెతికినా ఆ స్థలం ఓనరు కన్పించలేదు. నా దగ్గరకొచ్చి పలకరించిన రాజాని అదే అడిగితే "ఆయనకి ఈ ఏరియాలో ఇలాంటి స్థలాలు బోల్డండి... ఆ మధ్యోసారి నన్ను పిల్చి ఒట్టి వాచ్‌మేన్ పనొక్కటి చేస్తే గాదు... ఈ బిల్డింగ్ కట్టే పని మొత్తం నువ్వే చూసుకోవాలి అర్థమయ్యిందా? అన్నారండి" ఆరంత బాధ్యతెట్టేకా అన్ని పన్లు నెత్తినేసుకోవాలి గదండి మరీ?"

అర్థంచేసుకున్న నేను "అలాగా" అంటా నవ్వి అతనికిద్దామని తెచ్చిన పాత షర్ట్‌ల కవర్ అందిస్తే పరమానందంగా దాన్నందుకుంటా ఆ కవర్ని పాకలో దాచుకునొచ్చేడు.

నిన్న సిమెంటు చేసిన ఏరియా అంతా పొద్దుటే పైపుతో తడపడం, కర్చవగా మిగిలిన సిమెంట్ బస్తాల్ని లెక్కెట్టుకోడం. ఎవడన్నా పనోడు ఆ పూట పనిలోకి రాకపోతే ఆడి పని తనే చేసెయ్యడం ఓనరు గారిచ్చేకేషు అస్తమానంలెక్కెట్టుకోడం. నిమిషం తీరిక లేకుండా వుండే ఆ రాజా అసలెప్పుడు తింటున్నాడో ఎప్పుడు పడుకుంటున్నాడో అర్థమయ్యేది గాదు... ధ్యాసంతా ఆ పనిమీదే, కడుతున్న ఆ షాపింగ్ కాంప్లెక్స్ మీదే.

వర్షాకాలమెళ్ళిపోయి చల్లటి చలికాలమొచ్చింది. యూరోపియన్ కలర్ కాంబినేషన్‌తో ఎక్కడో ఇన్స్ బ్రూక్‌లో వున్నట్టు తయారైందా మూడు ఫ్లోర్ల మోడ్రన్ షాపింగ్ కాంప్లెక్స్.

ఆ వేళ ఓపెనింగ్‌కి ఎవరో మినిస్టరొస్తున్నాడట బయట బేనర్లు పెట్టేరు.

గేటు దగ్గర మూగిన జనాన్ని బయటకి పొమ్మంటా అరుస్తున్నాడా వయసులో వున్న కుర్రోడు.

ఆ జనంలో నలిగిపోతున్న రాజా "ఇదిగో అబ్బాయి గారు... నేను ఈళ్ళలాగ అన్నంకోసం రాలేదండి... దీని వాచ్‌మేన్‌ని. ఈ బిల్డింగ్ కట్టించింది నేనే" అంటుంటే ఏమాత్రం చెవిన పెట్టని ఆ కుర్రోడు సెక్యూరిటీవాళ్ళని పిలిచి-

"మినిస్టర్ గారెళ్ళేదాక ఏ భోజనాల్లేవు వీళ్ళందరినీ గెంటేయ్యండి" అంటా అరవడంతో వాళ్ళమీదకి దూకి బయటకి గెంటేస్తున్నారా సెక్యూరిటీవాళ్ళు.

అలా తరమబడ్డ జనంలో రాజా, అతని భార్య కూడా వున్నారు. కిందపడి నీరసంగా లేస్తున్న వాళ్ళ ముఖాలు చూసేవాళ్ళే లేరు. ఒకటే జనం.

నన్ను చూసిన రాజా దులుపుకుంటా దగ్గరకొచ్చి "కుర్రోడెవడో కొత్తోడు మా ఓనర్‌గారి వరసకి మేనల్లుడంట. మన గురించి తెల్దు... వాళ్ళ సొంతూరు

కష్టాలతో కూడిన పని

ఎంచక్కా ఏసీ రూముల్లో కూర్చుని దర్జాగా ఏ ఉద్యోగం చేసినా కొన్నాళ్ళకు ఆ పని బోర్ కొడుతుంది కాని, తమ వృత్తిమాత్రం అలా కాదంటున్నది అనుపమా పరమేశ్వరన్.

"సినిమావాళ్ళకు ఏ కష్టాలూ వుండవని అనుకుంటారు. కానీ, నటించడం అంత సులువైన సంగతి కాదు. మాది మిగతా ఉద్యోగాల మాదిరి ఏసీలో కూర్చునే పని కాదు.

ఎండైనా, వాన అయినా, చలి అయినా మా పని సాగాల్సిందే. మాకు నచ్చిన పని కాబట్టి ఎంత కష్టం అయినా తెలియదు. సృజనాత్మకత గల మా పనిలో బోరన్న మాటకు తావుండదు. ఎంతటి కష్టాన్ని అయినా ఓర్చుకోగల సహనం మాకు ఉంటుంది" అంటూ స్వంతడబ్బా బజాయించింది అనుపమా పరమేశ్వరన్.



కరీంనగర్‌లో వుంటాడంట" అన్నాడు.

"మీ ఓనరెక్కడ?"

"మినిస్టర్‌గార్ని తీసుకురాడానికెళ్ళేరండి"

కరాచి బేకరీ, జాకి, ఆల్మండ్, సబ్‌వే లాంటి బ్రాండెడ్ షాపుల్తో నిండిపోయిన ఆ షాపింగ్ కాంప్లెక్స్ కళకళ్ళాడిపోతోంది. దానికి ఎడంపక్కన నీలంరంగు ప్లాస్టిక్ కవర్ కప్పివున్న పాక పీకేసిన గుర్తులు కూడా లేవు. ఎవర్నన్నా రాజు గురించ డిగితే "వాడెవడు?" అంటున్నారు.

అంతా నాది అని పనిచేసిన రాజు ఎక్కడికెళ్ళిపోయాడో ఏమైపోయేడో అనుకుంటున్న నేను నా మార్నింగ్ వాక్ ఆ పక్కన చెయ్యబుద్ధవ్వక రూట్ మార్చేసేను.

లక్డికపూల్ రెడ్‌హిల్స్ అవతల మా అపార్ట్‌మెంట్‌ని అమెరికాలో ఉంటున్న సయ్యద్ అనే పెట్రోల్ బంక్ ఓనర్‌కి అమ్మేసి ఈ మంజీరా డైమండ్ టవర్స్‌లో కొందామనుకున్నాంగాని ఇవన్నీ ఆరేళ్ళపాత అపార్ట్‌మెంట్లు అని అంతా చెప్పడంతో నగరానికి చివర రింగ్‌రోడ్డులో పటాన్‌చెరు వెళ్తుంటే ముందు తగిలే కొల్లూర్ అనే ఊరు మొదట్లో కొత్తగా కట్టిన బ్లోజమ్ హైట్సొనేషిప్‌లో కొన్నాను.

ఫ్లాట్ ఇంటీరియర్ మొత్తం అయ్యేకా బండారు రమేష్ గారు పెట్టిన ముహూర్తం ప్రకారం మార్చి మూడోతేది రాత్రిఎనిమిది గంటల ఐదు నిమిషాలకి పాలు పొంగించి గృహప్రవేశం చేశాం.

"అన్నింటికీ దూరం ఇది. మేం ఆ గోపన్ పల్లిలోనే వుంటాంలే మీరిది ఆఫీసులా వాడుకోండి" అన్నారు మా ఇంట్లోవాళ్ళు.

దాంతో ఇక్కడే ఉంటా వారానికో సారి ఇంటికెళ్దామని నిర్ణయించుకుని ఇక్కడికొచ్చేసేను. రెడ్‌హిల్స్ ప్రాంతంలో వున్నప్పుడు పరిచయమైన నార్త్ కార్నర్ అనే రియల్ ఎస్టేట్‌కంపెనీ ఓనర్ ఆనంద్‌రెడ్డి చెప్పాపెట్టకుండా ఆ సాయంత్రం నా ఆఫీసులోకొచ్చి నాకు షాకిచ్చాడు.

పలకరింపులయ్యేక "శ్రీలంక వెళ్ళి చానాళ్ళుండిపోయేరుగదా ఎప్పుడొచ్చేరు...అన్నట్టు ఈప్రాంతంలో పనేంటి మీకు?" అన్నాను.

ఈదుల నాగులపల్లి వెళ్ళేదారిలో రోడ్డు పక్కనే ఐదెకరాల లేండ్‌ని విల్లాస్ కోసం మా పార్ట్‌నర్ చూసి ఫైనలైజ్ చేసేసేడు కాని నేపాల్ కేంప్ వెళ్ళడంవల్ల నేనింకా చూడలేదు అంతలో మీరిక్కడుంటున్నారని తెలిసింది" అన్నాడు ఆనంద్‌రెడ్డి.

"నన్ను కలిసేకా ఆ లేండ్ దగ్గరకెళదామనుకుంటున్నారు గదా?" అన్నాను.

"ఔనౌను" అన్నాడు ఆనంద్‌రెడ్డి.

"ఇక్కడికొచ్చిన ఈ రెండు వారాల్లో వాకింగ్‌కెళ్ళలేదు పదండి" అన్నాను.

నవ్వేసిన ఆనంద్‌రెడ్డి "అయితే ఆ తాండ దగ్గరకి నడిచెళదాం" అంటే బయల్దేరాం.

ఆ చల్లటిసాయంత్రం పూటకొల్లూరు ఊరు దాటి నడుచుకుంటూ వెళ్తున్నాం. కోకా పేటలోవున్న అపార్ట్‌మెంట్స్‌లో హౌస్ కీపింగ్‌లో పనిచెయ్యడానికి నీలంరంగు (యూనిఫారం) చీరలు కట్టుకున్న నాగులపల్లి ఆడోళ్ళు షేర్ ఆటోల్లో ఇళ్ళకి తిరిగెళ్తున్నారు.

కొల్లూరు టు పటాన్ చెరు సిటీబస్సు సగం ఖాళీగా వెళ్ళిపోతోంది.

రోడ్డుపక్కనేవున్న సమాధి మీద కూర్చుని కల్లు తాగుతున్నాడా జీను పేంటు కుర్రోడు.

లక్ష్మణ్‌రావు గారి పొలంలో వాళ్ళ అమ్మానాన్నల సమాధులముందు సిమెంట్ బెంచీలేస్తున్నారు.

ఈమధ్యే కట్టి తెల్లరంగేసిన ఎలైట్ విల్లాస్ దాటి కొంత దూరవెళ్ళామో లేదో "ఏవండోయ్... సారు గారు" కేక. అటు చూసేను.

రాజు... నేనిచ్చిన చిన్ని గళ్ళ చొక్కా తొడుక్కుని నవ్వుతా నిలబడున్నాడు.

అతన్నే చూస్తున్న నాకు ఎక్కడలేని సంబరమేసింది. ఆనందం మనసులోంచి పొంగుకొస్తోంది.

"ఏం రాజు బాగున్నావా?"

"ఆయ్"

"అక్కడ మునిగి ఇక్కడ తేలేవేంటి?"


నేనడిగిందానికి ఏ చప్పుడూ రాకుండా నవ్వేసిన రాజు "ఆ బిల్డింగులో షాపులు పెట్టేశాక మనకక్కడ పనేం వుంటది జెప్పండి" అన్నాడు.

అతన్నే చూస్తావున్న నాకు వెనకపక్కనున్న పొలం చూపిస్తా "ఈ పొలం కొబ్బరిచెట్లూ, ఆవులూ, చూస్తుంటే అచ్చం మనూళ్ళలో వున్నట్టుంది గదండీ... సిటీలో వుండే మా సారు వారానికి పదిరోజులకీ ఒసారొచ్చి ఓ పూటుండి నాకదీ ఇదీ జెప్పేసి ఎళ్ళిపోతారండి...

అక్కడకంటే ఇక్కడ పనెక్కువండి... ఆయ్ పొద్దుటే ఆవుల దగ్గర శుభ్రం చేసి, ఆటికి మేతేసి, పాలు పితకాలి, రాలిన కొబ్బరికాయలు ఏరాలి. కూరగాయలు కోసి మొక్కలకి నీరెట్టాలి చెప్పుకుంటూ పోతే ఒకటి గాదండి... ఆయ్...

అదిగో కనపడ్తుంది జూడండి పర్మనెంటు రేకుల షెడ్డు అందులోనే మా మకాం. మేము సమాధయిపోయేదాకా ఇక్కడేవుండిపోవొచ్చండి.

మొత్తానికి సారుగారు మా జీవితాలకో సెటిల్మెంటు దొరికేసిందండి... ఈ జన్మకి కదలనక్కర్లేదండి ఆయ్" అంటూ ఆ రాజు పరమానందంగా చెప్పుకుపోతుంటే-నన్ను పక్కకి పిల్చిన ఆనంద్‌రెడ్డి "మనం విల్లాస్ కట్టబోయేది ఈ అయిదెకరాల్లోనే. వచ్చే వారమే ఈ ల్యాండ్ మా కంపెనీ పేర్న రిజిస్ట్రేషన్" అనడంతో షాకైపోయిన నేను ఆ మునగపాటి కృష్ణంరాజునే చూస్తా అలాగుండిపోయేను.




ఉపఎన్నికల ఫలితాలద్వారా మాటలు చాలు, పని మొదలు పెట్టమన్న సంకేతం ప్రజలు మోడీకి అందించారు.

-చంద్రబాబు నాయుడు, ఏ.పి. సి.ఎమ్.

ప్రతీ వారం శ్రీ బాల బొమ్మ





అన్నింటా ఆనందం

• ఆనందంలో వెనకపడుతున్నాం • వ్యక్తి ఆనందమే సమాజపు ఆనందం
• చిన్నమార్పులతో ఆనందం అందుకోగలరు • ఆనందం పెంచే ఆరోగ్యం, ఆశాభావం

ఈ 2018సంవత్సరానికిసంబంధించిప్రపంచ ఆనందపు నివేదిక విడుదలైంది. 156 దేశాలలోని ప్రజల ఆనందస్థాయిని ఆ నివేదికలో వివరించి ఆ యా దేశాలకు ఆనందంపరంగా ర్యాంక్‌లు ఇచ్చారు. భారత దేశం 133వ స్థానంలో వుంది.

గత సంవత్సరం 122వ స్థానంలో వున్న భారత్ 11 స్థానాలు కిందికి జారటం ఒకింత ఆశ్చర్యమైతే మన ఇరుగుపొరుగు దేశాలన్నీ మరింత మెరుగైన ర్యాంక్‌ని పొందటం మరింత ఆశ్చర్యం.

నిరంతరం ఘర్షణ వాతావరణపు వార్తలు వచ్చే పాకిస్తాన్‌కి 75వ స్థానం దక్కింది. చైనా 86వ స్థానంలో, శ్రీలంక 1165 స్థానంలో వున్నాయి.

ఆనందపు ర్యాంకుల్లో చూసినప్పుడు అసలు ఈ ఆనందాన్ని ఎలా అంచనావేస్తారనే సందేహం రావటం సహజం. ఒక సమూహం ఆనందంగా వున్నదని అంచనావేసేందుకు సామాజిక సంబంధాలు, జీవనస్థాయి, జీవించేందుకుగల అవకాశాలు, ఎదిగేందుకు గల అవకాశాలు, నేరాలస్థాయి, ఆరోగ్యకర వాతావరణం, జీవితానికి అర్థం, జనాభాసంఖ్య వంటివన్నీ పరిగణనలోకి తీసుకుంటారు.

సమాజంలో ఆనందం వెల్లివిరియాలంటే వ్యక్తులు ఆనందంగా వుండాలి. వ్యక్తులు ఆనందంగా కీలకమైన అంశాలను ఆస్వాదిస్తుంటే ఆ సమాజం ఆనందకర సమాజమవుతుంది. ఆనందానికి మూలమైన ఆరోగ్యం, పనిచేసేచోట వాతావరణం, వ్యక్తిగత సంబంధాలు, తనలోని ఆశాభావంవంటివి మెరుగుపరుచుకోవాల్సి వుంటుంది.

ఆరోగ్యం

'ఆరోగ్యమే మహాభాగ్యం' అన్నారు పెద్దలు. అనారోగ్యాలులేని జీవితం ఆనందానికిమూలం. హాయిగా తిని అరిగించుకోగలిగిన శారీరక, మానసిక ఆరోగ్యం కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలి. ఆరోగ్యంతో వున్న వారికి వ్యతిరేక ఆలోచనలు చాలా చాలా తక్కువగా వస్తాయి. ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకునేవారికి ఒత్తిడిసమస్య వెంటాడదు.

ఒత్తిడికి దూరంగా వున్నవారిలో నాడీ సంబంధిత అంశాలన్నీ చక్కగా వుంటాయి. ఒత్తిడికి గురయితే ఆదుర్దా, తలనొప్పులు, జీర్ణక్రియలో మార్పులు, రక్తపోటు సమస్యలు వస్తాయి. ఫలితంగా జీవితంలో ఆనందం కరువవుతుంది.

అనారోగ్యానికి గురైన వ్యక్తి తాను నలుగురితో కలవలేకపోతున్నానని, నలుగురిలా హుషారుగా వుండలేకపోతున్నాను అన్న భావం పెరుగుతుంది. మనసుకు మరింత కష్టంకలిగించే పరిస్థితి అది. దీని వలన ఆనందం తగ్గుతుంది. ఆరోగ్యం దిగజారుతుంటే ఆనందం మరింత వెనక్కి వెళుతుంది.

జీవితంలో పెరిగేబాధ మరిన్ని కొత్తసమస్యలను తెచ్చిపెడుతుంది. ఆరోగ్యం గురించి శ్రద్ధ తీసుకున్న సమాజంలోనే ఆనందం వుంటుంది.

పనిలో

బతకటానికే కాదు తన మానసిక తృప్తికోసం కూడా ప్రతి ఒక్కరూ ఏదో ఒక పని చేయక తప్పదు. తాము చేస్తున్న ఉద్యోగం, వ్యాపారం లేదా ఇతర వృత్తి ఏదైనా అందులో ఆనందాన్ని పొందగలగాలి.

ఎందుకు చేస్తున్నామా! ఈ పని అనేభావం మనసులో వుంటే ఆ పనిలో ఉత్సాహం, తృప్తి రెండూ వుండవు. పనిపట్ల శ్రద్ధేకాదు వ్యక్తిగత, కుటుంబాల పట్ల వుండే బాధ్యతవిషయంలో ఎవరైతే సమతుల్యత పాటిస్తారో వారిలో ఆనందం పెరుగుతుంది. కొత్త రకం ఉద్యోగాలు కోరుకోవటంలో తప్పులేదు.

కొత్త బాధ్యతలు చేపట్టాలని, ఉద్యోగంలో ఎదగాలన్న ఆశ సరైనదే. అయితే ఆ ఎదుగుదల వ్యక్తిగత ఆనందానికి అడ్డంకిగా, ఆనందాన్ని హరించేదిగా వుండకూడదు. పని అనేది ప్రశాంతంగా చెయ్యగలగాలి.

ఆఫీసులో వుండగా ఇంటిగురించి, ఇంటి దగ్గర నిర్వహించలేకపోతున్న బాధ్యతల గురించి ఆలోచించే వారు, ఇంటి దగ్గరుండి కూడా ఆఫీసు పనుల కోసమే బతికేవారు ఆనందంగా వుండలేరు, ఇతరులకు ఆనందం కలిగించలేరు.

చేస్తున్నపనిలో అసంతృప్తి వుంటే గనుక ఇట్టే అలసిపోతారు. దానిని చక్కదిద్దుకోకపోతే అది క్రమంగా పనిలో సమర్థతను తగ్గిస్తుంది. తాను ఆనందంగా పనిచేయలేని వాతావరణంలోకి వెళ్ళటమే కాక ఇతరులకు అసంతృప్తి సెగను అందిస్తారు.

ఇది క్రమంగా పనిచేసేచోట కొత్త సమస్యలకు దారితీస్తుంది. నేటి కాలంలో ఉద్యోగంలోని బాధ్యతల మీదకన్నా ఆ ఉద్యోగంలో ఇచ్చే జీతంమీద ఎక్కువ దృష్టిపెడుతున్నారు. ఫలితంగా మానసిక తృప్తి లేని ఉద్యోగాలు చేస్తున్నారు.అధిక జీతం ఇస్తున్నాం కదా అని సంస్థలుగొడ్డుచాకిరి చేయించుకుంటున్నారు.

ఆపని ఒత్తిడి వారిని 40ఏళ్ళకే ఎందుకు పనికిరాని వారిగా తయారుచేస్తున్నాయి. పనిలో, పనిచేసేచోట తృప్తికర వాతావరణం మెదడుకు అందించాలి. సమస్యలమీద మెదడు కేంద్రీకరించేలా, విశ్లేషణ మెరుగ్గా వుండేలా చూసుకోవాలి.

ఆ విధంగా ప్రతి అంశంపట్ల పాజిటివ్ దృక్పథం అలవరచుకోవాలి.

అప్పుడే వ్యక్తిగత ఆనందం పెరిగి, ఆఫీసులో ఆనందకర వాతావరణాన్ని తయారుచేస్తుంది.

వ్యక్తిగత సంబంధాలు

ఆనందం అందించటంలో స్నేహితులు, బంధువులు, జీవిత భాగస్వాముల పాత్ర వుంటుంది. వారితో వుండే వ్యక్తిగత సంబంధాలు కీలకమవుతాయి. మనసువిప్పి మాట్లాడుకోగలిగిన ఆప్తులున్నవారికి ఆనందం సమస్యకాదు. అవసర సమయంలో మాటసాయం చేసేవారు, సమస్యలకు పరిష్కారమార్గం చూపించేవారు కొందరైనా కలిగివుండటమే ఆనందం.

అరమరికలులేకుండా జీవితం పంచుకునే భాగస్వామిద్వారావచ్చే ఆనందం అంతాఇంతా కాదు.

వ్యక్తిగత సంబంధాలు నిర్మించుకోవటంలో విఫలులైనవారి జీవితం ఇబ్బందులకు గురవుతుంది.

మనసులోని భావాలను ఎటువంటి సంకోచాలూ లేకుండా పంచుకునే నలుగురు స్నేహితులు, ఆత్మీయులను సంపాదించుకోలేనివారు ఆనందంగా జీవించలేరు. జీవితానికి తోడు అవసరం. ఆ తోడు సరైన మానసికబంధం పడిన తోడు అయినప్పుడు ఆనందం ఉన్నతస్థాయిలో వుంటుంది.

మానసికబంధం బలంగా నిర్మించుకున్నజంటలు ఒకరికొకరుగా ఆనందంగా బతుకుతారు. జీవితభాగస్వామి 'ఉత్తమస్నేహితుడు' అయితే అంతకన్నా ఆనందం మరొకటి వుండదు.

ఏ విషయం అయినా పంచుకోగలిగిన స్థాయిలో దాంపత్యబంధం వుండాలి. ఆనందమైనా, విషాదమైనా వెంటనే చెప్పుకోగలిగిన ఆత్మీయులను పొందిన జీవితం ధన్యం.

ఆనందం పెరిగేది ఎలా!

ఎవరో వచ్చి మిమ్మల్ని ఆనందంగా వుంచుతారని ఎదురుచూడకండి. ఎవరి ఆనందం వారు వెతుక్కోవాల్సిందే. ఎదురయ్యే సంఘటనలన్నీ మన చేతిలో వుండవు. కాని ఆ సంఘటనలకు స్పందించే నేర్పు, ఓర్పు మన చేతిలోనే వుంటుంది.

ప్రతి సంఘటన, అనుభవంనుండి ఏదో ఒక మంచిని నేర్చుకునే మనస్తత్వం ఆనందాన్నిస్తుంది. మనసును ఎవరైతే కాలానికి అనుగుణంగా మార్చుకుంటారో, దృక్పథాన్ని కొత్త వాతావరణానికి అనుకూలంగా మలచుకుంటారో వారే ఆనందంగా జీవిస్తారు.



Courtesy : WOMAN'S ERA

మీకు ఎదురైన అనుభవం భయంకరమైనదా! పరిష్కారం లేనంత జటిలమైనదా! కొత్త మార్గం కనుక్కోలేమా! అనే ప్రశ్నలు వేసుకోవాలి.

భయం, ఆదుర్దా అనేవి వదిలించుకోవాలి. ప్రతి అనుభవంనుండి మంచిని స్వీకరించి చెడు వదిలేయగలగాలి. అలా చెయ్యగలిగినవారే మధ్యవయసులో ఇబ్బందులు ఎదుర్కోరు.

- కొత్తను స్వాగతించాలి. ఎప్పటికప్పుడు ఏదో ఒక కొత్త అంశం నేర్చుకోవటం, కొత్త హాబీని అలవాటు చేసుకోవటం ఎవరు చేస్తారో వారు ఆనందంగా జీవించగలుగుతారు.
- జీవితభాగస్వామితో మెరుగైన సంబంధాలు వుండాలి. సంసారపు ప్రారంభంలో ఒకరికొకరుగా బతికినవారు క్రమంగా ఎడం పెంచుకుంటారు. ఇది ఆనందాన్ని పక్కకు నెడుతుంది.

  అవతలివారి ప్రవర్తన భిన్నంగా వున్నా మీవైపునుండి పాజిటివ్ స్పందన ప్రదర్శిస్తే సంసార జీవితంలో ఆనందం నిలిచివుంటుంది.
- కృతజ్ఞత తెలియచెపితే ఆనందం పెరుగుతుందంటే చాలామంది నమ్మరేమో! కాని అది నిజం. మీరు అందుకున్న ప్రతి చిన్న లాభానికి,మేలుకు కృతజ్ఞులుగా వుండండి. విశ్వాసం, విశ్వసనీయత రెండూ ఆనందం పెంచేవే.
- సహాయం అందించటం ఒక గొప్ప ఆనందం. నీకున్నదానిని నలుగురితో పంచుకో. పంచుకుంటే ఏదీ తరగదు. మానసిక అంశాలు అస్సలు తరగవు. ప్రేమను సేవలో చూపండి. సమస్యలు పరిష్కరించటంలో చూపండి. అడిగితే సహాయం చెయ్యటం కాదు, స్వచ్ఛందంగా సహాయం అందించటంలోనే అసలైన ఆనందం వుంటుంది.

వయసునుబట్టి

ఆనందం అనేది బాల్యంలో చాలా ఎక్కువ వుంటుంది. అందుకే బాల్యం బాగా గుర్తుకు వస్తుంది. హైస్కూల్ జీవితంవరకు అంతా ఆనందమే. అరమరికలు లేని స్నేహితులు, స్వార్థంలేని ఉపాధ్యాయులు, సహాయం అందించే ఇరుగుపొరుగులు. ఫిర్యాదులు చెయ్యటానికి ఏమీ వుండదు. అందుకే ఆ వయసులో ఆనందం అధికం.

అరవై ఏళ్ళ వయసు తర్వాత తిరిగి ఆనందం వస్తుంది. పోటీతత్వం తగ్గుతుంది. జీవితం అంటే అవగాహన పెరుగుతుంది. తాము చేసిన తప్పులు గుర్తుకువస్తాయి. ఇది చక్కదిద్దుకునే వయసు. పలు అనుభవాలవల్ల కష్టసుఖాలు రెండింటినీ ఒకేలా స్వీకరించగలిగిన స్థితిలో వుంటారు.

అసలు సమస్య అంతా మధ్యవయసులోనే. పాతికేళ్ళనుండి అరవై ఏళ్ళ మధ్యకాలంలో ఆనందంగా గడిపేవారు బహుతక్కువ.

అన్నింటికీ పోటీపడే వయసు అది. స్వార్థంఅధికం. అన్నీ తనకేదక్కాలనే మొండితనం.సహాయం అందుకోక, అందించక అంతా తాను స్వయంగా సాధించగలననే ఆత్మవిశ్వాసం వుంటుంది ఈ వయసులో. కోపం,కసి,అసూయలు ఆ వయసులోఎక్కువే. సాటివారివిజయాలను ఆస్వాదించలేరు. గర్వం అధికం.

భారతదేశం ఆనందపు అంశంలో ర్యాంక్ కోల్పోవటానికి మధ్యవయసు జనాభా అధికంగా వుండటమేనేమో! ఆ వయసువారు ఆనందాన్ని కొత్త కోణంలో చూసి, ఆనందంపెంచుకుంటే బహుశావచ్చే సంవత్సరానికి భారతదేశం ఆనందపు ర్యాంక్‌లో అద్భుతంగా దూసుకుపోగలుగుతాం.

టి.రమేష్

సీరియల్

అవినాష్ తన తలమీద తగిలినదెబ్బకి స్పృహ తప్పుతుందనుకున్నాడు కానీ అలా జరగలేదు.

కానీ అది కలిగించిన షాక్‌లో కొన్నిక్షణాలు ఏమరుపాటుగా ఉన్నాడేమో, దాన్నే అవకాశంగా తీసుకుని అతన్ని బంధించారు సుజో, అతని పక్కన ఉన్నవారు.

అతని చేతుల్ని వెనక్కి విరిచి కట్టేలోపు అప్పటికే జేబులో ఉన్న చేతితో వాకీటాకీని ఆన్‌చేశాడు అవినాష్.

లక్ష్మి కనుక తన సిగ్నల్ అందుకోగలిగితే సహాయం చేసే అవకాశం ఉంటుంది. లేకపోతే దేవుని మీద భారం వేయాల్సిందే.

వేట



"నా కొడుకు తనకు నాగరిక ప్రపంచంలో ప్రాణహాని ఉందని ఇక్కడకు వచ్చాడు. వాడిని వెతుక్కుంటూ ఎవరైనా ఇంతదూరం రాగలరని నేనూ అనుకోలేదు. అయినా జాగ్రత్తగా ఉండటం మంచిదయింది..." అన్నాడు సుజో తన పక్కన ఉన్న వారితో. నిద్రనుండి లేచి నిలబడిన లిమ్బెన్ అవినాష్ వైపు భయంగా చూస్తున్నాడు. అవినాష్‌ని ఆరుబయట ప్రదేశంలోకి తీసుకువచ్చారు.

"ఇంతకీ నా కొడుకును ఎందుకు చంపుదామనుకున్నావ్?" అడిగాడు సుజో.

"నేను నీ కొడుకును చంపటానికి రాలేదు. మరణశిక్ష అమలుచేయటానికి వచ్చాను. రెంటికీ చాలా తేడా ఉంది..." అన్నాడు అవినాష్.

"మరణశిక్షా? ఎవరు వేశారు?"

"భారత ప్రభుత్వం"

"అంత కానిపని నా కొడుకు ఏం చేశాడు?"

"కొన్ని లక్షలమందిని చంపే ప్రయత్నం చేశాడు. ఢిల్లీనడిబొడ్డున న్యూక్లియర్ బాంబ్ పేలితే ఏం జరిగేదో తలచుకుంటే... ఆమెకు ఈ సమస్య తీవ్రత అర్థమయింది.

అవినాష్ ఎందుకు వరుసగా కొంతమందిని చంపుతున్నాడో ఆమెకు ఒక అవగాహన వచ్చింది.

అవినాష్ చెప్తున్న మాటలు నమ్మలేనట్లు సుజో కొడుకువైపుచూశాడు. లిమ్బెన్ తలవంచుకున్నాడు.

"అర్థమయిందా, నీ కొడుకు ఎంత పాపం చెయ్యబోయాడో?" రెట్టించాడు అవినాష్.

"ఏది ఏమయినా కన్నకొడుకు ప్రాణాలు కళ్ళ

పుట్టగంటి గోపీకృష్ణ



ముందు పోతుంటే చూస్తూ ఊరుకోలేను"

"ఊరుకోక ఏం చేస్తావ్?"

"నిన్ను చంపుతాను"

"నా బదులు మరొకరు వస్తారు. ఈసారి నీ కొడుకుతోపాటు నీ మనుషుల్నీ, నీ గూడాన్నీ నామ రూపాల్లేకుండా చేస్తారు"

"ఎప్పుడో జరగబోయేదానికి నేను భయపడను" బెదరకుండా అన్నాడు సుజో. లిమ్బ్రెన్‌లో ఉన్న ధైర్యమంతా జావకారిపోయింది. తను మరణానికి ఎంత చేరువలోకి వెళ్ళి వచ్చాడో తలచుకుంటే అతని వెన్నులో నుండి వణుకుపుడుతుంది.

"వీడిని తల్లకిందులుగా వేలాడదీసి కింద మంట పెట్టండి. నా కొడుకును చంపబోయినవాడికి నరకం అంటే ఎలా ఉంటుందో చూపించి కానీ చంపను" అన్నాడు సుజో.

"నువ్వు నాకింద మంటపెట్టేలోపు నీ గూడెం మొత్తం కాలి బూడిదవుతుంది. నేను ఒంటరిగా వచ్చాననుకుంటున్నావేమో. నాతోపాటు ఇంకాచాలామంది ఉన్నారు. వారి దగ్గర ఉన్న పెట్రోల్ బాంబులు వేస్తే నీ గూడెం క్షణాల్లో భగ్గుమంటుంది" అంటు బెదిరించాడు అవినాష్.

అప్పటిదాకా జరుగుతున్న సంభాషణ వింటున్న లక్ష్మికి అవినాష్‌ని ఎలా కాపాడాలో అర్థం కాలేదు. ఇప్పుడు అతని మాటల్లో దొర్లిన పెట్రోల్‌బాంబులన్న మాట ఏదో సంకేతంలా వినిపించింది.

ఆ మాటద్వారా అతను తనకు ఏదో చెప్పాలనుకుంటున్నాడు అనుకుని ఆమె అతని బ్యాగ్ దగ్గరకు నడిచి దాన్ని తెరచి చూసింది.

అందులో మరో స్పేర్ రివాల్వర్ ఉంది. దాన్ని తీసుకుని తన ప్యాంట్ జేబులో పెట్టుకుని మిగిలిన బ్యాగ్ వెతికింది. ఒక పక్క అరలో ప్లాస్టిక్ కేసులో చాక్‌లెట్ డబ్బాలాంటిది కనిపించింది.

గుండ్రటి పెద్ద సైజు గోలీల్లాంటి నిగనిగలాడుతున్న ఆరు మెటల్ బాల్స్ కనిపించాయి.

అందులో ఒకదాన్ని పైకి తీసి దానిమీద ఉన్న అక్షరాలనుచూసింది. హైలీ ఎక్స్‌ప్లోజివ్ అని రాసివున్న అక్షరాలు ఆ మెటల్ బాల్ మీద కనిపించాయి.

కానీ అవి పేలాలంటే ఏదో మెకానిజమ్ ఉండాలి. అదేంటో ఆమెకి ముందు తెలియలేదు. మరింత పరిశీలనగా చూస్తే, ఆ బాల్‌కి ఒక పక్క చిన్న డిజిటల్ టైమర్ ఉంది.

దాంట్లో 30సెకన్లు, 60 సెకన్లు, 90 సెకన్లు... ఇలా టైమ్ సెట్‌చేసుకుని విసి రేస్తే అంతసమయం గడిచాక అది పేలుతుంది.

అవినాష్ అన్యాపదేశంగా తనకు సూచిస్తోంది ఇదేనా? ఇంతలో కొండకింద గూడెంలో సుజో ఒక నిర్ణయానికి వచ్చాడు. ఎప్పుడో ఏదో జరుగుతుందని ఇప్పుడు అవినాష్‌ని వదిలిపెట్టకూడదని నిర్ణయించుకున్నాడు. తన ఒరిజినల్ నిర్ణయాన్నే అమలు చేయమని మరొకసారి చెప్పాడు.

"పైన ఉన్నవాళ్ళు చూస్తూ ఊరుకోరు. నీ గూడెం భగ్గుమంటుంది..." అంటున్న అవినాష్‌ని పట్టించుకోకుండా తమ ప్రయత్నాల్లోపడ్డారు మిగిలినవాళ్ళు.

అవినాష్ అందించిన క్లూ అందుకుని, ఒక మెటల్ బాల్ తీసుకుని 30 సెకన్లకు సెట్ చేసి, దానిని ఒక ఇంటి మీద పడేలా కిందకు విసిరింది లక్ష్మి.

అవినాష్ చేతులతోపాటు కాళ్ళు కూడా కట్టెయ్యటానికి ప్రయత్నించబోతున్నవారు అదిరిపడేలా పెద్ద శబ్దంతో ఒక పక్కన ఉన్న ఇల్లు పేలిపోయింది.

పేలుడుతోపాటు పెద్దఎత్తున లేచినమంటలు చుట్టుపక్కల ఉన్న ఇళ్ళను కూడా కబళించాలని ఎగసిపడుతుంటే వాటిని ఆర్పటానికి అటు పరుగెత్తారు వారు. సుజో చూపు కొన్ని క్షణాలు అవినాష్ మీద నుండి పేలుడు మీదకి మరలింది.

జరిగిన కథ 13

లక్ష్మిని 'కిఫిరే'అనే ఊరికి తనతోపాటు బలవంతంగా ఓ ట్యాక్సీలో తీసుకువెళ్తాడు అవినాష్. నేను నువ్వనుకుంటున్నట్లు హంతకుడ్ని కానని చెబుతాడు.

కిఫిరే ఊరు బయట పర్వతాగ్రం మీదకు చేరుకుని అక్కడినుండి ఓ గ్లైడర్‌ద్వారా ఓ లోయప్రాంతానికి చేరతారు అవినాష్ లక్ష్మి.

లిమ్బ్రెన్ నివసించే గూడెం అది. అతనితో పాటు సుమిత్‌బోస్ అక్కడే వుంటాడు.

లిమ్బ్రెన్‌కు తెలియకుండా ఆ గూడెంలోని యువతుల ఫోటోలు తీస్తాడు సుమిత్‌బోస్.

ఆ యువతులు పారిపోతారు. ఫోటోలు తీసిన విషయం తెలిసి లిమ్బ్రెన్ మందలిస్తాడు సుమిత్‌బోస్‌ని. కెమోతో ఒంటరిపోరుకు సిద్ధపడతాడు సుమిత్‌బోస్. జలపాతం దగ్గరలో వున్న ఓ పెద్ద చెట్టుతొర్రలో దాక్కుంటాడు సుమిత్‌బోస్. కెమో అతని ఆచూకీని పట్టుకోలేకపోతాడు. దాంతో సుమిత్‌బోస్, కెమోను తన దగ్గరున్న పిస్టల్‌తో కాల్చేస్తాడు.

అక్కడికి చేరుకున్న అవినాష్ సుమిత్‌బోస్‌ను మట్టుపెడతాడు. లిమ్బ్రెన్‌ని కూడా చంపాలనుకుంటాడు గానీ ఎవరో తలమీద దొంగదెబ్బ తీసేసరికి స్పృహకోల్పోతాడు అవినాష్. ఆ తర్వాత జరగబోయేది చదవండి.

చక్కగా అర్థమవుతా

తన గురించి తాను వివరంగా వర్ణించుకుంటున్నది రకుల్‌ప్రీత్‌సింగ్.

తాను మ్యాథ్స్ పజిల్ మాదిరి వుండనని, చక్కగా అర్థమయ్యే చిన్నపిల్లల పుస్తకం మాదిరి వుంటానని చెప్పుకుంటున్నది.

"మనస్సులో కుళ్ళు పెట్టుకుని ఎదుటివారిని హింసించే తత్వం నాకు లేదు.

ఎప్పుడూ నవ్వుతూ, అందరినీ నవ్విస్తూ హాయిగా వుంటాను. సూటీపోటీ మాటలు నాకు నచ్చవు. ఏ విషయాన్ని అయినా ఉన్నది ఉన్నట్లు చెప్పేయడం నాకు అలవాటు" అంటూ గొప్పలుపోయింది.



అవకాశాన్ని అందిపుచ్చుకుంటూ చటుక్కున లేచాడు అవినాష్.

అప్పటికి అరగంట నుండి చేస్తున్న ప్రయత్నం ఫలించి అప్పుడే అతని చేతులు కూడా బంధనాల నుండి విడుదల అయ్యాయి.

ఇంతలో మరో మూలనుండి మరో పెద్ద విస్ఫోటనం జరిగింది.

వరుసగా జరుగుతున్న సంఘటనల నుండి సుజో, లిమ్చెన్ తేరుకునే లోపు అక్కడ గ్రామ దేవతకి అలంకారంగా ఉంచిన పెద్ద కత్తిని చేతిలోకి తీసుకున్నాడు అవినాష్.

తేరుకుని అక్కడనుండి తప్పుకోబోతున్న లిమ్చెన్‌కి ఆ అవకాశం ఇవ్వకుండా ఒక్క వేటు వేశాడు. బరువయిన ఆ కత్తి వేటుకు లిమ్చెన్ తల శరీరం నుండి వేరయి దొర్లుకుంటూ దూరంగా వెళ్ళిపోయింది.

క్షణాల్లో కళ్ళముందు జరిగిపోయిన ఘటనను నమ్మలేనట్లు చూస్తుండిపోయాడు సుజో.

మెరుపువేగంతో అక్కడ నుండి గూడెం వెనుక ఉన్న పర్వతంవైపు పరుగెత్తాడు అవినాష్. తేరుకున్న సుజో, "అతన్ని ఆపండి..." అని పెద్దగా అరిచాడు. కొడుకు మరణానికి విచారం వెలి బుచ్చటానికి ముందు-

అందుకు కారణం అయిన వాడిప్రాణాలు తీయాలని దృఢంగా నిశ్చయించుకున్నాడతను.

అతని కేకకు స్పందించిన కొంతమంది అవినాష్‌ని వెంబడించబోయారు. అవినాష్‌కి, వారికీ మధ్య పడేలా మరో మెటల్ బాల్ విసిరింది లక్ష్మి.

అది పేలడంతో వారికీ, అవినాష్‌కీ మధ్య ఎడం పెరిగింది. ఈలోపు పైనుండి తాడు కిందకు వేసింది లక్ష్మి. పరుగుతీస్తూ వస్తూనే పర్వతం మీద నుండి కిందకు వచ్చేటప్పటికి అతను దాదాపు పాతిక అడుగులు పైకి పాకాడు.

తాడుమీద అంత పైకి వెళ్ళిపోయిన అతన్ని పట్టుకోవటం అసాధ్యం అని నిర్ధారించుకున్నవారు తాడుకు మంటపెట్టటానికి ప్రయత్నించసాగారు.

ఇద్దరు ముగ్గురు పరుగెత్తుతూ కాగడా తేవటానికి వెనక్కి వెళ్ళారు. వాళ్ళు తిరిగివచ్చేలోపు మిగిలిన మెటల్‌బాల్స్ వారికి అవరోధాలు కలిగించేలా విసిరి... అవినాష్ పైకి వచ్చేలోపు హ్యాంగ్‌గ్లైడర్ రెడీ చేసింది.

ఒక్క మనిషిని పట్టుకోలేకపోయామన్న వైఫల్యం అవమానంగా మారింది సుజో అనుచరులకి.

కొంతమంది కొండమీదకి పరుగెత్తితే మరికొంతమంది తమ ఆయుధాలు తీసుకుని బయలుదేరారు.

నేను ప్రతిపాదించిన ఫెడరల్ ఫ్రంట్ ఫార్ములా ఉపఎన్నికల్లో విజయవంతమైంది.

-మమతా బెనర్జీ, బెంగాల్ సి.ఎమ్.



మోరుంగ్ దగ్గర ఉంచిన పెద్దపెద్ద డ్రమ్స్ ఒక్కసారిగా యుద్ధభేరీల్లా మోగుతున్నాయి.

క్షణాల్లో అందరి చేతుల్లో విల్లంబులు ప్రత్యక్షమయ్యాయి.

తూర్పుదిక్కును చీల్చుకుంటూ సూర్యుడు పైకి వస్తున్నాడు.

పర్వతం పైకి అవినాష్ చేరేటప్పటికి గ్లైడర్ స్టార్ట్ చేసి రెడీగా ఉంచింది లక్ష్మి.

ఇద్దరూ దాని మీదకు ఎక్కి కొండవాలుల్లోకి వేగంగా పోనిచ్చారు. కొన్నిక్షణాల్లో గ్లైడర్ క్షేమంగా గాల్లోకి లేచి దూరంగా వెళ్ళిపోయేదే...

కానీ, సుజో చేతిలోని విల్లునుండి బయటపడిన నిప్పు వెలిగించినబాణం గ్లైడర్ ఉన్న ప్లాస్టిక్ షీట్‌కి తగిలింది. భగ్గుమని గ్లైడర్‌కు మంటలు అంటుకున్నాయి. గాల్లోకి లేచినట్లే లేచిన గ్లైడర్ కిందకు పడిపోవటం మొదలుపెట్టింది.

తన నైపుణ్యం అంతా ఉపయోగించి దాన్ని పక్కన కనిపిస్తున్న నదివైపు తిప్పాడు అవినాష్.

గాల్లో నుండి సరాసరి నీటిలో పడింది గ్లైడర్. ఒడ్డున ఉన్న ఒక తెప్ప అవినాష్ కంట్లో పడింది. ఒడ్డుకు ఈది దాన్ని అందుకున్నాడు.

లక్ష్మి కూడా ఈదుతూ వచ్చింది. ఇద్దరూ దాన్ని నీటిలోకి లాగి ఎక్కి కూర్చున్నారు. దానికి ఉన్న తెడ్లు ఆడించసాగాడు అవినాష్.

నీటి ప్రవాహానికి అనుగుణంగా వెళ్తున్నారు కాబట్టి వేగంగా రెస్పాండ్ అయింది తెప్ప. అయితే అంతేవేగంగా తమకు అందివచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు సుజో మనుషులు. దాదాపు తప్పించుకున్నాడనుకున్న అవినాష్ తిరిగి అందుబాటులో కనపడటంతో ఎలా అయినా పట్టుకోవాలన్న పట్టుదలతో అంతా నది వైపుకు పరుగెత్తారు.

కొంతమంది మరికొన్ని తెప్పలమీద, కొంతమంది నదిఒడ్డున పరుగెత్తుతూ ప్రవాహంలో వెళ్తున్న తెప్పనువెంబడిస్తూ బాణాల్తో దాడి చేస్తున్నారు.

అవినాష్ నదీ తీరానికి దూరంగా తెప్పను నడుపుతున్నాడు. అయినా కొన్ని బాణాలు తెప్ప దగ్గరకు వచ్చి పడుతున్నాయి.

"వీళ్ళుఇంకాఎంత దూరం మనల్ని వెంబడిస్తారు?" ఒక తెడ్డు తనూ తీసుకుంటూ అంది లక్ష్మి.

"పాజిటివ్ ఆటిట్యూడ్ ఎలాఉండాలో వీళ్ళనిచూసి నేర్చుకోవచ్చు" చెప్పాడు అవినాష్.

వెనుకనుండివస్తున్న తెప్పలు ఎక్కువ మంది తెడ్లు వేస్తుండటంతో త్వరత్వరగా దగ్గరకు వస్తున్నాయి.

తీరం ఒడ్డున పరుగెత్తుతున్నవాళ్ళు అలసిపోయి వెనుకబడ్డారు.

ఇంతలో నది ఒక మలుపు తీసుకుంది. తెప్ప కనుక ఆ మలుపు తీసుకుంటే వెనుక నుండి వస్తున్న వారి బాణాల దెబ్బకు గురి కుదరదు.

అందుకే తను కూడా తెడ్డువేయటంలో వేగం పెంచాడు అవినాష్.

ఇద్దరికీ ఏ గాయం తగలకుండా తెప్ప మలుపు తిరిగింది. అయితే అక్కడ మరో అబ్బురపరిచేదృశ్యం ఎదురయింది. తీరం వెంబడి వందలాది మంది ఆదివాసీలు వీరికోసం ఎదురుచూస్తూ విల్లులు ఎక్కుపెట్టి రెడీగా ఉన్నారు.

అక్కడ తీరానికి తెప్ప ఎక్కువ దూరంకూడాలేదు. వారు బాణాలు వదలటం అంటూ జరిగితే వీరిద్దరి శరీరాలు తూట్లుపడటం ఖాయం.

“వీళ్ళెవరు?”

“సుమిత్ బోస్‌మీద పంతం పట్టి పోరాటానికి పట్టుపట్టిన వ్యక్తికి చెందిన తెగల వాళ్ళయి ఉంటారు. వాళ్ళ మనిషి చనిపోయాడు కదా... ఆ బాధతో ఇక్కడ పోగయి ఉంటారు”

“అతన్ని కూడా చంపేశావా?”

“ఆ పని నేను చెయ్యలేదు. సుమిత్ బోస్ చేశాడు”

“ఇంతకీ సుమిత్ బోస్ ఏమయ్యాడు?”

మాట్లాడలేదు అవినాష్.

“అంటే చంపేశావన్న మాట” అంది లక్ష్మి.

“పని పూర్తి చేసుకున్నాను. లేకపోతే మనం ఇలా ఇప్పుడు వెనక్కి వెళ్ళే వాళ్ళం కాదుగా...” అంటూ చాలా సింపుల్‌గా చెప్పాడు అవినాష్.

“అయితే ఇప్పుడు అనుభవించు. మన జీవితాలు ఈ విధంగా ఇక్కడ అంత మవబోతున్నాయన్న మాట” అంది లక్ష్మి.

సమాధానం చెప్పలేదు అవినాష్.

విల్లులు ఎక్కు పెట్టినవారివైపు చూడకుండా సూటిగా నదినే చూస్తున్నాడు అవినాష్.

అతని మనసు మాత్రం మొదటిబాణం శరీరంలో ఎక్కడ దిగుతుందో అంచనా వేసుకుంటోంది. తనకే మయినా పరవాలేదు.

అనవసరంగా లక్ష్మిని ఇందులోకి ఈడ్చాడు. ఇప్పుడు తనవలన ఆమె కూడా చనిపోబోతుం దనుకుంటే బాధగా ఉంది. తెప్ప తనదారిన తను ముందుకు వెళ్తూనే ఉంది. అనుకున్నట్లు బాణాలేవీ వీరి దగ్గరకు రాలేదు.

అసలు ఆటవికులు ఎక్కుపెట్టినబాణాలు వదలనే లేదు. ఇంతలో వీరిని వెంబడిస్తున్న తెప్పలు నది మలుపు తిరిగాయి.

అంతే, ఒడ్డున ఉన్న తెగవారు నదిలో తెప్పల్లో వస్తున్నవారిమీద బాణాలతో దాడికి దిగారు. ఇరువర్గాలు పెడుతున్న కేకలతో దిక్కులు ప్రతిధ్వనిస్తున్నాయి.

“అదేమిటి? మధ్యలో వాళ్ళు ఎందుకు కొట్టుకుంటున్నారు?” అంది లక్ష్మి.

“తమ మనిషిని చంపింది సుజో మనుషు లని వాళ్ళమీద దాడి చేస్తున్నారు”

“అనవసరంగా రెండు తెగల మధ్య తగాదా పెట్టావ్” అంది లక్ష్మి.

కొడుకు గుణం పెళ్ళి తర్వాత, కూతురు గుణం వయసులో, భర్త గుణం భార్య అనారోగ్యంలో, భార్యగుణం భర్త పేదరికంలో, స్నేహితుని గుణం కష్టంలో ఉన్నప్పుడు, అన్నదమ్ముల గుణం జగడంలో, పిల్లల గుణం వృద్ధాప్యంలో తెలుస్తుంది.

“ఆ సుమిత్ బోస్‌ని నేను ఇక్కడికి రమ్మన్నానా? వాళ్ళతో పంతానికి పొమ్మన్నానా?”

ఇంతలో నదిలో ఉరవడి బాగా పెరిగింది. తెడ్లు వెయ్యకుండానే తెప్ప వేగంగా ముందుకువెళ్తోంది.

“ఒక్కసారిగా ఇంతవేగం పెరిగిందేమిటి?”

అవినాష్‌కి అసలు విషయం అర్థమయ్యేటప్పటికి బాగా ఆలస్యం అయింది.

“ఎదురుగా జలపాతం ఉంది... మన తెప్ప కిందకు పడబోతోంది” చెప్పాడు అవినాష్.

“కిందకు దూకేద్దాం”

“వద్దు. అది మరింత ప్రమాదం. ప్రవాహానికి, మనం ఒడ్డుకు చేరుకోలేనంత వేగం ఉంది”

ఇద్దరు తెప్పల అంచులు గట్టిగా పట్టుకుని కళ్ళు మూసుకుని కూర్చున్నారు.

జెయింట్‌వీల్ మీద నుండి కింద పడుతున్నపుడు కలిగే అనుభూతి కలిగింది లక్ష్మికి.

దానితో పాటు టన్నులకొద్దీ నీరు మీదపడటంతో ఉక్కిరిబిక్కిరి అయింది. ఆ తరువాత ఏం జరిగిందో ఆమెకు అర్థంకాలేదు. కిందపడిన ఆమె ఒక్కసారిగా నీటి అడుక్కు వెళ్ళిపోయింది. కాళ్ళు విదిలించు కోవటంతో కాసేపటికి నీటిపైకి తేలింది.

ఆపుకున్న ఊపిరి తీసుకునేలోపే ప్రవాహంలో మరోసారి మునిగిపోయింది. ఆమె శక్తి ఆ నీటివేగాన్ని ఎదుర్కోవటానికి సరిపోవటం లేదు.

ఇంతలో అవినాష్ ఆమె భుజాలు పట్టుకుని పైకి లాగాడు. ఆ తరువాత ఆమె భుజాల కింద చేతులు వేసి ఒడ్డుకు చేర్చటం మొదలుపెట్టాడు.

దాదాపు పదినిమిషాల గడిచేవరకు ఇద్దరికీ నోట మాటరాలేదు. అంతగా అలసిపోయారు.

కాసేపటి తరువాత లేచి కూర్చుంది లక్ష్మి. “ఇలాగే కూర్చుని విశ్రాంతి తీసుకుంటుంటే ఇక్కడకు ఆ రెండు తెగలవాళ్ళూ కలిసివస్తారేమో” అంది.

తనూ లేచి “పద వెళ్దాం” అన్నాడు అవినాష్.

“ఎలా వెళ్ళాలి? ఎటు వెళ్ళాలి?...”

-అని ఇంకా ఏదో అనబోతున్న ఆమెను ఆపి దూరంగా కొండమీద మెలికలు తిరుగుతూ వెళ్తున్న ఘాట్ రోడ్డు చూపించాడు.

దీమాపూర్ ఊరిబయట ఆగిన లారీ నుండి లక్ష్మి, అవినాష్ దిగారు.

ఘాట్‌రోడ్డు మీద దాదాపు గంట ఎదురు చూశాక ఈ లారీ కనిపించింది. ఆ డ్రైవర్‌కు ఊహించనంత



కనిపించని కష్టాలు

తామెంతగా ఫిట్‌నెస్‌కోసం కష్టపడినా దాన్ని గుర్తించరనేది రాశీఖన్నాఅభిప్రాయం. కథనాయకులు కండలు పెంచినా, కరిగించినా గుర్తిస్తారు కాని, హీరోయిన్లనుమాత్రం అంతగా గుర్తించరంటున్నది.

“మేము ప్రతి సినిమాలోనూ ఒకే మాదిరి కనిపిస్తుంటాం. రూపం విషయంలోఅంతగా మార్పులుండవు. కాని, తెరవెనుక మేము పడిన కష్టం మాకే తెలుస్తుంది.

రూపంకోసం ఎంతోకష్టపడతాం. బరువు పెరిగినా, తగ్గినా దాని ప్రభావం ముఖంలో ఇట్టే కనిపిస్తుంది. మా కష్టాలు నిరంతరం సాగే ప్రక్రియ” అంటోంది.

కాదని ఎవరన్నారటా...?

డబ్బు ఎరచూపి లిఫ్ట్ తీసుకున్నారు.

దారిలో ఒక పెట్రోల్ స్టేషన్లో లారీ ఆగినపుడు తన కార్డ్ ద్వారా డబ్బు డ్రా చేసి ఆ డ్రైవర్‌కి ఇచ్చాడు అవినాష్.

దీమాపూర్ వచ్చేవరకు ప్రశాంతంగా సాగింది వారి ప్రయాణం. ఊర్లోకి లారీ రాదు కాబట్టి వారిని ఊరిబయటదించి తనదారిన తను వెళ్ళిపోయాడు ఆ లారీ డ్రైవర్.

అక్కడ నుండి హోటల్ వరకు ట్యాక్సీలో వచ్చారు. లక్ష్మిని ఆమె గదికి పంపి తనకు ధర్మేంద్ర ఇచ్చిన ఫోన్ నెంబర్ గుర్తుచేసుకున్నాడు అవినాష్.

ఆరోజు తనకు ఈ బాధ్యత అప్పచెప్తూ ధర్మేంద్ర చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయతనికి.

'పని పూర్తయ్యాక నన్ను కాంటాక్ట్ చేయటానికి ఈ నెంబర్ గుర్తుపెట్టుకో.

పని పూర్తయ్యేలోపు ఎట్టి పరిస్థితుల్లో ఎవరినీ కాంటాక్ట్ చేయవద్దు' అని అతను ఇచ్చిన ప్రైవేట్ నెంబర్‌కు ఇప్పుడు ఫోన్ చేశాడు అవినాష్.

అటువైపు ఫోన్ లిఫ్ట్ చేయటానికి బదులు ఒక మెసేజ్ వినిపించింది.

'మీరు చెప్పదలచుకున్న విషయం క్లుప్తంగా చెప్పండి. మీకు రెస్పాన్స్ త్వరలో వస్తుంది...' అంటున్న ఆ మెసేజ్ వాయిస్‌కు ఏం చెప్పాలో అర్థం గాక, "ధర్మేంద్రగారూ మీతో అర్జంటుగా మాట్లాడాలి. దయచేసి నన్ను కాంటాక్ట్ చేయండి..." అని చెప్పి ఫోన్ పెట్టేశాడు.

ఆ తరువాత RAW డైరెక్టర్‌కు ఫోన్ చేశాడు. ఆయన మొబైల్ నెంబర్ తన దగ్గర లేదు కాబట్టి ల్యాండ్ లైన్ నెంబర్‌కు ఫోన్ చేశాడు.

డైరెక్టర్ అసిస్టెంట్ ఫోన్ ఎత్తాడు.

"డైరెక్టర్‌తో మాట్లాడాలి" క్లుప్తంగా చెప్పాడు అవినాష్.

"ఆయన ప్రస్తుతం ఆఫీసులో లేరు. మీరు ఎవరో తెలుసుకోవచ్చా?"

"నేను అవినాష్‌ని మాట్లాడుతున్నాను" అన్నాడు.



"మైగాడ్! అవినాష్... నువ్వు ఇన్నాళ్ళూ ఏమయిపోయావ్?"


"అదొక పెద్ద కథ"

"చెప్పకుండా వెళ్ళిపోయావని నీమీద డైరెక్టర్ ఫైర్ అవుతున్నాడు"

"అదేంటి ఆయనకి నేను ఎందుకు వెళ్ళానో తెలియదా?"

"సార్ అలా ఏమీ చెప్పలేదే..."

"నన్ను ఎన్.ఎస్.ఏ.అడ్వైజర్ ధర్మేంద్ర ఒక స్పెషల్ ఎస్సైన్‌మెంట్ మీద పంపారు. దానికి అవసరమయిన పర్మిషన్స్ డైరెక్టర్ నుండి తీసుకుంటామని చెప్పారు.



నన్ను ఎవరినీ కాంటాక్ట్ చేయవద్దని స్పెసిఫిక్‌గా చెప్పారు. అందుకే నేను డైరెక్టర్‌తో మాట్లాడలేదు" అంటూ వివరంగా చెప్పాడు అవినాష్.

"మరి ఇప్పుడు ఫోన్ ఎందుకు చేశావ్?" అని అడిగాడు.

"ఇప్పుడు నాకు అప్పచెప్పిన పని పూర్తి అయింది కాబట్టి"

"ఐ.సీ... ఐతే అందుకేనేమో ధర్మేంద్ర మన డైరెక్టర్ గారిని మీటింగ్‌కి పిలిచారు. ఇప్పుడు చెప్తారేమో...

లేకపోతే అనవసరంగా ఇలా చెప్పకుండా వెళ్ళిపోయినందుకు నీమీద బ్యాడ్ రిమార్క్ పడుతుంది"

"మీటింగ్ ఎప్పుడు?" అడిగాడు అవినాష్.

సెక్యులర్ పార్టీలన్నీ ఏకమైతే బి.జె.పిని ఓడించగలమని ఉపఎన్నికల ఫలితాలు నిరూపించాయి.-సీతారామ్ ఏచూరి, సి.పి.ఎం. ప్రధాన కార్యదర్శి

అతను తనమీద పడబోయే బ్యాడ్ రిమార్క్ గురించి ఆలోచించటంలేదు.

అసలు ధర్మేంద్ర తనకు ఇచ్చిన మాట ఎందుకు తప్పాడో ఆలోచిస్తున్నాడు.

"మనం ఈ ఫోన్ మాట్లాడుకుంటున్న సమయంలో నార్త్‌బ్లాక్‌లోని ధర్మేంద్ర ఆఫీసులో మీటింగ్ జరుగుతోంది"

"ఇంకెవరెవరు ఉన్నారు ఆ మీటింగ్‌లో?"

"ఆ విషయం నాకు తెలియదు"

"సరే. డైరెక్టర్ రాగానే నేను ఫోన్ చేసిన విషయం చెప్పు" అని ఫోన్ పెట్టేశాడు అవినాష్.


అతని మనసులో అనేక ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి. ధర్మేంద్ర లాంటి వ్యక్తి ఇచ్చిన మాట తప్పాడంటే దాని వెనుక ఏదో పెద్ద విషయమే ఉండి ఉండాలి.

అది ఏమయిఉంటుందని ఊహించటానికి ప్రయత్నిస్తున్నాడతను.

రిటైర్డ్ జనరల్ ధర్మేంద్ర ఆఫీసుగదిలోకి ఒకరొకరుగా వస్తున్నారు.

ఆర్మీ ఇంటెలిజెన్స్, న్యావీ ఇంటెలిజెన్స్, ఎయిర్ ఫోర్స్ ఇంటెలిజెన్స్, కోస్ట్ గార్డ్, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్, ఇంటెలిజెన్స్ బ్యూరో, సి.బి.ఐ.కి చెందిన టాప్ బాస్‌లు RAW డైరెక్టర్ ఒకరి వెనుక ఒకరు వచ్చి కూర్చున్నారు.

ధర్మేంద్ర ప్రస్తుతం ఉన్నది గౌరవపూర్వక పదవే అయినా, అతనికి ప్రధానమంత్రితో



ఉన్న ప్రత్యేకమైన అనుబంధం గురించి అందరికీ తెలుసు. అందుకే అంత పెద్దపెద్ద పదవుల్లో ఉన్న అందరూ ఆయన పిలవగానే ఆయన ఆఫీసుకు వచ్చారు.

ఆఫీసురూములో అందరూ విశ్రాంతిగా కూర్చున్న తరువాత రిఫ్రెష్‌మెంట్స్ సర్వ్ చేశారు. సర్వర్లు.

ఆ తరువాత గది తలుపులు వేసి బయటకు వెళ్ళిపోయారు.

ఇంకా ఉంది



Courtesy : FEMINA

ఫర్ U

> Those who have the coverage to love should have coverage to suffer

వేసవి వరం

వేసవిలో మాత్రమే లభించే మరో ఆహారం తాటి ముంజెలు. ఈ సీజన్‌లో తప్పకుండా తినాల్సినవి.

తాటిముంజెల్లో నీటిశాతం ఎక్కువగా వుంటుంది కాబట్టి, కడుపు నిండిపోతుంది.బరువు తగ్గాలనుకునేవారికి మంచి ఆహారం. తాటిముంజెలు మలబద్దకాన్ని తగ్గిస్తాయి.

వికారాన్ని తగ్గించడంలో సాయపడతాయి. వడదెబ్బనుంచి పరిరక్షించడంలో తాటిముంజెలు తిరుగులేనివి. శరీరంలోని విషతుల్యాలను తొలగించడంలో సాయపడతాయి.

కాలేయ ఆరోగ్యాన్ని పరిరక్షిస్తాయి. పొటాషియం పుష్కలంగా వుండడంవల్ల రక్తపోటును నియంత్రిస్తాయి. వీటిలో యాంటీ ఆక్సిడెంట్స్ సమృద్ధిగా లభిస్తాయి. బ్లడ్‌కాట్‌ను నివారిస్తాయి. ◆

అల్జీమర్స్‌కు చెక్

బీట్‌రూట్‌రసం తాగడంవల్ల కలిగే ఫలితాల గురించి తెలిసిందే.

వయస్సు పైబడేకొద్దీ వచ్చే మతిమరుపును తగ్గించడంలోకూడా ఇది బాగా ఉపకరిస్తుందనేది తాజా పరిశోధనల సారాంశం.

బీట్‌రూట్‌రసం తాగడంవల్ల అల్జీమర్స్ వ్యాధి పెరిగే వేగం బాగా తగ్గుతుందని గుర్తించారు.

అల్జీమర్ వ్యాధిని కలిగించే మెదడులో తయారయ్యే ప్రత్యేకమయిన ప్రొటీన్ చర్యలను బీట్‌రూట్ నియంత్రిస్తుంది. అల్జీమర్స్ వ్యాధి పెరిగేలా చేసే మెదడులోని కొన్ని రసాయన చర్యలను కూడా బీట్‌రూట్‌లోని బెటానిన్ అనేది అడ్డుకుంటుందని పరిశోధకులు వివరించారు. ◆

మెలుకువగా ఉండొద్దు

అర్ధరాత్రులదాకా మెలుకువగా ఉండి,ఉదయాన్నే పొద్దెక్కేదాకా ముసుగేసి పడుకోవడం ఆరోగ్యానికి ఎంతమాత్రమూ మంచిది కాదు.

ఇలా ఏదోకరోజు కాకుండా, వరుసగారోజులతరబడి అర్ధరాత్రులవరకు మెలుకువగా వుండేవారిలో వ్యాధుల సమస్యలు ఎక్కువగా వుంటాయని అధ్యయనాల్లో గుర్తించారు.

ఎక్కువసేపు మెలుకువగా వుండే వాళ్ళు తప్పనిసరిగా తమ అలవాట్లు మార్చుకోవాల్సివుంటుందని, ఉదయం వేళ వెలుతురందేలా జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెప్తున్నారు. ◆

ఘాటు మాట

కారం అంటే అమ్మో మంట, కడుపులో మండుతుంది అనుకుంటుంటారు.అయితే కారం ఘాటూ మంచిదేనంటున్నారు నిపుణులు.

పండుమిరపకాయలు ఎక్కువగా తినేవారు మిగతావారితో పోల్చితే ఎక్కువ ఆయుష్షు కలిగివుంటారని అధ్యయనాలు పేర్కొంటున్నాయి.

పండుమిరపకాయలలో స్థూలకాయం సమస్యను తగ్గించే గుణం వుంటుంది. ఉదరంలో జీర్ణక్రియకు ఉపకరించే బ్యాక్టీరియా పెరుగుతుంది. గుండెధమనుల్లో రక్తసరఫరా కూడా సక్రమంగా జరుగుతుంది.

కాబట్టి కారం తగిన మోతాదులో తింటే మంచే జరుగుతుంది. ◆

ఫ్లాక్స్ సీడ్స్

ప్రాచీనకాలంనాటి అవిసెగింజలే ఇప్పుడు ఫ్లాక్స్ సీడ్స్ పేరిట పాపులర్ అవుతున్నాయి.వీటిలో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ సమృద్ధిగా వుంటాయి.

హార్మోన్లను సమతౌల్యపరిచే శక్తి కలిగివుంటాయి. గుండెకు చక్కని రక్త ప్రసరణచేయడంలో ఉపకరిస్తాయి.

రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టకుండా పరిరక్షించడంలో సాయపడతాయి.

ఇవి మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి. పీచు అత్యధికంగా లభిస్తుంది కాబట్టి కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహకరిస్తుంది. ప్రతిరోజూ ఈ గింజల్ని ఓ టీస్పూన్ చొప్పున తింటున్నా ఫలితాలు ఇట్టే కనపడతాయి.

వారఫలం

జూన్ 14 నుండి 20, 2018 వరకు

పిడపర్తి వీరేశ్వరశాస్త్రి, పిడపర్తి భాస్కర సుబ్రహ్మణ్యశాస్త్రి
సెల్ : 9492156064

మేషం: అశ్విని, భరణి, కృత్తిక 1వ పా. మిమ్మల్ని గౌరవించేవారి సంఖ్య పెరుగుతున్నది. అనుకొన్న పనులను పూర్తిచేసుకోగల్గుతారు. ఇంటా-బయటా సహకారములు పెరుగుతాయి. ఆదాయాలు మీరు ఊహించినట్లుగా ఉంటాయి. స్థిరాస్తుల ఏర్పాట్లకు ప్రయత్నాలుంటాయి. వివాహాది శుభకార్య యత్నాలకు మేలుతనాలుంటాయి. కళాశాల ప్రవేశాలు సుగమమవ్వగలవు. గురు, శుక్ర, బుధ వారాలు అనుకూలం.

వృషభం: కృత్తిక 2, 3, 4 పా, రోహిణి, మృగశిర 1, 2 పా. ఖర్చులు, శ్రమలు ఉన్నా ప్రయత్న కార్యములను అనుకూలింపచేసుకుంటారు. అవసరాలకు ధనం సర్దుబాటు కాగలదు. ప్రయాణాలు కొన్ని ఆకస్మికంగా ఏర్పడగలవు. ఉద్యోగులకు ప్రమోషన్ బదిలీలువంటి వార్తలుంటాయి. శుభకార్య యత్నాలకు తెలియని ఆటంకాలుంటాయి. అపరిచితులతో తగుమాత్రంగా వ్యవహరించుకోండి. భాగస్వామి ఆలోచనలు ఉపకరించగలవు. శని, ఆది, సోమ వారములు అనువైనవి.

మిథునం: మృగశిర 3, 4 పా, ఆరుద్ర, పునర్వసు 1, 2, 3 పా. ఉత్సాహాలు- నిరుత్సాహములు కలబోసినట్లుంటాయి. వృత్తి, ఉద్యోగ వ్యవహారాలలో మీ నిర్ణయాలకు గుర్తింపులు ఏర్పడతాయి. కుటుంబ వ్యక్తులతో మీ బాధ్యతలను పంచుకోగలుగుతారు. ఆదాయ-వ్యయాలలో పరిశీలనలు అవసరం. నూతన వస్తు-సదుపాయాలు ఏర్పరచుకోగలరు. ఒప్పందాలకు, ప్రయాణములకు పునరాలోచనలు అవసరం. ఈ రాశి వారికి గురు, శుక్ర, బుధ వారములు అనువైనవి.

కర్కాటకం: పునర్వసు 4వపా, పుష్యమి, ఆశ్లేష. ఒత్తిడులున్నా ఉద్యోగ, వ్యాపారాలలో ప్రయోజనాలు పొందుతారు. కుటుంబంలో సహకారములు పెరుగుతాయి. మీ అభిప్రాయాలను పంచుకొనునప్పుడు సున్నితముగా వ్యవహరించుకోండి. పిల్లల నుండి శుభవార్తలు వింటారు. భాగస్వామి ఆరోగ్య విషయంలో కొన్ని మెలకువలు అవసరం. ప్రయాణాలలో స్వల్ప జాగ్రత్తలు పాటించుకోండి. వివాహ యత్నములు అనుకూలిస్తాయి. వీరికి శని, ఆది, బుధ వారములు అనువైనవి.

సింహం: మఘ, పూర్వఫల్గుని, ఉత్తరఫల్గుని 1వ పా. ఒత్తిడి,శ్రమలు ఎక్కువగా ఉండే సూచనలున్నాయి. ప్రాధాన్యతననుసరించి పనుల్ని చేపట్టుకోండి.ఆర్థిక అనుకూలతలుంటాయి.బంధువర్గంనుండి వ్యతిరేకతలు పొందుతారు.భాగస్వామి సలహాలకు ప్రాధాన్యతనీయండి. వస్తు జాగ్రత్తలు అవసరం.చెల్లింపులకు ప్రాధాన్యతనీయండి.పిల్లలచే అసహనం పొందే సూచనలున్నాయి. గురు, శుక్ర, సోమ వారాలు అనువైనవి.

కన్య: ఉత్తరఫల్గుని 2, 3, 4 పా, హస్త, చిత్త 1, 2 పా. ముఖ్యమను కొన్న పనులను చేపట్టుకొని పూర్తిచేసుకోగలరు. సమర్థతకు తగిన గుర్తింపులు ఏర్పడతాయి. బంధుత్వములు బలపడతాయి. హామీలు, ష్యూరిటీలు ఇచ్చేటప్పుడు లౌక్యములతో వ్యవహరించుకోండి. ఖర్చులు, ఆదాయాలను సరిచూసుకోగలరు. ఉద్యోగ, వ్యాపార వ్యవహారాలలో వేగవంతమైన నిర్ణయాలేర్పడగలవు. విమర్శ, అభియోగాలకు దూరంగా ఉండండి. గురు, శుక్ర, శని, ఆది, బుధ వారాలు అనువైనవి.

తుల: చిత్త 3, 4 పా, స్వాతి, విశాఖ 1, 2, 3 పా. వ్యవహారానుకూలత ఉంది. అనుకున్నది సాధించుకోగలరు. నూతన పరిచయములేర్పడతాయి. ఖర్చులు కొన్ని అంచనాలను మించినా సమర్థించుకోగలరు. ఆరోగ్యం సంతృప్తికరం. కొత్తవైన పనులను చేపట్టుకొని పూర్తిచేసుకోగలరు. దైవకార్యములకు ప్రాధాన్యతనీయగలరు. వాహనయోగములు ఏర్పడతాయి. బుధవారంనాడు పెద్దదయిన ఖర్చు ఏర్పడే సూచనలు వున్నాయి. వీరికి శని, ఆది, సోమ వారములు అనువైనవి.

వృశ్చికం: విశాఖ 4వ పా, అనూరాధ, జ్యేష్ఠ. నమ్మకంతో వ్యవహరించుకోవాలి. ఆటంకములు, అధికారులచే ఒత్తిడులున్నా లక్ష్యములను సాధించగలరు. సహకరించేవారు ఉన్నారు. కొన్ని నిర్ణయాలు భవిష్యత్ ప్రయోజనాలను ఏర్పరచగలవు. కుటుంబసభ్యుల సూచనలకు ప్రాధాన్యతనీయండి. ఆంతరంగిక విషయాలలో లౌక్యములు అవసరం. సంతానంనుండి శుభవార్తలు వింటారు. ఈ రాశివారు గురు, శుక్ర వారములందు అన్నిటా యోచనలు అవసరం.

ధనుస్సు: మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పా. ఈ వారంలో మనోధైర్యంతో వ్యవహరించుకోవాలి. అవకాశాలను అందిపుచ్చుకొనేలా యత్నించుకోవాలి. వ్యవహారాలను స్వయంగా చూసుకోండి. ఏ విషయాన్నీ తేలికగా తీసుకోకండి. కుటుంబ వ్యక్తులకై కొన్ని అదనపు ఖర్చులు ఏర్పడతాయి. ఇతరులనుండి సలహాలు, సాయం ఆశించకండి. దంపతులు ఏకాభిప్రాయంతో సాగగలరు. ఈ రాశివారికి శని, ఆది వారాలలో అన్ని విషయాలలో ఆలోచనలు అవసరం.

మకరం: ఉత్తరాషాఢ 2, 3, 4 పా, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా. ఈ వారంలో మీరు శాంతంగా ఉంటూ మీ యత్నములను సాగించవలసివుంటుంది. ప్రణాళికాయుతంగా సాగుటకు యత్నించుకోండి. కుటుంబ వ్యక్తులు మీ బాధ్యతలలో పాలుపంచుకోగలరు. ఆదాయాలు వ్యయాలకు సరిపడునట్లుంటాయి. భ్రాతృవర్గంవారితో కొన్ని ఒత్తిడులుంటాయి. విద్యార్థులకు, అవివాహితులకు ప్రయోజనాలు ఏర్పడతాయి. ఆస్తి వ్యవహారాలను కదపకుండుట మేలు. ఈ రాశివారికి సోమ, మంగళ వారాలలో అన్నిటా మెలకువలు అవసరం.

కుంభం: ధనిష్ఠ 3, 4 పా, శతతార, పూర్వాభాద్ర 1, 2, 3 పా. ఈ వారంలో శారీరకమయిన అలసటలు, పని ఒత్తిడులు ఉంటాయి. విసుగు, విరామాదులకు గురికాకుండా సాగాలి. రాబడి సంతృప్తికరంగా ఉంటాయి. భ్రాతృవర్గంతో ఆచితూచి వ్యవహరించుకోండి. ఔషధసేవలు ఉంటాయి. వాహన, యంత్రాదుల వాడకంలో జాగ్రత్తలు పాటించుకోవాలి. ఊహించని విధంగా కొన్ని పనులు వాయిదా పడగలవు. ముఖ్యమయిన పనులు చేపట్టుటకు శని, ఆది, సోమ వారములు మేలైనవి.

మీనం: పూర్వాభాద్ర 4వపా, ఉత్తరాభాద్ర, రేవతి. ఈ వారంలో అవసరాలు తీరగలవు. అనుకొన్నది పూర్తిచేసుకోగలరు. అధికారులు, పెద్దలువంటివారు సహకరించగలరు. కుటుంబ వ్యక్తులతో ఉత్సాహాలు పంచుకొంటారు. ఆదాయాలు, మీ అవసరాలకు సరిపడునట్లుంటాయి. ఇతరులపై ఆధిపత్య ప్రదర్శనలకు దూరంగా ఉండండి. అనారోగ్యం విషయంలో మెలకువలు అవసరం. వీరు ముఖ్యమైన పనులు చేపట్టుటకు శని, ఆది, సోమ వారములు అనువైనవి.

నిజాయితీపరుడవయితే నీకు చెడు నుండి పూర్తి స్వేచ్ఛ లభిస్తుంది.

మేకప్

అందంగా, ఆకర్షణీయంగా కనిపించాలన్న కోరిక ఏటువంటి వారికైనా వుంటుంది. ఉన్న అందానికి మేకప్ మెరుగులుదిద్దితే మరింత అందంగా చూడచక్కగా వుంటారు.

అయితే మెరుగులు దిద్దుకునే ప్రక్రియ పరిశుభ్రంగా, ఆరోగ్యపూరితంగా వుండాలి. అందుకోసం ఆరోగ్యవంతమయిన మేకప్ అలవాట్లు చేసుకోవాలి.

మాయిశ్చరైజర్ వాడకం :

చర్మానికి నిరంతర తేమ అవసరం. కాబట్టి, దైనందిన కార్యక్రమంలో మాయిశ్చరైజ్ చేసుకోవడమన్నది అత్యవసర భాగం కావాలి. చర్మానికి కావాల్సిన తేమను మాయిశ్చరైజర్లు అందిస్తాయి. మాయిశ్చరైజర్ క్రమం తప్పకుండా అప్లయ్ చేస్తూండడం వల్ల చర్మం మృదువుగా, మెరుస్తూ, ఆకర్షణీయంగా కనపడుతుంది.

కనీసమాత్రపు మేకప్ :

అతిగా మేకప్ చేసుకోకుండా సహజంగా కనపడడం అవసరం. టింటెడ్ మాయిశ్చరైజర్లు ఇందుకు బాగా దోహదపడతాయి.

ఇవి చర్మాన్ని మేకప్‌కు సంసిద్ధం చేస్తాయి. సహజ ప్రభావం ఇస్తూనే, మెరుపులీనేలా కనపడడంలో షీర్ ఫౌండేషన్‌ది కీలకపాత్ర.

కనురెప్పలపై కొద్దిపాటి ఐషాడో, కొంచెం బ్లష్ అప్లయ్ చేయడంవల్ల చర్మంలో మెరుపు సహజంగా కనపడుతుంది. ఇందుకు అధరాలకూ సహజంగా వుండే మెరుపులు దిద్దాలి.

మేకప్ తొలగింపు :

పడుకునేముందు తప్పని సరిగా మేకప్ తొలగించుకునే అలవాటు చేసుకోవాలి. మేకప్ తొలగించనిపక్షంలో చర్మానికి హాని కలుగుతుంది. నిద్రించే సమయంలో పునరుత్తేజం పొందే సామర్థ్యంచర్మానికి వుంటుంది. మేకప్ తొలగించుకోకుండా పడుకున్నట్లయితే, చర్మ రంధ్రాలు మూసుకుపోయి, మొటిమలు, బ్రేకవుట్స్ వంటి సమస్యలు తలెత్తుతాయి.

మేకప్‌కు ముందు :

మచ్చల్లేని, సహజసిద్ధమైన చర్మమెరుపుల వెనుకగల రహస్యం మేకప్‌కు ముందుగా చర్మాన్ని సిద్ధంచేసుకోవడం లోనే వుంటుంది.

మేకప్‌కు ముందు చర్మాన్ని క్లెన్సింగ్, టోనింగ్ చెయ్యడంవల్ల మృదువుగా మారి, కనీసమాత్రపు మేకప్‌కు వీలవుతుంది.

సౌందర్య పరికరాల శుభ్రత :

ఒకరు వాడిన మేకప్ బ్రెష్‌లు, స్పాంజిలు వంటి వాటిని ఇంకొకరు వాడకూడదు.

అలాగే మురికిగా వుండే బ్రెష్‌లు సరైన మేకప్‌కు సహకరించడం అలా వుంచి వాటిలో వుండే బ్యాక్టీరియా చర్మానికి హాని కలిగిస్తుంది.

దీనివల్ల చర్మంపై ఇరిటేషన్, దురద వంటివి కలుగుతాయి. కాబట్టి మేకప్ బ్రెష్‌లను ప్రతివారం వేడినీళ్ళతో శుభ్రంగా కడగటం అవసరం.

సన్‌స్క్రీన్ :

ప్రతిరోజూ సీజన్లతో నిమిత్తం లేకుండా సన్‌స్క్రీన్ రాయడంవల్ల ముందస్తు వార్ధక్య లక్షణాలు కనపడవు. చర్మంపై ముడతలు, గీతలు, మచ్చలు పడకుండా చర్మ ఆరోగ్యం బావుంటుంది.

Courtesy :B+VE

సీరియల్

హృదయం ఎక్కడున్నదీ...?



వేదనతో కూడిన నవ్వొకటి నవ్వి చెప్పాడు. "నీకు తెలీదు రేష్మా! నిజంగా ఆమె ఈ ప్రపంచానికి ఒక అద్భుతమైన కానుకే!"

ఆమెకి వెంటనే నోటమాట రాలేదు. "ప్లీజ్ బ్రో! తేజాని పెళ్ళి చేస్కో! నా మాట విను! ఎప్పుడైనా నువ్వు ప్రేమించేవాళ్ళతో కంటే నిన్ను ప్రేమించేవాళ్ళతో ఉంటే నువ్వు ఎక్కువ సంతోషంగా ఉంటావ్!"అంది రేష్మ. "నేను సంతోషంగా ఉండాలను కోవట్లేదు. నాకు నచ్చినట్టుగా ఉండాలనుకుంటున్నాను. ఏదోక రోజు నా యశు నాకోసం వస్తుంది. నాకు తెల్సు!" చెప్పాడు విష్ణు.

డాక్టర్ బొమ్మదేవర నాగకుమారి

"అక్కడి పరిస్థితి తెల్సి.... నువ్వు..." ఆపై ఆమెకు నోట మాట రాలేదు.

"అవును సిస్! ఏదో ఒకరోజు చనిపోతామని తెల్సి మనమీ జీవితంపై ప్రేమ చంపుకుంటున్నామా చెప్పు?" బాధగా అడిగాడు.

ఆమె కాల్ కట్ చేసింది.

కొత్తల్లో విష్ణు తిరిగి తిరిగి ఆలోచించుకున్నాడు.

'యశు చాలా మారిపోయింది. ఆ తేడా ఏమిటనేది తన మనసుకు స్పష్టంగా అర్థమైంది. చాలా చిన్న విషయంలో అంటే ఆమె మొబైల్ ఎటెండయ్యే విధానంలోనే తనకు ఆ తేడా తెలిసేది.

ఇదివరలో తను ఫోన్ చేస్తే చాలు ఫోన్ ఇలా చెవిలో పెట్టుకుని ఉన్నట్టు, తన ఫోన్ కోసమే ఎదురు చూస్తున్నట్టు, ఒక్క రింగు కూడా పూర్తవ్వకముందే ఫోన్ లిఫ్ట్ చేసేది. కానీ ఇప్పుడలా కాదు ఫోన్ చాలా సార్లు రింగైన తరువాత తీస్తుంది. లేదా ఒక్కోసారి ఫోన్ ఎంగేజ్డ్ వస్తోంది! ఇంత చిన్న విషయానికే ఎవర్నీ అనుమానించక్కర్లేదు. ఇదివరలో ఎప్పుడూ హుషారుగా, ఉత్సాహంగా, జీవ శక్తి పొంగిపొర్లుతున్నట్టు ఉండేది.

ఇప్పుడేమో ఆమె పరధ్యానంగా, అన్యమనస్కంగా ఉంటుంది. ఎందుకిలా మారిపోయింది? ఆఫీస్ పని పట్ల ఎంతో శ్రద్ధ, కన్‌సర్న్ చూపించేది.

మనసా, వాచా, కర్మణా లీనమై పనిచేసే ఆమె ఓ ప్రక్క ప్రాజెక్ట్ పూర్తవ్వొస్తుంటే ఎందుకనో అంటీ ముట్టనట్టుగా ఉంటోంది.

ఒకప్పుడు తనని ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన యశు ఇప్పుడు తననీ, తన ప్రేమనీకాదని గంధర్వ్‌తో సన్నిహితంగా ఉంటోంది. ఎందుకు?

ఇరవై నాలుగ్గంటలూ ఆ గంధర్వ్ నామజపమే! అతడినీ, అతని పాటనీ అతిగా పొగడటమే!

కొత్తల్లో తనకు ఇరిటేషన్ వచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయ్! ఆ కళ్ళల్లో ఎంత ఆరాధనో?

జరిగిన కథ 19

అద్భుతంగా వయొలిన్‌ని ప్లే చేస్తున్నావని యశస్విని పొగుడుతాడు విష్ణు. ఈలోగా అనేక అంశాలపైవున్న పాటల్ని ప్లే చేస్తుంది యశస్వి. ఆనందించిన విష్ణు తనని వివాహం చేసుకోమని యశస్విని అడుగుతాడు.


యశస్వి ఆశ్చర్యపోయేసరికి 'నీకు గంధర్వ్ అంటేనే ఇష్టంలే' అని చెప్పేస్తాడు.

విష్ణు అలా అనేసరికి ఏం జవాబు చెప్పాలో తోచక డైలమాలో పడుతుంది. కారణం ఆమె నిజంగానే గంధర్వ్‌ని ప్రేమిస్తోంది.

గంధర్వ్ ఆమెను ముద్దుపెట్టుకుంటాడు. విష్ణుతో పాటు నిన్నూ ప్రేమిస్తున్నానని యశస్వి చెప్పేసరికి అతను ఈజీగా తీసుకుంటాడు.

యశస్విని చూసేందుకు ఆమె మేనత్త కవిత వస్తుంది. ఆవిడ రాక యశస్వికి కొత్త ఉత్సాహాన్ని ఇస్తుంది. తను గంధర్వ్‌ని, విష్ణుని ఇద్దర్నీ ప్రేమిస్తున్నానని చెప్పేసరికి ఒక ఒరలో రెండు కత్తులు ఇమడవని చెబుతుందామె. ఇంకా అనేక రకాలుగా హితవు చెప్పినా యశస్వికి తలకెక్కదు.

తర్వాత జరిగేది చదవండి.



అస్సలు ఆ గంధర్వ్ అన్న పేరుని ఉచ్చరిస్తుంటేనే ఆమె ముఖంలో ఒక తన్మయత్వం! ఒళ్ళంతా చెవులు చేసుకుని, పరవశించిపోతూ అతని పాటలు వింటుంది. గంధర్వ్‌లో ఉన్నదేమిటి? తనలో లేనిదేమిటి? అతనొక పేరున్న గాయకుడు!

పోనీ తనుకూడా గంధర్వ్‌లా పాటలు పాడటం నేర్చుకుంటే? ఊహు! అది తనవల్ల అయ్యే పనికాదు. ఇప్పటికిప్పుడు తను పాటలు పాడటం నేర్చుకోలేడు. అది రూల్డ్ అవుట్!

తన లిమిటేషన్స్ తనకు తెల్సు! ఓకే! వోకల్ వదిలేసి ఏదైనా మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్ అంటే గిటార్ కానీ, వయొలిన్ కానీ నేర్చుకుంటే ఎలా ఉంటుంది? ఈ వయసులో అది సాధ్యమేనా?

మనిషి తలుచుకుంటే అసాధ్యమైనది ఏదీ ఉండదు. ఆ సంగతి తనకు తెలుసు!

అతను ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. తనకేమయ్యింది? ఏమిటి తన పరిస్థితి? రోజురోజుకీ తను ఇంతగా దిగజారి పోతున్నాడా? తనని తాను ఇంకో మగాడితో పోల్చుకుంటున్నాడా?

ఎంతవమానం? ఇంతకాలం ప్రపంచంలోనే తనని తాను ఒక ప్రత్యేకమైన వ్యక్తిగా భావించుకునేవాడు. తన ఆత్మవిశ్వాసం, తనపై తనకున్న నమ్మకం అన్నీ ఏమైపోయాయి? తనెందుకిలా ఆలోచిస్తున్నాడు? చివరికి ఇంకో వ్యక్తితో తనని తాను పోల్చుకునే స్థాయికి దిగజారాడు.

ఆమె కోసం కాదు, ఆమె మీద తనకున్న ప్రేమ కోసం తను ఇలా ఆలోచిస్తున్నాడు. ప్రేమ మనుషుల్ని పిచ్చివాళ్ళని చేస్తుంది. అంటే తను ఏమో అనుకునేవాడు. కానీ ఇప్పుడు అర్థమవుతోంది. తను నిజంగానే పిచ్చివాడవుతున్నాడు. అతను ఆలోచనల్లోంచి తేరుకున్నాడు. అతను తన మొబైల్‌లోంచి గేమ్స్‌ని డిలీట్ చేశాడు. వాట్సాప్ గ్రూప్స్ అన్నిటినీ మ్యూట్‌లో పెట్టాడు. ఇల్లు తనదే! అమ్మాయ్ తన స్వంతమే! కానీ తానే పరాయివాడు. గదిగోడలు పట్టుకుని వేలాడే దిగులు! ఇల్లంతా బోసిపోయినట్టు ఉంది.

తన జీవితాన్ని రెండు సగభాగాలు చేస్తే ఆమెకి ముందు, ఆమెకి తర్వాత తానసలు బ్రతికి ఉన్నాడా? అనే సందేహం! తన మరణానికి తానే నిశ్శబ్దం పాటిస్తున్నట్టు ఇల్లంతా నిశ్శబ్దం!

నీతూ ఫోన్ చేసింది.

"ఎలా ఉన్నావ్?"

"నడుస్తోన్న మ్యూజియంలా..."

"అదేమిటి?" ఆమె ఆశ్చర్యపోయింది.

"ఆమె జ్ఞాపకాల్ని పదిలపరుచుకున్న మ్యూజియంని కదా నేను?" అడిగాడు.

అతని బాధ ఆమెకి అర్థమయ్యింది.

"ఈవినింగ్ కూర్చుందామా? డ్రింక్ తీసుకుంటావా?" చనువుగా అడిగింది.

"లేదు నీతూ! డ్రింక్ తీసుకుంటే మత్తు వస్తుంది. ఏదీ గుర్తుండదు. నాకు తనెలాగూ దూరమయ్యింది.



తన జ్ఞాపకాలైనా నాతో ఉండనీ!" వేదనగా చెప్పాడు.

"రిలాక్స్! డ్యూడ్! ఇట్ టేక్స్ టైమ్! కానీ టైమ్‌తో పెయిన్ తగ్గుతుంది" ఓదార్పుగా చెప్పింది.

"వద్దొద్దు నీతూ! నాకీ పెయిన్ కావాలి!" వెంటనే చెప్పాడు విష్ణు.

"యాజ్ యు విష్! రెలిష్ హర్ మెమరీస్!" కాల్ కట్ చేసింది నీతూ.

'మరుపురాని బాధకన్నా మధురమేదీ?' ప్రేమ ఇచ్చే ఆనందం అనంతం! అది బాధనికూడా ఇస్తుంది. నిజమే! నవ్వుల్లో, మూదంటు చూపుల్తో తన చుట్టూ ఎలా తిరిగేది? ఆ నవ్వంటే తనకు ప్రాణం! మాటలకి తడుముకోదు.

జ్ఞాపకం మెత్తగా కోస్తోంది. ఎక్కడో నొప్పి! ఒకే చరణం పదేపదే పాడి అరిగిపోయిన గ్రామఫోన్‌రికార్డ్ లాగా ఆమెనూ, ఆమె జ్ఞాపకాలనూ మించి ఆలోచించలేకపోతున్నాడు. ఆమెతో చెప్పుకున్న కబుర్లు గుర్తొస్తాయ్!

మళ్ళీ అంతలోనే అనుమానం వచ్చింది. అవన్నీ నిజంగా చెప్పుకున్న కబుర్లా? లేక తన ఊహలా?

అందుకే ఆ కబుర్లు చెప్తున్న సమయంలో ఆమె మొహం గుర్తుచేసుకోవటానికి ప్రయత్నిస్తాడు. ఆమె కళ్ళూ ఆమె పెదవులు ఎలా కదిలాయో గుర్తుచేసుకుంటాడు.

హాటు ఘాటు

పాపులర్ అవ్వాలంటే ఎక్స్‌పోజింగ్ వున్నంత మాత్రాన సరిపోదని తెలిసినా, తారలు దాదాపు అదే దారిపడుతుంటారు. తెలుగమ్మాయి ఇషా రెబ్బా తన కెరీర్‌ను ఆచితూచి ప్లాన్‌చేస్తున్నది. 'అంతకు ముందు ఆ తర్వాత' సినిమాతో పాపులర్ అయిన ఇషారెబ్బా నెమ్మదిగా ఒక్కో ప్రాజెక్టుకు సంతకాలు చేస్తూ, గ్లామర్ వేడిని సెగలు కక్కిస్తున్నది. అద్భుతమైన నటన, అందచందాలకు కొదవలేకపోయినా ఫ్లాపులు తప్పలేదు.

ఇప్పుడో భారీ సినిమా ఆఫర్ వచ్చిందని వినికిడి. పనిలో పనిగా తాజాగా స్విమ్మింగ్‌పూల్‌లో ఇచ్చిన పోజులతో షాకిస్తున్నది.

'నేను ఆమెని మనస్ఫూర్తిగా ప్రేమించాను. ఆమె నిర్ణయాన్ని గౌరవిస్తున్నాను'

'నీ ప్రేమని పొందలేనేమో కానీ నిన్ను మాత్రం ప్రేమించగలను! నీకు సంబంధించినంతవరకు ప్రేమ అనేది జీవితంలో ఒక భాగం! కానీ నాకు ప్రేమే జీవితం!' ఆమె ఫొటోకి చెప్పేవాడు.

ఒక్కోసారి వివేకం హెచ్చరిస్తూ ఉంటుంది.

ఏమో! తను ఆమెకన్నా పెద్దవాడు. ఆమెని తను ఇష్టపడ్డాడు. తన ఇష్టంతో ఆమెని ఉక్కిరిబిక్కిరి చేశాడు. అన్నివైపుల నుంచీ తను ఆమెని ఎంతో చాకచక్యంగా ఆకర్షించి తనతో ప్రేమలో పడేలా చేసుకున్నాడు. కానీ ఆమె? అమాయకురాలు!

ఆమె తనకు తానుగా ఇష్టపూర్తిగా అతడ్ని ఇష్టపడింది. ఆమె అతడ్ని ప్రేమించటం, అతనికే చెందటం న్యాయమేమో? నీ నిర్ణయాన్ని స్వాగతించకున్నా గౌరవిస్తాను. మళ్ళీ అంతలోనే ఒక కోరిక! ఒక ఆశ! ఏమో! నన్ను తలుచుకుని, తను లేని నన్ను ఊహించుకుని త్వరగా వచ్చేస్తుందేమో!

విష్ణుకి ఇష్టమైన వ్యాపకం ఏదీ అంటే ఆమెతో గడిపిన క్షణాల్ని మనసారా రివైండ్ చేసుకోవటం! ఆ క్షణాల్లో పునరుజ్జీవించటం!

ఉన్నట్టుండి ఒక్కోసారి గుండె కొట్టుకోవటం అకస్మాత్తుగా ఆగిపోయిందేమో అనిపిస్తుంది.

అంతలోనే ఆ గుండె ఏదో గుర్తొచ్చినట్టు వేగంగా, శరీరాన్ని చీల్చుకుని బయటకు వచ్చేస్తుందేమో అన్నంత వేగంగా కొట్టుకుంటుంది.

ఆమె నవ్వూ, చూపూ, మాటా తలపుల్లోకొస్తే చాలు మనస్సు నిండిపోతుంది. ఆ తలపులతో నిండిన గుండె బరువెక్కుతుంది. శరీరం దూదిపింజలా తేలికైపోతుంది. ఈ తేలికైన శరీరం బరువెక్కిన ఆ గుండెను మోయలేక అల్లల్లాడిపోతుంది. నువ్వు దూరంగా ఉంటే ఎంతో బాధ!

దగ్గరగా ఉన్నా అంతే బాధ! నీలోనే ఉన్న నన్ను ఎక్కడికి పొమ్మంటావ్? గుండెలో బాధ ఉండలా చుట్టుకుపోతుంది. ఒకప్పుడు యశుతో కలిసి విన్న జయదేవుని అష్టపది గుర్తొస్తుంది.

తన ప్రియసఖిని ఎవరైనా తీసుకెళ్ళిపోతే ఆ దుఃఖం గాఢాంధకారంలో ముంచేస్తుంది. నీ ప్రాణం కావాలా? యశస్వి కావాలా? అని అడిగితే రెండో ఆలోచన లేకుండా యశస్వి కావాలి అని అడిగేంత పిచ్చి ప్రేమ! ఒకరోజు నానమ్మ ఫోన్ చేసి మరీ చెప్పింది.

"కన్నా! నువ్వు వెయిట్ చెయ్యి! ఆ అమ్మాయికి నువ్వంటే ప్రేమ! తప్పకుండా నీ దగ్గరకే తిరిగి వస్తుంది" అని.

"అదే ఆశతో బ్రతుకుతున్నాను నానమ్మా!"

"హే ప్రభూ! నువ్వు రాముడివి! దేవుడివి! నీ సహచరి ప్రేమని ఓ జన్మలో కోల్పోతే... మరో జన్మ ఎత్తి అష్టభార్యల్లో... పదహారువేలమంది గోపికల్లో స్త్రీ ప్రేమని నువ్వు పొందావ్!

కానీ నేను కేవలం మానవమాత్రుడిని! నాకు మరో అవతారంలేదురా తండ్రీ! మరో యుగం కాదు కదా మరుజన్మ ఉంటుందో లేదో నాకు తెలీదు. ఈ జన్మకంతా నా ప్రేయసి నాక్కావాలి.

విష్ణు వాట్సాప్ ఆన్‌లైన్‌లో కన్పించటంతో చాటింగ్‌లోకి వచ్చి "హాయ్ బ్రో!" అంటూ టైప్ చేసింది రేష్మ.

"హాయ్ సిస్!" వెంటనే జవాబిచ్చాడతను.

"నీ స్వీట్‌హార్ట్‌తో ప్రేమలో ఎంతవరకొచ్చావ్?"

"తెలీదు... నాకేమీ అర్థంకావట్లేదు. అంతా అయోమయంగా ఉంది"

"ఎందుకు? యశస్వి ఏమంటోంది?"

"గంధర్వ్ అనే అబ్బాయిని ప్రేమిస్తున్నాను అంటోంది" అన్నాడు విష్ణు.

"ఈజిట్? అదెలా వీలవుతుంది? నీతో బ్రేకప్ చెప్పేసిందా?" కంగారుగా అడిగిందామె.

"లేదు లేదు! సమస్య అక్కడే వచ్చింది"

ఆమె ఆశ్చర్యపోయింది.

"అదెలా? ఇటు నీతో రిలేషన్‌షిప్‌లో ఉంటూ ఇంకో అబ్బాయిని ప్రేమిస్తోందా?" ఆమె ఆశ్చర్యంగా అడిగింది.

"ఆమె అలాగే చెప్తోంది" బాధగా చెప్పాడతను.

"ఎవరతను?" అడిగిందామె.

అతను టూకీగా చెప్పాడు.

ఇంకోలా అర్థంచేసుకున్న ఆమె "డోంట్ వర్రీ! ఒక్కొక్కసారి సెలబ్రిటీలపట్ల ఈ అమ్మాయిల అభిమానం హద్దులు దాటి పెరిగిపోతుంది. నీకు తెలుసు కదా? విరాట్ కోహ్లీని, మహేష్‌బాబుని చాలామంది అమ్మాయిలు చాలా గాఢంగా ప్రేమిస్తూ ఉంటారు. అది



గెలిచినవారు ఓడినవారు కూడా విలువైన పాఠాలు నేర్చుకోవాల్సిన సమయమిది.
-రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు

చాలా నేచురల్! లైట్ తీసుకో" చెప్పిందామె.

"నువ్వు చెప్పినవాళ్ళలా అయితే లైట్ తీసుకోవచ్చు! ఇది అలా లైట్ తీసుకునే విషయం కాదు. ఎందుకంటే అటుపక్క నుంచి గంధర్వ్ కూడా ఈమెని అంతే గాఢంగా ప్రేమిస్తున్నాడు"

ఆమె ఆశ్చర్యపోయింది "ఈజిట్! అతనలా కమిట్ అయ్యాడా?" అడిగింది.

"అదే కదా నా బాధ" చెప్పాడతను.

"వన్ మినిట్..." అని చెప్పి, కాల్ చేశాడు. గిటార్ క్లాసులు, ఆల్బమ్ రిలీజ్ చేయించటం దగ్గర్నుంచి కొన్ని వివరాలు చెప్పాడు. అంతా విని చెప్పిందామె.

"ఓ మైగాడ్! ఆమె ఆ గ్లామరస్ వరల్డ్‌లోకి వెళ్ళిపోవాలనుకుంటోంది. ఇది క్లిస్టర్ క్లియర్! ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ భార్యకన్నా ఓ పాపులర్ సింగర్ వైఫ్‌కి ఎక్కువ గ్లామర్ ఉంటుంది కదా?

తను ఆ గ్లామర్ కావాలనుకుంటోంది భయ్యా! దాల్ మే కుచ్ కాలా హై! నువ్వు మళ్ళీ ఒకసారి ఆలోచించుకో!" చెప్పింది.

"అదే పనిలో ఉన్నా" పేలవమైన నవ్వు నవ్వాడు.

"నాకో సూపర్ ఐడియా వచ్చింది. చెప్పనా?"

"చెప్పు"

"ఎందుకైనా మంచిది నీ ఇగో హర్ట్ అవ్వకుండా ఉండాలన్నా, నీ గ్రేస్ నువ్వు కాపాడుకోవాలన్నా నువ్వే బ్రేకప్ చెప్పేసెయ్ బ్రో!"

"నేను అలా చెప్పలేను" విషాదంగా చెప్పాడు.

"ఎందుకు? నీకేం తక్కువ? ఆ అమ్మాయ్ కాకపోతే ప్రపంచంలో ఇంక అమ్మాయిలే లేరనుకుంటున్నావా? నువ్వు కో అంటే కోటిమంది అమ్మాయిలు! నీ వర్త్ నీకు తెలీదు" అంది రేష్మ. "సిస్! అదంతా కాదు. ఆమె లేకుండా నేను బ్రతకలేను"



"దిసీజ్ టూ మచ్ బ్రో చిన్నచిన్న విషయాల్లో నచ్చకపోతేనే లవర్స్ ఒకళ్ళకొకళ్ళు బ్రేకప్ చెప్పేసుకుంటున్నారు. ఇంకా బ్రేకప్ పార్టీలు కూడా చేసేసుకుంటున్నారు. నువ్వింకా ఏ కాలంలో ఉన్నావు?"

"ప్లీజ్! లీవ్ మి ఎలోన్!" కాల్ కట్ చేశాడు.

అటు చూస్తే ఆఫీస్‌లో అందరికీ వీరి విషయం తెలిసిపోయింది. నెగెటివ్‌గా అతనిమీద ఒత్తిడి తెస్తున్నారు.ఎవరితో ఐనా పంచుకుంటే బాధ తగ్గుతుంది అంటారు. కానీ ఆమెకు సంబంధించిన బాధ ఎవరితో పంచుకున్నా రెట్టింపవుతోంది. ఎందుకు?

మొబైల్ మళ్ళీ రింగయ్యింది. రేష్మ అయితే మొబైల్ ఆన్ చెయ్యొద్దు అనుకున్నాడు. తీరా చూస్తే 'చక్రి కాలింగ్' అని డిస్‌ప్లే అవుతోంది.

తప్పనిసరై ఆన్ చేశాడు.

"బ్రో! నేను ఏదో విన్నాను... అది కిట్టనివాళ్ళు చెప్పిన రూమర్ అయ్యుండాలని కోరుకుంటున్నాను" చాలా మర్యాదగా చెప్పాడు.

"కాదు! నువ్వు విన్నది నిజమే!"

"అయామ్ సో సారీ!...తను మంచమ్మాయే అనుకున్నాను. ఇన్నోసెంట్ అనుకున్నాను కానీ అంతలా నటించిందా? నిన్ను చీట్ చేసిందా? ఎంత ఘోరం ఐనా రోజులు అలా ఉన్నాయ్!ఎవర్నీ నమ్మలేం!"

"... ... ..."

"బ్రో! నువ్వు ఎంత ఎంకరేజ్ చేశావ్? ఫ్రెషర్‌గా ఇక్కడికి వచ్చింది. షార్ట్ పీరియడ్‌లో ఎక్కడికో వెళ్ళిపోయింది. తను ప్రొఫెషన్‌లో పైకి రావటానికి నిన్ను ఒక నిచ్చెనలాగా వాడుకుంది. నో డౌట్!"

"... ... ..."

"నో డౌట్! ఆమె చాకులాంటి అమ్మాయ్! నువ్వు చెర్రీలాంటి బాయ్‌ఫ్రెండ్‌వి దొరికావ్! నిలువునా కట్ చేసేసింది! ఇక నుంచైనా జాగ్రత్త!"

కాల్ కట్ చేశాడు. తన మనసుకి సర్దిచెప్పుకోవటం బ్రహ్మప్రళయంలా ఉంది.

వీళ్ళందరినీ ఎదుర్కోవటం ఇంకా కష్టంగా ఉంది. ఎలా?... ఎలా?... ఆలోచిస్తూ ఉండిపోయాడతను. యశస్వి గురించి ఆలోచించినప్పుడల్లా విష్ణుకి వింతగా అన్పిస్తోంది.ఒకప్పుడు ఆ అమ్మాయ్ గుర్తొస్తే చాలు తన గుండె వేగంగా కొట్టుకునేది...

శరీరాన్ని చీల్చుకుని గుండె బైటకు వస్తుందేమోనన్నంత వేగంగా కొట్టుకునేది.

కానీ ఇప్పుడూ? ఆ అమ్మాయికి సంబంధించిన ఆలోచనలతో తన గుండె బరువెక్కుతోంది... ఉన్న కొద్దీ ఇక తనీ బరువు మోయలేడేమోనన్నంతగా పిడికిలంత గుండె బరువెక్కుతోంది.

ఏమో! ఏదో ఒకరోజు ఆ అమ్మాయ్ మనస్సు మార్చుకుని వస్తుందేమో... ఏమో.. ఆ రోజు ఈరోజే కావచ్చు! అలాంటిరోజుకోసమే ఎదురుచూస్తూ, ప్రతి పనీ యాంత్రికంగాచేస్తూ, జీవచ్ఛవంలా జీవిస్తూ...

అతనిలో మార్పుని నీతూ తొందరగా పసిగట్టింది. "ఏయ్ బడ్డీ ఏమిటిది?" అంటూ ఎదురుగా కూర్చుని



అదో వ్యసనం

పూజాహెగ్డెకు కూలింగ్ గ్లాసెస్ అంటే మహా ప్రీతి అట. ఎంత ఇష్టం అంటే మానేయలేనంత వ్యసనం అంత అంటుంది.

"కొత్త ప్రదేశాలకు వెళ్ళినప్పుడు షాపింగ్ చేయడం నాకు చాలా ఇష్టం. అక్కడ ప్రత్యేకంగా దొరికే వస్తువులను అవసరం వున్నా లేకపోయినా కొనేస్తుంటా. ముందుగా వెతికేదిమాత్రం కళ్ళజోళ్ళనే. వీటిని కొనడం నాకో వ్యసనం మాదిరి అయిపోయిందంటే నమ్మండి. అందాన్ని కాపాడడంలో కళ్ళజోళ్ళ పాత్ర చాలా వుంటుందనేది నా నమ్మకం" అంటున్నది పూజా హెగ్డె.



సాహస కథల పోటీ

ఒక్కో కథకి ₹10 వేలు బహుమతి

అలా పది కథలకు లక్ష రూపాయల బహుమతులు

కత్తి పట్టి కదనరంగంలోకి దూకడమే కాదు, ఎక్కుపెట్టిన విల్లంబులతో మట్టుపెట్టడమే కాదు, శత్రులక్ష్యంవైపు టార్గెట్‌ను ఎయిమ్ చేయడమే కాదు... సాహసమంటే! అటువంటి సాహసంతోపాటు ఇంటా, బయటా, సమాజంలో, చేసే వృత్తిలో తీసుకునే నిర్ణయాలు సాహసంతో కూడినవై ఎందరికో మేలు జరిగితే అవిగో అవీ అసలుసిసలైన సాహస కథలు. మీరు రాసే కథ ఎందరికో ఇన్‌స్పైర్ కావచ్చు.వారి జీవితాలను ప్రభావితంచేయొచ్చు. 'ధైర్యే సాహసే లక్ష్మి'అనుకుని మాంచి ఓ సాహసకథ రాసి పంపండి. విజేతలు మీరే!

సాధారణ ప్రచురణకు తీసుకున్న ప్రతి కథకు ₹ 2,000

: నిబంధనలు :

మీ సాహస కథ, స్వాతి సపరివార పత్రికలోబొమ్మతో సహా, ప్రచురణలో రెండు పేజీలు మాత్రమే రావాలి. అనగా మీ వ్రాతప్రతి **ఆరు అరఠావులకు** మించకుండా ఉండాలి. కాగితానికి ఒకవైపున మాత్రమే రాయాలి. ప్రతి అర ఠావుకు సుమారుగా ఇరవై ఐదు లైన్లు ఉండాలి.

1. సాహస కథల ఎంపికలో స్వాతి సంపాదకునిదే తుది నిర్ణయం. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు. ఈ పోటీ గడువుతేదీని పొడిగించేందుకు గానీ, పోటీని రద్దుచేసేందుకుగానీ, స్వాతి పబ్లికేషన్స్ యాజమాన్యానికి సర్వహక్కులూ ఉన్నాయి. 2. అనువాదాలూ, అనుకరణలు, ఇతర పత్రికలకి పంపబడి పరిశీలనలో ఉన్న రచనలను పంపవద్దు. 3. సాహస కథలు తమ స్వంతమే అని, అముద్రితమని, తమ స్వదస్తూరితో రాసిన హామీపత్రాన్ని విధిగా జత పరచాలి. 4. బహుమతియోగ్యం కానివాటిని సాధారణ ప్రచురణకు తీసుకునే హక్కు మాకు ఉంది. 5. ప్రచురణార్హం కాని కథలను తిప్పి పంపగోరువారు తగినన్ని స్టాంపులు అంటించిన స్వంత చిరునామాగల కవరు జతపరచాలి. 'సాహస కథల పోటీ'కి అని కవరుమీద స్పష్టంగా రాయాలి.

కథలను పంపవలసిన చిరునామా : ఎడిటర్, స్వాతి సపరివార పత్రిక, అనిల్ బిల్డింగ్స్, సూర్యారావుపేట, పోస్ట్ బాక్స్ 339, విజయవాడ 520 002

సాహస కథలు మాకు చేరవలసిన ఆఖరు తేది : 30.6.2018

ప్రశ్నించింది. ఆమె ముందు దాయలేకపోయాడు. ఆమె శ్రద్ధగా వింది. "దానికేమన్నా పిచ్చి పట్టిందా?" ఆశ్చర్యపోయింది.

"ప్లీజ్ నీతూ! అది ఏంజిల్! దాన్ని అట్లా తిట్టకు"

"నిజంచెప్పు! అసలు నీకది బ్రేకప్ చెప్పిందా?"

తల అడ్డంగా ఊపాడు. "షి లవ్స్ మి!"

"షి లవ్స్ గంధర్వ్ టూ?"

అవునన్నట్టు తలూపాడు.

"ఇదే మెంటల్ అంటే! అది ఏమనుకుంటోంది? మై ఫుట్!"

"నీతూ... నువ్వు ఆడపిల్లవి కాబట్టి బ్రతికి పోయావ్! లేకపోతే..."

"ఆల్ రైట్! డ్యూడ్! అయామ్ వెరీసారీ టు సే! నీ ఏంజెల్‌కి క్లారిటీ లేదు. దానికి ప్రాక్టికల్ లైఫ్ తెలీటం లేదు! ఇక్కడ తప్పంతా నీది!"

"తప్పు నాదా? నేనేం చేశాను?"

కొన్ని కొన్ని విషయాలు కొంతమందికి ఎప్పటికీ అర్థంకావు. వాళ్ళకు చెప్పాలని ప్రయత్నం చేయటం కూడా వృథా ప్రయాస!

"కమాన్! ఒక లవ్ ఫెయిల్యూర్‌కి బెస్ట్ మెడిసిన్ ఏమిటో తెల్సా? ఇంకో లవ్ ఎఫైర్ మొదలుపెట్టటమే..." నవ్వింది పెద్దగా!

అతను తల అడ్డంగా ఊపి, "నావల్ల కాదులే! నన్ను వదిలెయ్!" చెప్పాడు.

"నీ వల్ల అవుతుందని నేను చెప్పటంలేదు. అది ఇద్దర్నీ ఒకేరకంగా ఒకేసారి ప్రేమిస్తున్నాను అంటే నువ్వెందుకు ఊరుకున్నావ్? ఇంకో గాళ్ ఫ్రెండ్‌తో సినిమాల్లో చూపించినట్టుగా ఎఫైర్ ఉన్నట్టు నటించి దాన్ని అడుగు... నేను కూడా నీలాగా ఇద్దర్ని ప్రేమిస్తాను నీకు ఓకేనా? అని దాన్ని అడుగు"

అతను తల అడ్డంగా ఊపాడు.

"అడగవా? ఎందుకు అడగవ్?" కోపంగా అడిగింది నీతూ.

"వద్దు నీతూ! మనం గాఢంగా ప్రేమించినవాళ్ళు ఇంకొకళ్ళని ప్రేమిస్తే ఆ బాధ ఎలా ఉంటుందో నాకు తెల్సు! ఆ బాధని నేను నా యశస్వికి మాటల్లో కూడా ఇవ్వలేను. ఐ లవ్ హర్ సో మచ్!" చెప్తుంటేనే అతని గొంతు ఆర్ద్రమయ్యింది.

నీతూకి కూడా బాధ కల్గింది. కానీ ఆమె కరిగిపోదల్చుకోలేదు. "దానికి కాదురా! నీకు పిచ్చి పట్టింది" కోపంగా చెప్పింది.

"అయ్యుండొచ్చు!" నవ్వాడతను.

ఆమె సీరియస్‌గా అతనిముఖంలోకి చూసి, వెంటనే ఒక నిర్ణయానికి వచ్చింది.

"పద! సైకియాట్రిస్ట్ దగ్గరకు వెళదాం?"

"నాకిప్పుడేమయ్యిందీ? అస్సలు నీకు తొందరెక్కువ! నన్నిలా వదిలేయ్ ప్లీజ్!" అంటూ ఇబ్బందిగా నవ్వాడు విష్ణు.

"ప్లీజ్! నేను చెప్తున్నా విను! దానిమూలంగా నువ్వు మెంటల్ అయ్యావ్! అది నిన్ను... వద్దులే నాకస్సలే మంచి మాటలు రావు! నీకు నేనేం చెప్పినా తలకెక్కేలా లేదు. ఒక ప్రొఫెషనల్ మాట్లాడ్తేనైనా నీకు అర్థమవుతుందేమో చూద్దాం!

ఆ డాక్టర్ నీతో మాట్లాడి నువ్వు నార్మల్ అనీ, నిన్ను ఇలా వదిలేయమని చెబితే అలాగే వదిలేస్తా! కమాన్! నాకోసం రా! అపాయింట్‌మెంట్ తీసుకుంటున్నా!" అంటూ అప్పటికప్పుడు గబగబ డాక్టర్ చటర్జీకి ఫోన్‌చేసింది. రిసెప్షనిస్ట్ కాబోలు ఫోన్ తీసింది.

"ఎక్కడ నుంచి మాట్లాడ్తున్నారు?" అడిగింది.

"ఇందిరానగర్, బెంగళూరు"

తన స్నేహితుని సమస్య గురించి టూకీగా రెండు ముక్కల్లో చెప్పింది. "దట్స్ ఫైన్! క్లినిక్‌కి రాగలరా?? ఫోన్‌లో మాట్లాడతారా?"

"క్లినిక్‌కి వస్తాం! కొంచెం వివరంగా మాట్లాడాలి"

"సాయంత్రం ఆరున్నరకి రావచ్చు!" చెప్పింది.

కాల్ కట్ చేయగానే అన్నాడతను. "కాదు నీతూ! ఫోన్లో మాట్లాడ్తే అయిపోయేది కదా?"

"వద్దు! కొన్ని ముఖ్య విషయాలు ముఖతః మాట్లాడ్తేనే బావుంటుంది. అదీకాకుండా నువ్విలా కూర్చునీ కూర్చునీ ఇంకా డిప్రెస్ అవుతున్నావ్! బయటకు వెళదాం పద!" అంటూ హడావుడి చేసింది.

అతను తయారవుతుంటే సైకియాట్రిస్ట్‌కి ఫోన్ చేసి విష్ణు సమస్యగురించిచెప్పింది. దాదాపుగా అతడ్ని బలవంతంగా బైటకు తీసుకుని వెళ్ళింది. సైకియాట్రిస్ట్ సాదరంగా ఆహ్వానించాడు.

ఇంకా ఉంది

ఫాదర్స్ డే

తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలని చెప్పిన సంస్కృతి మనది. తల్లి జన్మనిస్తుంది. ఒక వయసువరకు ఆలనాపాలనా చూస్తుంది.

కాని ఆ తర్వాత పిల్లల బాధ్యత అంతా తండ్రి స్వీకరిస్తాడు. నిజానికి తండ్రి తాను పిల్లలకోసంచేసే పనిని తన బాధ్యతగా భావిస్తాడు.

తాను ఇంతగాచేస్తున్న పనులగురించి చెప్పుకోడు. పిల్లలకు భావోద్వేగం కలిగేలా పదేపదే తాను చేసినవి ప్రస్తావించడు. అందుకు భిన్నంగా తల్లి ప్రవర్తిస్తుంది. తాను చేసే ప్రతి చిన్న పనికీ పిల్లలను ఎమోషనల్‌గా దగ్గరకు తీసుకుంటుంది. అందుకే తల్లి చేస్తున్నది త్యాగం అని తండ్రి చేస్తున్నది బాధ్యతఅని పిల్లలుభావిస్తుంటారు.

> తండ్రితో సరిగా సమయం గడపనివారు ఆ తర్వాత ఏం కోల్పోయిందీ తెలుసుకుని బాధపడతారు

తండ్రిచేసే త్యాగాలగురించి ఆ స్థానంలోవున్న మగవారే ఆలోచించనప్పుడు ఇక సమాజంలోని మిగిలివారెందుకు గుర్తిస్తారు. అందుకే ప్రపంచంలో ఎన్నెన్నోరకాల దినోత్సవాలు ఉన్నాయి. కాని 'పితృదినోత్సవం' చాలాకాలం వరకు లేదు. ఇప్పటికి కూడా 'పితృదినోత్సవం' గురించిన ప్రచారంతక్కువే. ప్రతిసంవత్సరం జూన్‌మూడవ ఆదివారాన్ని తండ్రుల దినోత్సవంగా జరుపుకుంటారు. ఐతే తండ్రులదినోత్సవ విషయంలో ప్రపంచ దేశాలన్నింటిలో ఏకాభిప్రాయం లేకపోవటాన్నిబట్టి తమ గురించి మగవారు ఎంత తక్కువగా ఆలోచించుకుంటారో అర్థమవుతుంది.

ఇలాంటి కారణాలవల్ల తండ్రికోసం ఒక ప్రత్యేక రోజు అవసరమనివారు భావించలేదు. కాని అమెరికాలోజరిగిన ఒక సంఘటన పిల్లలకు తండ్రివిలువ తెలిసివచ్చేలాచేసింది.1907లో అమెరికాలోని ఒక గనిలో పెద్ద ప్రమాదం జరిగింది.

దాదాపుగా 361 మంది మరణించారు. వారిలో పెళ్ళి కాని పురుషులు,పిల్లలులేని మగవాళ్ళను తీసేస్తే మొత్తం 250మంది తండ్రులు మరణించారు. ఒక్కసారిగా ఆ కుటుంబాలన్నీ బావురుమన్నాయి.

ఆ కుటుంబాలన్నింటితో కలిపి దాదాపు 1000 మంది పిల్లలు, భిన్నవయసులవారున్నారు. వారందరిదీ తండ్రిలేని లోకమైంది.నాటివరకు తండ్రి చేస్తున్న సేవలు, ఇస్తున్న భరోసా గురించిన ఆలోచనే లేని ఆ పిల్లలకు తండ్రిలేనిలోటు తెలియవచ్చింది.

ఉదయం నిద్రలేవటం మొదలు, రాత్రి పడుకునేవరకు, ఒకవైపు కుటుంబ పోషణకోసం శ్రమిస్తూ మరోవైపు పిల్లల సంక్షేమంకోసం తపనపడుతూ,పనితో ఎంతగా అలసిపోయినా రాత్రివేళ పక్కనపడుకుని కథలుచెప్పి నిద్రపుచ్చుతూ తన శారీరక శ్రమ, మానసిక ఒత్తిడిని మరచిపోయే తండ్రి గొప్పతనం పిల్లలందరికీ తెలియవచ్చింది. అలా తండ్రిపోయిన పిల్లలు తమ కన్నీటిని అదుముకుంటూ, తమని వీడిపోయిన తండ్రుల సంస్మరణకోసం ఏదో ఒకటి చేసి తీరాలని చేసిన యత్నమే 'ఫాదర్స్‌డే' ప్రారంభం.

ఆ పిల్లలలో గ్రేస్ గోల్డెన్ క్లేటన్ అనే అమ్మాయి తన చర్చిఫాదర్ దగ్గర తమ తండ్రుల జ్ఞాపకం కోసం ఏదైనా చెయ్యాలని పట్టుబట్టింది.ఆ విధంగా ఆ చర్చిలో తొలి సారిగా 'ఫాదర్స్ డే' జరిగినా దానిని ఎవ్వరూ పట్టించుకోలేదు. తండ్రుల పట్ల సరైనగౌరవం చూపించలేని సమాజం అని గ్రేస్ గోల్డెన్ క్రమంగా వెనక్కి తగ్గింది.

ఆ తర్వాత ఎవరో ఒక అమ్మాయికి తండ్రి గొప్పతనం అర్థమవటం, తప్పనిసరిగా ఫాదర్స్‌డే జరపాలన్న ప్రయత్నం చెయ్యటం జరిగింది. విలియమ్ జాక్సన్ అనే సైనికుడి భార్య ఆరుగురు పిల్లలనుకన్న తర్వాత మరణించింది. ఆ ఆరుగురు పిల్లలను ఒక్కడిగా సాకి, అందరినీ సమాజంలో గౌరవస్థానంలో కూర్చోపెట్టాడు.

అతని శ్రమ, పిల్లలపట్ల చూపించిన బాధ్యత వంటివి గమనించిన అతని కూతురు తన తండ్రి పుట్టిన రోజును తండ్రులదినోత్సవంగా జరపాలని ప్రతిపాదించింది. కొద్దిపాటి తర్జన భర్జనల తర్వాత తండ్రుల దినోత్సవానికి సమాజంలో అంగీకారం లభించింది.

> తండ్రి క్రమశిక్షణలో ప్రేమ వుంటుంది... కాని పిల్లలు పెద్ద అయిన తర్వాతే వారికి అర్థమవుతుంది

జూన్ మూడవ ఆదివారం తండ్రుల దినోత్సవంగా స్థిరపడింది. అలా స్థిరపడటానికి దాదాపు 60ఏళ్ళు పట్టింది. తండ్రులగౌరవార్థం జూన్ మూడవ ఆదివారం కేటాయింపు ఉత్తర్వు 1966లో జరగగా 1972 నుండి సెలవుదినంగా ప్రకటించింది అమెరికన్ ప్రభుత్వం. తండ్రులు కాని మగవారి సంగతేమిటనే ప్రశ్న మరికొందరు వెయ్యటంతో దీనికి తోడు 'పురుషుల దినోత్సవం'గా ప్రకటించాల్సివచ్చింది.

భారతదేశంలో 'ఫాదర్స్‌డే'జరుపుకునే ఆచారం లేదు. పాశ్చాత్య సంస్కృతీ ప్రభావమున్న కొద్ది నగరాలకు మాత్రమే పరిమితం.

సాంప్రదాయ భారతీయ సమాజంలో పితృపక్షం అనేది మరో తేదీలో ఎప్పుడో వస్తుంది.

'ఫాదర్స్ డే' జరుపుకునే చోటకూడా తండ్రులకు కార్డ్‌లు, గిఫ్ట్‌లు ఇవ్వటం తప్పించి హాయిగా మనసువిప్పి, ప్రేమతో గడుపుకోవటం తక్కువే.

పిల్లలకు, తండ్రులకు మధ్య ఏదో తెలియని గోడ అడ్డుగా నిలుస్తుంది. అటువంటి ఎడం వారిమధ్య వుంటేనే తన పాత్ర మరింత బాగుంటుందని తల్లులు నమ్ముతారు. ఆ అడ్డంకిని తొలగించి పిల్లలను తండ్రులకు దగ్గర చేసే తల్లులు తక్కువే.

వయసుపెరిగిన తర్వాతే పిల్లలకు తండ్రివిలువ తెలుస్తుందంటారు. ముఖ్యంగా అమ్మాయిలకు తండ్రులమీద అభిమానంపెరిగేది వారికి వివాహం అయిన తర్వాతే అనేది చాలామంది అభిప్రాయం.

బాల్యంలో అమ్మాయిలకు తొలి హీరో తండ్రి. అయినా అది అంగీకరించేందుకు ఆ వయసులో ధైర్యం లేకపోయినా ఆ తర్వాత జీవితకాలం గుర్తుపెట్టుకుంటారు. తండ్రి పాత్రను సరిగ్గా అర్థంచేసుకోలేకపోవటం ఈ సమాజం లోపం.ఆ పాత్రగురించి అర్థమయ్యేలా తెలియచెప్పటం 'ఫాదర్స్‌డే' లక్ష్యం.



Courtesy : GOOD HOUSEKEEPING

కొంచెం ఎదిగాను



బాలీవుడ్‌లో చేసింది ఎనిమిదే సినిమాలైనా యామీగౌతమ్ ఎంతో ప్రాచుర్యాన్ని గడించింది. తన కంటూ ఓ స్థానాన్ని నిలబెట్టుకోగలిగింది. విజయాలు ఆమె తలకెక్కలేదు.

అపజయాలు నొప్పించలేదు. 'విక్కీ డోనర్'తో కెరీర్ ఆరంభించిన యామి పరిశ్రమకు పూర్తిగా కొత్త.

ఇటీవల 'కాబిల్'తో ప్రేక్షకలోకాన్ని మెప్పించింది. పక్కింటి స్వీట్‌గాళ్ ఇమేజ్‌ను 'సర్కార్ 3'తో చెరి పేసింది. హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన యామిలో ఎంతో ఎనర్జీ కనపడుతుంది.

ఆమెతో ఇంటర్వ్యూ.

నటి కావాలన్న కోరిక మీలో ఉందని ఎప్పుడు గ్రహించారు?

నేనెప్పుడూ సినిమాల్లోకి రావాలని కోరుకునేదాన్ని. అయితే చదువు కోవడం కూడా చాలా ఇష్టం నేను. పుస్త కాల పురుగును.

ఎప్పుడూ ఫరూక్ షేక్స్ షో, జీనా ఇసి కా నామ్ హై నేను చూసేదాన్ని. ఏదో ఒకరోజు షోకు నన్నూ పిలుస్తారని నా ఫ్రెండ్స్ జోక్‌చేసేవాళ్ళు.

ఓసారి మా ఫ్యామిలీ ఫ్రెండ్స్ కొం దరు పరిశ్రమలో ప్రయత్నించాలంటూ బలవంతపెట్టారు. మా అమ్మదగ్గర నుంచి నా ఫోటోలు తీసుకున్నారు.

2008లో టెలివిజన్‌లో నా కెరీర్ ఆరంభించాను. ఓ పదినెలల ప్రయ త్నాల తర్వాత షోకోసం కొన్ని సన్నివే శాలు చేయాల్సిందిగా నన్ను అడిగారు. ఇదంతా విధి అని నమ్ముతాను.

ప్రయాణం ఎలా ఉంది?

మా అమ్మానాన్నలు నాకెంతో సపో ర్టివ్. జీవితంలో ఏ విషయానికీ కుంగి పోవద్దని వాళ్ళు చెప్పేవారు. హార్డ్‌వర్క్ చేసినప్పుడు ఫలితం వుంటుందనేది నా నమ్మకం. గాడ్‌ఫాదర్లు లేనప్పుడు అవకాశాలుపరిమితంగా వుంటాయి.

'విక్కీ డోనర్' చేసి ఏడేళ్ళయింది. ఓ వ్యక్తిగా, నటిగా ఇన్నేళ్ళలో మీలో ఎటువంటి మార్పు వచ్చింది?

నటిగా మార్పుగురించి వ్యాఖ్యానిం చడం క్లిష్టం. కాబట్టి ఈ విషయంలోకి వెళ్ళను. అయితే, అవకాశాల విష యంలో, వ్యక్తిగతంగా నేనెంతో పరి ణతి చెందాను. వ్యక్తిగా ఎదగకపోతే, అది పనిలో ప్రతిబింబించదు.

వెనుతిరిగి చూసుకుంటే ఇప్పుడు ఎన్నో విషయాల్లో, ఎంతో సౌకర్యంగా వున్నాను. సంతోషంగా, ఎంజాయ్‌చేసే దశలో వున్నాను. పాత్రలతో ప్రయోగా లను ఇష్టపడతాను.



పెద్ద స్టార్‌తో పనిచేయాలన్నప్పుడు భయపడిన సందర్భాలు ఏవైనా ఉన్నాయా?

హృతిక్‌రోషన్‌తో. 'కాబిల్'లో అతనితో కలిసి పనిచేయడాన్ని ఆరంభించినప్పుడు చాలా నెర్వస్‌గా ఫీలయ్యా.

అతను చాలా పర్‌ఫెక్షనిస్టనివిన్నాను. అయితే, అతని దగ్గరకు వెళ్ళిపోయి నన్ను నేను పరిచయం చేసుకుని, నెర్వస్‌గా ఫీలవుతున్నానని చెప్పాను. నా నిజాయితీ తనకు నచ్చిందనితర్వాత చెప్పాడు. నేను ఎప్పుడూ ముక్కుసూటిగానే వ్యవహరిస్తుంటా.

స్క్రిప్ట్‌లోదేనికి ప్రాధాన్యంఇస్తారు?

ఇది సృజనాత్మక రంగం. టెక్నికాలిటీలగురించి మాట్లాడలేము. రెండూ రెండూ కలిపితే నాలుగు అవడం అన్న సూత్రం ఇక్కడ అప్లయ్ అవదు. అది ఐదు, పది లేదా జీరో కావచ్చు. షేప్ ఉండదు. సరిహద్దుల్ని నిర్వచించలేం. కాబట్టి స్క్రిప్టులో ఏం చూస్తావ్? అంటే పలానాది అని క్లియర్‌గా చెప్పలేను.

అవకాశం వస్తే ఎవరి బయోగ్రఫీలో నటించాలన్న కోరిక ఉంది?

మధుబాల లేదా కల్పనాచావ్లా. వాళ్ళు తమ రంగాల్లో మంచి ప్రభావం చూపిన వ్యక్తులు.

వృత్తిరీత్యా వెనుకంజల్ని మీరు ఎలా ఎదుర్కొంటారు?

ఇదో ప్రయాణం. సెట్‌బ్యాక్స్ అనేవి సహజం. విభిన్నంగా ఎదుర్కొంటున్నాను. నాలుగేళ్ళక్రితంతో పోల్చితే ఇప్పుడు తీరుమారింది. ముందుకు కదిలిపోతుండాలి. పనిలో దృక్పథంతో, ప్రయత్నాలతో మాత్రం రాజీపడకూడదన్నది నా ఉద్దేశ్యం.

మీ తదుపరి ప్రాజెక్టులు?

'బట్టీ గుల్‌మెటర్ చాలు'లో షాహిద్ కపూర్, శ్రద్ధాకపూర్‌లతో కలిసి నటిస్తున్నాను. మరోసినిమా విక్కీ కౌశల్‌తో కలిసి చేస్తున్నాను.

ఓ సినిమాలో లాయర్‌గా, ఇంకోదానిలో నర్సుగా నటిస్తున్నాను.

ఎటువంటి అందాల కార్యక్రమాన్ని అనుసరిస్తారు?

పాజిటివ్‌గా, సంతోషంగా ఉండడం



వల్ల నా చర్మం అందంగా ఉంటుంది. ఎక్కువ నీరు తాగుతుంటాను. పడుకునేముందు మేకప్ తొలగించుకుంటాను. మాయిశ్చరైజింగ్ తప్పనిసరి. పండ్లు బాగా తింటాను.

మీరు సహజ చికిత్సలు ఎక్కువగా అనుసరిస్తారేమో?

(నవ్వేస్తూ) అవును. ఇంతకు ముందు వీటిగురించి పదేపదే చెప్పేదాన్ని. మాఅమ్మ ఈ ధోరణిని ఆపేయమన్నది. చర్మ సంరక్షణలో నేను అనేక గృహచికిత్సలు పాటించేమాట వాస్తవం. పనిలేనప్పుడు అస్సలు మేకప్ ఉపయోగించను.

చిన్ననాటి అనుభూతులు మీకు గుర్తుకువస్తుంటాయా?

బాగా. హిమాచల్‌ప్రదేశ్‌లో మా ఐదంతస్తుల భవనంలో బాల్కనీలో ఎక్కువసేపుండి, కిందనడిచే వాళ్ళపైన నీళ్ళు జిమ్మేవాళ్ళం. వాళ్ళు పైకి చూసేలోగా దాక్కునేవారం.

ఇవి వినడానికి సింపుల్‌గా వున్నా, కొన్ని అనుభూతులు అలా గుర్తుండిపోయాయి. వానలో డ్యాన్సులు, వాన నీటిలో కాగితం పడవలు వేయడం, పెళ్ళిళ్ళలో భోజనాలు- ఇవన్నీ మధురానుభూతులే.

మీరు బాగా ప్రశాంతంగా ఎప్పుడు ఫీలవుతుంటారు?

ఫ్లైట్‌లో. హాయిగా కూర్చుని ఏదో ఒకటి చదువుకోవడమో, మరేదో చేస్తుంటాను. నా కుటుంబంతో ఉన్నప్పుడూ ప్రశాంతంగా వుంటుంది.

ప్రశాంతత అంటే మౌనంగా వుండడం కాదు. వంద ఆందోళనలున్నా సంతోషంగా ఫీలవడం అన్నమాట.

మీలో రహస్యంగా దాగున్న ప్రతిభలు ఏవైనా ఉన్నాయా?

నాకు డ్యాన్స్ చేయడం చాలా ఇష్టం. నాలోని సామర్థ్యాలకు మరింత సాన పెట్టి నన్నునేను ముందుకు తోసుకోవాలని భావిస్తాను.

మీకున్న బలం ఏమిటి?

మా అమ్మ, నా సోదరి అంటూ ముగించింది యామీగౌతమ్.

అయినపూరి సుజాత

మట్టిలో ముత్యము

₹ 10,000 బహుమతి కథ

డా॥ ఎమ్.సుగుణారావు

సెల్ : 97046 77930

కలెక్టరు కార్యాలయం చాలా సందడిగా ఉంది. ఆ రోజే కొత్తగా పదవీబాధ్యతలు స్వీకరించడానికి కలెక్టరమ్మ రాబోతున్నారు. అందరికీ చాలా టెన్షన్‌గా ఉంది. ఇప్పుడు అందరికీ ఒకటే ఆందోళన. కొత్తగా వచ్చే కలెక్టరమ్మ ఎలా ఉంటుందో అని.

భారతదేశం మొత్తానికి మంచిర్యాంకులో ఐ.ఎ.ఎస్ పాసై సొంత రాష్ట్రంలోనే రెండేళ్ళు ఒక గిరిజన వికాస కేంద్రంలో ప్రాజెక్టు అధికారిగా పని చేసింది. ఆ రెండేళ్ళలో అద్భుత ఫలితాలు.

ముక్కుసూటిగా వెళుతుందనీ, ఎవరికీ భయపడదని. ఆవిడ సంగతులు తెలిసేసరికే కలెక్టరాఫీసు సిబ్బందికి భయం పట్టుకుంది.

అందరికీ మళ్ళీ టెన్షన్. ఇదివరకు కలెక్టరు ద్వారా చాలామందికి శ్రీముఖాలు, కొంతమందికి సస్పెన్షన్ ఆర్డర్లు అందాయి. ఇప్పుడు ఈమె ద్వారా ఏం అందుతాయో అని భయం పట్టుకుంది చాలామందికి.

పది కావడానికి అయిదు నిమిషాల ముందు ముఖద్వారం దగ్గర ప్రభుత్వ వాహనాలు, దానిని అనుసరిస్తూ కాన్వాయ్. ముందుగా వెనక ఆగిన వాహనంలోంచి దిగిన పోలీస్ కమీషనర్, కలెక్టరమ్మ గారికి సెల్యూట్ చేసి సాదరంగా ఆహ్వానించారు. వరసగా జాయింట్ కలెక్టరుగారు, ఇతర అధికారులు పూలగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

ఆమె అందరివంకా ఆప్యాయంగా చూస్తూ ముందుకు నడిచారు. ఆమె పొడుగ్గా, సన్నగా ఉన్నారు. చామన ఛాయరంగు.

"అమ్మయ్య, చాలా ప్రశాంతంగా కనిపిస్తున్నారు" అనుకుని చాలామంది కాస్త స్థిమితపడ్డారు. ఆమె మెట్ల మార్గం వైపు నడక మొదలెట్టింది. "అమ్మా లిఫ్ట్ వుంది..." డఫేదారు మెల్లగా చెప్పాడు.

"ఫరవాలేదు, రెండో ఫ్లోరేకదా" అంటూ నడవడం మొదలెట్టింది. మిగతా అధికారులూ ఆమెను అనుసరించారు. ఆమె పరిసరాలను పరిశీలనగా చూస్తూ నడుస్తున్నారు. మెట్లన్నీ పరిశుభ్రంగానే కాక, అద్దంలా మెరుస్తున్నాయి.

మెట్లకు ఇరువైపులా తాజా పూలతో కుండీలు, సౌరభం వెదజల్లుతూ స్వాగతం పలుకుతున్నాయి. కార్యాలయంలోని గదులు అన్నీ పరిశుభ్రంగా ఉన్నాయి. ఆమె వరుసగా గదులన్నీ చూస్తూ తన ఛాంబర్‌కు వచ్చారు.

ఆమె తనకు కేటాయించినసీట్లో కూర్చుని జాయినింగ్ రిపోర్టు మీద సంతకం చేశారు.

"కూర్చోండి" అంది ఆమె, అందరివంకా చూసి. వాళ్ళెవరూ కూర్చోలేదు. "సర్లే... నేను నిలుచుంటాను" అంది ఆమె. అంతా కూర్చున్నారు.

ఆమె చెప్పడం మొదలుపెట్టింది. "మన ఆఫీసును ఇంత పరిశుభ్రంగా చేసింది ఎవరు?"

"సీతమ్మ మేడమ్. అలాగే వాళ్ళాయన జోగులు" చెప్పాడు ఆఫీస్ సూపరింటెండెంట్ సూర్యారావు.

"వారిని పిలవండి" అందామె.

"వారు డైలీవేజ్ లేబర్, దినసరిఉద్యోగులు" చెప్పాడు హెడ్ క్లర్క్ నాగభూషణం.

"ఫరవాలేదు పిలవండి" అంది కలెక్టరమ్మ.

వెంటనే కబురు వెళ్ళింది. సీతమ్మ, జోగులు ఇద్దరూ వచ్చి దూరంగా నిలుచున్నారు.

కలెక్టరమ్మ సీట్లోంచి లేచారు. తన టేబుల్ మీద ఉన్న పూలగుత్తులను, పళ్ళు, స్వీట్లు ఉన్న ప్యాకెట్టును వారికి ఇచ్చారు. అందరికీ మరో ఆశ్చర్యం అది.

ఇన్నేళ్ళుగా దినసరి భత్యాలతో కాలం వెళ్ళదీస్తున్న తమకి కలెక్టరమ్మ చేసిన ఆ సత్కారంతో వారికి గుండె ఆగినట్టయింది. కళ్ళు చెమర్చాయి. ఆనందంగా అక్కడనుంచి కదిలారు, ఆమెకు రెండు చేతులూ జోడించి. ఆ సమయంలో అక్కడ సూది నేలమీద పడినా వినిపించే నిశ్శబ్దం.

"ఇక మీరు వెళ్ళవచ్చు" కలెక్టరమ్మగారి పిలుపుతో ఆ ఛాంబర్ అంతా నిష్క్రమించారు.

రోజులు గడుస్తున్నాయి.

కలెక్టరుగారి ఆఫీసులో ఉద్యోగులకు భారంగా కాదు, సంతోషంగా, ఆనందంగా. ప్రతీ సోమవారం గ్రీ వెన్స్ డే, బాధితుల విజ్ఞప్తులు స్వీకరించి, వాటిని పరిష్కరించే దిశగా పనిచేస్తారు. ఆ సమావేశంలో ఉద్యోగులంతా పాల్గొంటారు.

గ్రీవెన్స్ డే ఇంకా ప్రారంభమవుతుందనగా వేదిక మీదకు ఒక పుష్పగుచ్ఛం, ఒక కేకు ప్రత్యక్షమైనాయి. అందరికీ ప్రశ్నార్థకం. అంతలో కలెక్టరమ్మ గారు, సీనియర్ అసిస్టెంట్ రామారావును వేదిక మీదకు పిలిచారు. "మీకు జన్మదిన శుభాకాంక్షలు" అంటూ మేడమ్ ఆయనకు శుభాకాంక్షలు తెలియచేసి, ఆయన చేత కేక్ కట్ చేయించారు, ఊహించని ఈ సంఘటనకు విస్తుబోతూ అలా శిలాప్రతిమలా ఉండిపోయాడు రామారావు. అతను ఇంకో సంవత్సరంలో రిటైర్ కాబోతున్నాడు. తన పుట్టినరోజు తను మరిచిపోయాడు. అతని కళ్ళనుంచి జలజలా నీళ్ళు, అది సంతోషంతో కార్చిన కన్నీళ్ళు. అంతా ఆ దృశ్యాన్ని ఆనందంగా చూశారు.

రెండు నెలల తర్వాత...అభివృద్ధిపథాన నడుస్తున్న జిల్లాల్లో ఆ జిల్లాదేశం మొత్తానికి ప్రథమస్థానంలో నిల్చింది. కలెక్టరమ్మ గారికి ఢిల్లీ నుంచి ప్రత్యేక ఆహ్వానం అందింది ప్రధానమంత్రి వారినుంచి. ఆమె అవార్డు స్వీకరించి తిరిగి జిల్లా కేంద్రం చేరుకున్నారు.

కలెక్టరు ఆఫీసు సిబ్బంది, పురప్రజలు ఆమెకు పౌరసన్మానం ఏర్పాటు చేశారు. నగరంలోని ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో సన్మానసభ ఏర్పాటైంది. జనం, వందలు కాదు, వేలాదిమంది... సభకు అధ్యక్షులయిన రాజకీయప్రముఖులు కోదండంగారు మాట్లాడడం మొదలు పెట్టారు. "సభకు నమస్కారం, కలెక్టరమ్మగారు సరస్వతీపుత్రిక. వీరి తల్లిదండ్రులు బాగా చదివినవారైవుంటారు, అందుకే ఈ సంస్కారం. అహంకారం లేదు, గర్వం లేదు, అందరినీ సమదృష్టితో చూసే విశ్వప్రేమ.." అలా ఆమె గుణవిశేషాలను చెప్పి కూర్చున్నారు.

ఆ తర్వాత జాయింట్ కలెక్టరు రామాంజనేయులు, ఇంకా ఇతర అధికారులు మాట్లాడారు. ఇక కలెక్టరమ్మ గారు మాట్లాడవలసిన సమయం వచ్చేసింది. ఆవిడ లేచినుంచున్నారు. సభలోని అందరికీ అభివాదం చేశారు. ఒక్కక్షణం కళ్ళు మూసుకున్నారు చెప్పడం మొదలుపెట్టారు.

"నాకు జరిగిన ఈ సత్కారానికి కృతజ్ఞతలు. నా గురించి మాట్లాడిన వ్యక్తులు సెలవిచ్చినట్టుగా మా తల్లిదండ్రులు విద్యాధికులు కాదు. మా నాన్న అపార్ట్‌మెంటులో వాచ్‌మేన్.

మాది శ్రీకాకుళం జిల్లాలో ఒక పల్లెటూరు. మా నాన్న అమ్మను తీసుకుని విశాఖ పట్నం వచ్చాడు.

ఒక అపార్ట్‌మెంట్ కడుతున్న దశలో మేస్త్రీ దగ్గర కూలీగా చేరాడు. అప్పటికి నా తల్లి నన్ను కడుపులో మోస్తోంది. అపార్టుమెంటు పూర్తయ్యేసరికే నేను భూమ్మీద పడ్డాను.


Kadali

మానాన్నకు ఆ అపార్ట్‌మెంట్‌లోనే వాచ్‌మెన్ పని కుదిరింది. ఆయన సంపాదించే దాంట్లో సగం తాగుడికే సరిపోయేది. పసికందునైన నన్ను మోస్తూనే అమ్మ, నాన్నకు వండిపెట్టేది.

అలాగే అపార్టుమెంటులోని ఇళ్ళల్లో పాచిపనికి కుదిరింది. మా నాన్న అపార్టుమెంటులో వాచ్‌మేన్ డ్యూటీతోపాటు ఎవరేం చెప్పినా చెయ్యాలి, అలాగే ఇంటింటికీ వెళ్ళి చెత్త బుట్టలు సేకరించి ఉదయం పదికల్లా మునిసిపాలిటీ బండివచ్చేవేళకి వాటిని అప్పగించాలి. నాకు ఐదేళ్ళు రాగానే అమ్మ నన్ను మాకు దగ్గరలోని ఒక దుంపలబడిలో నన్నుచేర్పించింది.

మా నాన్న తన చెత్త సేకరించే డ్యూటీ మా అమ్మను చేయమనేవాడు, అమ్మ నన్ను చంకనేసుకుని ఇంటింటికీ తిరిగి ఉదయం పదికల్లా ఆ చెత్తబుట్టలు మునిసిపాలిటీ బండికి అప్పగించేది, అలాగే నన్ను స్కూలుకు తీసుకెళ్ళేది.

మా అమ్మను, నన్ను చూడగానే మాష్టార్లు, విద్యార్థులు ముక్కున వేలేసుకునేవారు. మా అమ్మ నన్ను ఎత్తుకుని తిరగడంతో ఆమెనుంచి వచ్చే చెత్తవాసన, నాకూ వచ్చేది.

పిల్లలు దూరంగా జరిగి కూర్చునేవారు. మా అమ్మ నన్ను 'చిన్ని' అని ముద్దుగా పిలుచుకునేది.ఐతే మా మాస్టార్లు నా క్లాస్‌మేట్లు నాపేరు మార్చేశారు... ఏం పేరో తెలుసా?!" ఆమె చెప్పడం ఒక్క క్షణం ఆపింది."మా అమ్మ ముద్దుగా పెట్టుకున్న 'చిన్ని' అనే పేరును 'శని'గా మార్చేశారు.

ఒక్కసారిగా ఆ ప్రాంగణంలో నిశ్శబ్దం. అంతా తలొంచుకున్నారు. కొంతమంది కలెక్టరమ్మ చెపుతున్న ఆ మాటలకు మనసులోనే దుఃఖించారు.

ఆమెతిరిగి తనమాటలను కొనసాగించారు.

"నాకు మా అమ్మానాన్నలు పేరు పెట్టలేదు, మొదటి సారి స్కూల్లో చేరినప్పుడు రిజిష్టరులో నా పేరు 'దుర్గమ్మ కూతురు' అని రాశారు హెడ్‌మాస్టారు. ఐతే నాపేరు మాత్రం అందరికీ శని అయింది. నేను అమ్మతో స్కూల్లోకి రాగానే 'ఇది మనకు 'శని'లా దాపరించింది అనేవారు.

మాస్టార్లు, విద్యార్థులు నన్నెవరూ దగ్గరకు రానిచ్చేవారు కాదు. నేను ఒంటరిగా అందరికన్నా వెనక కూర్చునేదాన్ని. ఇక అపార్ట్‌మెంట్‌లో మానాన్నఅందరికీ సేవకుడైతే, మా అమ్మ ఆయనకు సేవకురాలు, ఆయనకు ఇంట్లో గౌరవం ఉండేది. అందరూ ఆయనపై చూపిన అహంకారాన్ని అమ్మపైన చూపించేవాడు. అయినా అమ్మ మౌనంగా భరించేది.

ఆయన స్నానం చేయడానికి వేడినీళ్ళు, అలాగే వేడిగా అన్నం, కూర వండిపెట్టేది. తాగిన మైకంలో అమ్మను తిట్టడం, కొట్టడం చేసేవాడు. అందుకే బాగా చదువుకుని అమ్మకు ఒక గుర్తింపు తేవాలనుకున్నాను. ఏ ప్రేమకూ, సుఖానికి నోచుకోని అమ్మను నలుగురి ముందు నిలబెట్టాలనుకున్నాను.

అందుకే బాగా చదువుకున్నాను.బాగా తాగి తాగి మా నాన్న చనిపోవడంతో మా అమ్మ బ్రతుకు మరీ దుర్భరమయింది. అయినా రెక్కలు ముక్కలు చేసుకుని నన్ను చదివించింది. ఈ నా ప్రయాణంలో ఎందరో దురహంకారుల మధ్య మసలిన నాకు సంయమనం, సహనం పరిస్థితులే నేర్పాయి.

నేను ఎలిమెంటరీ స్కూలు మొత్తానికి ప్రథమ శ్రేణిలో పాసయ్యాను.

జిల్లా పరిషత్ స్కూల్లో చేరే ముందు, మా హెడ్ మాస్టారు నాలిక్కరుచుకున్నారు. కారణం... నాపేరు రిజిస్టరులో 'దుర్గమ్మ కూతురు' అనే ఉంది. ఆయన నీ పేరు మారుస్తానన్నారు. నాకు అది ఇష్టంలేదు... నాకు 'దుర్గమ్మ కూతురు' అని పిలిపించుకోవడమే ఇష్టం. ఇక అంతా చరిత్రే... ఇప్పుడు మీ ముందు ఈ దుర్గమ్మ కూతురు ఐ.ఎ.ఎస్... దుర్గమ్మకూతురిని చూశారు. ఇప్పుడు దుర్గమ్మను చూడండి..." అలా అంటూ ఆమె ముందు వరుసలో కూర్చున్న తనతల్లి దుర్గమ్మను తనే స్వయంగా వేదికమీదకు తీసుకుని వచ్చారు. సభ అంతా ఒక్కసారి స్టాండింగ్ ఒవేషన్... చప్పట్ల వర్షంతో సభ అంతా తడిసింది.

సభలో అందరికీ ఒక అద్భుతం దర్శించిన అనుభూతి. వేదనలనుంచి విజయపథం వైపుగా పయనించిన దుర్గమ్మ కూతురి వంక అంతా అభినందన పూర్వకంగా చూశారు. వెంటనే వేదికమీద ఆసీనులైన జాయింట్ కలెక్టర్‌గారు లేచి నిలబడ్డారు. ఒక్క క్షణం కలెక్టరమ్మగారి వంక చూసి "మీరు అనుమతిస్తే రెండు మాటలు మాట్లాడతాను" అన్నారు.

ఆమె నవ్వుతూ చెయ్యి ఊపారు. ఆయన చెప్పడం మొదలుపెట్టారు. "ఈ మధ్యనే 118 దేశాలు పాల్గొన్న ప్రపంచసుందరి పోటీల్లో మన భారతదేశపు అమ్మాయి,మానుషీ ఛిల్లర్ విజేతగా నిలిచారు.ఆమెను విజేతగా నిలబెట్టినప్రశ్న "ప్రపంచంలోకెల్లా ఏవృత్తి ఎక్కువజీతం పొందగలిగేది?!" అని.

అందుకు ఆమె ఇచ్చిన సమాధానం, "ఆ గౌరవం దక్కాల్సింది అమ్మకే... అమ్మతనాన్ని మించిన ఉద్యోగం లేదు, కలెక్టరమ్మ గారు బాల్యంలోనే తన తల్లిని గుర్తించారు. అందుకే 'దుర్గమ్మ కూతురు' అని తన పేరును పెట్టుకున్నారు.

దీనికి కారణం ఆమె 'ఆటిట్యూడ్'. మన సామాజిక విశ్లేషణప్రకారం జీవితంలోగెలవాలంటే ప్రతివారికీ కావలసింది హార్డ్‌వర్క్ కాదు, నాలెడ్జ్ కాదు, లవ్ కాదు, లక్, మనీ, లీడర్‌షిప్, ఇవేమీ కాదు కావలసింది ఆటిట్యూడ్ అంటే వ్యక్తిత్వం.

ఆ వ్యక్తిత్వంఉంటే గ్రహాలన్నీ ఏకమై విజేతలుగా నిలబెడతాయి, చిన్నతనంలో శనిగా ముద్రపడిన ఈమెను విజయపథాన నడిపించింది ఈ Attitude. గణితపరంగా చూస్తే ATTITUDE కు వంద మార్కులు వస్తాయి.

1+20+20+9+20+21+4+5=100. అంచేత మన పిల్లలు, కలెక్టరమ్మ గారిలా రాణించాలంటే కావలసింది ATTITUDE. అందుకు 'దుర్గమ్మ కూతురుకు జై' ఆయన ఉద్వేగంగా చెప్పాడు.

సభ అంతా ఒక్కసారి 'దుర్గమ్మ కూతురు లాంగ్ లివ్' 'డాటరాఫ్ దుర్గమ్మ నీకు జేజేలు' వంటి నినాదాలతో మరోసారి మారుమ్రోగింది.

సముద్ర, వాయుమార్గాలను అన్ని దేశాలూ సమానంగా వినియోగించుకునే హక్కు కలిగివుంటాయి.
-నరేంద్రమోడీ, ప్రధాని





కామెడీ కష్టం

బాలాజీ టెలీఫిలిమ్స్ వెబ్ సిరీస్ షూటింగ్‌లో బిజీగా వున్న గాయత్రి అయ్యర్ తన తెలుగు సినిమా 'దేశముదుర్స్' విడుదలకోసం ఆత్రుతపడుతున్నది. హారర్, కామెడీ సినిమాల్లో నటించడం సులువైన విషయం కాదంటున్నది.

"ఇలా కామెడీ సినిమా చేయడం ఇదే మొదటి సారి.వినోదం పండించడం సులువు కాదనే సంగతి నాకు అర్థం అయింది" అంటున్న గాయత్రి అయ్యర్ ఈ సినిమాలో యాక్షన్ సన్నివేశాలకోసం బెక్వాండోలో శిక్షణ తీసుకున్నది. ఇదంతా చాలా కష్టమైన ప్రక్రియ అంటున్నది.

హెల్త్ బిట్స్

పిండంపై మందుల ప్రభావం



కడుపుతో వున్నవారి ఆలోచనలు పరిపరి విధాల పోతాయి. ఆ ఆలోచనలు, కడుపులో పెరుగుతున్న బిడ్డ ఆరోగ్యం, క్షేమం గురించిన ఆదుర్దా చాలామందిని డిప్రెషన్‌లోకి నెడు తుంటాయి. అటువంటి సమయంలో పెద్ద వాళ్ళు పక్కన వుండి ఆ భయాందోళనలు పోగొడుతూ, తగిన సూచనలు చేస్తూ డిప్రెషన్ లోకి వెళ్ళకుండా కాపాడతారు.

అందరికీ పెద్దవారి సహకారం వుండదు. వారు డిప్రెషన్‌లోకి వెళతారు. డిప్రెషన్ నుండి బయటపడేందుకు వైద్యులు ఇచ్చేటువంటి యాంటీ డిప్రెసెంట్ మందుల ప్రభావం కడుపులో పెరిగే శిశువుమీద వుంటుంది.

ముఖ్యంగా మెదడులోని భావోద్వేగాల నియంత్రణ భాగంమీద పడుతుంది.

డిప్రెషన్‌కి గురైనటువంటి తల్లుల బిడ్డలు, బరువు తక్కువగా పుట్టటం, నెలలు నిండకుండా పుట్టటం జరిగితే, డిప్రెషన్‌కి విరుగుడు మందులు వాడిన తల్లుల పిల్లలలో ఎదిగిన తర్వాత ఆదుర్దా అధికంగా కనిపిస్తున్నది. వారు చిన్నవయసులోనే అకారణంగా డిప్రెషన్‌లోకి వెళుతుంటారు. ◆

మీకు తెలుసా!

మనిషిని ఎక్కువకాలం జీవించి వుండేలా చేసేది ఏమిటి! చదువా! సంపదా!

ఈ విషయంమీద జరిగిన అధ్యయనంలో బాగా చదువుకున్నవారు, బాగా సంపద వున్న వారికన్నా ఎక్కువ కాలం బతుకుతారని తేలింది. చదువుకు, ఆయుర్దాయానికి వున్న సంబంధం ఏమిటో మాత్రం వివరించలేదు వారు. ◆



Courtesy : UNISHKURI



బరువు తగ్గించే దంపుడు బియ్యం

వడ్లు దంచి, జల్లెడపట్టి హాయిగా రుచికరమైన దంపుడు బియ్యం తిన్న రోజులలో ఎంత హాయిగా జీవించారో మన పెద్దలు. ఆ తర్వాత బియ్యానికి పాలిష్ పెట్టటం మొదలుపెట్టారు.

ఇప్పుడు తెల్లటి బియ్యం తప్పించి మరొకటి ఊహించుకోలేని తరం తయారయింది.

పోషక పదార్థాలు అన్నీ కోల్పోయినతర్వాత అందిస్తున్న బియ్యాన్ని ఇప్పుడు తింటున్నారు.

ఇది అధిక క్యాలరీలు పీల్చుకునేలా చేస్తున్నది. బరువు పెరుగుతున్నారు.

లావుగా వున్నవారు పాలిష్ చేసినటువంటి బియ్యం వదిలి ముదురు లేదా దంపుడు బియ్యానికి మారినట్లయితే త్వరగా బరువు తగ్గుతారు.

గతంలో తిన్న కూరగాయలు, పండ్లు, వ్యాయామ విధానం అలాగే ఉంచుతూ కేవలం బియ్యంమాత్రంమారిస్తే చాలు,దీని వలన శరీరంలోకి గతంలోకి చేరిన క్యాలరీలకన్నా కనీసంగా వంద క్యాలరీలు తక్కువ చేరతాయి.

అంటే అరగంటసేపు వేగంగా నడిస్తే ఎన్ని క్యాలరీలు ఖర్చు అవుతాయో, అటువంటి క్యాలరీలను అసలు శరీరంలోకి రాకుండా కాపాడుకుంటారు. దంపుడు బియ్యం రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరుస్తుంది. అలాగే జీర్ణనాళంలో మేలుచేసేటువంటి బ్యాక్టీరియాలు కూడా పెరుగుతాయి. ◆

నమస్కారం... జ్ఞాపకం

కొత్తవారిని పరిచయం చెయ్యగానే కరచాలనం చెయ్యటం నేటి పద్ధతి. కాని సాంప్రదాయ పద్ధతి ప్రకారం రెండు చేతులు కలిపి నమస్కరించటం.



రెండు అరచేతులు తాకించి, వేళ్ళను తాకించి హృదయానికి దగ్గరగా చేతులు వుంచి చేసేటువంటి నమస్కారంవలన అవతలి వ్యక్తి ముద్ర మనసులో స్థిరంగా వుంటుంది. రెండు అరచేతులు, వేళ్ళ చివరలు కలపటంవల్ల ఆ యా ప్రాంతాలలో ఏర్పడేటటువంటి ఒత్తిడివల్ల జ్ఞాపకశక్తి మెరుగవుతుంది. కాబట్టి అటువంటి పద్ధతిలో 'నమస్కారం చెయ్యండి... కరచాలనం ఆపండి' అన్నది సూచన.


కదిలే బొమ్మల కబుర్లు

పని చూసి గర్వపడాలి

అందం చూసుకుని కాకుండా పని చూసుకుని గర్వపడాలన్నది అదితీరావ్ హైదరీ అభిప్రాయం.

'చెలియా'తో తెలుగువారిని మెప్పించిన అదితి మరోమారు ఇక్కడి ప్రేక్షకుల్ని 'సమ్మోహన' పరచబోతున్నది. "అందం అనేది అమ్మానాన్నల జీన్స్ నుంచి వస్తుంది. మనం ఎక్కువగా ఆలోచించాల్సింది చేసే పనిగురించి. సున్నితంగా వుండి కళలపట్ల విపరీతమైన ఇష్టంగలవారంటే నాకు అభిమానం.

నా దృష్టిలో చర్మం తెల్లగా వుంటే అందం కాదు. అంతర్గతంగా కాన్ఫిడెంట్‌గా వుండడమే అందం" అని చెప్పింది అదితీరావ్ హైదరీ. ◆



Review

కాలా- తమిళ రాజకీయాల కోసం

రజనీకాంత్ సినిమా అంటేనే టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్ ఇలా అన్నీ వీర ఆవేశంతో ఊగిపోతాయి. విడుదల దగ్గరకు వచ్చిందంటే ఇక అభిమానులకు వీరావేశమే. ఆ అభిమానాన్ని సొమ్ము చేసుకునేందుకు కంపెనీలు క్యూకట్టేస్తాయి.

అలాంటిది అంతగా హడావుడి లేకుండా, సాదాసీదాగా విడుదలైన సినిమా 'కాలా'. ఈ పరిస్థితికి కారణం, ఈ మధ్య రజనీ సినిమాలు అన్నీ బాక్సాఫీస్ దగ్గర వరుసగా విఫలం కావడమే.

'కబాలి' వంటి సినిమాను అందించిన దర్శకుడు రంజిత్‌తోనే రజనీ చేసిన మరో సినిమా 'కాలా'. దర్శకుడు రంజిత్‌కు కాస్త పొలిటికల్ అయిడియాలజీ బలంగా వుంది. ముఖ్యంగా కమ్యూనిజం, దళిత వాదం వంటి వాటిపై అవగాహన, ఆలోచన, అభిమానం వంటివి వున్నాయి.

అందువల్లనే 'కబాలి' సినిమాలో ఈ అంశాలన్నీ అలా అలా తొంగిచూస్తాయి. కానీ 'కాలా' సినిమానే ఆ అయిడియాలజీ నేపథ్యంలో రాసుకున్న కథతో తయారయింది. భూమి అన్నది డబ్బున్నవారు, రాజకీయ నాయకులు ఆస్తిగా, అధికారంగా భావిస్తే, పేదవారికి అది జీవితం అన్నది 'కాలా' సినిమాలో చర్చించిన ప్రధానమైన పాయింట్.

నిజానికి 'కాలా' సినిమాలో కథ కొత్తదేమీ కాదు. సవాలక్ష తెలుగు ఫక్తు కమర్షియల్ సినిమాల్లో చూసిందే. ఊరి మధ్యలో విలువైన స్థలం, అది పేదవారి హక్కుభుక్తంలో వుండడం, దానిని చేజిక్కించుకోవాలని ఎవరోఒకరు పన్నాగంపన్నడం, ఆ పేదలకు నాయకుడిగా కథానాయకుడు వుండడం. ఇదీ లైను.

ఇలాంటి సినిమాలు ముందే చెప్పినట్లు సవాలక్ష వచ్చాయి. అయితే ఇదే కథను ఓ పొలిటికల్ అయిడియాలజీతో చూసి, రాజకీయపు రంగులు అద్ది, సైద్ధాంతిక చర్చలు అక్కడక్కడ చొప్పించి తయారుచేసిన సినిమా 'కాలా'. అంతకుమించి గొప్పదనం లేని 'కాలా' కథేంటీ అంటే...

ముంబయిలోని అతిపెద్ద మురికివాడ ధారావి. అక్కడ వుండే జనాల నాయకుడు కాలా అలియాస్ కలికాలన్ (రజనీకాంత్).

అయితే పట్టణ సుందరీకరణ పేరిట అక్కడ అపార్ట్‌మెంట్‌లు కట్టి జనాలకు ఇచ్చి, మిగిలిన ప్లేస్‌ను కార్పొరేట్ సంస్థలకు అప్పగించి లబ్ధిపొందాలన్నది హరిదాదా (నానా పటేకర్) ఆలోచన.


నిలకడ వ్యాయామాలు

బొద్దుభామ సోనాక్షిసిన్హా నాజూకుమొగ్గయిపోయి తన అందాల రహస్యాలను అవకాశం వచ్చినప్పుడల్లా విప్పి చెప్తుంటుంది.

ఇప్పుడూ అదే బాణీ వినిపించింది. "నిలకడగా సాగించే వ్యాయామాలే నా ఫిట్‌నెస్‌కు కారణం. చేసే వ్యాయామాలు ఎటువంటివి అయినా క్రమం తప్పకుండా కొనసాగించాలి. తొందరపడుతూ, ఇష్టం వచ్చినట్లు పదేపదే మార్చకూడదు.

నేను కఠినవ్యాయామాలు చెయ్యను. నా శరీరానికిసరిపడేవే చేస్తాను తప్ప, ఒక్కసారిగా అద్భుతాలు జరగాలనికోరుకోను.ఇతరులతో పోల్చుకుంటూ ఏవిపడితే అవి అస్సలు చెయ్యను"అని తెలిపింది. ◆





స్థలాలు మావే అని, ఇచ్చేది లేదని, ప్రభుత్వం సాయం చేయాలనుకుంటే డబ్బులు ఇస్తే, తామే ఇళ్ళు కట్టుకుంటామన్నది 'కాలా' వాదన.

ఇలాంటి నేపథ్యంలో ఏయే సంఘటనలు జరిగాయి, హరిదాదా ఎన్ని ప్రయత్నాలు, ఎలా చేశాడు, కాలా వాటిని ఎలా ఎదుర్కొన్నాడు. చివరకు ఏమయింది అన్నది మిగిలిన సినిమా.

కాలాకు వున్న అతి పెద్ద సమస్య, పాతచింతకాయ పచ్చడి లాంటి కథ. తెలుగు టాప్ హీరోలంతా ఇలాంటి కథలతో సినిమా చేసినవారే. ఇలాంటి కథకు దర్శకుడు రంజిత్ రాసుకున్న కథనం అంతకన్నా ఇబ్బందిగా వుంది. అలా అనడంకన్నా, సరైన కథనం రాసుకోవడంలో దర్శకుడు రంజిత్ పూర్తిగా విఫలమయ్యాడు అనే చెప్పాలి.

ఎందుకంటే తనది కావచ్చు, రజనీకాంత్ రాజకీయరంగప్రవేశం దృష్టిలోవుంచుకుని కావచ్చు, కొన్ని సిద్ధాంతాల నేపథ్యంలో కథనం తయారుచేసుకోవాలి అనుకున్నపుడు, నిర్మొహమాటంగా ముందుకెళ్ళాలి. అక్కడ రజనీ హీరోగా వున్నా, మరెవరు వున్నా.

కానీ దర్శకుడు అలా చేయలేదు. సినిమాలో రకరకాల గెంతులు గెంతాడు. ధారావి స్లమ్ జనాల సమస్య కన్నా, రజనీ ఇంటి వ్యవహారాలు, రజనీ గత కాలపు ప్రేమ, రజనీ కుటుంబ సభ్యుల అనుబంధాలు, సంబంధాలు, ప్రేమలు ఇలా అక్కడే ఎక్కువగా కథ తిరుగుతుంది. ధారావి స్లమ్‌లో బతుకు ఎంత భారంగా వుంటుందో?

ఎంత ఇబ్బందులతో కూడి వుంటుందో అన్నది పెద్దగా టచ్ చేయలేదు. పైగా వారంతామంచి హుషారుగా వుంటారు.

ధారావి జనాలకు కామన్ లెట్రిన్ వుంటుంది. వాళ్ళ నాయకుడు 'కాలా' ఇల్లు మాత్రం బ్రహ్మాండంగా వుంటుంది.

మాంచి ఫోర్ వీలర్, ఏసిలు, భార్య మెడనిండా నగలు. పలుచట్టాలు, వర్ణాలు, నలుపు, ఆహారపు అలవాట్లు ఇవన్నీ మాటల్లోనే తప్ప, సినిమాలో సన్నివేశాల్లో ఎక్కడా బలంగా చెప్పే ప్రయత్నం జరగలేదు. దీనివల్ల కథనం రెండు విధాలుగా దెబ్బతింది.

ఒకటి నీరసంగా, అక్కడిక్కడే తిరిగినట్లు అనిపించడం. రెండవది ధారావి సమస్యపై ప్రేక్షకుల్లో అవగాహన కల్పించలేకపోవడం అన్నది.

నిజానికి ప్రేక్షకుల్లో మరో రకమైన ఆలోచన కూడా కలుగుతుంది. కనీసం ఓ మరుగుదొడ్డి కూడా లేకుండా వుండేకన్నా, స్థలం ప్రభుత్వానికి ఇచ్చి, విశాలమైన అపార్ట్‌మెంట్, సకల సదుపాయాలు తీసుకుంటే తప్పేంటి అన్న ఆలోచన కలుగుతుంది.

ఇక్కడ భూమి హక్కు సమస్య ఏమిటి? అన్నది దర్శకుడు క్లారిటీగా చర్చించలేకపోయాడు. ఒక దశలో కాలా కొడుకు 'కాలా' మాజీ ప్రియురాలు కూడా ప్రేక్షకుల మాదిరిగానే, ప్రాజెక్టుకు ఓకె అంటే తప్పేమిటి? అనే ఆలోచనకు వస్తారు.

భూమి మీకు అధికారం, భూమి మాకు జీవితం అంటాడు కాలా. తను మాత్రం సకల సదుపాయాలతో బతికేస్తూ, జనాలను మాత్రం అరకొర సౌకర్యాల్లోనే బతుకుతూ వుండాలంటాడు. ఒక విధంగా కథనం ఇలాగే వుంటుంది. అందువల్లే ప్రేక్షకులు కథలో లీనం కావడం అంతగా జరగదు. అదే సమయంలో ధారావిస్లమ్‌లోవున్నవారు వివిధప్రాంతాలు, మతాలు, వర్ణాలు, వర్గాలకు చెందినవారు. ఇది సహజం.

కానీ దర్శకుడు వారంతా ఒకే ఒక వర్గం, ఒకే ప్రాంతం, ఒకే వర్ణం అన్నట్లు. ఇదంతా ఓ ఐడియాలజీకి, రాజకీయానికి, ధన దాహానికి మధ్య పోరాటం అన్నట్లు చిత్రీకరిస్తాడు.

ఇదంతా ప్రేక్షకులకు అంతగా అర్థంకాదు. ఇవన్నీ సైద్ధాంతిక వైఫల్యాలు అయితే, రజనీకూడా అభిమానులను, ప్రేక్షకులను ఆకట్టుకునే అవకాశంలేని కథనం తయారుచేశాడు దర్శకుడు.

అలాగే కాలా, అతనిభార్య మధ్య వచ్చే ఎపిసోడ్‌లు కూడా కృతకంగా వుంటాయి. వీటన్నిటికీ తోడు సినిమాలో సరైన ఆకట్టుకునే నటులు లేరు.

కేవలం నానాపటేకర్, రజనీమాత్రమేకీలకం. దర్శకుడు తన భావజాలానికి అనుగుణంగా నానాపటేకర్ చుట్టూ తెలుపువర్ణం, కాలా వర్గంచుట్టూ నలుపు వర్ణం ఫిక్స్ చేసి వదిలేశాడు అలాగే క్లయిమాక్స్‌ను మేధోజనిత ఆలోచన పూర్వకంగా అన్నట్లు నలుపు, నీలివర్ణాలు వాడి హడావుడి చేశారు. ఇవన్నీ కామన్ ప్రేక్షకులకే కాదు, మెజారిటీ ప్రేక్షకులకు చేరవు.

అయితే కొంతలో కొంత నయం ఏమిటంటే, రజనీతో చేయించిన ఓ ఫైట్, పోలీస్ స్టేషన్, నానా పటేకర్‌ను అడ్డుకునే సీన్, వంటివి ఆకట్టుకుంటాయి. కేవలం వీటిమీద ఆధారపడి సినిమామాత్రంనడవదు. రజనీ స్టయిల్ సంభాషణలకన్నా, దర్శకుడి భావజాలాన్ని తెలియచెప్పే సంభాషణలు ఎక్కువ.

సినిమాలో ఒక్కపాట కాస్త బాగుంటుంది కానీ చిత్రీకరణ రీత్యా ఆకట్టుకోదు. మిగిలిన పాటలు ఏదేదో చేశారు. నేపథ్య సంగీతం మాత్రం సంతోష్ నారాయణ్ బాగా చేశారు.

సినిమాటోగ్రఫీ, ధారావి సెట్ బాగున్నాయి. మొత్తంగా చూసుకుంటే పాత కథను తీసుకుని, లిమిటెడ్ ఏరియాలో, తక్కువ బడ్జెట్‌తో, అతితక్కువ పరిచయం వున్న నటులతో, రజనీకాంత్ సినిమాగా ప్రాజెక్ట్‌చేస్తూ అందించిన సినిమా 'కాలా'.

ప్లస్‌పాయింట్స్...
రజనీకాంత్

మైనస్‌పాయింట్స్...
కథ, కథనాలు

పంచ్‌లైన్
కాలా... అంత బా...లా ◆

మేఘాలలో...

తెలుగు పరిశ్రమలో మెరుపులు వెదజల్లాలన్న ఆశతో తమిళనాటనుంచి తరలివచ్చిన మేఘా ఆకాష్ మొదటి రెండు చిత్రాలూ బాక్సాఫీస్ వద్ద బోల్తాపడ్డాయి. 'లై', 'చల్‌మోహన్‌రంగా' సినిమాల తర్వాత మళ్ళీ కోలీవుడ్ వెళ్ళి కూతపెట్టాలని మేఘాల్లో విహరించింది.

ఈ సమయంలోనే సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించబోయే సినిమాలో అవకాశం వచ్చిందన్నది వినికిడి. ఈ సినిమాలో యువనటుడు సనంత్ సరసన నటించనున్నది. ఏదో ఒకటిలే 'రజనీ' సినిమాలో భాగంఅన్న క్రెడిట్అయితే దక్కుతున్నది కదా! ◆





అబ్బురమైన అనుభవం

ముంబయి మోడల్ రుహానిశర్మ తెలుగు చిత్ర పరిశ్రమలో పనిచేయడం అబ్బురంగా వుందం టున్నది. సుశాంత్ సరసన 'చి ల సౌ' సినిమాలో ఈ అమ్మాయి నటిస్తున్నది.

"ప్రపంచ ప్రమాణాలకు ధీటుగా సినిమాలు తీస్తున్న తెలుగు సినిమాతో కెరీర్‌కు శ్రీకారం చుట్ట గలగడం నా అదృష్టం. మొదట్లో నెర్వస్‌గా ఫీల య్యాను. భాష నాకు కొత్త. అయితే దర్శకుడు రాహుల్, సుశాంత్, చిత్రబృందం నా భయాన్ని పోగొట్టారు. ఇరవై మూడేళ్ళ వర్కింగ్ ప్రొఫెషనల్‌గా నటిస్తున్నా" అని తెలిపింది రుహానిశర్మ. ◆



నాలుగు భాషల్లోనూ

మలయాళ 'ప్రేమమ్'తో పరిశ్రమలోకి ప్రవే శించిన మడొనా సెబాస్టియన్ తెలుగు 'ప్రేమమ్' లోనూ కనిపించింది.

తమిళచిత్రమూ చేసింది. ఇప్పుడు కన్నడ పరి శ్రమలోనూ కాలుపెడుతున్నది.

'ఈగ'విలన్‌గా ఫామ్‌లోకి వచ్చిన సుదీప్ కన్న డంలో చేస్తున్న సినిమాలో మడొనా హీరోయిన్. మొత్తంమీద కెరీర్ ఆరంభదశలోనే నాలుగు దక్షి ణాది భాషల్లోనూ నటించిన క్రెడిట్ దక్కించు కున్నది ఈ కేరళ పిల్ల. ◆



ముచ్చటగా మూడోసారి

'సాహసం శ్వాసగా సాగిపో' ఫేమ్ మంజిమా మోహన్ 'క్వీన్' మలయాళ రీమేక్‌లో 'జామ్‌జామ్'గా నటిస్తూనే మరో కొత్త ప్రాజెక్టుకు సంతకాలు చేసింది. గౌతమ్ కార్తీక్ హీరోగా నటిస్తున్న 'దేవరదమ్' సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నది.

"ఈ చిత్రబృందంలో జాయిన్ అయినందుకు చాలా సంతోషంగా ఉంది. షూటింగ్ ఎప్పుడు ఆరంభం అవుతుందా అని ఆత్రుతగా ఎదురుచూస్తు న్నాను" అని తెలిపింది. గత సంవత్సరం రెండు తమిళ సినిమాల్లో నటించిన మంజిమామోహన్ ముచ్చటగా మూడో సినిమా చేస్తున్నది. ◆

సన్నీ సాహసాలు

శృంగార తార సన్నీలియోన్ తన తొలి తమిళ చిత్రం 'వీరమాదేవి'తో తన ఇమేజ్‌ను పూర్తిగా మార్చేసే ప్రయత్నాల్లో పడింది.

పాత్రకోసం సన్నీ సాహసాలు చేస్తున్నది. పోరాట సన్నివేశాల్లో డూప్ లేకుండా నటిస్తున్నదట. ఈ విష యాన్ని స్వయంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. "కత్తి యుద్ధాలు నేర్చుకుంటున్నాను. అందమైన గుర్రాలపై స్వారీ చేస్తున్నా.

ఇదంతా ఓ అద్భుతమైన అనుభవం" అంటూ కేరింతలు కొడుతున్నదీ కెనడియన్ భామ. ◆

ఎలా ఆడుతున్నాయి?

- గతవారం విడుదలయిన 'ఆఫీసర్' సినిమా పరమ డిజాస్టర్‌గా మిగిలింది.
- 'అభిమన్యుడు' సినిమా మంచి కలెక్షన్లు నమోదు చేసింది. తొలివారం వరల్డ్‌వైడ్‌గా 12 కోట్లవరకు గ్రాస్ వసూళ్ళు సాగించింది.
- 'రంగస్థలం', 'భరత్ అనే నేను' సినిమాలు యాభై రోజులు దాటినా ఇంకా చాలా సెంటర్లలో షేర్ వసూలు చేస్తున్నాయి.
- 'కాలా'సినిమా తెలుగునాట డైరెక్ట్‌గా విడుదలచేసు కున్నారు. ఐతే రజనీ సినిమాల్లో ఇదే అతితక్కువ ఓపెనింగ్స్ రాబట్టిన సినిమా అనుకోవాలి.



చివరి రోజుల్లో...

శశికపూర్ (1938-2017)

సినీరంగంలో ప్రేమలు, పెళ్ళిళ్ళ గురించిబయటి ప్రపంచానికి అంతగా సదభిప్రాయం లేదు. సినీరంగంలో సంబంధాలన్నీ ఆర్థికపరమైనవి లేదా అవసరాలకు సంబంధించినవి అనుకోవటం సహజం. ఒకరికొకరు అనుకునే రీతిలో సినీసంబంధాలు ఉంటాయని చెప్పినా నమ్మలేనంతగా సినీ ప్రేమసంబంధాల మీద ప్రచారం వుంది.

అటువంటి సాధారణ అభిప్రాయానికి భిన్నంగా అసలు సిసలు ప్రేమికుడిగా, ప్రేమించి పెళ్ళాడిన భార్యనే కడదాకా తలచుకుంటూ దిగులుగా బ్రతికిన హీరో శశికపూర్. బాలీవుడ్ రంగాన్ని ఏలిన కపూర్ కుటుంబసభ్యుడు శశికపూర్.

తండ్రి పృథ్వీరాజ్ కపూర్ నాటకాలలో దిట్ట. దేశమంతా తిరుగుతూ పలురకాలనాటకాలను ఆడిన పృథ్వీ థియేటర్స్ స్థాపకుడు ఆయన.

పృథ్వీ కొడుకుల్లో పెద్దవాడు రాజ్‌కపూర్. అసలు సిసలు షోమాన్. రెండవవాడు షమ్మీకపూర్ డాన్సింగ్ స్టార్. మూడవవాడు శశికపూర్.

రొమాంటిక్ స్టార్. ఎటువంటి అమ్మాయినైనా ఇట్టేపడేసే నవ్వు. ఎందరెందరో అతని ప్రేమకోసం ప్రయత్నం చేశారు. కాని అతని మనసంతా ఒక్కరి మీదే. మనసు పడి పెళ్ళాడి, ఆమెకు పూర్తిగా లొంగి పోయిన ప్రేమ పిపాసి శశికపూర్. ఆ ప్రేమకథ చిత్రంగానే మొదలైంది.

శశికపూర్ పుట్టింది కలకత్తా నగరంలో. అప్పుడు తండ్రి నాటకప్రదర్శన అక్కడ సాగుతోంది. పుట్టుకతోనే స్టేజ్‌కి అంకితం అయ్యాడు శశికపూర్.

కాని తల్లితండ్రులు పెట్టినపేరు బల్బీర్‌కపూర్. ఆ పేరుతోనే బాలనటుడిగా కనిపించాడేమో. అన్న రాజ్‌కపూర్ తీసిన 'ఆగ్', 'ఆవారా' వంటి సినిమాలలో చిన్నప్పటి రాజ్‌కపూర్‌గా నటించాడు. 'సంగమ్' సినిమాలో రాజ్‌కపూర్‌కి, 'దానాపానీ'లో అశోక్‌కుమార్ చిన్నప్పటి పాత్రలలో తళుక్కుమన్నాడు.

ఆరేళ్ళపాటు బాలనటుడిగా వున్న శశికపూర్ ఆ తర్వాత అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశాడు. తన ఇరవయ్యోఏట నాటకం వేస్తున్నప్పుడు ఆ నాటకానికి సహాయదర్శకుడిగా పనిచేస్తుండగా తెరలచాటు నుండి ఒక అమ్మాయిని చూశాడు.

అప్పటినుండి ఆ అమ్మాయి కోసమే తెరలు కదిలించేవాడు. చిన్నవయసులో ప్రేమకు అర్థం తెలియక ఒక విదేశీ అమ్మాయిమీద మోజు పడుతున్నారని అనుకున్నారు. ఆ అమ్మాయి పేరు జెన్నిఫర్. ఇంగ్లీషు నాటకాలు ఆడే కుటుంబం.

అటువంటి ఆ కుటుంబపెద్ద తన కూతురికి భారతీయ కుర్రాడితో ప్రేమ ఏమిటి! అంగీకరించను అన్నాడు. కాని ఆ అభ్యంతరం తొలగిపోవటానికి ఒక సంవత్సరం పట్టిందేమో! ఆ తర్వాత ఆ అల్లుడిని చూసుకుని మురిసిపోయి, ప్రతి ఏటా ఆరు నెలలు బొంబాయిలోనే వుండిపోయారు.

1961లో సినీహీరోగా 'ధర్మపుత్ర'లో ప్రవేశంచేసిన శశికపూర్ దాదాపు రెండుదశాబ్దాలు సినీరంగంలో ఒక వెలుగు వెలిగాడు.61 సినిమాలలో హీరోగా మెరిశాడు. అరవైల్లోనే ఇంగ్లీషు సినిమాలలోనూ నటించాడు. భార్య జెన్నిఫర్‌కి అత్యంత విధేయుడు శశికపూర్. ఆమె చెప్పినట్టు అలవాట్లు, సినిమాల ఎంపిక వుండేవి. అందుకే ఇతర కపూర్లకన్నా ఎంతో భిన్నమైనవాడిగా శశికపూర్ గుర్తింపు పొందాడు.

> ఆ కుటుంబ
> పెద్ద 'తన కూతురికి భారతీయ కుర్రాడితో ప్రేమ ఏమిటి! అంగీకరించను' అన్నాడు. కాని ఆ అభ్యంతరం తొలగిపోవటానికి ఒక సంవత్సరం పట్టిందేమో! ఆ తర్వాత ఆ అల్లుడిని చూసుకుని మురిసిపోయి, ప్రతిఏటా ఆరునెలలు బొంబాయిలోనే వుండిపోయారు.

కపూర్ హీరోలకువుండే ఎఫైర్స్ శశికపూర్‌లో వినలేదు బాలీవుడ్. అంతగా భార్య జెన్నిఫర్ ప్రేమలో మునిగిపోయిన శశికపూర్,ఆమెతో కలిసి నటించిన సినిమాలు హిట్ అయి, జెన్నిఫర్‌కంటూ ఒక ప్రత్యేక గుర్తింపు వచ్చి సినిమాలలో డిమాండ్ పెరుగుతున్న సమయంలో ఊహించని విషాదం వెన్నాడింది.

1984లో జెన్నిఫర్ క్యాన్సర్‌వ్యాధికి బలైంది.జెన్నిఫర్‌కి ఆవల లోకం తెలియని శశికపూర్ జీవితంలో హఠాత్తుగా ఒంటరితనం. ఏం చెయ్యాలో అర్థం కానంత శూన్యం. జెన్నిఫర్ ఆ ఇంట్లో తిరుగుతున్న భావన శశికపూర్‌ని వెంటాడేది.

ఆమె జ్ఞాపకాలు మరచిపోయేందుకు పలు సినిమాలు అంగీకరించి బిజీబిజీగా వుండేవాడు.

అది కూడా నాలుగేళ్ళే. ఆ తర్వాత ఇక సినిమాలు చెయ్యలేనంతగా డిప్రెషన్‌లోకి వెళ్ళాడు. సినిమాల నుండి 1988లో రిటైర్‌మెంట్ ప్రకటించాడు.నాటి వరకు మందు తెలియదు శశికపూర్‌కి.

కపూర్ల కుటుంబంలో సినిమాలు ఆపగానే శరీరం అదుపుతప్పి లావెక్కడం జీన్స్‌లోనే వుంది.

శశికపూర్‌కి మందులోనే లోకమైంది. బాధనుండి బైటపడవేయాలని పిల్లలు శశికపూర్‌ని గోవా తీసుకువెళితే, అక్కడ ఒక పడవలో సముద్రంలోకి వెళ్ళి మధ్యలో దానిని ఆపి ఒక్కసారిగా బిగ్గరగా, పసిపిల్లవాడిలా రోదిస్తూ పలుగంటలు వుండిపోయాడు.

మనసులోని ఆ బాధను అర్థంచేసుకున్న పిల్లలు శశికపూర్ తాగుతున్నా అభ్యంతరం చెప్పక కేవలం ఆయన్ని జాగ్రత్తగా కనిపెట్టుకుందామనే ఆలోచనకు వచ్చి అలాగే చూసుకున్నారు.

భార్యే లోకంగాగడిపిన శశికపూర్‌కి స్నేహితులు తక్కువ. ఒకరిద్దరు ఆత్మీయ స్నేహితులతోనే మాటలు.శరీరం లావెక్కింది.నిరంతర మానసిక సంఘర్షణ శశికపూర్‌కి పక్షవాతం తెచ్చింది.కుడి భాగం చచ్చుపడింది. చక్రాల కుర్చీకి పరిమితం. ఎవరిని వెంటనే గుర్తుపట్టలేని పరిస్థితి.

నటిస్తున్న రోజుల్లో ఆత్మీయంగా పలకరించిన 'సిమి'లాంటి కొందరిని మాత్రమే గుర్తుపట్టేవాడు. తనకు జీవితంమీద ఆశపోయిందని చెపుతుండేవాడు. శశికపూర్‌ని ఎలాగైనా తిరిగి నలుగురిలోకి తీసుకురావాలన్నది సినీరంగంవారి ఆశ.

అందుకోసం ఫిల్మ్ ఫేర్ అవార్డ్స్ ఫంక్షన్‌కి పిలిచి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ఇచ్చారు. ప్రభుత్వం సినీరంగానికి చేసిన సేవలకు పద్మభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డులను అందించి గౌరవించింది. ఇలా ఎవరు ఎన్నిరకాలుగా ప్రోత్సహించినా శశికపూర్ తలపులు రెండు దశాబ్దాలక్రితం మరణించిన భార్య చుట్టూనేవున్నాయి.

అవే ఆలోచనల్లో అలాగే కూరుకుపోయి, మత్తులో మునిగిపోతున్న శశికపూర్‌కి 2014లో గుండెపోటు వచ్చి బైపాస్ సర్జరీ చేయాల్సివచ్చింది. జీవించటం అనవసరం అని జీవన పోరాటం ఆపిన శశికపూర్‌కి ఒక అనారోగ్యం తర్వాత మరొకటి. మూత్రపిండాలకు ఇన్ఫెక్షన్ సోకింది. అప్పటికే జెన్నిఫర్‌ని చేరటంలో తాను చాలా ఆలస్యం చేశానంటూ శశికపూర్ 2017 డిశంబరు 4న తుదిశ్వాస విడిచారు.

అంత పిచ్చిగా భార్యను ప్రేమించిన సినీనటులు బహుతక్కువన్నది బాలీవుడ్ ఏకాభిప్రాయం.

ఈ శీర్షిక మీదే

ఉత్తమ ప్రశ్నకు ₹500
ప్రతి ప్రశ్నకు ₹300 బహుమతి

ఉత్తమ ప్రశ్న-సమాధానం

▸ వై.శ్రీలక్ష్మీ సరోజ, రాయకుదురు

తెలుగువారి నమ్మకం?

ఆంగ్లం నేర్చినవారికి అన్నీ తెలిసివుంటాయని!

▸ ఎస్.సుభాష్ చంద్రబోస్, విశాఖపట్నం

అందరూ 'కామెంట్' చేసి, 'బాధ పెడితే' ఎవరు 'కామెంట్' చేసి, 'సంతోషపెడతారు'?


'ఈ శీర్షిక మీదే' రైటర్లు.



"అమ్మా బిచ్చం వెయ్యండమ్మా..."
"అడుక్కోవటానికి వేళాపాళా లేదట్రా..."
"పోనీ వేళ చెప్పండమ్మా... ఆ వేళకే వస్తా"

"సాంప్రదాయ సంగీతానికి, డిస్కో సంగీతానికి తేడా ఏమిటి?"

ఈ కార్టూన్ మీదే



"సాంప్రదాయ సంగీతంలో శ్రోతలు తలలు ఊపుతారు... డిస్కో సంగీతంలో కాళ్ళు, చేతులు ఊపుతారు సార్"

"డబ్బు సంపాదించటం ఎలా! అనే పుస్తకం రాశావు కదా! ఎప్పుడు పబ్లిష్ చేస్తున్నావు..."
"పుస్తకం పబ్లిష్ చెయ్యటానికి అవసరమైన డబ్బు లేక ఆగిపోయాను"

"మీ ఆయనకి నువ్వంటే ఎంత ప్రేమే. నీ తల్లో పూలు వాడకుండా అలా నీళ్ళు చల్లుతున్నాడు"
"ప్రేమా నా బొందా...! ఆయనది ఫ్లవర్ బొకేల షాపు వ్యాపారం"

"ప్రకృతి సహజ జీవన చికిత్సాలయానికి వెళ్ళి డాక్టర్ నిద్రలేచిన గంటవరకు నీరసంగా ఉంటుం దండీ" అనడిగితే- "సరే... ఒక గంట ఆగి లేవండి" అంటూ సలహా ఇచ్చి పంపాడు డాక్టర్ రాజు.

"నా భార్యకు వంట చేయటం బాగా వచ్చు... అయినా ఏమిటో వంటమాత్రం చెయ్యదురా..." అని వాపోయాడు కుటుంబరావు.
"సంతోషించరా... మా ఆవిడకు వంట రాదు. అయినా చేస్తుంది... తినలేక చస్తున్నా..." తన కష్టం చెప్పుకున్నాడు సుబ్బారావు.

"మా చెల్లెలు వచ్చినప్పటినుండి చూస్తున్నా... ఏమిటి అది స్నానంచేస్తుంటే బాత్‌రూమ్‌లోకి తొంగి చూస్తున్నారు" అంటూ నిలదీసింది.
"మన సబ్బులు వాడుతున్నదేమోనన్న సందేహంతో చూస్తున్నానంతేనే... అనవసరంగా నన్ను అనుమానించకు" అన్నాడు.

"ఆయా ఉద్యోగం మానేస్తానంది"
"ఎందుకే పిల్లాడు బాగా అల్లరి చేస్తున్నాడా!"
"కాదమ్మగారూ... మీ ఆయన అల్లరి భరించ లేనంత ఎక్కువైందమ్మగారూ"

"మీరు గొడవ ఆపకపోతే పాఠం చెప్పటం మానేస్తా..." అరిచింది టీచర్.
"మీ పాఠం ఆపేస్తే గొడవే చెయ్యం మేడమ్"

"ఏమిట్రా... ప్రతిరోజూ నువ్వు, స్టూడియో రిసెప్షనిస్ట్ గంటలు గంటలు డార్క్ రూమ్‌లో గడుపుతున్నారట" అడిగాడు ఫోటోస్టూడియో యజమాని గోపాల్.
"అదా. తనకి డెవలపింగ్ నేర్పమంటే నేర్పుతున్నా సార్..." అన్నది అసిస్టెంట్ శంకరం సమాధానం.

"లెక్కల మాస్టారు దగ్గరకు ట్యూషన్‌కి వచ్చిన అమ్మాయి మాస్టారు... నాకు అప్పుడే మూడోనెల... మనం పెళ్ళిచేసుకోవాలి..." అన్నది దీనంగా.
"నువ్వు ఎప్పుడూ లెక్కల్లో వీక్. అది సరిగ్గా నేర్చుకున్నప్పుడే పెళ్ళి..." అంటూ కొత్త లెక్క మొదలు పెట్టాడు ఆ మాథ్స్ లెక్చరర్.

▸ పి.యోబు, ముదునూరు

మనిషి ఎప్పుడు 'వంగి'పోతాడు?

సమస్యలు 'తలెత్తి'నప్పుడు.

▸ ఎస్.సుభాష్ చంద్రబోస్, విశాఖపట్నం

'పోలీసు' 'దొంగ'ను ఖచ్చితంగా పట్టుకునే దెప్పుడు?

కొట్టేసిన 'బైకు' తనదేనని తెలిసినప్పుడు.

▸ జి.వి.మురళీమోహన్, ముచ్చుమిల్లి

పావురాలు ఆలయ గోపురాల్లో ఎక్కువగా ఉంటాయి ఎందుకు?

అక్కడైతే హింసకు తావుండదని.

విజయం తానంతట తాను ఎవరికీ దక్కదు. సాహసం చేసేవారినే విజయం వరిస్తుంది.